సోమవారం 22-9-2025


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 182



SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 182
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పాక్‌ను చిత్తుగా ఓడించి...

ఆసియా కప్ సూపర్–4లో పోరులో భారత్ 6 వికెట్లతో పాక్‌ను చిత్తు చేసింది. భారత్ 7 బంతులు ఉండగానే లక్ష్యాన్ని అందుకుంది.

- వివరాలు 16లో



స్వతంత్ర దేశంగా పాలస్తీనా!

గాజావాసులున్న భూభాగాన్ని స్వతంత్ర పాలస్తీనా దేశంగా అధికారికంగా గుర్తిస్తున్నట్లు బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా ప్రకటించాయి.

వివరాలు 6లో ▸

మిడిల్ క్లాస్‌కు మెలోడీ!

నేటి నుంచే జీఎస్‌టీ 2.0 | మధ్యతరగతి ప్రజలకు కాస్త ఆదా

- 5%.. 18%..40%... ఇకపై ఈ మూడే శ్లాబ్‌లు
- కిరాణా సరుకులు, ప్యాకేజ్డ్ ఫుడ్స్ 5 శాతంలోకి
- ఔషధాలు, వైద్య సంబంధ పరికరాలపైనా పన్ను తగ్గింపు.. బీమా పాలసీ ప్రీమియంలపై పూర్తిగా పన్ను మినహాయింపు
- కుటుంబాన్ని బట్టి నెలకు రూ.1700–2200 మిగిలే చాన్స్
- 40 శాతంలోకి సిగరెట్లు, పాన్‌మసాలా, గుట్కా
- సిమెంటు సహా నిర్మాణ సామగ్రిపై తగ్గింపు
- రోడ్లపైకి మరిన్ని చిన్నకార్లు
- 1500 సీసీ దాటిన ఎస్‌యూవీలు, హైఎండ్ కార్లపై 40% పన్ను
- అంతిమ ప్రయోజనాలు ప్రజలకు చేరేలా ప్రభుత్వం పర్యవేక్షణ

2లో





జీఎస్‌టీ సంస్కరణలతో 'ఆత్మనిర్భరత'

- దేశవ్యాప్తంగా అభివృద్ధి ఇక వేగవంతం
- దేశంలో ప్రతి ఇంటినీ స్వదేశీకి ప్రతీకగా మార్చుకోవాలి
- ప్రజలకు ప్రధాని పిలుపు

-6లో

అమెరికా పొమ్మంటే.. చైనా రమ్మంటోంది

6లో

లక్ష డాలర్లు కొత్త దరఖాస్తులకే..

- అది కూడా ఒక్కసారి మాత్రమే.. రెన్యూవల్స్‌కు పాత రుసుమే
- ఈనెల 21 తర్వాత సమర్పించే దరఖాస్తులకే వర్తింపు
- హెచ్–1బీ వీసాలపై యూఎస్ సిటిజెన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ వివరణ

6లో

రూ. 15 వేల కోట్ల కబ్జా భూమికి విముక్తి

- హైదరాబాద్‌లో 317 ఎకరాల ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగించిన హైడ్రా
- ఉమ్మడి ఏపీలో ఫైనాన్స్ కార్పొరేషన్‌కు కేటాయించిన అప్పటి సర్కారు

8లో




మిడిల్ క్లాస్‌కు మెలోడీ!

5%.. 18%..40%...
ఇకపై ఈ మూడే శ్లాబ్‌లు

కిరాణా సరుకులు, ప్యాకేజ్డ్ ఫుడ్స్ 5 శాతంలోకి

ఔషధాలు, వైద్య సంబంధ పరికరాల పైనా పన్ను తగ్గింపు

బీమా పాలసీ ప్రీమియంలపై పూర్తిగా పన్ను మినహాయింపు



సాక్షి ప్రత్యేక ప్రతినిధి

వివిధ వస్తువులపై సవరించిన కొత్త పన్ను రేట్లు సోమవారం నుంచి అమల్లోకి రాబోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తూ ... జీఎస్టీ 2.0గా పేర్కొంటున్న ఈ సవరణలతో చాలా వస్తువుల ధరలు మారబోతున్నాయి. మధ్యతరగతి భారతావనికి ఈ పన్నుల మార్పు ఎంతో మేలు చేస్తుందని, చాలా వస్తువుల ధరలు తగ్గుతాయని ప్రభుత్వం చెబుతోంది. ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ సైతం ఇదే చెప్పారు. ఈ నేపథ్యంలో అసలు జీఎస్టీ మండలి చేసిన సవరణల వల్ల ఎవరికి లాభం? ధరల్లో హెచ్చుతగ్గులు ఏ రకమైన ప్రభావం చూపబోతున్నాయి? దీనిపై 'సాక్షి' సమగ్ర కథనమిది..

ఇక 12 శాతం; 28 శాతం ఉండవు...

సేల్స్‌ట్యాక్స్, వ్యాట్, సెంట్రల్ ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ సహా పలు రకాల పరోక్ష పన్నులన్నిటినీ తొలగిస్తూ 2017 జూలై నుంచీ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) అమల్లోకి వచ్చింది. తక్కువ పన్నురేట్లుండాలని మొదట లక్ష్యించినా సాధ్యం కాలేదు. తాజా సవరణలతో అది సాధ్యమై జీఎస్టీ శ్లాబ్‌లు 3కు తగ్గాయి. తక్కువ శ్లాబ్‌లుంటే పాలన, ధరల నిర్ణయం, బిల్లింగ్ సులువవుతుంది. పన్ను అధికారులపైనా భారం తగ్గుతుంది. జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాల్లో అత్యంత ప్రధానమైనది.. 12 శాతం, 28 శాతం పన్ను రేట్లను పూర్తిగా తొలగించటం. కొన్ని విలాస, అనారోగ్య (సిన్) వస్తువుల కోసం 40 శాతం పన్ను రేటును చేర్చటం. వాస్తవంగా చూస్తే చాలావరకూ ఆహార పదార్థాలు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, ప్యాకేజ్డ్ ఫుడ్స్ 5% పరిధిలోకి వచ్చాయి. కొన్నింటిపై పన్నే లేకుండా చేశారు. గతంలో వీటిపై 12, 28 శాతం పన్ను రేట్లుండేవి. ఇది అత్యధికులకు ఊరటే. ఇక కొన్ని విలాస వస్తువులు, కూల్‌డ్రింక్స్, టొబాకో ఉత్పత్తులు, పాన్ మసాలా వంటివి మాత్రం 28 శాతం పన్ను పరిధిలో ఉండగా ఇపుడు 40 శాతం శ్లాబ్‌లోకి వెళ్లాయి.

తగ్గింపు ప్రయోజనాలు ఎక్కువే...

ముఖ్యంగా ప్రాణాధార ఔషధాలపై పన్ను భారం తొలగిపోనుంది. మరెన్నో ఔషధాలు, వైద్య పరికరాలు, ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులైన టూత్‌బ్రష్, టూత్‌పేస్ట్, సబ్బులు, షాంపూలు, హెయిర్ ఆయిల్, టాల్కమ్ పౌడర్, షేవింగ్ క్రీమ్‌తో పాటు నెయ్యి, పన్నీరు, బటర్, నమ్కీన్, కెచప్, డ్రై ఫ్రూట్స్, కాఫీ దగ్గర్నుంచి.. పెద్ద సైజు టీవీలు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు, కార్ల వరకు మొత్తం 375 ఉత్పత్తుల ధరలు గతంతో పోల్చితే తగ్గనున్నాయి. ఈ తగ్గింపు వల్ల జనం చేతుల్లో మరికొంత డబ్బు మిగులుతుంది కనక ఇది సేవింగ్స్‌లోకి, స్టాక్ మార్కెట్లోకి మళ్లే అవకాశం ఉందనేది ప్రభుత్వం అంచనా. అంతిమంగా ఇది ఆర్థిక వృద్ధికి దారితీయాలనేది లక్ష్యం. అయితే అదే తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాలు తగ్గిపోకూడదు కనక విలాస, అనారోగ్య వస్తువులపై ఏకంగా పన్ను శాతం 40కి పెంచారు.

ధర పెరిగే వస్తువులివీ..

- బీడీ మినహా సిగరెట్లు, సిగార్లు, గుట్కా, పాన్ మసాలా, నికొటిన్ ఉత్పత్తులు గతంలో ఉన్న 28 శాతం నుంచి 40 శాతానికి చేరాయి. అయితే ఈ పెంపు ప్రస్తుతానికి అమల్లోకి రాదు. బీడీలపై పన్నును మాత్రం 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు. బిహార్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లో సిగరెట్లు తాగేవారికన్నా బీడీలు కాల్చేవారు దాదాపు మూడురెట్లు ఎక్కువనేది గమనార్హం.
- కార్బొనేటెడ్ డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్, కెఫైన్ ఆధారిత పానీయాలను 28 నుంచి 40 శాతంలోకి చేర్చారు.
- లాటరీ టికెట్లు, కేసినో సేవలు, ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారాలపై పన్ను రేటు 40 శాతంగా నిర్ణయించారు.
- 1,500 సీసీకన్నా ఎక్కువ సామర్థ్యం ఉన్న ఎస్‌యూవీలు, హై-ఎండ్ కార్లపై ఇకపై 40 శాతం జీఎస్టీ అమలవుతుంది.
- ఫ్యాట్స్, చక్కెర, ఉప్పు ఎక్కువగా ఉండే ఫాస్ట్ ఫుడ్స్, ప్యాకేజ్డ్ స్నాక్స్ కూడా ఇకపై 40 శాతం శ్లాబ్‌లోకి వస్తాయి.

మధ్యతరగతిపై ప్రభావమెంత?

మధ్య తరగతి ప్రజలకు ఈ సవరణల్లో ఎక్కువ లాభం తెచ్చేవి ఏవైనా ఉన్నాయంటే అవి కిరాణా సరుకులు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులే. చాలా వస్తువులు 18, 12 శాతాల నుంచి 5 శాతం పరిధిలోకి రావటమే ఇందుకు కారణం. ఇక ఔషధాలు, బీమా రూపేణా కలిసొచ్చేది ఎక్కువే. అందుకే ప్రతినెలా కొంత కచ్చితంగా ఆదా అవుతుందని ప్రభుత్వం చెబుతోంది. పట్టణ మధ్య తరగతి కుటుంబాల్లో ఈ నెలవారీ ఆదా మందులను కూడా పరిగణనలోకి తీసుకుంటే రూ.1700 నుంచి రూ.2200 వరకూ ఉండవచ్చనేది నిపుణుల అంచనా. పైపెచ్చు ఈ జీఎస్టీ సవరణల్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకే ఏ వస్తువుపై ఎంత తగ్గిందనేది ప్రతి తయారీదారూ కచ్చితంగా ప్రకటించాలనే నియమాన్ని పెట్టింది. ఈ మేరకు తయారీదారులు రకరకాల ప్రకటనలు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా విస్తృత ప్రచారం కల్పిస్తోంది. పైపెచ్చు ఉత్పత్తిదారులు తగ్గించినా రిటైల్ అమ్మకందారులు తగ్గించకపోతే పన్ను తగ్గింపు ప్రయోజనం జనానికి చేరదు కనక ఈ అమలు తీరును 6 నెలల పాటు నిశితంగా పర్యవేక్షించనుంది కూడా.

ఏవి చౌకగా లభిస్తాయంటే..

- వెన్న, నెయ్యి, చీజ్, కండెన్స్‌డ్ మిల్క్, యూహెచ్‌టీ మిల్క్ వంటివి గతంలో 12, 5 శాతాల్లో ఉండగా ఇపుడు 5, సున్నా శాతాల్లోకి వచ్చాయి.
- బిస్కెట్లు, కేక్‌లు, పాస్తా, ఓట్స్, కార్న్‌ఫ్లేక్స్ వంటి బ్రేక్‌ఫాస్ట్ సిరెల్స్, చీజ్ పఫ్‌లు, పలు రకాల కన్ఫెక్షనరీ ఉత్పత్తులు గతంలో ఉన్న 18 నుంచి 5 శాతానికి దిగివస్తాయి.
- వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులైన షాంపూలు, తల నూనె, టూత్‌పేస్ట్, సబ్బులు చాలావరకూ గతంలో 18 శాతంలో ఉండగా ఇపుడు 5 శాతం పరిధిలోకి వచ్చాయి.
- ఆహార దినుసులతో పాటు శీతల పానీయాల పరిధిలోకి రాని జ్యూస్‌లు, మొక్కల ఆధారిత మిల్క్ డ్రింక్‌లు, పలురకాల డ్రైఫ్రూట్స్ గతంలో 12, 28 శాతాల్లో ఉండగా ఇపుడు 5 శాతానికి వచ్చాయి.
- చిన్న, మిడ్‌సైజ్ కార్లపై గతంలో ఉన్న 28 శాతం పన్నును 18 శాతానికి తగ్గించారు. వాహనాల ధర ఎక్కువ కనక ఈ పన్ను తగ్గింపు ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే దాదాపు అన్ని కంపెనీలూ జీఎస్టీ సవరణకు అనుగుణంగా తమ ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి.
- 32 అంగుళాలకు మించి ఉన్న టీవీలపై ఇప్పటి వరకు ఉన్న 28 శాతం జీఎస్టీ కాస్తా 18 శాతం కిందకు వచ్చింది. దీంతో వాటి మోడళ్ల ఆధారంగా రూ.2,500 నుంచి రూ.85,000 వరకు ధరలు తగ్గాయి. ప్రముఖ కంపెనీలు సోనీ, ఎల్‌జీ, ప్యానాసోనిక్ ఇప్పటికే కొత్త ధరలను ప్రకటించాయి. ఏసీలు, కొన్ని రకాల వాషింగ్ మెషీన్లపైనా జీఎస్టీ 28% నుంచి 18 శాతానికి తగ్గింది.
- నిర్మాణంలోకి వినియోగించే సిమెంట్, ఇతర బిల్డింగ్ మెటీరియల్స్‌పైనా జీఎస్టీ తగ్గించడమనేది ఇళ్ల మార్కెట్‌కు అనుకూలించనుంది.

ముందు వరుసలో కార్ల కంపెనీలు...

- మారుతి సుజుకీలో ప్రారంభ శ్రేణి కార్లు అయిన ఎస్‌ప్రెస్సోపై రూ.1,29,600, ఆల్టో కే10పై రూ.1,07,600 వరకు ధర తగ్గింది. గ్రాండ్ విటారాపై రూ.1.07 లక్షలు, ఎక్స్‌ఎల్ 6పై రూ.52,000, ఎర్టిగాపై రూ.46,400 వరకు ధర తగ్గిస్తున్నట్టు కంపెనీ ప్రకటించింది. ఇతర అన్ని మోడళ్లపైనా ధరలు తగ్గాయి.
- టాటా మోటార్స్ తన పంచ్ ఎస్‌యూవీపై రూ.85,000, నెక్సాన్‌పై రూ.1.55 లక్షల వరకు ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కర్వ్‌పై రూ.65,000, హ్యారియర్, సఫారీ ధరలు రూ.1.45 లక్షల వరకు తగ్గాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా తన మోడళ్ల ధరలను గరిష్ఠంగా రూ.1.56 లక్షల వరకు తగ్గించింది. ఇందులో పాపులర్ మోడల్ బొలెరో ధర రూ.1.27 లక్షలు తగ్గింది. థార్ డీజిల్ వేరియంట్లపై రూ.1.35 లక్షల వరకు తగ్గింది.
- కియా కార్ల ధరలు రూ.4.48 లక్షల వరకు చౌక అవుతున్నాయి. మెర్సెడెస్ బెంజ్ తన విలాస కార్లు ఏ-క్లాస్‌పై రూ.2 లక్షల వరకు, ఎస్-క్లాస్‌పై రూ.10 లక్షల వరకు ధరలు తగ్గించింది. బీఎండబ్ల్యూ కార్ల ధరలు రూ.13.6 లక్షల మేర తగ్గాయి. జాగ్వార్ ల్యాండ్ రోవర్ వాహన ధరలు రూ.4.5–30.4 లక్షల మధ్య తగ్గాయి. హీరో మోటోకార్ప్ బైక్‌లు, స్కూటర్ల ధరలు రూ.15,743 వరకు, హోండా మోటార్ సైకిల్ వాహన ధరలు 350 సీసీలోపు ఉన్న వాటిపై రూ.18,800 వరకు తగ్గాయి.

వీటిపై ఇక నో జీఎస్టీ

జీవిత బీమా, ఆరోగ్య బీమాపై ఇప్పటి వరకు 18 శాతం జీఎస్టీ అమల్లో ఉండగా, పూర్తి మినహాయింపు ఇచ్చారు. దీంతో ఈ మేరకు పాలసీ ప్రీమియం ధరలు తగ్గుతాయి. జీవిత బీమా పాలసీల్లోనూ ఎన్నో రకాలున్నాయి. వీటిపై భిన్నమైన జీఎస్టీ అమలవుతోంది. టర్మ్ ఇన్సూరెన్స్‌పై 18 శాతం... ఎండోమెంట్ ప్లాన్లపై మొదటి ఏడాది 4.5 శాతం.. రెండో ఏడాది నుంచి 2.25 శాతం చొప్పున కాల వ్యవధి ముగిసే వరకు ప్రీమియంపై జీఎస్టీ చెల్లించాల్సి వచ్చేది. సింగిల్ ప్రీమియం పాలసీలపై 1.8 శాతం, యులిప్ ప్లాన్లపై (పెట్టుబడి భాగం కాకుండా, బీమా రక్షణ చార్జీలపైనే) 18 శాతం అమల్లో ఉంది. వీటన్నింటిపై జీఎస్టీ మినహాయింపు ఇచ్చారు. ఇకపై ఈ మేరకు ప్రీమియం భారం తగ్గుతుంది. కేన్సర్, జన్యు సంబంధిత, అరుదైన వ్యాధులు, గుండె జబ్బులకు వినియోగించే 33 ఔషధాలను జీఎస్టీ నుంచి మినహాయించారు. వీటికి తోడు 12 శాతం పరిధిలో ఉన్న పలు ఔషధాలను 5 శాతం శ్లాబుకు మార్చడంతో ఈ మేరకు ఉపశమనం లభించనుంది. గ్లూకో మీటర్లు, డయాగ్నోస్టిక్స్ కిట్లు కూడా 5 శాతం కిందకు మారాయి. ఈ మేరకు ఎంఆర్‌పీలను సవరించాలని, లేదంటే పాత ఎంఆర్‌పీ రేట్లపై తగ్గించి విక్రయించాలని (సెప్టెంబర్ 22 నుంచి) ఔషధ కంపెనీలను ప్రభుత్వం ఆదేశించింది.

సీఎంఆర్‌లో అందుబాటులో జీఎస్టీ ప్రయోజనాలు

ఆరిలోవ(విశాఖ): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ప్రకటించిన జీఎస్టీ ప్రయోజనాలు సీఎంఆర్ టెక్స్‌టైల్స్ అండ్ జ్యూయెలర్స్‌లో అందుబాటులో ఉన్నట్లు సీఎంఆర్ సీఎండీ మావూరి వెంకటరమణ ఆదివారం తెలిపారు. సీఎంఆర్‌లో కొత్త జీఎస్టీ 2.0 నిబంధనల ప్రకారం రూ.1,001 నుంచి రూ.2,500 మధ్య ధర ఉన్న వస్త్రాలపై ఇప్పుడు కేవలం 5 శాతం జీఎస్టీ మాత్రమే ఉంటుందని తెలిపారు. ఈ శ్రేణిలో ధరలపై 6.25 శాతం తగ్గింపుతో వినియోగదార్లకు నేరుగా ప్రయోజనం అందిస్తున్నామన్నారు. గతంలో 12 శాతం ఉన్న జీఎస్టీ ప్రస్తుతం 5 శాతానికి తగ్గిందని తెలిపారు.



రోజూ ఏదో ఒక ఇలాంటి స్టేట్‌మెంట్ ఇవ్వనిదే నిద్రపోరు!

వడివడిగా 'స్థానిక' అడుగులు

సీఎస్ నుంచి గ్రామ కార్యదర్శి వరకు ఏర్పాట్లలో నిమగ్నం

- జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్
- రిజర్వేషన్లు, బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ బూత్‌లు తదితరాలపై సూచనలు
- బీసీ రిజర్వేషన్లపై కసరత్తు షురూ.. ఓటర్ల జాబితాలపై కులాలవారీగా మార్కింగ్



సాక్షి, హైదరాబాద్: ఎంత వీలుంటే అంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే దిశలో వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నుంచి సానుకూల సంకేతాలు వెలువడిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి గ్రామ కార్యదర్శి వరకు అన్ని స్థాయిల్లోని ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల తేదీలను ప్రభుత్వం ఏ క్షణంలో ఖరారు చేసినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని, ఈ మేరకు యుద్ధ ప్రాతిపదికన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సీఎస్ కె. రామకృష్ణారావు ఆదివారం ఇచ్చిన ఆదేశాలతో పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలు, డీపీవోలు, గ్రామ కార్యదర్శులందరూ తాము నిర్వహించాల్సిన బాధ్యతల్లో మునిగిపోయారు. ఒకట్రెండు రోజుల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో విడుదలవుతుందని, ఆ తర్వాత వారం రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలుస్తోంది.

రెండు రోజుల్లో కులాల మార్కింగ్ పూర్తి

సీఎస్ ఆదివారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రిజర్వేషన్ల ఖరారు, బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ బూత్‌లు, ఇతర అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మరోవైపు ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని శనివారం రాత్రే కలెక్టర్లను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ సృజన ఆదేశించారు. రిజర్వేషన్లపై ప్రభుత్వం జీవో ఇచ్చిన తర్వాత నాలుగు రోజుల్లోనే రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శులు వార్డుల వారీ ఓటర్ల జాబితాల్లో ఎస్టీ, ఎస్సీ, బీసీ కులాలను మార్క్ చేసుకునేలా జిల్లా పంచాయతీ అధికారుల (డీపీవో)ను ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా ఆదివారం అన్ని జిల్లాల్లో పంచాయతీ కార్యదర్శులు వార్డుల వారీగా ఓటర్ల జాబితాలపై కులాల వారీగా మార్కింగ్ మొదలుపెట్టారు. రెండురోజుల్లోగా ఈ ప్రక్రియ పూర్తికావొచ్చునని అధికారుల ద్వారా తెలిసింది. అయితే ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసేందుకు కనీసం వారం, పదిరోజులు పట్టొచ్చుననే అభిప్రాయంతోనూ కలెక్టర్లు ఉన్నట్టు తెలుస్తోంది.

తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు!

రాజకీయ పార్టీల గుర్తులపై జరిపే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలే మొదట జరిగే అవకాశాలున్నట్టుగా తెలుస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం చర్చనీయాంశమైనందున దాని ద్వారా ఈ ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చునని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తుండటమే ఇందుకు కారణం. ఇవి ముగిశాక కొన్ని రోజుల అంతరంతో అంటే 2, 3 వారాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తిచేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్టుగా చెబుతున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచుతూ జీవో జారీ తదితర అంశాలపై 2,3 రోజుల్లోనే జరిగే సీఎం, మంత్రుల సమావేశంలో అధికారిక నిర్ణయం వెలువడవచ్చుననే ప్రచారం ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది.

కృష్ణాలో 382.48 టీఎంసీల అదనపు అవసరాలు

23, 24న కృష్ణా ట్రిబ్యునల్ ఎదుట వాదించనున్న రాష్ట్రం

- ఇందుకోసం తెరపైకి కొత్తగా 16 ప్రాజెక్టులు
- వాటికి ఇన్వెస్టిగేషన్లు, సర్వేలు, డీపీఆర్‌ల తయారీకి సర్కారు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సాగు, తాగునీటి అవసరాలకు 382.48 టీఎంసీల కృష్ణా జలాలను అదనంగా వినియోగంలోకి తీసుకురావడానికి 16 కొత్త ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్-2 ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్న విచారణ సందర్భంగా భవిష్యత్‌లో నిర్మించనున్న ఈ ప్రాజెక్టులకు మొత్తం 382.48 టీఎంసీల నీటి కేటాయింపులు జరపాలని వాదనలు వినిపించనుంది. ఇందులో భాగంగా ఆయా ప్రాజెక్టులకు ఇన్వెస్టిగేషన్లు, సర్వేలు నిర్వహించాలని ఆదేశిస్తూ ఇటీవల రాష్ట్ర నీటిపారుదల శాఖ ఆదేశాలు జారీ చేసింది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా ఏపీ భారీగా కృష్ణా జలాలను తరలించి జలాశయాల్లో నిల్వ చేసుకుంటుండగా, తెలంగాణలో మాత్రం రాష్ట్ర అవసరాలకు సరిపడా కృష్ణా జలాలను నిల్వ చేసుకోవడానికి జలాశయాలు లేవని చాలాకాలంగా ఆందోళనలున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు నిల్వ సామర్థ్యం పెంచుకొని కృష్ణా మిగులు జలాలను వాడుకోవడానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రిజర్వాయర్ల నిర్మాణానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై ఇటీవల ప్రభుత్వానికి నివేదిక అందింది. దీని ఆధారంగా ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో 16 కొత్త ప్రాజెక్టులకు డీపీఆర్‌ల తయారీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

జూరాల నుంచి 227టీఎంసీల తరలింపు..

227 టీఎంసీలను జూరాల ప్రాజెక్టు, 55 టీఎంసీలను శ్రీశైలం జలాశయం నుంచి తీసుకోనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. వరదల సమయంలో జూరాల రిజర్వాయర్ నుంచి రోజుకు 2 టీఎంసీలు చొప్పున మొత్తం 100 టీఎంసీలను తరలించుకోవడానికి జూరాల ఫ్లడ్ ఫ్లో కెనాల్ నిర్మించి ఇతర రిజర్వాయర్లు, చెరువులకు అనుసంధానం చేయడం ద్వారా ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లోని 11.3 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ప్రతిపాదించింది.

- వరదల సమయంలో జూరాల రిజర్వాయర్ వెనక భాగం నుంచి మరో 123 టీఎంసీల నీటిని తరలించి మహబూబ్‌నగర్ జిల్లాలోని కరువు పీడిత ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించడానికి కోయిల్‌కొండ-గండీడ్ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించనున్నట్టు తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా 45 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో కోయిల్‌కొండ, 35 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో గండీడ్, 43 టీఎంసీల సామర్థ్యంతో దౌలతాబాద్ రిజర్వాయర్లను నిర్మించనుంది.
- జూరాల రిజర్వాయర్ నుంచి మరో 4 టీఎంసీలను తరలించి అదనంగా 25వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం రెండో దశ ప్రాజెక్టును చేపట్టనున్నట్టు వెల్లడించింది.
- నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామంలో శ్రీశైలం జలాశయం వెనక నుంచి రోజుకు టీఎంసీ చొప్పున 35 టీఎంసీలను తరలించి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 3.99 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, తాగునీరు అందించడానికి శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ పొడవు పొడిగించనున్నట్టు తెలిపింది.
- కల్వకుర్తి ఎత్తిపోతల పథకం రెండోదశ కింద కాల్వలు, హెడ్‌వర్క్స్, పంప్‌హౌస్ సామర్థ్యం పెంచి శ్రీశైలం జలాశయం నుంచి 13 టీఎంసీలను తరలించి అదనంగా 95,531 ఎకరాల ఆయకట్టుకు సాగునీరుతో పాటు 7.12 టీఎంసీల తాగునీటి సరఫరా చేయనున్నట్టు పేర్కొంది.

ప్రభుత్వం ప్రతిపాదించిన మరికొన్ని ప్రాజెక్టుల వివరాలు ఇలా...

ప్రాజెక్టు పేరు	టీఎంసీలు	సాగులోకి వచ్చేది (ఎకరాల్లో)
కోయిల్‌సాగర్ ఎత్తిపోతలకు నీటితరలింపు	3.3	13,500 (అదనంగా)
ఆకేరుపై బరాజ్ (మహబూబాబాద్ జిల్లా జయపురం)	2	11,250
ఆకేరుపై బరాజ్ (మహబూబాబాద్ జిల్లా విస్సంపల్లి)	1.2	11,799
మున్నేరుపై బరాజ్ (మహబూబాబాద్ జిల్లా ఏదులపుసపల్లి)	1.3	13,201
ఆకేరు వాగుపై బరాజ్ (ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం)	1.3	13,129
వేములూరు వాగుపై (సూర్యాపేట జిల్లా పులిచింతల ఏరియా)	0.5	1380
మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలం ముల్కపల్లిలో 25-30 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం		
రేలంపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామర్థ్యం 4 నుంచి 10 టీఎంసీలకు పెంపుదల.		
రీజనల్ రింగ్ రోడ్డు పరిధిలోని దేవులమ్మనాగారంలో 10 టీఎంసీలు, దండుమైలారంలో 10 టీఎంసీలు, ఆరుట్లలో 5-10 టీఎంసీలు చొప్పున మొత్తం 30 టీఎంసీల సామర్థ్యంతో మూడు రిజర్వాయర్లు నిర్మించి హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సరఫరా చేయాలి.		

'హెచ్1బీ'ని యుద్ధప్రాతిపదికన పరిష్కరించండి

ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: హెచ్1బీ వీసాల వార్షిక రుసుమును లక్ష డాలర్ల (రూ. 88 లక్షలు)కు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రంప్ నిర్ణయం అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న తెలుగు టెక్ నిపుణులు సహా అక్కడి భారతీయ వృత్తి నిపుణులపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాల చరిత్రలో ఇలాంటి చర్యలు ఆమోదయోగ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు దశాబ్దాలుగా తోడ్పడుతున్న భారతీయ టెక్ నిపుణుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించకపోతే భారతీయ నిపుణులు ఊహించని కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

శ్రీశైలానికి భారీగా వరద

పది గేట్లు ఎత్తివేత



శ్రీశైలంలో దిగువకు విడుదలవుతున్న వరద నీరు

దోమలపెంట/నాగార్జునసాగర్: ఎగువ నుంచి భారీ వరద నీటి రాకతో ఆదివారం శ్రీశైలం ఆనకట్ట వద్ద పది గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాలలో ఆనకట్ట స్పిల్‌వే ద్వారా 2,02,739, విద్యుదుత్పత్తి చేస్తూ 29,555, సుంకేసుల నుంచి 4,479, హంద్రీ నుంచి 250 కలిపి మొత్తం 2,37,023 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తోంది. దీంతో శ్రీశైలం ఆనకట్ట వద్ద పది గేట్లను ఒక్కొక్కటి పది అడుగుల మేర పైకెత్తి.. స్పిల్‌వే ద్వారా 2,75,700 క్యూసెక్కులు, భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 65,626 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 883.9 అడుగుల వద్ద 209.5948 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సాగర్‌లో 26 గేట్ల ఎత్తివేత

ఎగువనుంచి నాగార్జునసాగర్‌కు వరద ఉధృతి పెరగడంతో.. 26 గేట్ల ద్వారా స్పిల్‌వే మీదుగా 2,70,938 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 33,657 క్యూసెక్కులు మొత్తం 3,04,595 క్యూసెక్కుల నీటిని కృష్ణా నదిలోకి విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ, వరద, ఏఎమ్మార్పీ కాల్వలకు 21,007 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్టస్థాయి నీటిమట్టం 590.00 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా ప్రస్తుతం సాగర్ జలాశయంలో 587.60 అడుగుల (305.8626 టీఎంసీలు) మేర నీరుంది.



సాగర్‌లో 26 క్రస్ట్ గేట్ల నుంచి విడుదలవుతున్న వరద నీరు


TVS
10 సంవత్సరాల వరకు వారంటీ*
భారీ పొదుపు
GST తగ్గింపు వల్ల ధరలో ₹8 500## వరకు ఆదా
TVS XL100
ఎక్స్-షోరూం ధర
₹47 754
₹43 900#
Star City+
ఎక్స్-షోరూం ధర
₹75 586
₹69 500#
TVS Radeon
ఎక్స్-షోరూం ధర
₹73 808
₹67 800#
TVS Raider
ఎక్స్-షోరూం ధర
₹90 746
₹83 400#
₹4 999** తక్కువ డౌన్ పేమెంట్
5.99%** వడ్డీ రేటు
www.tvsmotor.com
Finance Partners: TVS CREDIT, SHRIRAM Finance, IDFC FIRST Bank, L&T Finance, IndusInd Bank


MARUTI SUZUKI COMMERCIAL
GST తగ్గింపుతో
ఇప్పుడు
వేడుకలు
మరింత ఘనంగా మారాయి.
ఇప్పుడు ప్రారంభ ధర
₹5 06 100^
₹52 100^
వరకు ధరపై తగ్గింపు
₹58 000**
వరకు ప్రత్యేక పండుగ ఆఫర్
S-CNG+PETROL
ELECTRONIC STABILITY PROGRAM
3 years 100 000 km WARRANTY*
EXTENDABLE UPTO 6 YEARS
సూపర్ మైలేజీ
NEW SUPER CARRY
WWW.MARUTISUZUKICOMMERCIAL.COM | వివరాల కోసం, టోల్ ఫ్రీ నంబర్ 1800 102 1800/1900 1800 150 కు కాల్ చేయండి.
JAYABHERI AUTOMOTIVES HYDRABAD CALL: 7799758248
ADARSH AUTOMOTIVES HYDRABAD CALL: 9581916633
RKS UPPAL CALL: 9133391009
SAI SERIVCES PVT. LTD. BACHUPALLY CALL: 7036048866
VARUN MOTORS VANASTHALIPURAM CALL: 9912250600
KALYANI MOTORS HYDERABAD CALL: 87126 15242
AUTOFIN LTD. SECUNDERABAD CALL: 88850 40049
GEM MOTORS HYDERABAD CALL: 9293455556



భాష ఒక వంతెన. గోడ కాదు!
– పీవీ శ్రీనివాస్

సాక్షి
సోమవారం, 22 సెప్టెంబర్ 2025

దయనీయుడు కాకూడదు!

'మానవుడే మహనీయుడు, శక్తియుతుడు, యుక్తిపరుడు, మానవుడే మాననీయు'డంటాడు కవి ఆరుద్ర ఒక సినీ గీతంలో! సందేహమేముంది? ఆయనే అన్నట్టు, మంచిని తలపెడితే మనిషికి అడ్డే లేదు, దివిజ గంగ భువి దించిన భగీరథుడు మానవుడే, సృష్టికి ప్రతిసృష్టి చేయు విశ్వామిత్రుడు నరుడే; చంద్రలోకమైన, దేవేంద్రలోకమైన బొందితో జయించి భువికి తిరిగి రాగలిగినవాడూ మానవుడే! కానీ, అంతటి మహనీయుడు కూడా ఒక్కోసారి దయనీయుడైపోతాడు. ఎంతో ముందుకు చూడగలిగి కూడా తరచూ హ్రస్వ దృష్టికి లోనవుతాడు. పదిమందికీ మంచిని తలపెట్టేవాడు కూడా స్వప్రయోజనాన్ని మరిగి చివరికి సొంతానికే చేటు తెచ్చుకుంటాడు. సర్వతోముఖ వికాసం మనిషికి వరమే కానీ, తనకు తనే చెరుపు చేసుకునే బహుముఖ వైఫల్యం పెనుశాపం.

అసాధారణ వర్షాల కారణంగా హిమాలయ ప్రాంత రాష్ట్రాలు అతలాకుతలమవుతున్నాయి. హఠాత్తుగా అతివృష్టి, మెరుపు వరదలు, మట్టిపెళ్ళలు విరిగిపడటం వగైరా ఉత్పాతాల కారణంగా ఈ సంవత్సరం ఇప్పటికి దాదాపు మూడు వేల మంది మరణించారు, లక్షల కోట్ల విలువైన ఆస్తినష్టం సంభవించింది. అడ్డూ అదుపూ లేని పట్టణాభివృద్ధి, అడవుల నిర్మూలన, రోడ్ల నిర్మాణం, విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన మొదలైన అభివృద్ధి చర్యలను ఇందుకు కారణంగా పర్యావరణ వాదులు ఎత్తిచూపుతున్నారు. ఇటువంటివి లేని రోజుల్లో కూడా ఇలాంటి ప్రమాదాలు జరిగిన సంగతిని కొందరు ఉదాహరిస్తున్నారు. కారణమేమైనా ప్రాణనష్టం, ఆస్తినష్టం కళ్లముందు కటిక నిజాలు. పటిష్ఠమైన ముందస్తు హెచ్చరిక యంత్రాంగాన్ని ఇప్పటికీ ఏర్పరచుకోలేకపోవడం – దీనంతటి వెనుకా మహనీయుడైన మానవుడి పరంగా చెప్పుకోవలసిన ఒకానొక వైఫల్యం. దీనికితోడు, దేశంలో ప్రకృతి విపత్తులకు గురికాగల ప్రాంతాల గురించిన గణాంకాలు గుండె గుభేలుమనిపిస్తాయి. ఏకంగా 27 రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాలూ ఇందులోకి వస్తాయి. వ్యవసాయ యోగ్యమైన 68 శాతం భూమి ఏ క్షణంలోనైనా అనావృష్టికి గురికావచ్చు, 15 శాతం ప్రాంతంలో ఉన్నట్టుండి రాళ్ళవర్షం కురవచ్చు, 12 శాతం ప్రాంతంలో మెరుపు వరదలు సంభవించవచ్చు. ఈ విపత్తులు ఏటా పెరగడమే తప్పే తగ్గే అవకాశం లేదట!

శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక అభివృద్ధిలో మానవుడి బుద్ధి ఎంతో చురుగ్గా పని పనిచేయడం ఎంతైనా శ్లాఘనీయమే; అభివృద్ధిని ప్రజలకు మరింత సుఖమయ జీవన యోగ్యంగా మలచే దిశగా శరవేగంతో కదలడమూ అభినందనీయమే; కానీ, దానిని అంటిపెట్టుకుని వచ్చే సమస్యల నివారణలో మాత్రం అతని అడుగు చురుగ్గా పడటం లేదు. దాంతో అభివృద్ధి అస్తవ్యస్తానికీ, అభద్రతకూ చిరునామా అవుతోంది. దేశంలోని మహా నగరాలలో రోడ్ల పరిస్థితే ఇందుకు మరో ఉదాహరణ. ఆ యా నగరాలలో జనాభా పెరుగుదలా, కొత్త జనావాసాల విస్తరణా, రాకపోకల అవసరాలూ, వాహనాల పెంపూ విమాన వేగాన్ని అందుకున్నాయి; కానీ, ఆ దామాషాలో రోడ్ల నిర్వహణా, ఇతర వసతుల కల్పనలో ప్రభుత్వాల ప్రణాళికలు ఎడ్లబండి వేగంతో నడుస్తున్నాయి. అనేక నగరాలలో రాకపోకల రద్దీ ఎంతటి సమస్యాత్మక స్థాయికి చేరిందంటే, జనం గంటల తరబడి కాలాన్ని ట్రాఫిక్ జామ్ లోనే గడపవలసి వస్తోంది, ఎంతో విలువైన ఉత్పాదక సమయం రోడ్లపాలైపోతోంది. రకరకాల జీవనోపాధి పనుల మీద తిరిగే జనాలను అది మానసికంగా విపరీతమైన ఒత్తిడికి గురిచేసి ఆర్థిక సమస్యలతోపాటు ఆరోగ్య సమస్యలనూ తెచ్చిపెడుతోంది. ఈ ఏడాది తొలి అయిదారు మాసాల్లోనే దేశవ్యాప్తంగా నగరాల రోడ్లపై సంభవించిన దుర్ఘటన మరణాలు వేలసంఖ్యను దాటిపోయాయి. అయినాసరే, పౌరరవాణా సదుపాయాల అభివృద్ధీ వగైరాలు కాగితాల దశను దాటి కార్యరూపం ధరించడానికి ఏళ్లూపూళ్లూ పట్టిపోతోంది.

మొత్తంమీద కవి చెప్పినట్టు గ్రహరాశుల నధిగమించి ఘనతారల పథము తొక్కగలిగిన మహనీయుడే తన లోకాన్ని సర్వతోభద్రంగా మార్చుకోవడంలో విఫలమవుతున్నాడు. మనిషి జైత్రయాత్రలో ఎక్కడో అడుగు తడబడి అపజయపు దారి పడుతోంది. తనను దయనీయుడిగా రూపుకట్టే ఆ తడబాటును సరిదిద్దుకుని మహనీయుడన్న ఖ్యాతి నిలుపుకోవడం మనిషి తక్షణావసరం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.పాడ్యమి రా.1.06 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ఉత్తర ప.11.15 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.8.17 నుండి 10.00 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.21 నుండి 1.10 వరకు తదుపరి ప.2.47 నుండి 3.36 వరకు, **అమృత ఘడియలు:** లేవు, **శరన్నవరాత్రులు ప్రారంభం**

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.56
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

ఆత్మ నిర్భర జీఎస్టీ?

అభిప్రాయం



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

సెప్టెంబర్ మాసం శుభాలను మోసుకొస్తుందని ఓ నానుడి. దానిని నిజం చేస్తూ దేశ ప్రజలకు మేలు చేసే రెండు తీపి పరిణామాలు జరిగాయి ఈ మాసంలో! ఒకటి – ఎంతో కాలంగా దేశ ప్రజలు కోరుతున్న జీఎస్టీ సంస్కరణలు. రెండు – భారత్–చైనాల మధ్య చిగురించిన మైత్రీ బంధం. వీటిని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు అందిస్తున్న దీపావళి బహుమతులుగా చెప్పడం గమనార్హం!

అమెరికా విధించిన అదనపు సుంకాల పుణ్యమా అని దేశంలో వినియోగ సంస్కృతిని... అది కూడా దేశీయ వస్తువుల వినియోగం పెంచడం కోసం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 సంస్కరణను తీసుకువచ్చింది. నాలుగు శ్లాబుల్లో ఉన్న వస్తువులను సెప్టెంబర్ 22 నుంచి అమలులోకి వచ్చే జీఎస్టీ 2.0లో మూడు శ్లాబ్‌లకు కుదించారు. 5 శాతం, 18 శాతం శ్లాబ్‌లలోకి దాదాపుగా అన్ని వస్తువులు వస్తాయి. సిన్ గూడ్స్ (పాపపు వస్తువులు)గా పేర్కొంటున్న సిగరెట్లు, గుట్కా వంటి ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించడం కోసం అత్యధికంగా 40 శాతం పన్ను విధిస్తారు.

కార్లు, ఫ్రిజ్‌లు, ఏసీల వంటి లగ్జరీ గూడ్స్ కారుచౌకగా లభిస్తాయని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. భారీ వాహనాల మీద జీఎస్టీ తగ్గింపు వల్ల వినియోగదారుడికి రెండు విధాల ప్రయోజనం కలుగుతుంది. ఒకటి – వాహనం ధర తగ్గుతుంది. రెండోది – వాహనం ధర ఆధారంగా రిజిస్ట్రేషన్, బీమా (ఇన్సూరెన్స్) చార్జీలు ఉంటాయి కనుక వాహనం ధర తగ్గితే... ఆ దామాషాలో వాటి ఛార్జీలు కూడా తగ్గుతాయి.

ఇక, దేశంలో అత్యధిక శాతంగా ఉన్న మధ్యతరగతి వర్గానికి, పేదలకు ఊరట కలిగించే అంశం... నిత్యావసరాల ధరలు తగ్గడం. బియ్యం, గోధుమలు, పప్పులపై ప్రస్తుతం విధిస్తున్న జీఎస్టీ 18 శాతం కాగా, ప్యాకేజీలో ఉండేవి కాకుండా విడిగా లభించే ఈ వస్తువులను కొంటే అవి 5 శాతం పరిధిలోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు ముందే జీఎస్టీ 2.0ను ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారనీ, ఇది బీజేపీ గెలుపునకు బ్రహ్మాస్త్రంగా పనికొస్తుందనీ ఆ పార్టీ నేతలు లెక్కలు కడుతున్నారు.

రాష్ట్రాలకు ఆదాయం తగ్గుతుందా?

జీఎస్టీ మండలి సమావేశంలో జీఎస్టీ 2.0పై ఏకాభిప్రాయం కుదిరినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించినప్పటికీ... 4 రాష్ట్రాలు తమకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందని గగ్గోలు పెట్టాయి. తమకు నష్టపరిహారం చెల్లించాలని బెంగాల్, కేరళ, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాలు పట్టుబట్టాయి. కానీ మంత్రి ఆ రాష్ట్రాలకు సర్దిచెప్పారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు వల్ల వస్తు వినియోగం పెరుగుతుందనీ, దాని వల్ల రాష్ట్రాల ఆదాయం పెరుగుతుందనీ వివరించారు. రాష్ట్రాలకు ఆదాయం చేకూరుస్తున్న రంగాలలో సిమెంటు, ఆటోమొబైల్, గ్రానైట్, ఎలక్ట్రానిక్ ఉపకరణాల వంటివి ఉన్నాయి. ప్రస్తుతం వీటిపై అత్యధికంగా 18 నుంచి 28 శాతం జీఎస్టీ ఉంది. తాజాగా సవరించిన రేట్ల వల్ల ఈ రంగాల్లో రాష్ట్రాలకు వచ్చే ఆదాయంలో సుమారు 10 శాతం కోత పడనుంది.

> జీఎస్టీ సరళీకరణ వల్ల దేశీయ ఉత్పత్తుల వినియోగం తప్పనిసరిగా పెరుగుతుంది. అదేవిధంగా చైనాతో వాణిజ్య సంబంధాలు మెరుగుపడటం కారణంగా చైనా పెట్టుబడులు, సాంకేతిక నైపుణ్యాలు అందుబాటులోకి వస్తాయి.

చాలా కాలంగా ప్రజలు కోరుకుంటున్నట్లుగా... పెట్రో ఉత్పత్తులను జీఎస్టీ 2.0 పరిధిలోకి తీసుకురాకపోవడం సామాన్యుల్ని నిరాశపర్చేదే! పెట్రోల్, డీజిల్, విమానాల ఇంధనంగా వాడే టర్బైన్ ఫ్యూయెల్, సహజ వాయువులపై వివిధ రాష్ట్రాలు అత్యధికంగా 18 నుంచి 34 శాతం వరకు విలువ ఆధారిత పన్ను విధిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలైతే అదనంగా లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూపాయి నుండి రెండు రూపాయల మేర సెస్సు విధిస్తున్నాయి.

ఇదిలా ఉండగా, అధిక మోతాదు చక్కెరతో తయారు చేసే చాక్లెట్లు, కేకులు, మిఠాయిలపై జీఎస్‌టీ తగ్గించటం పట్ల ఆరోగ్యరంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారతదేశం ఇప్పటికే మధుమేహ వ్యాధిగ్రస్థుల సంఖ్యలో అగ్రస్థానంలో కొనసాగుతున్న దశలో, చక్కెర పదార్థాల ధరలు తగ్గే చర్యల వల్ల వాటి వినియోగం పెరిగి పిల్లల్లో చక్కెరస్థాయి నిల్వలు పెరుగుతాయని హెచ్చరిస్తున్నారు. ఇంకోవైపు బీడీ కార్మికులకు మేలు చేసే నెపంతో బీడీలపై జీఎస్టీ తగ్గింపు సరికాదంటున్నారు.

చైనాతో దోస్తీ... సానుకూలం!

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా విధించిన అదనపు సుంకాల నేపథ్యంలో భారత్ ఆత్మనిర్భర్ దిశగా అడుగులు వేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఒక మార్గం మూసుకుపోయినప్పుడు, మరో మార్గాన్ని ఏర్పరచుకోవాలన్నట్లుగా ప్రధాని నరేంద్రమోదీ జీఎస్టీ 2.0తో పాటు చైనాతో వాణిజ్య బంధాన్ని మెరుగుపర్చుకోవడం గొప్ప ఊరటనిస్తోంది.

'అన్నీ మంచి శకునములే' అన్నట్లుగా భారత్‌కు అమెరికాతో ఏర్పడిన సంక్షోభంతో ప్రత్యామ్నాయ అవకాశాలు లభిస్తున్నాయి. జీఎస్టీ సరళీకరణ వల్ల దేశీయ ఉత్పత్తుల వినియోగం తప్పనిసరిగా పెరుగుతుంది. అదేవిధంగా చైనాతో వాణిజ్య సంబంధాలు మెరుగుపడటం కారణంగా చైనా పెట్టుబడులు, సాంకేతిక నైపుణ్యాలు అందుబాటులోకి వస్తాయి. ఈ అంశాలను సద్వినియోగం చేసుకొని భారతదేశాన్ని ఆత్మనిర్భర్ దిశగా వడివడిగా అడుగులు వేయించాల్సిన బాధ్యత ప్రధానిదే!

వ్యాసకర్త మాజీ కేంద్రమంత్రి, ఏపీ శాసన మండలి సభ్యులు



నేటి నుంచి అమలులోకి వస్తున్న జీఎస్టీ 2.0

వాటా పెంచాలి!

విశ్లేషణ



అజిత్ రనడే

వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) మండలి ఇటీవలి 56వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు చారిత్రకమైనవి. జీఎస్టీ రెండవ అధ్యాయానికి అంకురార్పణగా దాన్ని అభివర్ణించినా తప్పు లేదు. జీఎస్టీని అమలులోకి తెచ్చిన ఏడేళ్ళ తర్వాత, వినియోగంపై వేసిన ఈ లెవీని సంస్కరించేందుకు పెద్ద ప్రక్షాళననే చేపట్టారు. ఇంతవరకు ఉన్న నాలుగు ప్రధాన పన్ను శ్లాబులు సెప్టెంబర్ 22 నుంచి రెండు శ్లాబులు కానున్నాయి. అధిక విలాస వస్తువులు, పొగాకు వంటి 'వ్యసనాల' వస్తువులపై కొత్త శ్లాబు రేటు ప్రవేశపెట్టనున్నారు. ఇంతకుముందున్న పన్నుల రేట్లు, 'సక్రమమైన, సరళమైన' పన్నుగా జీఎస్టీకున్న స్ఫూర్తిని దెబ్బతీశాయి. కనుక, రెండు రేట్ల పద్ధతికి మారడం స్వాగతించదగిన పరిణామం.

గతంలోని 12%–28% రేట్లను రద్దు చేసి 5%–18% రేట్లను అట్టిపెట్టారు. మొత్తం జీఎస్టీ రాబడిలో మూడింట రెండొంతుల భాగాన్ని 18% రేటు ఇప్పటికే తెచ్చిపెడుతోంది. ఆదాయంలో 7% భాగం 5% శ్లాబు ద్వారా లభిస్తోంది. అలాగే 12% శ్లాబు 5% ఆదాయానికి, 28% శ్లాబు 11% ఆదాయానికి కారణమవుతున్నాయి. ఇపుడు 18% శ్లాబు జీఎస్టీ రాబడిలో మరింత ఎక్కువ భాగాన్ని తెచ్చిపెట్టబోతోంది. అయితే, రెండు రేట్లుగా సరళీకరించిన పద్ధతి సమమితిగా సాగలేదు. ఏం చేశారంటే 12% కేటగిరీలోని చాలా వస్తువులను 5% లోకి, 28% వర్గంలోని చాలా వాటిని 18% వర్గంలోకి తెచ్చారు. అధిక పన్ను రేటులోకి చాలా తక్కువ వస్తువులే వెళ్ళాయి. మొత్తం మీద పన్ను భారం లేదా ఈ లెవీకి సంబంధించిన ప్రభావశీల పన్ను రేటు తగ్గింది. ఇది వినిమయ వ్యయాన్ని పెంపొందించే ద్రవ్య ఉద్దీపనగా ఉపకరించవచ్చు.

చాలా భాగం వస్తువులు తక్కువ పన్ను రేట్లకి తరలిపోవడం వినియోగదారుల కోణం నుంచి ద్రవ్య ఉద్దీపన కావచ్చుకానీ, ప్రభుత్వానికి మాత్రం రాబడిలో లోటు ఏర్పడుతుంది. అయితే, దానివల్ల ఏర్పడే లోటు కన్నా, వినియోగదారుల అధిక వ్యయం వల్ల ఒనగూడగల ఆదాయం ఎక్కువగా ఉంటుంది. దీన్ని ఆర్థిక శాస్త్ర పరిభాషలో 'ల్యాఫర్ కర్వ్ ఎఫెక్ట్' అంటారు. సూటిగా చెప్పాలంటే, పన్ను రేటు తగ్గింపు పన్ను వసూళ్ళ పెరుగుదలకు దారితీస్తుంది. కానీ, భారతదేశం విషయంలో దీన్ని సిద్ధాంతపరంగా అన్వయించి చూడలేం. అనుభవంలో మాత్రమే అసలు విషయం తెలుస్తుంది.

రెండు ఇబ్బందులు

జీఎస్టీ వ్యవస్థలోని రెండు అంశాలు ఇప్పటికీ వేధిస్తూనే ఉన్నాయి. ఇది పరోక్ష పన్ను. తిరోగమనదాయకమైనది కావడం వల్ల ధనికుల కన్నా పేదలను ఎక్కువ కుంగదీస్తుంది. పాటించవలసిన నియమ నిబంధనల భారం అధికంగా ఉండటం వల్ల, ముఖ్యంగా చిన్న వ్యాపారులకు ఇది తలనొప్పి తెచ్చిపెట్టే అంశం. రాష్ట్రాలపై ప్రభావం రెండవ అంశం. రేటులో కోత, హేతుబద్ధీకరణ వల్ల ఏర్పడగల స్థూల నష్టం రూ. 1.5 ట్రిలియనా లేక రూ. 1 ట్రిలియన్ కన్నా తక్కువే ఉంటుందా అన్నది చూడవలసి ఉంది. కానీ, దానిలో సగం భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే మోయవలసి ఉంది. తొలుతటి జీఎస్టీ చట్టంలో చేసిన రీయింబర్స్‌మెంట్ వాగ్దానానికి 2022లో కాలం చెల్లింది. పరిహారం సెస్సునకు కూడా గడువు తీరబోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లలో పేర్కొన్న వ్యయాలను ఎలా నిర్వహించగలుగుతాయి?

> జీఎస్టీ రాబడుల పంపకం సూత్రాన్ని రాష్ట్రాలకు అనుకూలంగా 60:40గా మార్చాలి. రాష్ట్రాలపై వ్యయాల భారం ఎక్కువగా ఉంటోంది కనుక అది న్యాయబద్ధమవుతుంది. సహకార సమాఖ్య తత్వ స్ఫూర్తిని పటిష్ఠపరుస్తుంది.

భారతదేశంలో మాత్రమే కనిపించే 'మూడింట రెండు వంతులు/ మూడింట ఒకటో వంతు' సమస్య దాని సమాఖ్య ఏర్పాటులోనే ఉంది. మూడింట రెండొంతుల వ్యయ కర్తవ్యం రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలపైనే ఉంది. కానీ, రెవిన్యూ స్వయం ప్రతిపత్తిలో వాటికున్నది మూడింట ఒకటో వంతు మాత్రమే! పెట్రోలు, డీజిలు, విద్యుచ్ఛక్తి జీఎస్టీ పరిధిలోకి రాకుండా బయటే ఉండిపోవడానికి అది కూడా ఒక కారణం. అటువంటి ఆందోళనలపై స్పందిస్తూ ఆర్థిక మంత్రి రాష్ట్రాల కోశ సుస్థిరత, ఆర్థిక యోగక్షేమాల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్ని రాష్ట్రాలకూ హామీ ఇచ్చారు. ''సహకార సమాఖ్యతత్వ స్ఫూర్తిని ఆలంబన చేసుకునే మా చర్చలు సాగాయి'' అని నిర్మలా సీతారామన్ చెప్పారు.


రాష్ట్రాలకు ఆదాయం పెరిగేలా...

ఈ నేపథ్యంలో, జీఎస్టీ విధానంలో ఒక సంస్కరణ రూపుదిద్దుకునేటట్లు చేయవచ్చు. ప్రస్తుతం 50:50గా ఉన్న పంపకం సూత్రాన్ని రాష్ట్రాలకు అనుకూలంగా 60:40గా మార్చవచ్చు. ఏదేమైనా, మొత్తం ప్రభుత్వ వ్యయాలన్నింటిలోనూ మూడింట రెండొంతుల భారాన్ని రాష్ట్రాలే భరిస్తున్నాయి కనుక, జీఎస్టీ ఆదాయంలో వాటికి 60 శాతం భాగం ఇస్తే, వాటి బడ్జెటరీ ఖర్చులకు తగ్గట్లుగా ఉంటుంది. వసూలు చేస్తున్న జీఎస్టీని సమీకృత మొత్తంగానే చూస్తున్నారు. అంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరఫున (సగం, సగం) సమ భాగాలుగా వసూలు చేస్తున్నట్లు లెక్క. కేంద్రానికి సెస్సులు, దేశ రుణం, విదేశాల నుంచి అప్పులు తెచ్చుకోవడం వంటి ఇతర వనరులు అందుబాటులో ఉన్నాయి. పంపకాల సూత్రాన్ని రాష్ట్రాలకు అనుకూలంగా కొద్దిగా మొగ్గేటట్లు చేసినా, వాటి గాబరా కొంత ఉపశమిస్తుంది. సహకార సమాఖ్యతత్వ స్ఫూర్తి మరింత బలపడుతుంది.

వ్యాసకర్త పుణె ఇంటర్నేషనల్ సెంటర్‌లో సీనియర్ ఫెలో

సోషల్ టాక్


తరగతి గదులు



పిల్లవాడు పాఠాలు మర్చిపోయాడని నిందించకండి. పాఠాలను మరపురానివిగా చేయండి. పిల్లలు, టీనేజర్లు తరగతి గదుల్లో అర్థంకాని వాటిని నేర్చుకోటానికి బందీలుగా పడి ఉండటం నాకు వింతగా అనిపిస్తుంది.

– సోనమ్ వాంగ్చుక్, ఇంజినీర్, ఇన్నోవేటర్


అలా వద్దు!



ఒత్తిడిని ఎదుర్కోవడంలో కీలకం ఏమిటంటే, మీరు దాని గురించి అదే పనిగా ఆలోచించకపోవటం! చింతించడం మాని, దానిని ఆస్వాదించడం మొదలుపెడితే కనుక ఒత్తిడిని మీరు జయించినట్లే! నిజంగా అది గొప్ప విషయం.

– స్టీవ్ వా, ఆస్ట్రేలియా క్రికెటర్


తల్లిని అయ్యాకే!



తల్లిని కాకముందు, పెళ్లి కాని స్త్రీలకే 'ఛాయిస్' ఉంటుందని నాకొక భావన ఉండేది. కానీ, నేను తల్లిని అయిన తర్వాత ఆ భావన పూర్తిగా మారిపోయింది. పెళ్లికి ముందు నటనే నా జీవనాధారం, కానీ ఇప్పుడు అదే నా జీవితేచ్ఛ.

– నవ్యా నాయర్, మలయాళీ నటి


దూరమవుతాం!



నేను ఫేస్‌బుక్, ట్విట్టర్ వాడను. అవి స్నేహితులను అపరిచితులను చేసి, అపరిచితులను స్నేహితులను చేస్తాయి. వాటివల్ల నేను నా ప్రియమైన స్నేహితులతో జరిపే సంభాషణలకు దూరం అవుతాను. అది నేను వారిని కోల్పోవటం కాదు. నన్ను నేను కోల్పోవటం!

– జేమ్స్ మెక్అవోయ్, స్కాటిష్ యాక్టర్

నీది అవదు!



నువ్వు నీలాగే ఉండు, అది సరిపోతుంది. వేరెవరిలానో ఉండే ప్రయత్నం చెయ్యకు! దాని వల్ల నీకు గుర్తింపు వచ్చినా ఆ గుర్తింపు నీది అవదు. ఏదైనా నీ కోసమే చెయ్యి. నీకు తప్ప మరెవరికీ నిన్ను నువ్వు నిరూపించుకోవాల్సిన అవసరం లేదు.

– ప్రజక్తా కోలి, యూట్యూబర్ – నటి

ఎరుపు రంగు



స్టీవ్ జాబ్స్ లాగా మిమ్మల్ని మీరు మలుచుకునే ప్రయత్నం చేయటం అంటే, "నేను పికాసో లాగా పెయింట్ చేయాలనుకుంటున్నాను. అందుకు నేను ఏమి చేయాలి, మరింత ఎరుపు రంగును ఉపయోగించాలా?" అని అడగటం వంటిది.

– లారీ ఎల్లిసన్, 'ఒరాకిల్' కో–ఫౌండర్

అపురూప సాహితీ పరిశోధకుడు

ఇన్ బాక్స్

'ఆచార్య ఎస్వీ రామారావు' పేరు వినని సాహిత్య విమర్శకుడు లేడనటంలో అతిశయోక్తి లేదు. సత్యాన్ని వెలికి తీసే పరిశోధనాత్మక తీర్పు ఎస్వీ రామారావు విమర్శలోని అంతరార్థం. ఆయన 1941 జూన్ 5వ తేదీన వనపర్తి జిల్లా శ్రీరంగాపురం గ్రామంలో జన్మించారు. 1958లో హైదరాబాద్ నిజాం కళాశాలలో ప్రవేశించి పీయూసీ, బీఏ చదివారు. ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో తెలుగులో ఎంఏ పూర్తి చేశారు. అదే కళాశాలలో తెలుగు శాఖ అధ్యక్షుడిగా, 2001లో ఉస్మానియా డీన్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు.



ఆచార్య ఎస్వీ రామారావు

ఆయన సాహిత్య రచన ఆరంభం సినిమా సమీక్షల ద్వారానే జరిగింది. తదనంతరం సాహిత్య విమర్శ రంగంలోకి అడుగు పెట్టారు. ఈ దశ భవిష్యత్తు విమర్శకుడిగా ఎదగడానికి ప్రాథమిక పునాది అయ్యింది. 15 ఏళ్ల వయసులోనే ఆయన విశ్వనాథ సత్యనారాయణ 'ఏకవీర', బుచ్చిబాబు 'చివరకు మిగిలేది', గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర' వంటి తెలుగు సాహిత్యంలో మైలురాయి స్థాయి నవలను చదివేశారు. అందుకే ఆయన 'నా సాహిత్య గురువులు అవే' అనేవారు.

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత సింగిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆయన పరిశోధన గ్రంథమైన 'తెలుగులో సాహిత్య విమర్శ అవతరణ, వికాసాలు' అపూర్వ విమర్శ గ్రంథంగా చెప్పుకోవచ్చు. 'మంచి, చెడు ఏది అనేది తెలుసుకోవాలంటే మొత్తం సాహిత్యం అధ్యయనం చేయాలి' అన్న సిద్ధాంతం ఆయన పరిశోధనకు పునాది అయింది. 1973లో వెలువరించిన 'తెలుగులో సాహిత్య విమర్శ గ్రంథం' తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి ఏకైక విమర్శ చరిత్ర గ్రంథం. ఈ గ్రంథంలో తెలుగు విమర్శ ఆరంభం, 19వ శతాబ్దపు విమర్శ గ్రంథాలు, తొలి నాటక, నవలా విమర్శలు, అలాగే ఆధునిక విమర్శకుడైన విశ్వనాథ, రాళ్లపల్లి వంటి మహనీయుల కృషిని సమగ్రంగా పరిచయం చేశారు. 'ది ఎవల్యూషన్ ఆఫ్ తెలుగు లిటరరీ క్రిటిసిజం' అనేది ఆంగ్ల రచన. 'పాలమూరు సాహితీ వైభవం' అనేది పాలమూరు ప్రాచీన చరిత్ర.


రామారావు సాహిత్య విమర్శ సేవలకు అనేక ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 'ఉత్తమ విమర్శ పురస్కారం'తో 1994లో గౌరవించింది. పరిశోధన పటిమతో రామారావు తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్మరణీయ స్థానాన్ని సంపాదించారు.

– వద్దేపల్లి లక్ష్మీనారాయణ । సాహిత్య విమర్శకుడు
(సెప్టెంబర్ 17న కన్నుమూసిన ఆచార్య రామారావుకు నివాళిగా)

శ్రీ 'మంత్రులు'

డేటా పాయింట్

దేశంలో... రాష్ట్ర మంత్రిమండలిలో (రూ. 100 కోట్లకు పైగా సంపద ఉన్న) అత్యధిక బిలియనీర్లు ఉన్న రాష్ట్రం కర్ణాటక. ఆంధ్రప్రదేశ్ (కూటమి ప్రభుత్వం), తెలంగాణ (కాంగ్రెస్) 2, 5 స్థానాల్లో ఉన్నాయి.



ఆధారం: అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్

ఈశ్వరుడు

జ్యోతిర్మయం

ఈశ్వరుడు అంటే ప్రభువు. పాలకుడు. ఎవరి ఆజ్ఞ ప్రకారం అన్నీ జరుగుతాయో, అందరూ నడుచుకొంటారో, అతడు ఈశ్వరుడు. మనుజేశ్వరుడు అంటే మనుషులకు రాజు. అలాగే లంకేశ్వరుడు, గణేశ్వరుడు, యక్షేశ్వరుడు ఇత్యాది ప్రయోగాలు. ఈశ్వరుడు అంటే శ్రేష్ఠత్వాన్ని సూచించే శ్రేష్ఠ వాచక పదం కూడా! మునీశ్వరుడు. యోగీశ్వరుడు. కవీశ్వరుడు.

ఒక ప్రాంతానికి ఒక మనుజేశ్వరుడున్నట్టే, ఈ జగత్తుకంతటికీ కూడా జగదీశ్వరుడైన ప్రభువు ఉంటాడని ఆస్తికుల విశ్వాసం. 'ఎవ్వనిచే జనించు జగము, ఎవ్వని లోపల నుండు లీనమై, ఎవ్వనియందు డిందు, పరమేశ్వరుడెవ్వడు, మూలకారణం బెవ్వడు, ... వానిని... నే శరణంబు వేడెదన్' అని భాగవతంలో గజేంద్రుడు అభివర్ణించి, ప్రార్థించిన పరమ ఈశ్వరుడు ఆయన. పౌరాణిక కథా సందర్భాలలో త్రిమూర్తులలో లయ కారకుడైన శివుడిని, ఈశ్వరుడు, మహేశ్వరుడు, పరమేశ్వరుడు ('పార్వతీ పరమేశ్వరులు') అని ప్రస్తావించటం చాలాచోట్ల కనిపిస్తుంది.

వేదాంతుల దృష్టిలో అయితే, ఈ బ్రహ్మాండంలో ఉన్న ఒకే ఒక్క సత్యమైన, శాశ్వతమైన, అనాద్యంతమైన 'వస్తువు' పరమాత్మ, లేక 'పరబ్రహ్మ'. అది నిరాకారం, నిర్గుణం. కేవలం 'సత్–చిత్–ఆనందం'. అయితే ఒక కళాకారుడిలో అంతర్లీనంగా అతడి సృజనశక్తి ఉన్నట్టు, పరమాత్మలో లీనమై ఆయన 'మాయాశక్తి' అనే సృజనశక్తి ఉంది. కళాకారుడి సృజనశక్తి ప్రకటితమైతే, అది కళాకృతి అవుతుంది. పరమాత్మ మాయాశక్తి ప్రకటితమైతే, అదే అనేక వైవిధ్యాలూ, వైచిత్ర్యాలూ, చరాచర ప్రాణులూ, అప్రాణులతో కూడిన సృష్టి. ఆ సృష్టిలో అణువణువులోనూ ఆయన సర్వవ్యాపిగా ఉంటాడు. **'ఈశా వాస్యం ఇదం సర్వం'** అని ఉపనిషత్తు. ఆయనే ప్రతి ప్రాణిలోనూ అంతర్యామిగా ఉండి, నడిపిస్తాడు. **'ఈశ్వరః సర్వభూతానాం హృత్–దేశే, అర్జున!, తిష్ఠతి'** అని గీత. మాయాశక్తిని తన వశంలో ఉంచుకొని నడిపే పరమాత్మ ఈశ్వరుడు. ఈశ్వర మాయ వశంలో తను నడిచేవాడు జీవుడు. పరమేశ్వరుడి మాయాశక్తి ఆవిష్కృతమైతే, సృష్టి. అది మళ్ళీ ఆయనలోనే లీనమైపోతే, లయం!

– ఎం. మారుతి శాస్త్రి

జీఎస్టీ సంస్కరణలతో ఆత్మనిర్భరత

దేశవ్యాప్తంగా అభివృద్ధి ఇక వేగవంతం

- స్వదేశీ ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం
- పేదలు, మధ్య తరగతి సహా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి
- దేశంలో ప్రతి ఇంటినీ స్వదేశీకి ప్రతీకగా మార్చుకోవాలి
- దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు
- పౌరులకు 'డబుల్ బొనాంజా' ఇచ్చామని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: తదుపరి తరం వస్తు సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణలతో దేశవ్యాప్తంగా అభివృద్ధి వేగం పుంజుకోనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. 'ఆత్మనిర్భర్ భారత్' సాధన దిశగా ఇది అతిపెద్ద, కీలకమైన అడుగు అని అభివర్ణించారు. దేశ సౌభాగ్యం కోసం స్వదేశీ ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. జీఎస్టీ సంస్కరణలు సోమవారం నుంచే అమల్లోకి రాబోతున్నాయని, నిత్యావసరాల ధరలు తగ్గుతాయని, పేద, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. నవరాత్రులను పురస్కరించుకొని ప్రధాని మోదీ ఆదివారం దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'స్వదేశీ' ఉద్యమం దేశ స్వాతంత్ర్య పోరాటానికి కొత్త శక్తిని ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రజలంతా స్వదేశీ ఉత్పత్తులు ఉపయోగించుకుంటే దేశ ఆర్థిక ప్రగతికి నూతన బలం చేకూరుతుందని వెల్లడించారు. దేశంలో ప్రతి ఇంటినీ స్వదేశీకి ప్రతీకగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రతి దుకాణాన్నీ స్వదేశీ వస్తువులతో అలంకరించాలని పిలుపునిచ్చారు. రూ.12 లక్షల దాకా ఆదాయంపై ఇప్పటికే పన్ను మినహాయింపు ఇచ్చామని, ఇప్పుడు జీఎస్టీ సంస్కరణలు తీసుకొచ్చామని, ఈ రెండూ దేశ పౌరులకు 'డబుల్ బొనాంజా' అని స్పష్టంచేశారు. దీనివల్ల ఖర్చులు తగ్గి, డబ్బులు ఆదా చేయడం పెరుగుతుందని, తద్వారా ప్రజలు వారి కలలు నిజం చేసుకోవడానికి అవకాశం దక్కుతుందని వ్యాఖ్యానించారు. రెండు కీలక నిర్ణయాల వల్ల ప్రజలకు రూ.2.5 లక్షల కోట్లు ఆదా అవుతాయని వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..

నాగరిక్ దేవో భవ

''మన దేశం స్వావలంబన సాధించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలి. పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని రాష్ట్రాలు కల్పించాలి. తయారీ రంగాన్ని మరింతగా ప్రోత్సహించాలి. ప్రజలు 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులు విస్తృతంగా ఉపయోగించాలి. స్వదేశీ ఉత్పతుల కొనుగోలు, విక్రయం మన ధ్యేయం కావాలి. మన దేశంలో తయారైన వస్తువులు, సరుకులే వాడుకుంటున్నామని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకోవాలి. అప్పుడు మన దేశం ప్రగతి పథంలో పరుగులు తీస్తుంది. నాగరిక్ దేవో భవ(ప్రజలే దేవుళ్లు) అనేదే మా విధానం. ప్రజలకు మేలు చేయాలన్న తలంపుతోనే జీఎస్టీ సంస్కరణలకు శ్రీకారం చుట్టాం. ఈ నిర్ణయంతో కీలకమైన నిత్యావసర వస్తువులు, సేవల ధరలు తగ్గుతాయి. నిర్మాణం, ఆరోగ్య రంగంలోనూ ఖర్చులు తగ్గిపోతాయి. సోమవారం నుంచి 'జీఎస్టీ సేవింగ్స్ ఫెస్టివల్' ప్రారంభం కానుంది. ప్రతి కుటుంబానికి సంతోషం తీసుకొస్తుంది. ఆత్మనిర్భర్ భారత్ కోసం ఈ నవరాత్రుల్లో తొలి రోజు దేశం కీలకమైన అడుగు వేయబోతోంది. మీకు ఇష్టమైన వస్తువులు తక్కువ ధరకే కొనుక్కోవచ్చు. పేదలు, మధ్య తరగతి, యువత, రైతులు, మహిళలు, వ్యాపారులు, దుకాణదారులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతారు. దేశంలో సులభతర వాణిజ్యం ఊపందుకుంటుంది. భారీగా పెట్టుబడులు వస్తాయి'' అని మోదీ చెప్పారు.



ఇకనుంచి 5, 18% శ్లాబ్‌లే..

'సంస్కరణలతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) సైతం ప్రయోజనం పొందుతాయి. మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులకు పూర్వ వైభవం తీసుకురావాలని ఎంఎస్ఎంఈలను కోరుతున్నా. స్వావలంబన భారత్ నిర్మాణంలో ఎంఎస్ఎంఈలదే కీలక పాత్ర. సాధ్యమైనంత ఎక్కువగా మన దేశంలోనే వస్తువులు ఉత్పత్తి చేయాలి. మనం ఉపయోగించుకుంటున్న వస్తువు ఎక్కడ తయారైందో ప్రజలు తెలుసుకోవాలి. నిత్యం వాడుతున్న దువ్వెన ఎక్కడ తయారు చేశారో కూడా చాలామందికి తెలియదు. విదేశీ వస్తువులకు ప్రాధాన్యం వేయడం సరైంది కాదు. ఇకపై స్వదేశీ ఉత్పత్తులకే పెద్దపీట వేద్దాం. తగ్గిన జీఎస్టీ రేట్ల ప్రయోజనం ప్రజలకు దక్కేలా పరిశ్రమ వర్గాలు చొరవ చూపుతుండడం సంతోషంగా ఉంది. ఇకనుంచి 5 శాతం, 18 శాతం ట్యాక్స్ శ్లాబ్‌లే ఉంటాయి. గతంలో 12 శాతం పన్ను శ్లాబ్‌లో ఉన్న 99 శాతం వస్తువులను 5 శాతం పన్ను శ్లాబ్‌లోకి తీసుకొచ్చాం. ఫలితంగా వాటి ధరలు గణనీయంగా తగ్గిపోతాయి' అని మోదీ అన్నారు.

బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు..

''2017లో జీఎస్టీ సంస్కరణలు ఆరంభించాం. చరిత్ర లిఖించడానికి అప్పుడే అడుగు పడింది. ఒకే దేశం–ఒకే పన్ను అనే స్వప్నాన్ని జీఎస్టీ నిజం చేసింది. గతంలో రకరకాల పన్నులు, సుంకాల వల్ల వ్యాపారులకు, వినియోగదారులకు ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యేవి. పన్నుల భారాన్ని వ్యాపారులు జనంపైనే వేసేవారు. జీఎస్టీతో ఆ కష్టాలకు చరమగీతం పాడేశాం. 2014లో ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఓ విదేశీ పత్రికలో వార్త చదివా. బెంగళూరు నుంచి 570 కిలోమీటర్ల దూరంలోని హైదరాబాద్‌కు సరుకులు చేరవేయడం ఓ కంపెనీకి పెద్ద సవాలుగా మారిందని అందులో రాశారు. పలు రకాల పన్నులు చెల్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. దానికి బదులు తొలుత యూరప్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు చేర్చడమే సులభమని ప్రస్తావించారు. అందుకే పన్నులపరంగా అవరోధాలు తొలగించాలని నిర్ణయించాం. అన్ని రాష్ట్రాలు, భాగస్వామ్య పక్షాలతో చర్చించి, జీఎస్టీని తీసుకొచ్చాం'' అని ప్రధాన మంత్రి 'మోదీ వివరించారు.

క్రెడిట్ కొట్టేయడానికి మోదీ ఆరాటం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్నులో నరేంద్ర మోదీ సర్కార్ చేపట్టిన మార్పులు లోతైన గాయాలకు కేవలం బ్యాండ్‌–ఎయిడ్ వేసి వదిలేసినట్లుగా ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. కొన్ని రకాల నిత్యావసరాలపై అధికంగా జీఎస్టీ విధించారని, ప్రజలకు కేంద్రం క్షమాపణ చెప్పాలని అన్నారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. 900 ఎలుకలను తిన్న పిల్లి హజ్ యాత్రకు వెళ్లిందన్న సామెత తీరుగా ప్రధాని నరేంద్ర మోదీ తీరు ఉందని ధ్వజమెత్తారు. మోదీ సర్కార్ ఇప్పటిదాకా 9 రకాల పన్నుల శ్లాబ్‌లతో గబ్బర్‌సింగ్ ట్యాక్స్ వసూలు చేసిందని ఆరోపించారు. ఎనిమిదేళ్లలో ఏకంగా రూ.55 లక్షల కోట్లు ప్రజల నుంచి వసూలు చేసిందన్నారు. కానీ, ఇప్పుడు ప్రజలకు రూ.2.5 లక్ష కోట్లు కోసం ఆదా చేశామంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సంస్కరణల విషయంలో మొత్తం క్రెడిట్ కొట్టేయడానికి ప్రధాని మోదీ ఆరాటపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. నిజానికి జీఎస్టీలో ఇప్పుడు తీసుకొచ్చిన సంస్కరణలు ఏమాత్రం సరిపోవని చెప్పారు. రాష్ట్రాలకు ఇచ్చే పరిహారాన్ని మరో ఐదేళ్లు పొడిగించాలన్న డిమాండ్‌ను కేంద్రం విస్మరించిందని ఆక్షేపించారు. జీఎస్టీ 2.0 తీసుకురావాలని తాము 2017 జూలై నుంచే డిమాండ్ చేస్తున్నామని గుర్తుచేశారు. జీఎస్టీలో సంస్కరణలను మరింత విస్తరింపజేయాలని కేంద్రానికి సూచించారు.

పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తున్నాం

ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్ ప్రకటన
అమెరికా, ఇజ్రాయెల్ అభ్యంతరాలు బేఖాతరు

లండన్: పరమకిరాతకంగా వందల కొద్దీ బాంబులేస్తూ, భూతల దాడులుచేస్తూ పాలస్తీనియన్ల మరణ శాసన రాస్తున్న ఇజ్రాయెల్‌పై ధర్మాగ్రహంతో బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. గాజావాసులున్న భూభాగాన్ని స్వతంత్ర పాలస్తీనా దేశంగా అధికారికంగా గుర్తిస్తున్నట్లు ఈ మూడు దేశాలు ఆదివారం ప్రకటించాయి. పాలస్తీనాను దేశంగా అధికారికంగా గుర్తించొద్దని అమెరికా, ఇజ్రాయెల్‌ల నుంచి తీవ్రస్థాయిలో ప్రతిఘటన ఎదురవుతున్నప్పటికీ బ్రిటన్ తన స్వీయనిర్ణయానికే కట్టుబడి ఉంటుందని బ్రిటిష్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఆదివారం వ్యాఖ్యానించారు. తామూ పాలస్తీనాను దేశంగా గుర్తిస్తున్నట్లు కెనడా ప్రధాని మార్క్ కార్నీ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో ఆదివారం ఒక పోస్ట్‌చేశారు. తాము సైతం పాలస్తీనాకే మద్దతు పలుకుతున్నట్లు ఆస్ట్రేలియా ఆదివారం ప్రకటించింది. కామన్వెల్త్ దేశాల మధ్య సమన్వయాన్ని పెంచే చర్యల్లో భాగంగా కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గాజాలో మరణమృదంగం మోగిస్తున్న ఇజ్రాయెల్ విషయంలో కఠిన నిర్ణయం తీసుకోవాలని సొంత లేబర్ పార్టీ నుంచి ఒత్తిళ్ల నేపథ్యంలో బ్రిటన్‌లో స్టార్మర్ సర్కార్ ఈ ప్రకటన వెలువరించింది. కాల్పుల విరమణ, గాజాలో ఐరాస మానవతా సాయం అనుమతి, శాంతి స్థాపనకు ఇజ్రాయెల్ అడ్డు తగిలితే పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామని జూలైలోనే స్టార్మర్ ప్రకటించారు.

ద్విదేశ పరిష్కారం ఉత్తమం

ఈ మేరకు లండన్‌లోని ప్రధాని కార్యాలయం నుంచి స్టార్మర్ పేరిట ఒక వీడియో సందేశం వెలువడింది. ''పాలస్తీనియన్లకు అనుకూలంగా మాత్రమే నిర్ణయం తీసుకున్నాం. ఇది హమాస్ సాయుధ సంస్థకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయం కాదు. భవిష్యత్తులో పాలస్తీనియన్ల ప్రభుత్వ పాలనలో బ్రిటన్ పాత్ర ఏమాత్రం ఉండదు. పాలస్తీనాలో శాంతియుత భవిత కోసం మనందరం కలసినడుద్దాం. హమాస్ చెరలోని బందీలను విడిపించుకుందాం. ఘర్షణలకు చరమగీతం పాడదాం. శాంతి, భద్రతలకు ద్విదేశ పరిష్కారం ఉత్తమం'' అని స్టార్మర్ స్పష్టంచేశారు. 1917లో నాటి పాలస్తీనా భూభాగంపై ఏలిన బ్రిటన్ తదనంతరకాలంలో ఇజ్రాయెల్ ఆవిర్భావానికి పునాది రాయి వేసింది. అదే బ్రిటన్ ఇన్నాళ్ల తర్వాత పాలస్తీనాను స్వతంత్ర దేశంగా ప్రకటించడం గమనార్హం. ఇప్పటికే భారత్ సహా 140కిపైగా దేశాలు పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించినప్పటికీ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసి ఐరాసతో స్వతంత్రదేశంగా ప్రకటన చేయించడంలో విఫలమయ్యాయి. అయితే ఈసారి ఆ దిశగా అడుగులుపడే అవకాశముందని తెలుస్తోంది.

తప్పుబట్టిన నెతన్యాహూ

ఆస్ట్రేలియా, యూకే, కెనడాల నిర్ణయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తప్పుబట్టారు. ''మీరంతా పాలస్తీనాను దేశంగా గుర్తించినంతమాత్రాన సరిపోదు. దానిని వాస్తవరూపంలోకి తీసుకురావాలి. అది అసాధ్యం. పాలస్తీనాను గుర్తించడం అంటే 2023 అక్టోబర్ ఏడున ఇజ్రాయెల్‌పై హమాస్ సాయుధుల మెరుపుదాడి, వందల మంది ఊచకోతను ఈ దేశాలన్నీ సమర్థించినట్లే. ఈ తాజా గుర్తింపు హమాస్‌కు మీరంతా ఇచ్చే బహుమతితో సమానం. జోర్డాన్ నదీ పశ్చిమాన పాలస్తీనా ఆవిర్భావాన్ని నేను సాధ్యం కానివ్వను. వచ్చే వారం అమెరికాలో పర్యటన, ట్రంప్‌తో భేటీ తర్వాత నా తదుపరి కార్యాచరణ వెల్లడిస్తా'' అని నెతన్యాహూ అన్నారు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయాక ఒట్టొమన్ రాజ్యపతనం ఆరంభమైంది. అప్పటి నుంచి వందేళ్లపాటు పశ్చిమాసియా భౌగోళిక, రాజకీయాలపై ఫ్రాన్స్, బ్రిటన్‌ల ఆధిపత్యం కొనసాగింది. యూదుల కోసం ఒక దేశం అవసరమని చేసిన 1917లో చేసిన బాల్ఫోర్ తీర్మానాన్ని బ్రిటనే రచించింది. తీర్మానం మొదటిభాగాన్ని సవ్యంగా అమలుచేసిన బ్రిటన్ ఆ తర్వాత రెండో భాగాన్ని గాలికొదిలేసింది. పాలస్తీనియన్ల పౌర, మత హక్కులకు ఎలాంటి అవరోధాలు సృష్టించకూడదని రెండోభాగంలో తీర్మానించినా అది ఇజ్రాయెల్ కారణంగా అమలుకు నోచుకోలేదు. ఇన్నాళ్ల తర్వాత బ్రిటన్ పాలస్తీనాను గుర్తించి గతంలో తాను చేసిన చారిత్రక తప్పిదాన్ని సరిచేసిందని రాయల్ యునైటెడ్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్‌లో పరిశోధకుడు బెర్కూ ఒజ్‌సేలిక్ వ్యాఖ్యానించారు.

41వ సారి!



- భారత్, పాక్ సమరానికి స్వస్తి పలికింది నేనేనని మళ్లీ ప్రకటించుకున్న ట్రంప్
- ఏడు యుద్ధాల్ని ఆపిన తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని వ్యాఖ్య

న్యూఢిల్లీ/వాషింగ్టన్: పదేపదే అదే విషయాన్ని చెప్పి అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డ్‌లా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మారిపోయారు. ఆపరేషన్ సిందూర్ వేళ భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం అణ్వస్త్రపోరుకు దారితీయకుండా తానొక్కడినే అడ్డంగా నిలబడి యుద్ధానికి ముగింపు పలికానని ట్రంప్ శనివారం మరోమారు ప్రకటించుకున్నారు. ఇలా ప్రకటించుకోవడం ఇది 41వ సారి కావడం గమనార్హం. ఈ ప్రకటనకు వర్జీనియా రాష్ట్రంలోని మౌంట్ వెర్నాన్ పట్టణంలో జరిగిన 'అమెరికన్ కార్నర్‌స్టోన్ ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్స్' డిన్నర్ కార్యక్రమం వేదికైంది. భారత్, పాక్ ఘర్షణలను తానే ఆపానని ట్రంప్ ఇప్పటికే పలు సందర్భాల్లో మొత్తంగా 40 సార్లు ప్రకటించారని వార్తలొచ్చాయి. ''భారత్, పాకిస్తాన్ మధ్య ఇటీవల మొదలైన యుద్ధాన్ని మీరొకసారి గుర్తుచేసుకోండి. నేనా యుద్ధాన్ని ఎలా ఆపానో తెలుసా? వాణిజ్యం ఆయుధంతో భయపెట్టి ఆ రెండు దేశాలను తీవ్ర యుద్ధంలో జారిపోకుండా కాపాడా. నేను ఇలా ఎన్నో యుద్ధాలను ఆపేశా. భారత్, పాకిస్తాన్, థాయ్‌లాండ్, కాంబోడియా, అర్మేనియా, అజర్‌బైజాన్, కొసావో, సెర్బియా, ఇజ్రాయెల్, ఇరాన్, ఈజిప్ట్, ఇథియోపియా, రువాండా, డీఆర్ కాంగో ఇలా ఇన్ని దేశాల మధ్య ఆరంభమైన ఏడు యుద్ధాలను నిలువరించా. వీటిలో 60 శాతం యుద్ధాలను కేవలం వాణిజ్యబూచిని చూపి అడ్డుకున్నా. నెలల తరబడి కొనసాగుతున్న రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపితే నాకు కచ్చితంగా నోబెల్ శాంతి పురస్కారం దక్కుతుందేమో. అసలు నేను ఇప్పటికే 7 యుద్ధాలను ఆపాను కదా ఈ లెక్కన ఒక్కో భారీ యుద్ధానికి ఒక నోబెల్ లెక్కేసుకున్నా ఏడు నోబెల్ బహుమతులు రావాలి. కానీ కొందరు నాతో మరోలా చెప్పారు. ఏడు సంగతి పక్కనబెడితే ఈ రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపితే మాత్రం నోబెల్ తథ్యం అని అన్నారు. వాస్తవానికి ఏడు సమరాలకు ముగింపు పలకడం అంత ఆషామాషీ వ్యవహారం కాదు. ఒక్క యుద్ధం ఆపడమంటే అత్యంత సంక్లిష్ట, సాహసోపేతమైన పని విజయవంతంగా పూర్తిచేసినట్లే. వాస్తవానికి పుతిన్‌తో నాకున్న పాత పరిచయాల కారణంగా ఈ యుద్ధం ఆపడం అత్యంత తేలిక అని గతంలో భావించా. నా నమ్మకాన్ని పుతిన్ వమ్ముచేసి వంచించారు. ఎలాగైనా సరే ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపి తీరుతా'' అని ట్రంప్ అన్నారు.

కొత్త దరఖాస్తులకే లక్ష డాలర్లు

- అది కూడా ఒక్కసారి మాత్రమే.. రెన్యూవల్స్‌కు పాత రుసుమే
- ఈనెల 21 తర్వాత సమర్పించే దరఖాస్తులకే వర్తింపు
- ఇప్పటికే వీసాలు ఉన్నవారికి, రెన్యూవల్స్‌కు ఎలాంటి అదనపు రుసుము ఉండదు
- వారికి సాధారణ చార్జీలే వర్తిస్తాయి
- వీసాదారులు నిక్షేపంగా స్వదేశాలకు వెళ్లిరావొచ్చు
- హెచ్‌–1బీ వీసాలపై యూఎస్ సిటిజెన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ వివరణ



వాషింగ్టన్: విదేశీ వృత్తి నిపుణులు అమెరికాలో తాత్కాలికంగా ఉద్యోగాలు చేసుకోవడానికి వీలు కల్పించే హెచ్‌–1బీ వీసా దరఖాస్తు రుసుమును ఏకంగా లక్ష డాలర్లకు పెంచేయడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీనిపై రకరకాల సందేహాలు తలెత్తాయి. కొత్త దరఖాస్తులకేనా? లేక వీసాల పునరుద్ధరణకు కూడా ఈ రుసుము వర్తిస్తుందా? దరఖాస్తు చేసిన ప్రతిసారీ లక్ష డాలర్లు చెల్లించాలా? అనే అనుమానాలు విదేశీ ఉద్యోగుల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తాజాగా స్పష్టతనిచ్చింది. హెచ్‌–1బీ వీసాలతో ఇప్పటికే అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నవారికి భారీ ఊరట కల్పించింది. కొత్త దరఖాస్తులకు మాత్రమే లక్ష డాలర్ల రుసుము వసూలు చేయనున్నట్లు తెలియజేసింది. అది కూడా ఒక్కసారి మాత్రమేనని, వారు వీసా రెన్యూవల్ చేసుకుంటే పాత రుసుములే వర్తిస్తాయని వెల్లడించింది. అంతేకాకుండా ప్రస్తుతం హెచ్‌–1బీ వీసాలు కలిగి ఉన్నవారిపై ఎలాంటి ప్రభావం ఉండబోదని పేర్కొంది. వారు వీసా రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ లక్ష డాలర్లు చెల్లించాల్సి అవసరం లేదని, పాత రుసుములే వర్తిస్తాయని వివరించింది. ఈ మేరకు యూఎస్ సిటిజెన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. హెచ్‌–1బీ వీసా కోసం తొలిసారిగా దరఖాస్తు చేసేవారు మాత్రమే లక్ష డాలర్లు చెల్లించాలని తెలియజేసింది. ఈ నెల 21వ తేదీ కంటే ముందు సమర్పించిన వీసా దరఖాస్తులపై ఎలాంటి ప్రభావం ఉండబోదని, లక్ష డాలర్ల ఫీజు వారికి వర్తించదని వెల్లడించింది. 21వ తేదీ తర్వాత సమర్పించే దరఖాస్తులకు మాత్రమే లక్ష డాలర్లు చెల్లించాలని సూచించింది. ప్రస్తుతం అమెరికా బయట ఉన్న హెచ్‌–1బీ వీసాదారులు మళ్లీ తమ దేశంలోకి రావడానికి కొత్తగా వీసా ఫీజు చెల్లించాల్సి అవసరం లేదని స్పష్టంచేసింది.

దుర్వినియోగాన్ని అడ్డుకోవడానికే భారీ రుసుము

లక్ష డాలర్ల ఫీజు అనేది వన్‌–టైమ్ చార్జీ మాత్రమేనని వైట్‌హౌస్ అధికార ప్రతినిధి టేలర్ రోజర్స్ తెలిపారు. కొత్త దరఖాస్తులకే ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. లక్ష డాలర్లు చెల్లించి పొందిన హెచ్‌–1బీ వీసాను రెన్యూవల్ చేసుకోవడానికి మళ్లీ లక్ష డాలర్లు చెల్లించాల్సిన పనిలేదని, పాత చార్జీలు చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. ఇప్పటికే హెచ్‌–1బీ వీసాలు పొందిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వీసా రెన్యూవల్‌పై వారిపై అదనంగా ఎలాంటి భారం పడబోదని తేల్చిచెప్పారు. 2025లో లాటరీలో హెచ్‌–1బీ వీసాలు పొందినవారిపై భారమేమీ ఉండదన్నారు. త్వరలో జరగబోయే లాటరీలో పాల్గొని, మొట్టమొదటిసారిగా వీసాలు పొందేవారు లక్ష డాలర్లు చెల్లించక తప్పదని వివరణ ఇచ్చారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల్లో స్థానిక అమెరికన్లకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానమని గుర్తుచేశారు. విదేశీయులను విచ్చలవిడిగా నియమించుకోకుండా అమెరికా కంపెనీలను నిరుత్సాహపర్చాలన్నదే ఆయన ఉద్దేశమని పేర్కొన్నారు. అత్యధిక ప్రతిభాపాటవాలు కలిగిన ఉద్యోగులే ఉద్యోగాల్లో చేరితే తమ దేశానికి లబ్ధి కలుగుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌–1బీ వీసా కార్యక్రమం దుర్వినియోగం అవుతోందని, దీనికి అడ్డుకట్ట వేసే దిశగానే కొత్త దరఖాస్తులపై లక్ష డాలర్ల రుసుము విధించినట్లు స్పష్టంచేశారు. ఈ నెల 21 కంటే ముందు హెచ్‌–1బీ వీసా దరఖాస్తులు సమర్పించిన వారు, అవి ఆమోదం పొందినవారు లక్ష డాలర్లు చెల్లించనక్కర్లేదని యూఎస్‌సీఐఎస్ డైరెక్టర్ జోసెఫ్ ఎడ్‌లో వెల్లడించారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లెవిట్ సైతం స్పందించారు. 'ఎక్స్'లో పోస్టు చేశారు. హెచ్‌–1బీ నాన్‌–ఇమ్మిగ్రెంట్ వీసాల విషయంలో లక్ష డాలర్లు అనేది వార్షిక రుసుము కాదని, వన్‌–టైమ్ ఫీజు మాత్రమేనని ఉద్ఘాటించారు. ఈ వీసా కోసం ప్రతిఏటా లక్ష డాలర్లు కట్టాల్సిన పని లేదని, మొదటిసారి చెల్లిస్తే సరిపోతుందని, ఆ తర్వాత సాధారణ చార్జీలే వర్తిస్తాయని తెలియజేశారు. ఇప్పటికే హెచ్‌–1బీ వీసాదారులు ఉన్నవారు ఎప్పటిలాగే నిక్షేపంగా వారి స్వదేశానికి వెళ్లి రావొచ్చని సూచించారు. ఇదిలా ఉండగా, వీసా రుసుములపై అమెరికా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో భారతీయ ఐటీ నిపుణులు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. సంబంధిత ఉత్తర్వుపై అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేసిన తర్వాత వారు ఆందోళనకు గురైన సంగతి తెలిసిందే.

అమెరికాలో కాల్పులు..ఇద్దరు మృతి

ఇండియానాపొలిస్: అమెరికాలోని ఇండియానాపొలిస్‌లో ఆదివారం జరిగిన కాల్పుల ఘటనలో ఇద్దరు చనిపోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. షోర్ టెర్రస్‌లోని పార్కింగ్ ప్రాంతంలో అర్ధరాత్రి 2 గంటల సమయంలో జరిగిన గొడవే కాల్పులకు దారితీసిందని భావిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనలో స్వల్పంగా గాయాలైన మరో ఇద్దరు సొంతంగానే ఆస్పత్రికి వెళ్లారని పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు జరుగుతోందన్నారు.

జెన్ జడ్ నిరసనల్లో మరణాలపై దర్యాప్తు కమిటీ

కాఠ్మండు: నేపాల్‌లో కేపీ శర్మ ఓలిని గద్దె దింపేందుకు జెన్ జెడ్ విద్యార్థులు చేపట్టిన నిరసనల సమయంలో 72 మంది చనిపోవడంపై దర్యాప్తు చేపట్టేందుకు ఆపద్ధర్మ ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశామని ఆదివారం ప్రభుత్వం ప్రకటించింది. కమిటీలో రిటైర్డు జడ్జి గౌరీ బహదూర్ కర్కి, మాజీ అదనపు ఏజీపీ బిగ్యాన్ రామ్ శర్మ, న్యాయ నిపుణుడు బిశ్వేశ్వర్ ప్రసాద్ భండారి ఉన్నారు. ఈ కమిటీ మూడు నెలల్లోగా నివేదిక అందజేస్తుందని హోం మంత్రి ఓం ప్రకాశ్ ఆర్యాల్ మీడియాకు తెలిపారు.

కర్కి కేబినెట్‌లో మరో ఐదుగురు మంత్రులు

కాఠ్మండు: నేపాల్ ప్రధానమంత్రి సుశీలా కర్కి సారథ్యంలోని ఆపద్ధర్మ ప్రభుత్వ కేబినెట్‌లో మరో ఐదుగురు మంత్రులు చేరారు. దీంతో కేబినెట్ బలం ప్రధాని సహా తొమ్మిదికి చేరుకుంది. ప్రధాని కర్కి సిఫారసు మేరకు అధ్యక్షుడు రాంచంద్ర పౌడెల్ ఆదివారం అనిల్ సిన్హా, మహావీర్ పున్, సంగీతా కౌశల్ మిశ్రా, జగదీశ్ ఖరేల్, మదన్ పరియార్‌లను కొత్తగా మంత్రులు నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరు సోమవారం మంత్రులుగా ప్రమాణం చేస్తారని అధ్యక్ష కార్యాలయం తెలిపింది. మార్చి 5వ తేదీన సాధారణ ఎన్నికలు జరిగే వరకు ఆపద్ధర్మ ప్రభుత్వం అధికారంలో కొనసాగనుంది.

మధ్యవర్తిత్వానికి జాప్యం జాడ్యం

సుప్రీంకోర్టు జడ్జి సూర్యకాంత్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం కూడా ఆలస్యమవుతోందని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కేసుల పరిష్కారానికి ఒకప్పుడు సత్వరమైన ప్రత్యామ్నాయంగా ఉన్న మధ్యవర్తిత్వానికి నేడు మితిమీరిన వాయిదాల జాడ్యం అంటుకుందని వ్యాఖ్యానించారు. మధ్యవర్తిత్వం అంశంలో ప్రపంచంలోనే ప్రముఖంగా నిలవాలని భావిస్తున్న భారత్ కేవలం తీర్పుల సంఖ్యతోనే కాదు, ఆ తీర్పుల్లో తార్కికమైన ప్రమాణాలను, నిష్పాక్షికతను ప్రతిబింబించాలన్నారు. మధ్యవర్తిత్వ తీర్పుల్లో జాప్యాన్ని నివారించేందుకు ఇరుపక్షాలు కట్టుబడి ఉండాల్సిన నమూనా విధివిధానాలు వంటి సంస్థాగత పద్ధతులను అవలంబించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. వాయిదాలను కఠినంగా నియంత్రించడం ఈ సమస్యకు ఒక పరిష్కారమని తెలిపారు. మధ్యవర్తిత్వ విధాన సమగ్రతను కాపాడేందుకు క్రమశిక్షణ ఎంతో అవసరమని జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. వాణిజ్య వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వ విధానం నేడు వెన్నెముకగా మారిందని చెప్పారు.

అమెరికా పొమ్మంటే.. చైనా రమ్మంటోంది

విదేశీ ప్రతిభావంతుల కోసం కొత్తగా కే-వీసా ● అక్టోబర్ నుంచి జారీ

బీజింగ్: హెచ్‌–1బీ వీసా వార్షిక రుసుమును పెంచేసి అమెరికా విదేశీ ప్రతిభావంతులను దూరం చేసుకుంటుంటే ఇదే అదనుగా వాళ్లకు చైనా స్వాగతం పలుకుతోంది. కీలకమైన సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మెడిసిన్(స్టెమ్) కోర్సుల్లో పట్టభద్రులైన విదేశీ నిపుణులు సులభంగా తమ కొత్త కే-వీసా పొంది తమ దేశంలో హాయిగా ఉద్యోగాలు చేసుకోవచ్చని చైనా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు అక్టోబర్ నుంచి కొత్త కేటగిరీ అయిన కే-వీసాల జారీ ప్రక్రియను ప్రారంభించబోతున్నట్లు ఆదివారం పేర్కొంది. కొత్త కేటగిరీ వీసాల జారీకి వీలుగా విదేశీయుల రాకపోకల అడ్మినిస్ట్రేషన్ నిబంధనల్లో మార్పులు తీసుకొచ్చారు. అమెరికా సహా పలు సంపన్న దేశాలు స్థానికుల ఉద్యోగకల్పనకు ప్రాధాన్యతనిస్తూ వర్క్ వీసా నిబంధనలను కఠినతరం చేస్తుండటంతో విదేశీ ప్రతిభావంతులను ముఖ్యంగా దక్షిణాసియా యువ ప్రతిభను ఒడిసిపట్టేందుకు చైనా ఇలా కొత్త కేటగిరీ వీసాను తెస్తోంది. చైనా లేదా విదేశీ ప్రముఖ విశ్వవిద్యాలయాలు, ఇన్‌స్టిట్యూట్‌లలో స్టెమ్ కోర్సుల్లో బ్యాచిలర్ డిగ్రీ లేదా ఆపై ఉత్తీర్ణత సాధించిన యువ శాస్త్ర, సాంకేతిక నిపుణులకు కే-వీసాను ఇవ్వనున్నారు. బోధన, పరిశోధనారంగంలో ఉన్న వాళ్లు కే-వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఎక్కువ రోజుల కాలపరిమితి, ఎక్కువ సార్లు స్వదేశాలకు రాకపోకలు సాగించే వెసులుబాటు, రెన్యూవల్ సదుపాయం వంటి మరిన్ని ఫీచర్లను కే-వీసాకు జోడించారు. హెచ్‌–1బీ వీసా రావాలంటే అమెరికాలోని కంపెనీయే స్వయంగా వీసా దరఖాస్తుదారుడిని సిఫార్సు చేయాల్సి ఉంటుంది. చైనా కే-వీసాకు అలాంటి కఠిన షరతులు లేవని తెలుస్తోంది. విదేశీయులు చైనాలో విద్య, సాంస్కృతిక, శాస్త్ర, సాంకేతికత, అంకుర వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల్లో పాల్గొనేందుకు కే-వీసా అనుమతిస్తుంది. ఇన్నాళ్లూ అమెరికాకు పాలోమంటూ వెళ్లిన సృజనాత్మక, ప్రతిభావంత యువతను తమ వైపునకు తిప్పుకోవాలని చైనా అభిలషిస్తోంది.

11, 12 తరగతుల్లో నైపుణ్యాధారిత బోధన

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి

చెన్నై: జాతీయ విద్యా విధానం–2020 సిఫారసు మేరకు 11, 12వ తరగతుల్లో నైపుణ్య ఆధారిత పాఠ్యాంశాలను చేర్చే విషయం పరిశీలిస్తున్నట్లు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. మద్రాస్ ఐఐటీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక సర్టిఫికెట్ లేదా డిగ్రీకే విద్యా విధానం పరిమితం కారాదని, విద్యార్థులను పోటీకి అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అన్నారు. జాతీయ విద్యా విధానంలో నైపుణ్యాధారిత విద్య ప్రముఖంగా ఉందని చెప్పారు. గతంలో నైపుణ్యాధారిత విద్య ఆప్షనల్‌గా ఉండేదని ఇకపై విద్యలో ఇదో భాగంగా మారనుందన్నారు. ఆరోగతి నుంచే నైపుణ్య ఆధారిత విద్యాబోధనను ప్రవేశపెట్టే యోచన ఉందని మంత్రి వివరించారు. దేశంలోని ఏ రాష్ట్రంపైనా ఏ భాషనూ కేంద్రం బలవంతంగా రుద్దడం లేదని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. త్రిభాషా విధానంపై కేంద్రం రాష్ట్రాలను బలవంతం చేస్తోందంటూ కొందరు చేసే ఆరోపణలను రాజకీయ ప్రేరేపితమైనవిగా ధర్మేంద్ర ప్రధాన్ అభివర్ణించారు.

అంతర్ముఖత్వం.. బహిర్ముఖత్వం.. ఈ రెండూ ఉండే ఉభయముఖత్వం.. మొత్తం ఈ మూడింటి గురించీ, ఈ తరహా వ్యక్తుల గురించీ అందరూ వినే ఉంటారు. సమాజంలో ఉండే వాళ్లంతా ఈ మూడు కేటగిరీల్లో ఏదో ఒక దాన్లో ఉంటారు అని అందరూ అనుకుంటారు. కానీ, కాదట. కొత్త తరహా వ్యక్తిత్వం ఉన్న వ్యక్తులు కూడా ఉన్నారట. ఈ వ్యక్తులకు 'ఆట్రోవర్ట్' అనే పేరును ఖరారు చేశారు అమెరికాకు చెందిన ప్రముఖ సైకియాట్రిస్ట్ రామి కమిన్‌స్కి. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వంటి మేధావులు ఈ కోవకు చెందుతారట.

- సాక్షి, స్పెషల్ డెస్క్

మీరు ఆట్రోవర్టా?



లండన్‌కు చెందిన ప్రసిద్ధ సైన్స్ మ్యాగజైన్ 'న్యూ సైంటిస్ట్'లో ప్రముఖ సైకియాట్రిస్ట్ రామి కమిన్‌స్కి 'ఆట్రోవర్ట్' గురించి ప్రస్తావించారు. అంతేకాదు, దీనిపై ఏకంగా 'ద గిఫ్ట్ ఆఫ్ నాట్ బిలాంగింగ్' అనే పుస్తకమే రాశారు. 'మనలో కొంతమంది అంతర్ముఖులు ఉంటే, మరికొందరు బహిర్ముఖత్వంతో ఉంటారు. ఈ రెండు వ్యక్తిత్వ లక్షణాలూ ఉన్నవాళ్లూ ఉంటారు. కానీ, ఆట్రోవర్ట్‌లు అలా కాదు, వీరు చాలా ప్రత్యేకం' అంటారు కమిన్‌స్కి.

ఈ మూడూ తెలిసినవే

ఇంట్రావర్ట్‌లు లేదా అంతర్ముఖులు.. నలుగురితో కలవడానికి ఇష్టపడరు. ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే చాలాసేపు ఆలోచిస్తారు. బయటి వ్యక్తుల నుంచి ప్రేరణ పొందరు. తమకు తామే ప్రేరణ. ఎక్స్‌ట్రావర్ట్‌లు లేదా బహిర్ముఖులు ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంటారు. నలుగురితో కలివిడిగా ఉంటారు. ఎక్కువగా మాట్లాడతారు. త్వరగా నిర్ణయాలు తీసుకుంటారు. యాంబివర్ట్ లేదా ఉభయముఖత్వం ఉన్నవాళ్లు. ఈ రెండు లక్షణాలూ కలిసి ఉంటాయి. కొన్నిసార్లు ఒంటరితనాన్ని, మరికొన్నిసార్లు నలుగురితో కలవడాన్ని ఇష్టపడతారు.

భిన్నమైన ఆలోచనా విధానం

'నలుగురికీ నచ్చినది.. నాకసలే ఇక నచ్చదులే' అనే టైపు ఈ ఆట్రోవర్ట్‌లు. వీరు నలుగురూ ఆలోచించే పద్ధతికి భిన్నంగా, స్వతంత్రంగా ఆలోచిస్తారు.

విశిష్ట లక్షణాల కలబోతే ఈ కొత్త వ్యక్తిత్వం

అంతర్ముఖులు, బహిర్ముఖులు కారు వీరు

స్థిరత్వం, ధైర్యం, సృజనాత్మకత వీరి సొంతం

భావోద్వేగాల నియంత్రణ

ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఇతరుల మీద ఆధారపడరు. తమ సమస్యను నలుగురిలో పెట్టరు. అలాగని ఒక్కళ్లూ కూర్చుని మథనమూ చేయరు. వ్యక్తిగతంగా తాము నమ్మినవాళ్లతో లోతుగా చర్చించి విశ్లేషణ చేయడానికి, సమస్య పరిష్కారానికి ఎక్కువగా ఆలోచిస్తుంటారు.

ఏంటి తేడా?

యాంబివర్ట్‌కీ ఆట్రోవర్ట్‌కీ ఏంటి తేడా అని చాలా మందికి అనిపించవచ్చు. చాలా తేడా ఉంది. సమయం, సందర్భాన్ని బట్టి యాంబివర్ట్‌లు అంతర్ముఖులుగానో, బహిర్ముఖులుగానో ప్రవర్తిస్తుంటారు. కొన్నిసార్లు నలుగురితో కలిసినప్పుడు చురుగ్గా ఉంటే.. కొన్నిసార్లు ఎవ్వరూ లేకపోయినా ఉత్సాహంగా పనిచేసుకుపోతారు. కానీ ఆట్రోవర్ట్‌లు అలాకాదు. సమయం, సందర్భం బట్టి మారిపోయే వ్యక్తిత్వం కాదు వీళ్లది.

సామాజిక సంబంధాలు

వీళ్లు పార్టీల వంటి వేడుకలకు హాజరవుతారు. కానీ, అందరి దగ్గరకూ వెళ్లిపోరు. వచ్చిన ప్రతి ఒక్కరితోనూ అంత వేగంగా కలిసిపోరు. వ్యక్తులను అంచనావేసి, కొద్దిమందితోనే మాట్లాడతారు.

- ఏదో ఒక సమూహానికి చెందిన వ్యక్తులుగా ముద్ర వేయించుకోవడానికంటే వ్యక్తిగత సంబంధాలు, పనితీరును ఇష్టపడతారు.
- వ్యక్తులతో సంభాషణల్లో పాలుపంచుకోవడానికంటే వాటిని పరిశీలించడానికి ఆసక్తి చూపుతారు.
- సమూహంలో ఉంటేనే మెదడు యాక్టివ్‌గా పనిచేయడం, శక్తిని పొందడం ఉండదు.

నాయకత్వ లక్షణాలు

స్థిరత్వం, ధైర్యానికి వీరు ప్రతీకలు. ఎలాంటి దెబ్బ తగిలినా లేదా సమస్య వచ్చి కిందపడినా తమంతట తామే తొందరగా పైకి లేవగలరు.

- వీళ్ల దృష్టిలో నాయకత్వం అంటే అజమాయిషీ కాదు. ఎదుటివాళ్లు చెప్పేది శ్రద్ధగా వింటారు. ఎదుటివారి పరిస్థితినీ అర్థం చేసుకుంటారు.

బలమైన, నమ్మకమైన బంధాలు



ప్రముఖ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, రచయిత్రి వర్జీనియా ఉల్ఫ్ వంటి వాళ్లు ఈ ఆట్రోవర్ట్ వ్యక్తిత్వం ఉన్నవాళ్లు. వీళ్లు స్వతంత్ర భావాలతో ఉంటారు. సృజనాత్మకత వీరి సొంతం. సంప్రదాయ ధోరణిలో పోరు. భావోద్వేగాలను అదుపులో ఉంచుకోగలరు. నా దగ్గరకు వచ్చే వారిలో ఇంట్రావర్ట్‌లు, ఎక్స్‌ట్రావర్ట్‌లు, యాంబివర్ట్‌లు.. ఈ మూడు రకాల వ్యక్తిత్వాలూ కానివారిని నేను గమనించాను. వీళ్ల దృష్టిలో ఎక్కువమందితో సంబంధాలు ముఖ్యం కాదు. ఉన్నవి కొన్నయినా.. అవి బలంగా, నమ్మకంగా ఉండేలా చూసుకుంటారు. సామాజిక సంబంధాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తారు. ఎలాంటి పరిస్థితులనైనా ఇట్టే ఆకళింపు చేసుకుంటారు. తమ భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడమే కాదు, ఎదుటివారి భావోద్వేగాలనూ అర్థం చేసుకోవడం వీరి ప్రత్యేకత.

- రామి కమిన్‌స్కి, సైకియాట్రిస్ట్

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను పునఃసమీక్షించాలి

బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: రైతుల భూముల్ని, వారి జీవనోపాధిని కాపాడటం ప్రభుత్వ బాధ్యతని బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) అలైన్‌మెంట్‌ను పునఃసమీక్షించి, రైతులకు నష్టం లేకుండా నిర్ణయం తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పుట్టపాక గ్రామ స్తులు, రైతులు తాము ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రైతులు తెలిపిన ప్రకారం ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్పు వల్ల సాగు భూములు కోల్పోయే ప్రమాదంతో.. పెద్ద నష్టాన్ని ఎదుర్కొంటున్నామని వాపోయారు. ప్రస్తుత రోడ్ మార్గాన్ని రద్దు చేసి, పునఃసర్వే చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. పక్కనే ఉన్న పంటకు అనర్హమైన కొండ భూములను రహదారి కోసం వినియోగిస్తే, పంట భూములు కాపాడుకోవచ్చునని వారు సూచించారు. ఈ అంశాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని వారికి రాంచందర్ రావు హామీ ఇచ్చారు.

రాష్ట్రానికి మరో రెండు వందేభారత్ రైళ్లు

- చర్లపల్లి–నాందేడ్, నాంపల్లి–పుణె మధ్య సర్వీసులు
- మంజూరు చేసిన రైల్వే బోర్డు..త్వరలో ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి మరో రెండు వందేభారత్ రైళ్లు మంజూరయ్యాయి. ఇవి త్వరలోనే పట్టాలెక్కనున్నాయి. నాంపల్లి- పుణె నగరాల మధ్య ఇటీవలే ప్రతిపాదించిన వందేభారత్ రైలును తాజాగా మంజూరు చేసిన రైల్వే బోర్డు, చర్లపల్లి–నాందేడ్ మధ్య కూడా కొత్త సర్వీసు నడిపేందుకు పచ్చజెండా ఊపింది. నాందేడ్, పుణె నగరాలకు హైదరాబాద్ నుంచి కొత్తగా రెండు వందేభారత్ రైళ్లు నడవబోతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ మీదుగా ఐదు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. కొత్తగా చేరే రెండుతో ఆ సంఖ్య ఏడుకు పెరుగుతుంది. హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకు రెండు, తిరుపతి, బెంగళూరు, నాగపూర్‌లకు ఒకటి చొప్పున వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి.

అనూహ్యంగా నాందేడ్‌కు...

ఇప్పటి వరకు హైదరాబాద్ నుంచి 600 కి.మీ., అంతకుమించిన దూరం ఉన్న ప్రాంతాలకు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. కానీ, నగరం నుంచి కేవలం 281 కి.మీ. దూరంలోనే ఉన్న నాందేడ్‌కు అనూహ్యంగా వందేభారత్ రైలు మంజూరు కావటం విశేషం. దీర్ఘకాల ప్రతిపాదన అంటూ లేకుండా ఉన్నట్టుండి ఇది మంజూరైంది. మహారాష్ట్రలో ఉన్నా, నాందేడ్ ప్రజలు వివిధ అవసరాలకు ఎక్కువగా హైదరాబాద్‌కే వస్తారు. అక్కడి వ్యాపారులకు తెలంగాణతో వాణిజ్య సంబంధాలు కూడా ఎక్కువ. అందుకే హైదరాబాద్–నాందేడ్ మధ్య సాధారణ రైళ్లు, బస్సులు అధికం. దీనికితోడు అదే మార్గంలో ఉన్న నిజామాబాద్ పట్టణం నుంచి హైదరాబాద్‌కు వచ్చే వారి సంఖ్య చాలా ఎక్కువ. రాష్ట్రంలో మరే పట్టణానికి లేనన్ని రాజధాని కేటగిరీ బస్సు సర్వీసులు నిజామాబాద్‌కే తిరుగుతుంటాయి. నిజామాబాద్ నుంచి నిత్యం విమానాశ్రయానికి కూడా బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వందేభారత్ రైలు నడిపితే నిజామాబాద్, దాని పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని రైల్వే శాఖ భావించింది. ఇక ఇదే మార్గంలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం బాసరకు హైదరాబాద్ నుంచి వెళ్లేవారి సంఖ్య చాలా ఎక్కువ. దీంతో నాందేడ్ వాసులకు హైదరాబాద్‌తో ఉన్న లావాదేవీల బంధం, నిజామాబాద్, బాసర ప్రాంతాల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని అనూహ్యంగా ఈ రైలు సర్వీసును మంజూరు చేశారు. నగర శివారులోని చర్లపల్లి టెర్మినల్ నుంచి ఈ సర్వీసు నడవనుంది. కేవలం నాలుగు గంటల లోపే అది గమ్యం చేరుతుంది. దీంతో అవసరమైతే రోజుకు రెండు ట్రిప్పులు కూడా తిరిగే వీలుంటుంది. ప్రస్తుతానికి ఒక ట్రిప్పుతోనే సరిపెట్టనున్నారు.

- ఇక హైదరాబాద్–పుణె నగరాల మధ్య ప్రయాణికుల రాకపోకలు అధికంగా ఉంటాయి. ఈ రెండు నగరాల మధ్య 17 రైళ్లు నడుస్తుండటం విశేషం. వీటిల్లో నాలుగు రైళ్లు ప్రతిరోజూ తిరుగుతుండగా, శతాబ్ది సర్వీసు వారంలో ఆరు రోజులు తిరుగుతోంది. రెండు రైళ్లు వారంలో మూడు రోజులు, రెండు రైళ్లు రెండు రోజులు, 8 రైళ్లు వారంలో ఒక రోజు చొప్పున తిరుగుతున్నాయి. ఇప్పుడు వీటికి అదనంగా వందేభారత్ కూడా జతకూడనుంది. రెండు నగరాల మధ్య 592 కి.మీ. దూరం ఉంది. సాధారణ రైళ్లు గమ్యం చేరేందుకు 11 గంటల నుంచి 13 గంటల సమయం తీసుకుంటున్నాయి. శతాబ్ది రైలు 8.30 గంటలు, దురొంతో 8.45 గంటల సమయం తీసుకుంటున్నాయి. ఈ నిడివిని నాంపల్లి స్టేషన్ నుంచి బయలుదేరే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 8 గంటల్లో చేరుకోనుంది.

టీజీఓ మహిళా కేంద్ర సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

- చైర్‌పర్సన్‌గా జి.దీపారెడ్డి, కన్వీనర్‌గా జె.సుజాత



బతుకమ్మ ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన టీజీవో మహిళా విభాగం కేంద్ర సంఘం చైర్‌పర్సన్ దీపారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల మహిళా కేంద్ర సంఘానికి కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్‌పర్సన్‌గా భూగర్భ జలవనరుల శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న జి.దీపారెడ్డి, కన్వీనర్‌గా వాణిజ్య పన్నుల శాఖలో డిప్యూటీ సీటీఓగా పనిచేస్తున్న జె.సుజాత, కోశాధికారిగా రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో సీడీపీఓగా పనిచేస్తున్న జి.శాంతిశ్రీలను కలుపుకొని మొత్తం 103 మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం మూడేళ్లపాటు కొనసాగనుంది. రాష్ట్రంలో 87వేలకు పైగా గెజిటెడ్ అధికారులున్నారు. ఇందులో 22వేల మంది గెజిటెడ్ మహిళా అధికారిణులున్నారు. టీజీఓ సచివాలయ విభాగం, నగర శాఖతో పాటు 33 జిల్లాల కమిటీలు, 747 అనుబంధ విభాగాల సంఘాలు ఆదివారం నాంపల్లిలోని టీజీఓ భవన్‌లో జరిగిన ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నాయి. నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, కన్వీనర్, ట్రెజరర్, ఇతర సభ్యులకు టీజీఓ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏనుగుల సత్యనారాయణ నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా టీజీఓ బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నూతన కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు.

తీర్మానాల్లో ముఖ్యమైనవి

- మహిళా ఉద్యోగినులకు వేతనంతో కూడిన 365 రోజుల చైల్డ్ కేర్ సెలవులివ్వాలి.
- నెలసరి సమయం కోసం ప్రతి కార్యాలయంలో విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలి.
- ప్రతి కార్యాలయంలో ఉద్యోగినుల చిన్న పిల్లల సంరక్షణకు క్రెష్ (సంరక్షణ) కేంద్రాలను ఏర్పాటు చేయాలి.
- మహిళా ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ ఇళ్ల స్థలాల్లో ప్రాధాన్యం ఇస్తూ తప్పనిసరిగా కేటాయించాలి.
- మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనే పండుగలు, జాతరలకు ప్రత్యేక ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలి.
- బదిలీల్లో మహిళా ఉద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వాలి. మహిళా ఉద్యోగులను ఏజెన్సీ, మారుమూల ప్రాంతాలలో బదిలీలు చేయకుండా చూడాలి.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పుపై స్పష్టత ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) అలైన్‌మెంట్ మార్పుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. రైతులతో మాట్లాడకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా, భూసేకరణలో స్పష్టత ఇవ్వకుండా.. బలవంతంగా భూములను తీసుకోవాలని ప్రయత్నం చేస్తే తీవ్ర ప్రతిఘటన వస్తుందని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ రోడ్డును 100 మీటర్ల వెడల్పుతో నిర్మించేందుకు 8 జిల్లాలు, 33 మండలాలు, 163 గ్రామాల పరిధిలో భూములు తీసుకుంటామని, 40 అడుగుల వెడల్పుతో రైల్వే ట్రాక్ కోసం రోడ్డును పెంచుతామని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పటికి రెండుసార్లు అలైన్‌మెంట్ మార్చిందని గుర్తు చేశారు. మూడోసారి మార్పు చేసి తాజాగా అలైన్‌మెంట్ విడుదల చేశారని తెలిపారు. రాజకీయ అండదండలు, డబ్బు, పలుకుబడి ఉన్న వారి జోలికి వెళ్లకుండా, చిన్న, సన్నకారు రైతుల భూములనే తీసుకుంటున్నట్టు పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయని వెల్లడించారు. ట్రిపుల్ ఆర్ భూ బాధితుల పక్షాన భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈనెల 23న హైదరాబాద్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్టు జాన్‌వెస్లీ ఆ ప్రకటనలో తెలిపారు.

హెచ్‌సీయూ ఎన్నికల్లో ఏబీవీపీ విజయం



మాట్లాడుతున్న హెచ్‌సీయూ విద్యార్థి సంఘం నూతన అధ్యక్షుడు శివ పాలెపు

సాక్షి, హైదరాబాద్/ రాయదుర్గం/ పంజగుట్ట: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఘన విజయం సాధించింది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత వెలువడిన ఫలితాల్లో ఏబీవీపీ ప్యానెల్ విజయం సాధించినట్లు ప్రకటించారు. ఈ ఎన్నికల్లో ఏబీవీపీ.. సేవాలాల్ విద్యార్థి దళ్‌తో కలిసి బరిలోకి దిగింది. ప్రత్యర్థులుగా బీఎస్‌ఎఫ్, డీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, టీఎస్‌ఎఫ్‌లు ఒక కూటమిగా, ఏఎస్‌ఏ, ఏఐఎస్‌ఏ, ఫ్రెటర్నిటీ, ఎంఎస్‌ఎఫ్‌లు మరో కూటమిగా బరిలో దిగగా, ఎన్‌ఎస్‌యూఐ, ఏఐఓబీసీఎస్‌ఏ అభ్యర్థులు ఒంటరిగా పోటీ చేశారు. అధ్యక్షుడిగా ఏబీవీపీ అభ్యర్థి శివ పాలెపు 170 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా దేవేంద్ర, ప్రధాన కార్యదర్శిగా శ్రుతి ప్రియ, కల్చరల్ సెక్రెటరీగా వీనస్, సంయుక్త కార్యదర్శిగా సౌరభ్ శుక్లా, క్రీడా కార్యదర్శిగా జ్వాల ఎన్నికయ్యారు.

విద్యార్థులు కోరుకున్న వాతావరణాన్ని తీసుకొస్తాం

హెచ్‌సీయూలో విద్యార్థులు కోరుకున్న వాతావరణాన్ని తీసుకువస్తామని ఎన్నికల్లో విజయం సాధించిన ఏబీవీపీ నేతృత్వంలోని హెచ్‌సీయూ ఎస్‌యూ ప్యానెల్ పేర్కొంది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివ పాలెపు, దేవేంద్ర మాట్లాడుతూ.. 2019 నుంచి హెచ్‌సీయూలో ఎలాంటి అభివృద్ధి లేదన్నారు.

విద్యార్థుల నిజమైన ప్రతినిధి ఏబీవీపీ: రాంచందర్‌రావు

ఏబీవీపీ ఘన విజయం సాధించడం పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయంతో విద్యార్థుల ఆశయాలకు నిజమైన ఏకైక ప్రతినిధి ఏబీవీపీ మాత్రమేనని మరోసారి నిరూపితమైందన్నారు.

నీళ్ల ట్యాంక్‌లో పడి ఇద్దరు చిన్నారుల మృతి



చిన్నారుల మృతదేహాలు

కరీంనగర్ రూరల్: ప్రమాదవశాత్తు ఇద్దరు చిన్నారులు నీళ్ల ట్యాంక్‌లో పడి మృతి చెందారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన సహానీ బిట్టుకుమార్ కరీంనగర్ పరిధిలోని బొమ్మకల్ బైపాస్‌లో ఉన్న సత్యం సిమెంట్ పైపుల కంపెనీలో కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం బిట్టుకుమార్ కుమారులు సత్యంకుమార్(4), ఆర్యన్‌కుమార్(2) ఫ్యాక్టరీ ఆవరణలో ఆడుకుంటూ సిమెంట్ పైపులు క్యూరింగ్ చేసే వాటర్ ట్యాంక్‌లో పడ్డారు. పిల్లలు కనిపించకపోవడంతో తల్లి సుధాదేవి వెతుకుతుండగా వాటర్‌ట్యాంక్‌లో కనిపించారు. వెంటనే ఇద్దరిని చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పిల్లలు మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు పిల్లల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బిట్టుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

స్పెషల్ చార్జీల పేరుతో దోపిడీ తగదు

సాక్షి, హైదరాబాద్: హిందువులు జరుపుకునే పండుగలకు రాష్ట్ర ప్రభుత్వం పన్నుల మీద పన్నులు వేసి తీవ్ర భారం మోపడం తగదని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అభిప్రాయపడింది. దసరా పండుగ సందర్భంగా స్పెషల్‌చార్జీల పేరుతో బస్సుల్లో సాధారణ చార్జీలకు 50 శాతం అదనంగా వసూలు చేయడం దోపిడీకి పాల్పడటమేనని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తాము తీవ్రంగా తప్పుపడుతున్నామని వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగడాకుల బాలస్వామి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

వీక్షణల కోసం.. వేలంవెర్రి

రీల్స్ చేస్తున్నవాళ్లు, రీల్స్ చూస్తున్నవాళ్లు.. సమాజంలో ఉన్నది ఇప్పుడు ఈ రెండే వర్గాలు అన్నంతగా సోషల్ మీడియా మార్చేసింది. ఉన్నవారు-లేనివారు.. స్త్రీలు-పురుషులు.. రాత్రి-పగలు.. ఇంట-బయట.. ఇవేవీలేవు, ప్రతి ఒక్కరూ రీల్స్‌కి అతుక్కుపోతున్నారు. వాళ్లు అలా అతుక్కుపోయేలా కంటెంట్ క్రియేటర్‌లు రీల్స్ చేసి సోషల్ మీడియాలోకి వదిలిపెడుతున్నారు. అయితే ఎంతో మందికి ఆనందాన్నిస్తున్న రీల్స్.. ఆ రీల్స్ చేస్తున్న వ్యక్తులు ముఖ్యంగా మహిళల జీవితాల్లో కల్లోలం సృష్టిస్తున్నాయి. పరువు కోసం కుటుంబ సభ్యులే వారి ఉసురు తీసేందుకు ప్రేరేపిస్తున్నాయి. - సాక్షి, స్పెషల్ డెస్క్



నిక్కీ భాటీ.. గ్రేటర్ నోయిడాకు చెందిన 26 ఏళ్ల ఈమెను ఇటీవల ఆమె భర్త, అత్తమామలు చిత్రహింసలు పెట్టి నిప్పంటించటంతో మరణించింది. మొదట దీన్ని వరకట్న హత్య అని పోలీసులు భావించారు. అయితే నిక్కీ రీల్స్ చేయటంపై అభ్యంతరం తెలిపిన ఆమె మెట్టినింటివారు.. ఆమె తమ మాట వినకపోవటంతో ఆమెపై తీవ్రంగా దాడి చేసి, నిప్పంటించారని తర్వాత వెల్లడించారు!

నిక్కీ మరణానికి కొన్ని నెలల ముందు ఇలాంటి ఘటనే హరియాణాని గురుగ్రామ్‌లో జరిగింది. 25 ఏళ్ల రాధిక యాదవ్‌ను ఆమె తండ్రి కాల్చి చంపాడు. రాధిక సోషల్ మీడియా రీల్స్ చేయడం

వద్దని చెప్పినందుకు..

పై ఆయన తీవ్రంగా కలత చెందారని, ఆ మనోవ్యథ ఆగ్రహంగా మారి కూతుర్ని చంపేశాడని వార్తలు వచ్చాయి. ఇక ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఒక మహిళ తను రీల్స్ చేయటానికి అడ్డు చెప్పినందుకు భర్తపై కత్తితో దాడి చేసింది. ఆ రీల్స్ రెచ్చగొట్టేలా ఉంటున్నాయని ఆ భర్త మనో వేదన.

'మిస్టేకెన్ మోడర్నిటీ'?!

తాత్కాలికమైన ఆనందంతో చురుకు పుట్టించే 'డోపమైన్-బూస్టింగ్' కంటెంట్‌ను ఆస్వాదించటంలో వీక్షకులు, అలాంటి కంటెంట్‌ను సృష్టించటంలో కంటెంట్ క్రియేటర్‌లు.. అదే లోకంగా ఉండటంతో సమాజంలో ప్రమాదకరమైన ఘర్షణలకు ఆజ్యం పోసినట్లవుతోంది! కంటెంట్ క్రియేటర్‌లలో కనిపించే ఈ దూకుడును 'మిస్టేకెన్ మోడర్నిటీ' (ఆధునికతను వేరేలా అర్థం చేసుకోవటం) అని సామాజిక నిపుణులు అంటున్నారు

ఉపయోగపడేవీ ఉన్నాయి

రీల్స్, షార్ట్స్.. అసభ్యత లేనంతవరకూ ఎవరికీ ఇబ్బంది కావు. అశ్లీలత కానంతవరకూ ఎవరికీ హాని చేయవు. ఒక వర్గాన్ని, మతాన్ని, ఒకరి శరీరాన్ని, వైకల్యాన్ని వెక్కిరిస్తూ, వెకిలిచేష్టలతో చేసే వీడియోలు సమాజానికి ప్రమాదకరం. యువతను పెడదారిపట్టించే కంటెంట్ ఉన్న షార్ట్స్.. ఏ జనరేషన్‌కీ మంచి వికావు. మరి, ఉపయోగపడే రీల్స్, షార్ట్స్ లేవా అంటే ఎందుకు లేవూ, చాలా ఉన్నాయి. సరదాగా, నవ్వించేవి.. విజ్ఞానాన్ని పంచేవి.. సరికొత్త విషయాలు తెలియజేసేవి.. వంటలవీ, ఆధ్యాత్మికతవీ.. ఇలాంటి ఎన్నో సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయి.

దేశమంతా ఇదే గొడవ



దేశంలోని చాలాచోట్ల కొందరు చేస్తున్న రీల్స్, షార్ట్స్ కుటుంబాలలో అశాంతికి, ఆవేదనకు, ఆగ్రహానికి కారణం అవుతున్నాయి. లైక్‌లు, కామెంట్లు, వాటి ద్వారా వచ్చే పేరు, డబ్బు కోసం కొందరు అశ్లీలత, అసభ్యత నిండిన కంటెంట్‌తో వీక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. పాశ్చాత్య దేశాల్లో ఎలా ఉన్నా, భారతీయ సమాజం మాత్రం ఈ రీళ్ల సుడిగాలిని తట్టుకోలేక సతమతం అవుతోంది. పల్లెల నుంచి మహా నగరాలకు వలస వచ్చిన వారు అక్కడి వెలుగు జిలుగుల నవ నాగరికతలకు ఎలాగైతే ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతారో.. కంటెంట్ క్రియేటర్‌ల జీవితాల్లోకి రీల్స్, షార్ట్స్ అంతటి థ్రిల్ తెచ్చిపెట్టాయి. వీక్షకులు చూస్తున్నకొద్దీ వారు ఇంకా ఇంకా చూసేలా కంటెంట్ మోతాదును పెంచుకుంటూ పోతున్నారు.

దైనందిన జీవితంలో భాగమైపోయిన రీల్స్

- రీల్స్ తీస్తూ 'రేఖ' దాటేస్తున్న వైనం
- అసభ్యకరమైన కంటెంట్‌తో వీడియోలు
- కుటుంబాలలో గొడవలు, ఘర్షణలు

వీక్షకులే తిరస్కరించాలి

లైకుల కోసం, ఆర్థిక ప్రయోజనం కోసం కంటెంట్ క్రియేటర్‌లు అశ్లీలమైన, అసభ్యకరమైన రీల్స్‌కి అడ్డుకట్ట వేసేదెలా? చాలా సింపుల్ అంటున్నారు మానసిక నిపుణులు. 'అలాంటి కంటెంట్‌ను ఆదరించకపోవటం లేదా వారిని బ్లాక్ చేయడం ద్వారా వారికి అడ్డుకట్ట వేయవచ్చు. ఇలాంటి వీడియోలు చేయడం ఒక మానసిక సమస్య కూడా కావచ్చు' అంటున్నారు మానసిక నిపుణులు.

రీల్సే లోకం!

ఫేస్‌బుక్ మాతృసంస్థ 'మెటా', గ్లోబల్ మార్కెట్ రీసెర్చ్ సంస్థ 'ఇప్సోస్' సంయుక్తంగా దేశవ్యాప్తంగా 33 పట్టణాల్లో ఇటీవల నిర్వహించిన సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.

- షార్ట్స్, రీల్స్ భారతీయుల దైనందిన జీవితంలో భాగమైపోయాయి.
- ముఖ్యంగా దేశంలో అత్యధికులు చూసే షార్ట్ ఫామ్ వీడియో ఫార్మాట్‌గా రీల్స్ అవతరించాయి.
- 97 శాతం మంది రోజులో కనీసం ఒక్కసారైనా తక్కువ నిడివి గల వీడియోలు చూస్తున్నారు. ఇందులో సింహభాగం రీల్సే.
- ఈ ట్రెండ్ జెన్ జెడ్ యూజర్లలో ఎక్కువగా ఉంది.వీటిని చూడటం ఎంటర్‌టైన్‌మెంట్ స్థాయిని దాటి.. దైనందిన కార్యకలాపంలా మారిపోయింది.



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న జేసీబీ



శిథిలాల వద్దే పిల్లలకు తినిపిస్తున్న తల్లులు..



బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న ఇళ్లు కోల్పోయిన మహిళలు..

రూ.15 వేల కోట్ల భూమికి హైడ్రా విముక్తి

హైదరాబాద్‌లో 317 ఎకరాల ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాల తొలగింపు

- కుత్బుల్లాపూర్‌లోని గాజులరామారంలో పేదలను అడ్డంపెట్టుకొని చక్రం తిప్పిన బడా బాబులు
- ఉమ్మడి ఏపీలో ఫైనాన్స్ కార్పొరేషన్‌కు కేటాయించిన అప్పటి సర్కారు
- రాష్ట్ర విభజన తర్వాత కార్పొరేషన్ ఆస్తుల పంపిణీలో జాప్యంతో తెరపైకి రౌడీషీటర్లు, స్థానిక నేతలు
- 60, 120 గజాల చొప్పున వెంచర్లు, లేఅవుట్లు వేసి పేదలకు విక్రయం
- స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి హైడ్రా.. ఆరు నెలలపాటు సుదీర్ఘ విచారణ
- జీహెచ్ఎంసీ, ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులతో పలుమార్లు సంప్రదింపులు
- ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు నిర్ధారించుకొని అక్రమ నిర్మాణాల తొలగింపు
- కూల్చివేత సమయంలో ఉద్రిక్తత.. ఒంటిపై కిరోసిన్ పోసుకున్న కొందరు బాధితులు
- భారీ పోలీసు బందోబస్తుతో అక్కడి నుంచి నిరసనకారుల తరలింపు



కట్ చేసిన విద్యుత్ వైర్లను పట్టుకుని జేసీబీ వెళ్లకుండా అడ్డుగా పడుకున్న మహిళలు

సాక్షి, హైదరాబాద్/కుత్బుల్లాపూర్: భాగ్యనగరంలో 317 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చెర నుంచి హైడ్రా (హైదరాబాద్ విపత్తుల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ) కాపాడింది. కుత్బుల్లాపూర్‌లోని గాజులరామారంలో సర్వే నంబర్ 307 సహా వివిధ సర్వే నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిలో వెలిసిన వెంచర్లు, లేఅవుట్లకు చెందిన దాదాపు 300 అక్రమ నిర్మాణాలను ఆదివారం తొలగించింది. ప్రగతినగర్ వైపు కబ్జాకు గురైన భూమిలో రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ సంస్థల యజమానుల తోపాటు కొందరు ప్రభుత్వ అధికారులు కూడా అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించి ఈ మేరకు చర్యలు చేపట్టింది. ఈ స్థలం మార్కెట్ విలువ సుమారు రూ. 15 వేల కోట్ల వరకు ఉంటుందని అధికారులు ప్రకటించారు.

రాష్ట్ర విభజన పంపకాల్లో జాప్యంతో..

గాజులరామారంలో 444 ఎకరాలకుపైగా భూమి ఉండగా సర్వే నంబర్ 307లోనే 317 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో దీన్ని ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు నాటి సర్కారు అప్పగించింది. రాష్ట్ర విభజన తర్వాత ఫైనాన్స్ కార్పొరేషన్ ఆస్తుల పంపకాల్లో జాప్యం జరిగింది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు ఆక్రమణలకు పాల్పడ్డారు. ఈ విషయంపై హైడ్రాకు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందగా హైడ్రా ఆరు నెలలపాటు విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులతో ఆరుసార్లు సమావేశమైంది. ఈ భూమిలో ప్రగతినగర్ వైపు బడాబాబులు వెంచర్లు, లేఅవుట్లు వేశారని, సర్వే నంబర్లు 329/1, 342లలో ఉన్న భూమిని 60 గజాలు, 120 గజాల చొప్పున ప్లాట్లుగా వేసి రౌడీషీటర్లు, స్థానిక నేతలు పేదలకు విక్రయించారని గుర్తించింది. జగద్గిరిగుట్ట పోలీసుస్టేషన్‌లో రౌడీషీటర్‌గా నమోదైన షేక్ అబిద్... లక్ష్మీ మురళి, హుస్సేన్ పేరుతో ఈ విక్రయాలు జరిపారు. బోడాసు శ్రీనివాస్ (డాన్ శీను), ఏసుబాబు, సయ్యద్ గౌస్ బాబు, మనీష్, దేవా తదితరులూ భూమిని ఆక్రమించి ప్లాట్లుగా అమ్మేశారు. వారికి స్థానిక రెవెన్యూ అధికారులు సహకరించారు. వాటిలో నిర్మించిన గదులను కొందరు అద్దెలకు కూడా ఇచ్చారు. ఇలా ఆ ప్రభుత్వ భూమిలోని 12 ఎకరాల వెంచర్‌తోపాటు 20 ఎకరాల లేఅవుట్‌ను హైడ్రా తొలగించింది. అందులో ఇప్పటికే ఉంటున్న వారి ఇళ్ల జోలికి హైడ్రా వెళ్లలేదని అధికారులు తెలిపారు. రౌడీల అధీనంలో ఉండి అమ్మకానికి సిద్ధంగా ప్రహరీలు నిర్మించిన వాటిని మాత్రమే హైడ్రా తొలగించిందని స్పష్టం చేశారు.

ఉద్రిక్తత.. బందోబస్తు..

ఆక్రమణల తొలగింపు నేపథ్యంలో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అధికారులను అడ్డుకోవడానికి కొందరు ఒంటిపై కిరోసిన్ పోసుకోగా మరికొందరు కరెంటు వైర్లు పట్టుకుంటామని బెదిరించారు. కొందరు యువకులు జేసీబీలను అడ్డుకొని వాటికి అడ్డంగా పడుకున్నారు. అయితే భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు.. నిరసనకారులను అక్కడ నుంచి తరలించారు.

ఎందరో పేదలు మోసపోయారు: కూన శ్రీశైలంగౌడ్

ప్రభుత్వ భూమిలో స్థలాలు కొని ఎందరో పేదలు మోసపోయారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ చెప్పారు. కూల్చివేతల విషయం తెలుసుకున్న ఆయన ఘటనాస్థలానికి వెళ్లారు. అప్పటికే అక్కడ నివసిస్తున్న పేదల ఇళ్ల జోలికి వెళ్లొద్దని హైడ్రాకు సూచించారు. దీంతో అధికారులు వాటిని సైతం విడిచిపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ కబ్జాలు విపరీతంగా పెరిగిపోయాయని వందలాది ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని శ్రీశైలంగౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కబ్జాదారులపై కేసులు నమోదు చేసిందన్నారు. కబ్జాదారులను వదిలిపెట్టే ప్రసక్తి లేదని.. మోసపోయిన బాధితులందరికీ న్యాయం చేసే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

నేడు హైకోర్టులో విచారణ

గాజులరామారం సర్వే నంబర్ 307లో ప్రైవేటు భూమి ఎక్కడా మిగల్లేదని.. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బంధువుల పేర్లపై ధరణిలో చేర్చింది ప్రభుత్వ భూమినని బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టనున్నారు. సర్వే నంబర్ 307లో 441 ఎకరాల భూమి ఉండగా అందులో 317.25 ఎకరాలను సీలింగ్ కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని.. మిగిలిన 123.28 ప్రైవేటు భూమి అని పేర్కొన్నారు. ప్రైవేటు భూమిలో ఇప్పటికే ఇళ్లు వెలిశాయని.. ఇక ఖాళీ అన్నదే లేదన్నారు. తమ పేరిట ఉన్న 11 ఎకరాలను ఎప్పుడో విక్రయించి వెళ్లిపోయిన జాహెద్ బేగం, షేక్ ఇమామ్, ఇశాన్, అమీన్‌లను తీసుకొచ్చి వారి పేరిట భూమిని కొన్నట్లు చూపించారన్నారు. వాస్తవంగా ఆ ముగ్గురి పేరిట భూమి లేదన్నారు. దాదాపు రూ. 100 కోట్ల విలువైన భూమి అక్రమ రిజిస్ట్రేషన్లతో స్వాహా చేసేందుకు స్కెచ్ వేశారన్నారు. ఆ 11 ఎకరాలు ముమ్మాటికీ సర్కార్ భూమేనని స్పష్టం చేశారు. ధరణిలో చేర్చిన పేర్లను తొలగించాలని.. ఇటీవల ఆర్డీవో జారీ చేసిన నాలా ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయాలని కోరారు. బహుళ అంతస్తుల భవనాల నిర్మాణ ప్రక్రియను అడ్డుకొనేందుకు వీలుగా వెంటనే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీలకు గ్రహణం!

18 కేంద్రాలు మంజూరై ఏళ్లు గడుస్తున్నా ఏర్పాటు కాని వైనం

- వీటి ఏర్పాటు, నిర్వహణ బాధ్యతలు డీఐఎంఎస్‌కు అప్పగింత
- భవనాల లభ్యత లేదనే సాకుతో ముందుకు కదలని యంత్రాంగం
- వైద్యులు, సిబ్బంది నియామకంలోనూ ఉదాసీనత
- ఫలితంగా చందాదారులకు అందని ఈఎస్ఐ వైద్య సేవలు

సాక్షి, హైదరాబాద్: కార్మికుల సంఖ్యకు అనుగుణంగా మరిన్ని డిస్పెన్సరీల ఏర్పాటుకు ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) అన్ని రకాల అనుమతులు జారీ చేసినప్పటికీ.. రాష్ట్ర యంత్రాంగం ఉదాసీనతతో వాటి ఏర్పాటుకు గ్రహణం పట్టుకుంది. కోవిడ్-19 సమయంలో కొత్తగా 18 డిస్పెన్సరీలను మంచిర్యాల, ఖమ్మం, ఆదిలాబాద్, హనుమకొండ, మెదక్, రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్, సూర్యాపేట జిల్లాల్లో ఏర్పాటు చేసుకోవచ్చని ఈఎస్ఐసీ స్పష్టం చేసింది. వీటి ఏర్పాటు, నిర్వహణకు సంబంధించిన ఆర్థిక పరమైన సహకారాన్ని అందించేందుకు ఈఎస్ఐసీ అంగీకరించింది. ఈ డిస్పెన్సరీలను ఏర్పాటు చేయడంతో పాటు నిర్వహణకు సంబంధించిన బాధ్యతలను రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ ఆఫ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (డీఐఎంఎస్)కు ఈఎస్ఐసీ అప్పగించింది.



అయితే ఇది జరిగి దాదాపు ఐదేళ్లు కావస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం వీటి ఏర్పాటు విషయంలో ఎలాంటి పురోగతి లేదు.

నిరుపయోగంగా నిధులు..

కొత్తగా డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలంటే అందుకు సంబంధించి అనువైన భవనం అవసరం. ఆ తర్వాత డాక్టర్‌తో పాటు సిబ్బందిని నియమించుకోవాల్సి ఉంటుంది. దీనికి కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ఈఎస్ఐసీ కేవలం ఆర్థిక సహకారం అందిస్తుండగా.. అందుకు సంబంధించిన కార్యాచరణను అమలు చేయాల్సిన బాధ్యత మాత్రం డీఐఎంఎస్‌దే. కానీ కొత్త డిస్పెన్సరీల ఏర్పాటుకు డీఐఎంఎస్ ఎలాంటి కార్యాచరణను ఇప్పటివరకు అమలు చేయలేదు. కొత్త భవనాల ఏర్పాటును గాలికి వదిలేసిందని విమర్శలు వస్తున్నాయి. దాదాపు ఐదేళ్ల నుంచి ఈఎస్ఐసీ ప్రతి సంవత్సరం బడ్జెట్ రివిజన్‌లో భాగంగా నిధులు కేటాయిస్తున్నప్పటికీ డిస్పెన్సరీలు ఏర్పాటు చేయకపోవడంతో ఆ నిధులు వినియోగంలోకి రావడం లేదు. కొత్త డిస్పెన్సరీల ఏర్పాటుకు భవనాల లభ్యత లేదని డీఐఎంఎస్ చెబుతోంది. మరోవైపు డిస్పెన్సరీల్లో పనిచేసేందుకు తాత్కాలిక పద్ధతిలో డాక్టర్లు, ఫార్మసిస్టులతో పాటు ఇతర సిబ్బందిని నియమించుకోవాల్సి ఉండగా... ఇప్పటివరకు నియామకాలకు సంబంధించి కనీసం ప్రకటన కూడా జారీ చేయలేదు. భవనాల లభ్యత లేదనే కారణంతో కొత్తగా 18 డిస్పెన్సరీల ఏర్పాటును డీఐఎంఎస్ అటకెక్కించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 71 డిస్పెన్సరీలున్నాయి. వీటి ద్వారా 21 లక్షల మంది కార్మికుల కుటుంబాలకు వైద్య సేవలందుతున్నాయి. డిమాండ్‌కు తగినట్లు డిస్పెన్సరీల ఏర్పాటులో భాగంగా వాటి సంఖ్యను ఈఎస్ఐసీ క్రమంగా పెంచుతోంది. కాగా, రాష్ట్రానికి మంజూరైన 18 సెంటర్లను అనేక ఏళ్లుగా ఏర్పాటు చేయకపోవడంతో మరిన్ని కేంద్రాల మంజూరుకు అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో చందాదారులకు వేగవంతంగా వైద్య సేవలు అందడం కష్టతరంగా మారింది.

డ్రగ్స్ కేసుల్లో యువతే ఎక్కువ!

- మూడేళ్లలో 14 వేల మందిపై కేసులు
- వీరిలో యువకులు 13,684 మంది, యువతులు 316 మంది

సాక్షి, హైదరాబాద్: ఓ వైపు దర్యాప్తు సంస్థల సోదాలు, మరోవైపు ముమ్మరంగా అవగాహన కార్యక్రమాల నిర్వహణ కొనసాగుతున్నా రాష్ట్ర యువతలో మత్తుపదార్థాల వినియోగం పెరుగుతూనే ఉంది. మత్తుపదార్థాలు వాడుతూ పోలీసులు, ఇతర దర్యాప్తు సంస్థలకు పట్టు బడుతున్న వారిలో యువతే ఎక్కువగా ఉంటున్నారు. గత మూడేళ్లలో ఎన్‌డీపీఎస్‌యాక్ట్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోఫిక్ సబ్‌స్టాన్సెస్‌యాక్ట్-1985) కింద నమోదైన కేసులలో 40 ఏళ్ల లోపు వారు 14 వేల మంది ఉన్నట్టు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో తెలిపింది. 2022 నుంచి ఇప్పటివరకు ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద పట్టుబడిన నిందితుల్లో 40 ఏళ్ల లోపు వారు ఎంతమంది? ఎంతమందికి శిక్ష పడింది తదితర వివరాలు కోరుతూ.. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద యూత్ ఫర్ యాంటీ కరప్షన్ (వైఏసీ) సంస్థ వ్యవస్థాపకుడు రాజేందర్ పల్నాటి చేసిన దరఖాస్తునకు యాంటీ నార్కో టిక్స్ బ్యూరో ఈ మేరకు సమాధానం ఇచ్చింది. 2022 జూన్ నుంచి 2025 జూలై వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద 40 ఏళ్ల లోపు ఉన్న 14 వేల మందిపై కేసులు నమోదు చేయగా..అందులో యువకులు 13,684 మంది, యువ తులు 316 మంది ఉన్నారు. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ యువత డ్రగ్స్ బారినపడడం బాధాకరమని, దీనిపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా రాజేందర్ సూచించారు.



రాజేందర్

మద్యం మత్తులో తల్లిదండ్రులనే హతమార్చాడు

హైదరాబాద్ నేరేడ్‌మెట్‌లో ఓ మానసిక రోగి నిర్వాకం

అల్వాల్: మానసిక స్థితి బాగోలేని కుమారుడు మద్యం మత్తులో తల్లిదండ్రులనే హతమార్చిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాయినగర్‌లో నివసించే బరిగే లక్ష్మి (60), రాజయ్య (65) దంపతుల రెండో కుమారుడు శ్రీనివాస్ అనారోగ్యానికి గురై మానసిక స్థితి కోల్పోయాడు. దీంతో భార్య అతన్ని విడిచిపెట్టి వెళ్లిపోయింది. ఈ క్రమంలో శ్రీనివాస్‌ను ఎర్రగడ్డలోని మానసిక ఆస్పత్రికి తరలించారు. నెల క్రితం ఆసుపత్రి నుంచి వచ్చిన శ్రీనివాస్ అతిగా మద్యం తాగుతున్నాడు. ఆదివారం రాత్రి మద్యం తాగి వచ్చి తల్లిదండ్రులతో గొడవపడ్డ శ్రీనివాస్.. ఈ క్రమంలో వారిని తీవ్రంగా గాయపరిచి చంపాడు. దీన్ని గమనించిన స్థానికులు శ్రీనివాస్‌ను పట్టుకొని చితకబాదారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు గంజాయికి అలవాటు పడినట్లు తెలిసింది.

జ్యోతి ప్రాణాలకు భరోసా ఇవ్వలేం

- రక్తం గ్రూపు మార్చి ఎక్కించిన రోగి పరిస్థితి సంక్లిష్టం
- ఎంజీఎం నుంచి నిమ్స్‌కు తరలించాలని వైద్యుల సలహా

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన జ్యోతి అనే మహిళ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారుతోందని వైద్యులు చెపుతున్నారు. ఈ నెల 16న హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యపురానికి చెందిన జ్యోతి తెల్ల, ఎర్ర రక్త కణాలతోపాటు ప్లేట్‌లేట్స్ సంఖ్య తక్కువై తీవ్ర అస్వస్థతతో ఎంజీఎం ఆస్పత్రిలో చేరింది. ఆమెకు 17వ తేదీన ఆస్పత్రి వైద్య సిబ్బంది ఓ-పాజిటివ్‌కు బదులు బీ-పాజిటివ్ రక్తం ఎక్కించారు. అనంతరం 20వ తేదీన మరోమారు రక్తం ఎక్కించాల్సి వచ్చింది. పరీక్షల సందర్భంగా ఆమె రక్తం శాంపిల్స్ సేకరించగా ఓ-పాజిటివ్ రావడంతో కేస్ షీట్‌ను పరిశీలించిన వైద్యసిబ్బంది, కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. ఈ విషయాన్ని గమనించిన వైద్యులు, పరిపాలనాధికారులు ఆమెకు ప్రాణాపాయ స్థితి రాకుండా ఉండేందుకు శనివారం ఫిమేల్ మెడికల్ వార్డు నుంచి ఐఎంసీ వార్డుకు తరలించారు. కాగా, శనివారం జ్యోతి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పిన వైద్యులు, ఆదివారం ఆమెను నిమ్స్‌కు తరలించాలని సూచించారు. ఎంజీఎం ఆస్పత్రిలో ట్రాన్స్‌ఫ్యూషన్ విభాగం లేదని, జ్యోతి ప్రాణాలకు భరోసా ఇవ్వలేమని, నిమ్స్‌కు వెళ్తే మెరుగైన వైద్యం అందుతుందని చేతులెత్తేశారు. తన భార్య జ్యోతిని కాపాడాలని భర్త రాజు వేడుకుంటున్నారు. 'ఆమె ఆరోగ్య పరిస్థితి బాగాలేదు. నిమ్స్‌కు తీసుకెళ్లాలని డాక్టర్లు చెబుతున్నారు, మా ఆర్థిక పరిస్థితి అంతంతే'అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కలెక్టర్, రాష్ట్ర ఉన్నతాధికారులు దృష్టిసారించాలని, వెంటనే ఎంజీఎం ఆస్పత్రి వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రాణం తీసిన ఫొటోల సరదా

- ములుగు జిల్లా దుసపాటి లొద్ది జలపాతంలో పడి విద్యార్థి మృతి
- రంగారెడ్డి జిల్లాలో ఒకరి గల్లంతు



మహాశ్విన్ మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొస్తున్న సహాయక సిబ్బంది

వాజేడు/అబ్దుల్లాపూర్‌మెట్: జలపాతాల వద్ద ఫొటోల సరదా ప్రాణాల మీదకు తెచ్చింది. రెండు వేర్వేరు ఘటనల్లో ఓ విద్యార్థి ప్రాణాలు కోల్పోగా, మరో విద్యార్థి గల్లంతయ్యాడు. ములుగు, రంగారెడ్డి జిల్లాల్లో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. వాజేడు ఎస్సై జక్కుల సతీశ్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన హర్షారెడ్డి, శివరాంరెడ్డి, అభిరామిరెడ్డి, మహాశ్విన్(18), సాక్షిత్, అర్జున్, పూజ, రాకేశ్‌లు ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల గ్రామ సమీపంలోని దుసపాటి లొద్ది జలపాతం సందర్శనకు వచ్చారు. ఇందులో పూజ, రాకేశ్ భార్యాభర్తలు. కాగా వీరంతా స్నేహితులు. ఈ క్రమంలో జలపాతం వద్ద ఫొటోలు దిగుతున్న కొండిశెట్టి మహాశ్విన్ నీటిలో జారి పడ్డాడు. వెంటనే పూజ అతడిని రక్షించడం కోసం నీటిలోకి దూకింది. మహాశ్విన్ భయంతో ఆమెను గట్టిగా పట్టుకోవడంతో ఇద్దరూ నీటిలో మునిగారు. వెంటనే హర్షారెడ్డి, శివరాంరెడ్డి నీటిలోకి దూకారు. వారు కూడా నీటిలో మునిగిపోవడంతో అర్జున్ నీటిలోకి దూకి పూజ, హర్షారెడ్డి, శివరాంరెడ్డిని కాపాడాడు. మహాశ్విన్‌ను కాపాడేందుకు తిరిగి నీటిలోకి వెళ్లేలోగానే అతడు గల్లంతయ్యాడు. దీంతో భయాందోళనకు గురైన మిగతావారు, ఈ విషయాన్ని పోలీసులకు చేరవేయడంతో వారు గజఈతగాళ్లను పంపించారు. మధ్యాహ్నం సమయంలో మహాశ్విన్ మృతదేహం లభించింది. మృతుడు హైదరాబాద్‌లో బీఎస్సీ బయోటెక్నాలజీ చదువుతున్నాడు. ఈ ఘటనపై వాజేడు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆనందం కోసం వస్తే..

వారంతా స్నేహితులు. సెలవు రోజు ఆనందంగా గడుపుదామని జలపాతం వద్దకు వెళ్లారు. అక్కడ ఫొటోలు దిగుతుండగా అందులో ఓ ఇంటర్ విద్యార్థి ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతయ్యాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ బేగంపేట రసూల్‌పుర ప్రాంతానికి చెందిన క్యామ సాయితేజ (17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం అతడు తన స్నేహితులైన సాయిరాం, నందు, మహేశ్, జయంత్, విష్ణు సుర్నార్, కార్తీక్, సునీల్‌లతో కలిసి కోహెడ శివారులో ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్డు పక్కన ఉన్న వాటర్ ఫాల్స్ వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో సరదాగా ఫొటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తు సాయితేజ నీటిలో జారి పడిపోయి గల్లంతయ్యాడు. దీంతో మిగతావారు పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఫైర్ సిబ్బంది, డీఆర్ఎఫ్ బృందాలతో రాత్రి వరకూ గాలింపు చర్యలు చేపట్టారు. అయినా సాయితేజ ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



అక్రమ నిర్మాణాలకు అడ్డేదీ..
టౌన్ ప్లానింగ్‌లో అవినీతి పేరుకుపోయింది. ప్రభుత్వం పురపాలికల్లో టీజీ-బీపాస్ అమల్లోకి తెచ్చినా అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు.
-12లో



సరదా పాటలు.. దాండియా ఆటలు..
దాండియా ఆటలు.. సరదా పాటలకు నగరం సిద్ధమైంది. నవరాత్రి వేడుకలు సంబరంగా నిర్వహించేందుకు పలువురు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు.
- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 33.0/23.0

వాతావరణం
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షపు జల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 33, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

నగరాన.. పూల నజరానా


కూకట్‌పల్లిలో బతుకమ్మతో వస్తున్న యువతి

ఎంగిలిపూల బతుకమ్మతో భాగ్యనగరం పులకించింది. తీరొక్క పుష్పాలతో పుడమి పరవశించింది. నవరాత్రి వేడుకల్లో భాగంగా తొలిరోజు ఆదివారం బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. కూకట్‌పల్లిలో మహిళలు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ భవన్‌లో ఆ పార్టీ మహిళా నేతలు ఒక్కేసి పువ్వేసి చందమామా.. అంటూ ఆడీపాడారు. రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో, కొత్తపేట అష్టలక్ష్మి ఆలయంతో పాటు నగరంలోని కాలనీలు, బస్తీలు, వీధివీధినా బతుకమ్మ ఆటాపాటలు వైభవంగా ప్రారంభమయ్యాయి.
- సాక్షి, సిటీబ్యూరో


కూకట్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బీఆర్‌ఎస్ భవన్‌లో బతుకమ్మలతో..


రవీంద్ర భారతిలో..


కూకట్‌పల్లిలో బతుకమ్మలతో..


కొత్తపేట అష్టలక్ష్మి ఆలయం వద్ద బతుకమ్మ వేడుకలు

వాకింగ్‌కు వెళ్లిన వృద్ధుడిపై వీధి కుక్కల దాడి


కుక్కలు కరవడంతో చేతికి గాయం


బాధితుడు నరసింహ

అమీర్‌పేట: మార్నింగ్ వాకింగ్ కోసం వెళ్లిన ఓ వృద్ధుడిపై వీధికుక్కలు దాడి చేయడంతో అతడి రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. బీకేగూడ మున్సిపల్ వార్డు కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. బల్కంపేటకు చెందిన 72 ఏళ్ల విశ్రాంత ఉద్యోగి డి.నరసింహ ప్రతి రోజు వార్డు కార్యాలయం పక్కనే ఉన్న పార్కులో మార్నింగ్ వాకింగ్ చేస్తుంటాడు. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం వాకింగ్‌కు కోసం బయలుదేరారు. వార్డు కార్యాలయం వద్దకు రాగానే రెండు వీధికుక్కలు వెంట పడి దాడి చేశాయి. రెండు చేతులను గాయపర్చాయి. స్థానికులు బాధితుడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. రాత్రి సమయంలో వీధి కుక్కలు వార్డు కార్యాలయం ఆవరణలోనే ఉంటున్నాయని, ఉదయం పూట వాకింగ్ చేసేవారి వెంట పడుతూ భయాందోళనకు గురి చేస్తున్నాయని వాకర్స్ వాపోయారు. కుక్కల బెడదపై జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

రూ.1.6 కోట్లతో సిటీ పోలీసు వాహనాలకు మరమ్మతులు


మరమ్మతులు పూర్తయిన వాహనాలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సిటీ కమిషనరేట్‌లోని 188 వాహనాలకు అధికారులు మరమ్మతులు చేయించారు. దీనికోసం నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ రూ.1.6 కోట్లు కేటాయించారు. అధికారులు వినియోగించే వాటితో పాటు గస్తీ వాహనాలకు రిపేర్లు చేయడంతో పాటు టీఎస్‌గా ఉన్న స్టిక్కరింగ్‌ను టీజీగా మార్చి, తెలంగాణ స్టేట్ పోలీసు అనే స్టిక్కర్ల స్థానంలో తెలంగాణ పోలీస్ పేరు ఏర్పాటు చేశారు.

బతుకమ్మ పండుగకు బల్దియా విస్తృత ఏర్పాట్లు

లక్డీకాపూల్: బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు జీహెచ్ఎంసీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన వేడుకలతో నగరమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో చివరి రోజు సద్దుల బతుకమ్మ వరకూ జీహెచ్ఎంసీ ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపట్టింది. నగర వ్యాప్తంగా 384కుపైగా బతుకమ్మ కుంటలు, చెరువులు, తాత్కాలిక కుంటలు, ట్యాంకులను సిద్ధం చేసింది. ప్రజల సౌకర్యార్థం 82 తాత్కాలిక మరుగుదొడ్లు, 45 వేల తాత్కాలిక విద్యుద్దీపాలను ఏర్పాటు చేసింది. వేడుకలు జరిగే ప్రదేశాలలో 1,450 మంది శానిటేషన్ సిబ్బందితో పారిశుద్ధ్యం కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పేర్కొన్నారు.

పల్లెకు పోదాం

బతుకమ్మ పండుగ, దసరా కోసం జనం క్యూ

- సొంతూళ్లకు పయనమైన నగర వాసులు
- 7,754 ప్రత్యేక బస్సులు నడపనున్న ఆర్టీసీ
- హైదరాబాద్ నుంచి వందకు పైగా ప్రత్యేక రైళ్లు
- వారం రోజుల పాటు కొనసాగనున్న రద్దీ


జేబీఎస్‌లో..


ప్రయాణికులతో కిక్కిరిసిన ఎంజీబీఎస్

సాక్షి, సిటీబ్యూరో: దసరా రద్దీ మొదలైంది. విద్యా సంస్థలు సెలవులు ప్రకటించడంతో నగర వాసులు సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో నగరం నుంచి వివిధ ప్రాంతాలకు బయలుదేరే బస్సులు, రైళ్లలో ఆదివారం ప్రయాణికుల రద్దీ పెరిగింది. మరో వారం రోజుల పాటు ప్రయాణికుల రద్దీ కొనసాగనుంది. ఆర్టీసీ బస్సులు, రైళ్లతో పాటు ప్రైవేట్ బస్సులు, సొంత వాహనాల్లోనూ జనం పల్లెబాట పట్టారు. ప్రయాణికుల రద్దీకనుగుణంగా ఈసారి ఆర్టీసీ 7754 ప్రత్యేక బస్సులను నడిపేందుకు ప్రణాళికలు రూపొందించింది. మరోవైపు సికింద్రాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికుల డిమాండ్ మేరకు 100 రైళ్లను అదనంగా నడిపేందుకు దక్షిణమధ్య రైల్వే చర్యలు చేపట్టింది. ప్రయాణికుల రద్దీ మేరకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసి బెర్తుల సంఖ్యను పెంచనున్నట్లు అధికారులు తెలిపారు. రెగ్యులర్ రైళ్లన్నింటిలోనూ ఇప్పటికే వెయిటింగ్ లిస్ట్ వందల్లోకి చేరింది. దసరా, దీపావళి, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి వంటి వరుస పండుల సీజన్ దృష్ట్యా రైళ్లకు భారీ డిమాండ్ నెలకొంది. ఫిబ్రవరి వరకు పలు రైళ్లలో 150 నుంచి 200 వరకు వెయిటింగ్ లిస్ట్ దర్శనమివ్వడం గమనార్హం.

నగర శివార్ల నుంచే..

బతుకమ్మ, దసరా పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకొని 7,754 ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. సుమారు 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా. ఈ మేరకు నగర శివార్ల నుంచే ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ఉప్పల్, ఎల్బీనగర్, హయత్‌నగర్, సాగర్‌రింగ్ రోడ్డు, మెహిదీపట్నం, ఆరాంఘర్, తదితర ప్రాంతాల నుంచి బస్సులు బయలుదేరనున్నాయి. మరోవైపు హాస్టళ్లలో ఉండే విద్యార్థులు సొంత ఊళ్లకు వెళ్లేందుకు వీలుగా బస్సులను నేరుగా హాస్టళ్ల నుంచి ఆయా జిల్లా కేంద్రాలకు నడిపేందుకు కూడా అధికారులు ఏర్పాట్లు చేశారు. దసరా ప్రత్యేక బస్సుల్లో 25 శాతం నుంచి 50 శాతం వరకు అదనపు చార్జీలు విధించనున్నారు. అన్ని రెగ్యులర్ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళా ప్రయాణికులకు యథావిధిగా ఉచిత ప్రయాణ సదుపాయం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

చర్లపల్లి నుంచే ఎక్కువ రైళ్లు..

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనుల దృష్ట్యా పలు రెగ్యులర్ రైళ్లతో పాటు ప్రత్యేక సర్వీసులను చర్లపల్లి నుంచి నడిపేందుకు దక్షిణమధ్య రైల్వే ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఇవి కాకుండా యథావిధిగా సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే రైళ్ల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బందిని అదనంగా ఏర్పాటు చేశారు. సాధారణ బోగీల్లో బయలుదేరే ప్రయాణికులు టికెట్ల కోసం పడిగాపులు కాయాల్సిన అవసరం లేకుండా యూటీఎస్ మొబైల్ యాప్ సదుపాయాన్ని స్టేషన్‌లోని వివిధ చోట్ల అందుబాటులో ఉంచారు. అధికారులు ఎంపిక చేసిన కొంతమంది సిబ్బంది మొబైల్ స్కానర్లు కలిగిన జాకెట్‌లను ధరించి ప్రయాణికుల వద్దకు వచ్చేవిధంగా ఏర్పాటు చేశారు. దీంతో టికెట్ కౌంటర్‌ల వద్ద క్యూలైన్‌లలో పడిగాపులు కాయాల్సిన అవసరం ఉండదని దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.


నమో యువ రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

ధనాధన్.. నమో యువ రన్


రన్‌లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

నగరంలోని నెక్లెస్ రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వేదికగా ఆదివారం బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన నమో యువ రన్‌లో యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ప్రేమ్‌సింగ్ రాథోడ్, దీపక్ రెడ్డి, గువ్వల బాలరాజు, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.
- సాక్షి, సిటీబ్యూరో


నమో యువ రన్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

విద్యార్థులు దేశసేవలో భాగస్వాములు కావాలి


అమ్మ ఒడి- నా తెలంగాణ పుస్తకావిష్కరణలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, దత్తాత్రేయ తదితరులు

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- అమ్మ ఒడి - నా తెలంగాణ పుస్తకావిష్కరణ

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో రచయిత్రి రాయపూడి ఆశాలత, ఆమె కుమారుడు రంజీ ట్రోఫీ క్రికెటర్ రాయపూడి నాగేంద్ర ఆధ్వర్యంలో రచించిన 'అమ్మ ఒడి - నా తెలంగాణ' పుస్తకాన్ని ఆదివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. విద్యార్థులు దేశసేవలో భాగస్వామ్యులు కావాలన్నారు. ప్రపంచ దేశాల్లో డిజిటలైజేషన్ దేశంగా భారతదేశం నిలవడం సంతోషంగా ఉందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో ప్రపంచ దేశాలను ధీటుగా భారతదేశం అవతరించిందన్నారు. ఆదివాసీ ప్రాంతాన్ని ఎంచుకొని వారి స్థితిగతులపై పరిశోధనలు చేసి విద్యా, ఆరోగ్య, ఉపాధి కల్పించి పేదరికాన్ని పాలదోలమే లక్ష్యంగా ఐఐటీ విద్యార్థి, రంజీ ట్రోఫీ క్రికెటర్ నాగేంద్ర పని చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హరియాణా మాజీ గవర్నర్ దత్తాత్రేయ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబు, బిట్స్ పిలానీ డైరెక్టర్ సౌమ్యో ముఖర్జీ, డీన్ యేగేశ్వరి పాల్గొన్నారు.


హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిని ముంచెత్తిన వరద

నిశీధిలో మేఘ గర్జన

నగరాన్ని సాయంత్రం వర్షం వెంటాడుతూనే ఉంది. వారం రోజులుగా రోజుకో ప్రాంతంలో భారీ వర్షపాతం నమోదవుతోంది. పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రతలు 32 డిగ్రీలు నమోదవుతున్నా.. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కుంభవృష్టి కురుస్తోంది. ఆదివారం రాత్రి తొమ్మిది గంటల వరకు అత్యధికంగా బాలాపూర్ నాదర్‌గుల్‌లో 9.3, హయత్‌నగర్‌లో 8.5 సెంటీమీటర్ల వర్షం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 4 నుంచి 8 సెంటీ మీటర్ల వరకు కురిసింది. రాత్రి వర్షం బతుకమ్మ వేడుకలకు ఆటంకం కలిగించింది. వర్షానికి రోడ్లపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాబోయే మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.
-సాక్షి, సిటీబ్యూరో


మాసబ్‌ట్యాంక్ ప్రాంతంలో..

ఆక్టోపస్ సేవలు భేష్

- టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్


సమావేశంలో మాట్లాడుతున్న సజ్జనార్

సాక్షి, సిటీబ్యూరో: ఉగ్రవాద కార్యకలాపాల నియంత్రణలో ఆర్గనైజేషన్ ఫర్ కౌంటర్ టెర్రరిస్ట్ ఆపరేషన (ఆక్టోపస్) సేవలు ఎనలేనివని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. దేశంలోనే తెలంగాణ ఆక్టోపస్ విభాగానికి అపారమైన అనుభవముందని ఆయన గుర్తు చేశారు. యూసుఫ్‌గూడలోని టీజీఎస్పీ మొదటి బెటాలియన్‌లో ఆదివారం 'ఆక్టోపస్ కమాండో పిల్లర్స్' పేరుతో గెట్ టు గెదర్ జరిగింది. గతంలో ఆక్టోపస్‌లో పని చేసిన అధికారులతో కలిసి వీసీ సజ్జనార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పటి జ్ఞాపకాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. 2007లో గోకుల్ చాట్, లుంబినీ పార్క్ పేలుళ్ల తర్వాత అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆక్టోపస్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. అప్పటి శిక్షణ, ఆపరేషన్లు, టీమ్ వర్క్ అన్నీ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐజీ మురళీకృష్ణ, బెటాలియన్ డీఐజీలు సన్నీ, ప్రసాద్ బాబు, రిటైర్డ్ కమాండెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెక్లెస్ రోడ్డులో కార్డియాక్ రీ హబ్ రన్



గుండె ఆరోగ్యంపై అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో కార్డియాక్ రీ హబ్ రన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ రాజీవ్ గార్గ్ తదితరులు

ఖైరతాబాద్ : గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు హైదర్‌గూడ అపోలో హాస్పిటల్, కార్డియాక్ రీహబ్ ఫౌండేషన్ సహకారంతో నెక్లెస్ రోడ్డులో కార్డియాక్ రీ హబ్ రన్ ఆదివారం నిర్వహించారు. యువకుల్లో గుండెపోటు పెరగడానికి కారణం జీవనశైలి, ఒత్తిడి, జంక్‌ఫుడ్స్ ప్రధాన కారణమని అపోలో హాస్పిటల్స్ హైదర్‌గూడ సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజీవ్ గార్గ్ అన్నారు. సంస్థ తెలంగాణ రీజినల్ సీఈఓ తేజస్వీరావు వీరవల్లి మాట్లాడుతూ ప్రతిరోజు వ్యాయామం, పౌష్టిక ఆహారం తీసుకోవడంతో పాటు ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలని సూచించారు. దేశంలోనే మొదటి అడ్వాన్స్ కార్డియాక్ రీహబ్ సెంటర్‌గా హైదర్‌గూడ కేంద్రంలో ఇప్పటికే 120 మందికి పైగా రోగులకు ప్రయోజనం చేకూరిందన్నారు. ఈ సందర్భంగా గుండెపోటు నుంచి బయటపడ్డ వారు.. వారి అనుభవాలను పంచుకున్నారు. కార్డియాక్ రీ హబ్ రన్‌లో అపోలో హాస్పిటల్స్ రీజినల్ సీఓఓ డాక్టర్ రాచపల్లి రెడ్డయ్యప్రరెడ్డి, హైదర్‌గూడ యూనిట్ హెడ్ సుజాత హెల్డాతో పాటు డాక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సాగర్ చూసేందుకు వెళ్లి..నగరవాసి గల్లంతు



రాంబాబు(ఫైల్)

నాగార్జునసాగర్: కుటుంబ సభ్యులతో కలిసి నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చిన వ్యక్తి కృష్ణా నదిలో గల్లంతయ్యాడు. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని చింతల్ ప్రాంతానికి చెందిన దిరిసెల రాంబాబు(45) ఫార్మా కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం అతడు తన భార్య సుహాసిని, ఇద్దరు కుమారులతో కలిసి నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చారు. మధ్యాహ్నం వరకు కుటుంబ సభ్యులతో కలిసి సాగర్ అందాలను తిలకిస్తూ, ఫొటోలు దిగుతూ ఆనందంగా గడిపారు. అనంతరం స్నానాలు చేసేందుకుగాను సాగర్ డ్యాం దిగువన విద్యుదుత్పాదన కేంద్రానికి వెళ్లే దారిలోని శివాలయం పుష్కరఘాట్‌లోకి దిగారు. ఈ క్రమంలో రాంబాబు ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతయ్యాడు. అక్కడే ఉన్న భార్య, కుమారులు బోరున విలపించారు. సమాచారం అందుకున్న సాగర్ ఎస్ఐ ముత్తయ్య ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి వరకు కూడా రాంబాబు ఆచూకీ లభించలేదు.

అక్కడ చంపి..ఇక్కడ నక్కి!

- నవీ ముంబైలో భార్యను చంపిన మనోహర్
- ఆరేళ్ల క్రితం చోటు చేసుకున్న ఈ దారుణం
- తప్పించుకుని వచ్చి సిటీలో దాక్కున్న నిందితుడు
- గత వారం వచ్చి పట్టుకెళ్లిన ప్రత్యేక బృందం



మనోహర్ (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: చిన్న కారణం నేపథ్యంలో మహారాష్ట్రలోని నవీ ముంబైలో భార్యను చంపి, పరారై వచ్చిన మనోహర్ సరోదే (50) ఆరేళ్ల తర్వాత నగరంలో పట్టుబడ్డాడు. 2019లో ఈ ఘాతుకానికి పాల్పడిన అతగాడు హైదరాబాద్ వచ్చి తలదాచుకున్నాడు. కాటేదాన్ ప్రాంతంలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. సాంకేతిక ఆధారాలను బట్టి మనోహర్ ఆచూకీ కనిపెట్టిన నవీ ముంబై పోలీసులు గత వారం అతడు నివసిస్తున్న గదిపై దాడి చేసి అరెస్టు చేశారు. అక్కడి కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

చికెన్ ముక్కల విషయంలో వివాదం...

నవీ ముంబైలోని కమోథే ప్రాంతానికి చెందిన మనోహర్‌కు నాందేడ్‌కు చెందిన పల్లవితో 2007లో వివాహమైంది. పల్లవి గృహిణి కాగా... మనోహర్ స్థానికంగా ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసే వాడు. మద్యానికి బానిసైన ఇతగాడు నిత్యం భార్యతో గొడవ పడేవాడు. ఓ దశలో మానసికంగానూ దెబ్బతిన్న వ్యక్తిలా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. 2019 డిసెంబరు 4న రాత్రి మనోహర్ తన విధులు ముగించుకుని, ఇంటికి వెళ్తూ చికెన్ తీసుకువెళ్లాడు. మార్గమధ్యంలోనే పూటుగా మద్యం సేవించిన అతగాడు ఇంటికి వెళ్లిన తర్వాత చికెన్‌ను భార్యకు అప్పగించి వండమని చెప్పాడు. అప్పటికే ఇద్దరు పిల్లల ఆలనా పాలనా చూస్తున్న ఆమె వంట చేయడం కాస్త ఆలస్యమైంది.

విచక్షణ కోల్పోయి కిరోసిన్ పోసి...

దీంతో దాదాపు గంట పాటు ఆమెతో వాగ్వాదం చేస్తూనే ఉన్నాడు. వంట పూర్తయిన తర్వాత భార్యకు భోజనం వడ్డించిన పల్లవి తన పిల్లల వద్దకు వెళ్లింది. తనకు వడ్డించిన కూరలో చికెన్ ముక్కలు తక్కువ ఉన్నాయని, పిల్లలతో కలిసి తినడానికి దాచుకున్నావా? అంటూ మనోహర్ భార్యను దూషించడం మొదలుపెట్టాడు. ఆమె వారించడానికి ప్రయత్నించడంతో మరింత రెచ్చిపోయిన అతగాడు తీవ్రంగా దాడి చేశాడు. స్పృహ తప్పి పడిపోయిన పల్లవిపై ఇంట్లో ఉన్న కిరోసిన్ పోసిన మనోహర్ నిప్పంటించి పారిపోయాడు. ఈ ఘోరాన్ని చూసిన వారి సంతానం నిశ్చేష్టులై ఉండిపోయారు. పల్లవి ఆర్తనాదాలు విన్న చుట్టుపక్కల వాళ్లు ఆమెను ముంబైలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దాదాపు 45 శాతం కాలిన గాయాలైన ఆమె మూడు రోజుల చికిత్స తర్వాత చనిపోయింది.

కాటేదాన్ వచ్చి కూలీగా మారి...

దీంతో మనోహర్‌పై నమోదైన హత్యాయత్నం కేసును కమోథే పోలీసుస్టేషన్ అధికారులు హత్యగా మార్చారు. నవీ ముంబై నుంచి పరారైన మనోహర్ రెండేళ్ల పాటు వివిధ ప్రాంతాల్లో సంచరించాడు. 2021లో నగరానికి వచ్చిన ఇతగాడు కాటేదాన్ ప్రాంతంలో ఓ గది అద్దెకు తీసుకున్నాడు. బతుకుతెరువు కోసం ఓ కంపెనీలో దినసరి కూలీగా చేరాడు. నవీ ముంబైతో పాటు తన కుటుంబీకులు, బంధువులతో సంబంధాలు తెంచుకున్నాడు. దీంతో ఇతడి ఆచూకీ కనిపెట్టడం కమోథే పోలీసులకు సవాల్‌గా మారింది. ఇటీవల మనోహర్ నవీ ముంబైలో ఉన్న తన స్నేహితుడిని సంప్రదించాడు. సాంకేతిక ఆధారాలను బట్టి ఈ విషయం గుర్తించిన కమోథే అధికారులు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. సిటీకి వచ్చిన ఆ టీమ్ మనోహర్‌ను అరెస్టు చేసి తీసుకువెళ్లింది.

హైడ్రా ప్రజావాణి వాయిదా

సాక్షి, సిటీబ్యూరో: హైడ్రా ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ఈసారి మంగళవారానికి వాయిదా వేశారు. ఈ మార్పును గమనించి..ప్రజలు ఈ నెల 23న మంగళవారం ప్రజావాణికి వచ్చి ఫిర్యాదు చేయాలని హైడ్రా కోరింది. నాలాలు, చెరువులు, రహదారులు, పార్కులు, ప్రభుత్వ భూముల కబ్జాలు ఉంటే పూర్తి సమాచారంతో ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేసింది.

షేర్‌మార్కెట్ వ్యాపారి అదృశ్యం

వెంగళరావునగర్: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. వివరాలివీ... వెంగళరావునగర్ డివిజన్ ఎల్లారెడ్డిగూడకు చెందిన టి.కరుణాకర్‌రావు షేర్ మార్కెట్ వ్యాపారం చేస్తుంటాడు. దాంతో తరచూ ఆయన పని నిమిత్తం చెన్నై వెళ్తుంటాడు. ఈ క్రమంలో గత నెల 8న చెన్నై వెళ్లాడు. ఈ నెల 4న భార్య భార్య శిరీషకు ఫోన్ చేసి తాను 15 లేదా 16 తేదీల్లో నగరానికి వస్తున్నట్టుగా చెప్పాడు. అయితే తిరిగి రాలేదు. ఎన్నిమార్లు ఫోన్లు చేసినా ఫలితం లేకుండా ఉంది. అనేక ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేదు. దీంతో మధురానగర్ పీఎస్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం

అమీర్‌పేట: మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తితో పాటు మరో ముగ్గురిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎస్ఆర్‌నగర్ రత్నదీప్ సూపర్ మార్కెట్ పక్కనే ఉన్న పద్మసాగర్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెం.201లో బ్యూటీ స్పా పేరుతో మసాజ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. అందులో గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నడిపిస్తున్నారనే సమాచారంతో ఆదివారం సోదాలు చేశారు. ఆర్గనైజర్ శ్రీజ పారిపోగా స్పా సెంటర్‌లో ఉన్న సబ్ ఆర్గనైజర్ షేక్ పర్వీన్ అలియాస్ నీలవేణి, మరో ఇద్దరు యువతులు, ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు. సబ్ ఆర్గనైజర్ చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం పీలేరు నివాసి కాగా అమీర్‌పేట శ్యామ్‌లాల్ బిల్డింగ్‌లో నివాసం ఉంటోంది. సిద్దిపేట, బీదర్ జిల్లా కర్ణాటకకు చెందిన ఇద్దరు యువతులు, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన ఓ చానల్ న్యూస్ రిపోర్టర్ మండలపు వెంకట రామాంజనేయులు విటుడిగా గుర్తించారు. వారి వద్ద నుండి 7 సెల్‌ఫోన్లు, కండోమ్ ప్యాకెట్లు, ఒక డీవీఆర్, స్వైపింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు: ఒకరి మృతి



నగేష్‌చారి (ఫైల్)

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లో పండగపూట విషాదం నెలకొంది. కార్పెంటర్ పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో తలబాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ఈ హృదయ విదారక ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెన్నాపురం చౌరస్తా వద్ద చోటుచేసుకుంది. సీఐ సైదయ్య, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల మండలం కడవేర్గు గ్రామానికి చెందిన నగేష్‌చారి బతుకు దెరువు కోసం వలస వచ్చి జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ఆదర్శనగర్‌లో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో కార్పెంటర్ పనులు ముగించుకుని దమ్మాయిగూడ నుండి ఇంటికి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పసికందు మృతదేహం లభ్యం

మియాపూర్: మూడు రోజుల పసికందు మృతదేహం లభ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మల్లేశం తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ - హాఫీజ్‌పేట ప్రేమ్‌నగర్ కాలనీ సమీపంలో రోడ్డు ప్రక్కన ఓ కవర్‌లో చిన్న పసిపాప పడి ఉందని మియాపూర్ పోలీసులకు శనివారం సాయంత్రం సమయంలో స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా సుమారు రెండు లేదా మూడు రోజుల ముందు జన్మించిన ఆడ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు కవర్‌లో కట్టి రోడ్డు పక్కన వదిలేశారన్నారు. ఆ పసికందు అప్పటికే మృతిచెంది ఉంది. పసికందు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి: ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన 1వ దక్షిణ భారత కరాటే చాంపియన్‌షిప్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ విభాగాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక ధృడ త్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ నాయకులు వైభవ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్ అనుకుని యాసిడ్ తాగిన వ్యక్తి మృతి

వెంగళరావునగర్: కూల్‌డ్రింక్ అనుకుని యాసిడ్ తాగిన వ్యక్తి మృతి చెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఒడిశా ప్రాంతానికి చెందిన సుశాంత్‌కుమార్ సాహు స్థానికంగా రహమత్‌నగర్‌లో నివాసం ఉంటూ టీ-స్టాల్ నిర్వహిస్తుంటాడు. అతని భార్య సుమిత్రా సాహు ఇటీవల షాపింగ్‌కు వెళ్లి బాత్రూంలు శుభ్రం చేయడానికి యాసిడ్‌ను కొనుగోలు చేసి ఇంటికి తెచ్చింది. అనంతరం కొద్దిగా కూల్‌డ్రింక్ బాటిల్‌లో పోసి మిగిలింది దాచింది. ఈ నెల 19న పనుల నిమిత్తం బయటకు వెళ్లి వచ్చిన సుశాంత్ కుమార్ సాహు ఇంట్లో కూల్‌డ్రింక్ బాటిల్‌లో ఉన్న యాసిడ్‌ను తెలుసుకోకుండా తాగాడు. దాంతో ఉక్కిరిబిక్కిరై పడిపోయాడు. చుట్టుపక్కల వారు అతన్ని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రెండు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన సుశాంత్ కుమార్ సాహు ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్ తగిలి ఉద్యోగి మృతి



రాంబాబు (ఫైల్)

జీడిమెట్ల: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా కరెంటు షాక్ తగిలి ఓ విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగి మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ వివరాల ప్రకారం.. టీజీఐఐసి కాలనీకి చెందిన బైరిశెట్టి రాంబాబు(43) షాపూర్‌నగర్ డివిజన్‌లో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం షాపూర్‌నగర్ ప్రధానరోడ్డులోని ఆదర్శ్‌బ్యాంకు ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్నాడు. ఒక్కసారిగా కరెంటుషాక్ తగిలి రాంబాబు కిందపడిపోయాడు. వెంటనే షాపూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించగా అప్పటికే రాంబాబు మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుని భార్య సత్యవతి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యారత్న అవార్డుకు ఎంపిక

మంచాల: మండలంలోని తాళ్లపల్లిగూడకు చెందిన డాక్టర్ ఎన్‌కే భిక్షపతి ప్రొఫెసర్ జయశంకర్ విద్యారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 22న (సోమవారం) రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఏనుగు నరసింహారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

నవరాత్రులలో 'దుర్గా సప్తశ్లోకి' పారాయణం చేయండి

శృంగేరి పీఠం పిలుపు



సాక్షి, సిటీబ్యూరో: ప్రతి సంవత్సరం దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా అత్యంత శ్రద్ధాభక్తులతో అమ్మవారిని ఆరాధించడం ఆచారంగా వస్తోందని, ప్రస్తుతం మన దేశం, తెలుగు రాష్ట్రాలు, సమాజం అనేక సమస్యలను, సవాళ్లను ఎదుర్కొంటున్నందున ఈ నవరాత్రుల్లో ప్రత్యేకంగా దుర్గా సప్తశ్లోకి అనే ఏడు శ్లోకాల స్తోత్రాన్ని పఠించాలి శృంగేరీ పీఠం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు మహా శక్తిసంపన్నమైన శ్రీ దుర్గా సప్తశతి సంక్షిప్త రూపమైన దుర్గా సప్తశ్లోకి అనే ఏడు శ్లోకాల స్తోత్రాన్ని ప్రతిరోజూ కనీసం 108 మార్లు పఠించాలని శృంగేరీ జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారు, ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామివారు భక్తులకు సూచించారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

విద్యతో పాటు శాస్త్రీయ కళల్లో ప్రతిభ చాటాలి



విద్యార్థినిల నృత్య ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు విద్యతో పాటు శాస్త్రీయ సంగీత కళల్లో ప్రతిభను చాటాలని చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య సూర్య ధనుంజయ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సింగిడి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గత 25 రోజులుగా మాధురి నృత్యంపై నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న మాధురి నృత్యంపై విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థినీలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పావని, సింగిడి సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు డిఆర్‌కె. విశ్వకర్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యూత్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్



సాక్షి, హైదరాబాద్: పెట్రా స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ ఫుట్‌బాల్ చాంపియన్ ఘనంగా ముగిసింది. అండర్-13, అండర్-15 కేటగిరీల్లో జరిగిన పోటీల్లో నగరానికి చెందిన మొత్తం 17 జట్లు పాల్గొన్నాయి. అండర్-15 విభాగంలో రీడ్స్ ఫుట్‌బాల్ అకాడమీ విజేతగా, హైదరాబాద్ లిటిల్ స్టార్స్ అకాడమీ రన్నరప్‌గా నిలిచింది. అండర్-13 కేటగిరీలో స్కై కింగ్స్ విజేతగా నిలవగా... ఆతిథ్య జట్టు పెట్రా స్పోర్ట్స్ అకాడమీ రన్నరప్ స్థానాన్ని అందుకుంది. అమరాన్, ఎడ్జ్‌గ్రిడ్, స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ స్పాన్సర్లుగా వ్యవహరించాయి. అత్యంత అధునాతన సౌకర్యాలు ఉన్న తమ అకాడమీలో త్వరలోనే అండర్-11, అండర్-18 స్థాయిలో టోర్నమెంట్‌లు నిర్వహిస్తామని పెట్రా అకాడమీ కోచ్ కెవిన్ ఆండ్రూస్ వెల్లడించారు.

'స్థానిక'.. కదలిక!

- నేడో, రేపో రిజర్వేషన్ల అంశం కొలిక్కి వస్తుందనే అంచనాలు
- ఈ నెలాఖరులో ఎప్పుడైనా నోటిఫికేషన్ వచ్చే అవకాశం
- ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం
- ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్న నేతల్లో చిగురించిన ఆశలు
- గ్రామ, మండలాల వారీగా సమావేశాలకు పార్టీల యోచన



సాక్షి, రంగారెడ్డిజిల్లా: దసరాకు ముందే స్థానిక సందడి మొదలు కానుంది. ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాల్సిందిగా ఇప్పటికే ప్రభుత్వం నుంచి జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు అందడం, ఆ మేరకు వార్డు, గ్రామ, మండల స్థాయి ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్లు, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను రెడీ చేసి ఉంచడం తెలిసిందే. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పనకు సంబంధించిన జీఓ వెలువడిన వెంటనే డెడికేషన్ కమిటీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా వార్డులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. ఒకటిరెండు రోజుల్లో బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చే అవకాశం ఉండటం, నెలాఖరులోగా ఎప్పుడైనా నోటిఫికేషన్ వెలువడే చాన్స్ ఉండటంతో ఇప్పటి వరకు స్తబ్దుగా ఉన్న ఆశావహుల్లో మళ్లీ చర్చ మొదలైంది. తొలి విడతలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, తర్వాత వార్డు మెంబర్లు, సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.

ఇప్పటికే ఓటర్ల ముసాయిదా వెల్లడి

జిల్లాలో 27 మండలాలు ఉండగా, వీటి పరిధిలో 15 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉన్నా యి. 21 జెడ్పీటీసీ స్థానాలతో పాటు 230 ఎంపీటీసీ స్థానాలు ఖరారయ్యాయి. 2019 ఎన్నికల్లో 257 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, కొత్తగా మొయినాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడం, గ్రేటర్ సమీపంలోని పలు గ్రామాలను ఆయా మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో 27 ఎంపీటీసీ స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది. 558 గ్రామ పంచాయతీలు ఉండగా, 32 స్థానాలను కోల్పోవాల్సి రావడంతో ప్రస్తుతం వీటి సంఖ్య 526కు చేరింది. వార్డులు, గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల పరిధిలో ఓటర్ల జాబితాలను పంచాయతీ/ మండల పరిషత్ కార్యాలయాల్లో వెల్లడించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పార్టీపరంగా ప్రకటించనున్నట్లు తెలిసింది. వీకెండ్‌లో కానీ/దసరా సెలవుల్లో కానీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది.

జిల్లాలో స్థానిక స్వరూపం	
గ్రామ పంచాయతీలు	526
వార్డులు	4,668
పోలింగ్ కేంద్రాలు	4,682
మొత్తం ఓటర్లు	7,94,653
పురుషులు	3,99,404
మహిళలు	3,95,216
ఇతర ఓటర్లు	33
ఎంపీటీసీలు	230
జెడ్పీటీసీలు	21

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే ఏర్పాట్లు కూడా చేశాం. ఓటర్ల జాబితా తయారీలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారమివ్వబోం. బోగస్ ఓట్లకు తావు లేకుండా పక్కాగా రూపొందిస్తున్నాం. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి.. అభ్యంతరాలను స్వీకరించి, అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నాం. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేస్తాం. నోటిఫికేషన్ జారీ చేసి, నామినేషన్ల స్వీకరణ తర్వాతే బ్యాలెట్ పేపర్లపై అభ్యర్థుల పేర్లు, పార్టీ గుర్తులను ముద్రించనున్నాం. ఇందుకోసం అవసరమైన బ్యాలెట్ పేపర్లను సిద్ధంగా ఉంచాం. బ్యాలెట్ బాక్సులను ఇతర రాష్ట్రాల నుంచి సమకూర్చనున్నాం. – నారాయణరెడ్డి, కలెక్టర్

బతుకమ్మ పాటల సీడీ ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం, బొంతు రామ్మోహన్, విజయలక్ష్మి

రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకురాలు కంజర్ల విజయలక్ష్మి రూపొందించిన బతుకమ్మ పాటల సీడీని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా బతుకమ్మ పాటలను రూపొందించిన విజయలక్ష్మిని అభినందించారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు మనుక రాజ్‌యాదవ్‌తో పాటు ఎర్రగడ్డ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే ఊరుకోం

బంజారా నాయకులు



ఆత్మగౌరవ సభలో పాల్గొన్న బంజారా సంఘం నాయకులు

అమీర్‌పేట: ఎస్టీ రిజర్వేషన్లు ఎత్తివేయాలని కుట్రలు పన్నుతున్నారని, తమ హక్కులకు భంగం కలిగిస్తే ఊరుకోమని బజారా నాయకులు హెచ్చరించారు. రిజర్వేషన్లను తొలగించాలని మాజీ ఎంపీ సోయం బాబురావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ సుప్రీం కోర్టులో పిల్ వేయడాన్ని నిరసిస్తూ ఆదివారం అమీర్‌పేట బాపూనగర్‌లో లంబాడా (బంజారా) ఆత్మగౌరవసభ నిర్వహించారు. బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిసింగ్‌జాదవ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జరిగిన సభలో పలువురు నాయకులు మాట్లాడారు. ఎస్టీ జాబితాలో అనేక ఉపకులాలు ఉండగా కేవలం బంజారాలకు మాత్రమే రిజర్వేషన్లు లేకుండా చేయాలని డిమాండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎస్టీ రిజర్వేషన్లు కల్పించి 50 ఏళ్లు పూర్తైయిందన్నారు. నాడు ఎమ్మెల్యేగా ఉన్న రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో బస్తీ నాయకులు స్వామినాయక్, అమర్‌సింగ్ రాథోడ్, దీప్‌లాల్ చౌహాన్ తదితరులు లంబాడి తెగకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలంటూ పోరాటం చేశారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన ఆదిలాబాద్ మాజీ ఎంపీ బాబురావుకు సోయి లేదని, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు తెలివి లేదని విమర్శించారు. మా హక్కులకు భంగం కలిగించే వ్యక్తులకు తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎం.గోపీలాల్‌చౌహాన్, చెరణ్‌సింగ్, ప్రతాప్‌నాయక్, కృష్ణకుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు: ఎమ్మెల్యే

గోల్కొండ: దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని తాను సంబంధిత అధికారులను కోరానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాహెద్ అలీ ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులు దివ్యాంగుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో తమకు న్యాయం చేయాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..తాను గతంలోనే సంబంధిత అధికారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరామన్నారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసి దివ్యాంగులకు స్వయం ఉపాధి కోసం సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని కోరుతానని అవసరమైతే ఈ విషయం అసెంబ్లీలో సైతం లేవనెత్తుతానన్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

అబిడ్స్: శక్తిలేని వ్యక్తి శవంతో సమానమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రచారక్ లింగం శ్రీధర్‌జీ అన్నారు. శక్తితో పాటు సంస్కారం, సమర్పణ, సేవాభావం కలిగి ఉండాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను సీతారాంబాగ్‌లోని శ్రీ జగన్నాథ మఠంలో శ్రీధర్‌జీ ఆదివారం ప్రారంభించారు. దసరా నాటికి జంట నగరాల్లోని 1000 ప్రాంతాల్లో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించి, సంఘం సిద్ధాంతాలను గడప గడపకూ తీసుకువెళ్తామని ఆయన ప్రకటించారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాలన్నారు. 100 ఏళ్లల్లో ఆర్‌ఎస్‌ఎస్ దేశానికి ఎంతో సేవ చేసిందని ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఆనుపురం లక్ష్మీనారాయణ వివరించారు. మానవ జీవితం సంపూర్ణం కావాలంటే తల్లిదండ్రులను పూజించి ధర్మ రక్షణకు పాటు పడాలని జగన్నాథ్ మఠం పీఠాధిపతి అచ్యుత రామానుజాచార్య స్వామీజీ సూచించారు.



ఎమ్మెల్యే కాలనీ క్లబ్‌లో...





బంజారాహిల్స్‌లోని గౌరీ శంకర్ కాలనీలో...

ఒక్కేసి.. పువ్వేసి చందమామ..

- బస్తీలు, కాలనీల్లో పండుగ వాతావరణం
- బతుకమ్మ ఆట పాటలో మహిళల ఆనందోత్సాహం

వాడవాడలా ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు







ఫిలింనగర్ బీజేఆర్‌నగర్ బస్తీలో...

బంజారాహిల్స్: ఒక్కేసి.. పువ్వేసి చందమామా... ఒక్కజాములాయే చందమామ.. అంటూ చిన్నాపెద్దా తేడా లేకుండా మహిళలంతా బతుకమ్మ పాటలు పాడుతూ.. పాదంపాదం కదుపుతూ బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఖైరతాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, ఖైరతాబాద్, పంజగుట్ట, సోమాజిగూడ, ఫిలింనగర్ ప్రాంతాల్లో వైభవంగా జరిగాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీ రిక్రియేషన్ సెంటర్‌లో కాలనీవాసులు పెద్ద ఎత్తున బతుకమ్మలను పేర్చుకొని వచ్చి సందడిగా బతుకమ్మ వేడుకలను జరుపుకొన్నారు. ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో రాణి రుద్రమ దేవి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి రాములమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ కాంతుల ధగధగలతో పెద్దమ్మతల్లి ఆలయం

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి వేడుకలు





విద్యుత్ కాంతుల వెలుగులో జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయం



బంజారాహిల్స్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం ముస్తాబైంది. తొమ్మిది రోజుల పాటు జరగనున్న ఈ నవరాత్రి వేడుకలకు ఆలయాన్ని ఆలయ అధికారులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ కాంతుల వెలుగులో అమ్మవారి ఆలయం ధగధగలాడుతున్నది. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు నగర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఆలయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. భక్తులకు కోసం ఇప్పటికే బారికేడ్లు ఏర్పాటు చేశారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి



మాట్లాడుతున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు కష్ట పడి తమ సత్తా చాటాలని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ పిలుపు నిచ్చారు. ఎస్‌ఆర్‌ఆర్ పురం సైట్-1, రాజ్‌నగర్, మధురానగర్ బూత్ కమిటీల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా సైనికుల్లా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమని, అయితే అత్యధిక మెజారిటీ రావాలన్నది తమ లక్ష్యమన్నారు. నియోజకవర్గంలోనే బోరబండ డివిజన్ నుంచి అత్యధిక మెజారిటీ సాధించే విధంగా కార్యకర్తలు శ్రమించాలని సూచించారు. ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర టీజీఐడీసీ చైర్మన్ మువ్వ విజయ్ బాబు, నగర కాంగ్రెస్ నాయకుడు మహేష్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు అశోక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బీవీబీపీలో నేత్రపర్వంగా శరన్నవరాత్రి ఉత్సవాలు





ఫిలింనగర్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో ఆదివారం దసరా వేడుకలకు సరికొత్త థీమ్‌తో కనులపండువగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పాఠశాలకు చెందిన 30 మంది ఉపాధ్యాయినులు దేవీ నవరాత్రుల్లో ఒక్కో రోజు దర్శనమిచ్చే అమ్మవారి వేషధారణలో విశేషంగా ఆకట్టుకున్నారు. మహిషాసుర మర్దినిగా పరిమళ టీచర్, దుర్గాదేవిగా రీతుపర్ణ టీచర్‌తో పాటు ఉపాధ్యాయురాళ్లు దేవతామూర్తుల వేషధారణలో ఆహూతులను తమ హావభావాలు, నటనాచాతుర్యం, నృత్య భంగిమలతో కనువిందుచేశారు. పాఠశాల ఆవరణలో దసరా పండుగ అప్పుడే కలువుదీరిందా అన్న రీతిలో కార్యక్రమాన్ని రక్తి కట్టించారు. దేవీ నవరాత్రుల థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమం మూడు గంటల పాటు ఉద్రూతలూగించింది. పాఠశాల ప్రిన్సిపాల్ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం

వెంగళరావునగర్: అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించడం చాలా గొప్ప విషయమేకాకుండా పుణ్యకార్యమని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత అన్నారు. రహమత్‌నగర్ వర్తక సంఘం అన్నపూర్ణదేవి అన్న సమర్పణ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సునీత మాట్లాడుతూ... రాష్ట్ర సౌభాగ్యాన్ని కోరుతూ, రాజకీయాలకు అతీతంగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్పొరేటర్ దేదీప్య విజయ్, బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు ముదిరాజ్, వర్తక సంఘం నాయకులు కృష్ణమూర్తి, నటరాజు, సురేష్ ముదిరాజ్, బ్రహ్మానందం, నాగరాజు, ప్రభు, కిట్టు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న మాగంటి సునీత

బూత్ కమిటీలతోనే కాంగ్రెస్ విజయం తథ్యం



బూత్‌కమిటీలతో సమావేశమైన ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్

శ్రీనగర్‌కాలనీ: బూత్ కమిటీలతోనే జూబ్లీహిల్స్ నియోజకర్గానికి జరుగనున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సుసాధ్యమని ఏఐసీసీ సెక్రటరీ పి.విశ్వనాథన్ అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్‌కాలనీలో స్థానిక బూత్ కమిటీ నేతలతో తెలంగాణ డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అమిత్‌రెడ్డి, కాంగ్రెస్ నేత నవీన్‌యాదవ్‌తో కలిసి సమావేశమయ్యారు. డివిజన్‌లోని పలు బూత్‌లను తిరిగి అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బూత్ కమిటీలు బలంగా పనిచేయాలని కోరారు. నేతలు రవిగౌడ్, రమేష్ నాయక్, మోసిన్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

26న ఎన్‌డీఎస్‌ఎఫ్ వార్షికోత్సవ మహాసభ

హిమాయత్‌నగర్: బీజేపీ (ఎన్‌డీఏ), కాంగ్రెస్ (ఇండియా) తదితర కూటములకు రాజకీయ ప్రత్యామ్నాయంగా నేషనల్ డెమోక్రటిక్ సెక్యులర్ ఫ్రంట్(ఎన్‌డీఎస్‌ఎఫ్) ఆవిర్భావ మహాసభ ఈ నెల 26న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్లు ఫ్రంట్ చైర్మన్ చైర్మన్, దళిత బహుజన పార్టీ(డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ తెలిపారు. ఆదివారం హిమాయత్‌నగర్ జాతీయ కార్యాలయంలో ఫ్రంట్ ఆవిర్భావ కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అంతా ఒక్కటేనని అన్నారు. వారి అజెండా కేవలం దళిత బహుజన ప్రజలను సామాజికంగా అణిచివేసి దోపిడీ చేయడమేనని అన్నారు. జూబ్లీహిల్స్‌తో సహా 11 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఫ్రంట్ తరుపున ఉమ్మడిగా పోటీచేస్తామని తెలిపారు. ఈ మహా సభ, ర్యాలీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫ్రంట్‌లో భాగమైన వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అగ్రవర్ణ పేదలకు రాయితీపై వైద్య సేవలు

విరించి చైర్‌పర్సన్ మాధవీ లత



ఈడబ్ల్యూఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విరించి చైర్ పర్సన్ మాధవీలత

బంజారాహిల్స్: సంవత్సరానికి రూ. 8 లక్షల లోపు ఆదాయం కలిగి ఉన్న అగ్రవర్ణ పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు ఈడబ్ల్యూఎస్ (ఎకనామిక్ వీకర్స్ సెక్షన్) పథకంతో కార్పొరేట్ వైద్యం అందించనున్నట్లు విరించి ఆస్పత్రి చైర్ పర్సన్ మాధవీ లత అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని విరించి ఆస్పత్రిలో ఆమె ఈడబ్ల్యూఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఇప్పటి దాకా ఆరోగ్య శ్రీ లేకుండా ఉండి, హెల్త్ ఇన్సూరెన్స్ లేకున్న వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని దీని ద్వారా అతి తక్కువ ధరలకే అగ్రవర్ణ పేదలకు ఖరీదైన వైద్యాన్ని అందిస్తామని తెలిపారు. రూ. 99తో ఆస్పత్రిలో ఈ ఈడబ్ల్యూఎస్ కార్డును పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ పథకంలో చేరాల్సిన వారు ఆస్పత్రిలో ఉన్న ఎకనామిక్ వీకర్స్ సెక్షన్ కార్యాలయంలో నమోదు చేసుకొని కార్డు పొందాల్సి ఉంటుందని తెలిపారు. దీని ద్వారా అన్ని రకాల వైద్య సేవలను అతి తక్కువ ధరలకు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ యార్లగడ్డ కృష్ణ మోహన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యవేదుల తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి తమ్మినేని శేఖర్, చైర్మన్ సాయిబాబాగౌడ్ తెలిపారు. ఆదివారం దసరా నవరాత్రి వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం నుంచి సెప్టెంబర్ 2 వరకు వేడుకలు జరుగుతాయన్నారు. ప్రతీ రోజు గర్భగుడిలో అమ్మవారిని, మూల విరాట్‌ను రోజుకో ప్రత్యేక రూపంలో అలంకరించనున్నట్లు చెప్పారు. ఉదయం హోమం ఉంటుందన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో.. 'పోషణ మాసోత్సవం'

బంజారాహిల్స్: పోషకాహార లోపం చిన్నారులకు శాపంగా మారుతోంది. పోషకాలు సమృద్ధిగా ఉండే ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాల ప్రాధాన్యతపై తల్లిదండ్రులు దృష్టి పెట్టకపోవడంతో పిల్లలను రక్తహీనత, పలు వ్యాధులు వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంగా గర్భిణులు, బాలింతలు, బాలికలను అప్రమత్తం చేసే దిశగా 'పోషణ మాసోత్సవం' నిర్వహిస్తున్నాయి. ఈనెల 18 నుంచి వచ్చేనెల 16వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల వేదికగా అవగాహన సదస్సులు, ప్రదర్శనలు నిర్వహించాలని ప్రణాళికలు రూపొందించారు. ఖైరతాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్-2 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, బోరబండ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో ఉన్న 151 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పోషణ మాసోత్సవం గురువారం ప్రారంభమైంది. ప్రతిరోజూ ఒక్కో కార్యక్రమంతో కార్యక్రమాలు నిర్వహించాలని, పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, రోజువారీ షెడ్యూల్ ఏర్పాటు చేసి పక్కాగా అమలు చేయాలని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. విద్యార్థుల బరువుతో పాటు ఆటాపాటలతో అలరించే కార్యక్రమాలు నిర్వహించారు.



ఫిలింనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువు తెలుసుకుంటున్న టీచర్

రోజువారీ కార్యక్రమాలు.. మొదటి వారం:

- అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, పాలిచ్చే తల్లులు, శిశువులు, చిన్న పిల్లల పోషణపై సమావేశం నిర్వహిస్తారు. పోషకాహారంపై అనుబంధ ఆహారాల తయారీపై వంటకాల పోటీలు, కిశోర బాలబాలికలకు, పెద్దవాళ్ల కోసం బీఎంఐ పరీక్షలు, పిల్లల కోసం బరువు, ఎత్తు కొలతలు తీసుకుంటారు. ఆహారంలో చక్కెర, నూనె వినియోగాన్ని తగ్గించే విషయంపై అవగాహన కల్పిస్తారు. తండ్రులు, సంరక్షకులకు అనుబంధ ఆహార తయారీపై వంటకాల పోటీలు నిర్వహించి తండ్రులతో పోషకాహార ప్రతిజ్ఞలు చేయిస్తారు.
- చిన్నారుల పూర్తి సమాచారంతో అపార్ ఐడీ కార్డులు తయారు చేయిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కథలు చెప్పడం, బొమ్మల ప్రదర్శనలు నిర్వహిస్తారు. 0-3 సంవత్సరాల పిల్లల ఆరంభ అభివృద్ధి, ప్రేరణ కోసం దృష్టి సారించాల్సిన కార్యక్రమాలు తల్లిదండ్రులతో చేయిస్తారు. బొమ్మలు, పౌష్టికాహార పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించి స్థానిక వంటకాలు స్వయంగా తయారు చేయించి ప్రోత్సహిస్తారు.

రెండోవారం:

- బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టడం, పిల్లలకు అనుబంధ ఆహారం అందించడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. పిల్లల పోషణ, సంరక్షణలో తండ్రుల భాగస్వామ్యంపై పోషణ సమావేశాలు ఉంటాయి. పిల్లల మొదటి, రెండు సంవత్సరాల్లో మెదడు అభివృద్ధిపై తండ్రులకు అవగాహన, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహిస్తారు. స్థానిక వంటకాలు, చిరుధాన్యాలు, ఫలాలు, కూరగాయలపై అవగాహన కల్పించి స్వదేశీ బొమ్మల తయారీ, స్థానిక వంటకాలు స్వయంగా తయారు చేయడంపై వివరిస్తారు.

మూడో వారం..

- అతి తీవ్ర పోషణ లోపంతో ఉన్న పిల్లలపై ఆకలి పరీక్షలు నిర్వహించి గ్రోత్ మానిటరింగ్‌లో హాజరుకాని పిల్లల బరువు, ఎత్తు కొలుస్తారు. పోషణ్ మిషన్ 100 రోజుల ప్రచారాన్ని ప్రారంభిస్తారు. పోషణ్ చాంపియన్లుగా పిల్లల తల్లిదండ్రులను సత్కరించి బస్తీ సభలు ఏర్పాటు చేసి పోషణ లోపం ఉన్న పిల్లల జాబితాను తయరు చేసి ఆ పిల్లల గృహాలను సందర్శిస్తారు.

నాల్గవ వారం..

- తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు ఎలా పట్టించాలి అనే విషయాలను తెలియజేస్తారు. ఆరు నెలలలోపు వయస్సున్న పిల్లల ఇళ్లతో పాటు గర్భిణుల ఇళ్లను ఆశా వర్కర్లు సందర్శించి ఇంట్లోని పురుషులకు అవగాహన కల్పిస్తారు. ప్రీ స్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో సంయుక్తంగా ఆటల పోటీలు నిర్వహిస్తారు. 'మీరు తినే ఆహారం.. మీ పెరుగుదల' అనే అంశంపై పోటీలు, ఆహార సమూహాలు, మిటమిన్లు, రక్తహీనత, పరిశుభ్రతపై క్విజ్ పోటీలు, ఆరోగ్యకరమైన వంటకాల గురించి వివరిస్తారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాలల ప్రాంగణంలో మొక్కలు నాటుతారు. జంక్ ఫుడ్‌తో కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తారు.

ఉపాధికి గ్రామీణ పర్యాటకం ఊతం



సదస్సుకు హాజరైన అతిథులు

సనత్‌నగర్: బేగంపేటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ శ్రీశక్తిలో ఫార్మ్–టు–ఫోక్ టూరిజం కాన్‌క్లేవ్‌ను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరు క్రాంతి హాజరై మాట్లాడారు. స్థిరమైన జీవనోపాధిని పెంపొందించడంలో గ్రామీణ పర్యాటకం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. హోమ్‌స్టే మార్గదర్శకాలు, ఎంఎస్‌ఎంఈ నిధులు, అతిథ్య సవాళ్లు, డిజిటల్ మార్కెటింగ్ వంటి అంశాలపై ఈ సదస్సులో చర్చించారు. శ్రీశక్తి ఎడ్యుకేషనల్ సొసైటీ యాజమాన్యం అతిథ్య రంగంలో యువతకు స్థిరమైన పర్యాటకం, గ్రామీణ సాధికారత అవకాశాలను ప్రోత్సహించడంలో నిబద్ధతను చాటుకుంటున్నట్లు పలువురు వక్తలు కొనియాడారు.

ముగిసిన అసెట్ ఫెయిర్



పంజగుట్ట: ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో రెండు రోజులపాటు సోమాజిగూడలోని జయా గార్డెన్స్‌లో నిర్వహించిన అసెట్ ఫెయిర్ ఆదివారం ముగిసినట్లు బ్యాంకు ఫీల్డ్ మేనేజర్ ప్రణీష్ కుమార్ తెలిపారు. అసెట్ ఫెయిర్‌కు విశేష స్పందన లభించిందన్నారు. ఈ అసెట్ ఫెయిర్ ద్వారా న్యాయమైన ప్రక్రియలో ఆస్తులను సొంతం ఎలా చేసుకోవచ్చనే విషయాన్ని వినియోగదారులకు వివరిస్తామని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో అసెట్ ఫెయిర్ నిర్వహించినట్లు తెలిపారు. ఫెయిర్‌లో 120కిపైగా ఆస్తులను ప్రదర్శించామని, వందమందికి పైగా కొనుగోలుదారులు ముందుకు వచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి, కరీంనగర్ జోన్ల అధికారులు పాల్గొన్నారు.

వీకెండ్‌లో దొరికిన 490 మంది నిషాచరులు

– 12 మందికి జైలు శిక్ష

రాయదుర్గం: 'తాగి రోడ్డెక్కితే వదలం'అంటూ సైబరాబాద్ పోలీసులు స్పష్టం చేస్తున్నారు. సైబరాబాద్ పోలీసులు 'స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్'పేరిట కార్య క్రమాన్ని వీకెండ్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వీకెండ్‌లో 490 మంది నిషాచరులను సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పర్చగా 12 మందికి జైలు శిక్ష విధించారు. ఈ ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవింగ్ కార్యక్రమం ద్వారా ద్విచక్రవాహనాలు–384, త్రీ వీలర్ వాహనాలు–20, ఫోర్ వీలర్ వాహనాలు–79, హెవీ వెహికిల్స్–07 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు మొత్తం 199 డీడీ కేసులు పరిష్కారమయ్యాయని, అందులో 187 మందికి జరిమానా, 12 మందికి జైలుశిక్ష విధించారని పోలీసులు వివరించారు.

నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఉద్యాన వన శాఖ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హార్టికల్చర్ షో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- ఈపీటీఆర్ఐ ఆధ్వర్యంలో స్కెకింగ్, రీస్కెలింగ్ థీమ్‌తో కొండాపూర్‌లోని పాలపిట్ట స్కెలింగ్ పార్క్‌లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్కెలింగ్ ఈవెంట్ జరుగుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ హాల్‌లో దసరా పండుగ ప్రత్యేకంగా హ్యాండ్‌లూమ్ ఇండియా పేరిట స్వచ్ఛమైన ఫైబర్ సిల్క్ ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్కల్పచర్స్, స్టేకిడ్ స్టోరీస్ , డీప్ ఇంటీరియర్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ గఫార్ ఖాన్ కాలనీలోని లేబుల్స్ ది పాప్ అప్ స్పేస్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఖిజార్ స్కిల్స్ సోలో ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

అక్రమ నిర్మాణాలకు అడ్డేదీ?

టీజీ–బీపాస్ అమల్లో ఉన్నా ఆగని దందా!

- పట్టించుకోని పర్యవేక్షకులు.. సిబ్బంది చేతివాటం
- అవినీతిమయంగా టౌన్‌ప్లానింగ్ విభాగం
- జిల్లా అదనపు కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపాలని వినతి



మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్...

సాక్షి, సిటీబ్యూరో: టౌన్ ప్లానింగ్ కాదు, అది అవినీతి ప్లానింగ్.. అక్రమ నిర్మాణాలకు అడ్డులేదు.. సిబ్బంది చేతివాటానికి అదుపులేదు.. ప్రభుత్వం పురపాలికల్లో టీజీ–బీపాస్ అమల్లోకి తెచ్చినా అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఇంటి నిర్మాణాలు, స్థలమార్పిడి కోసం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించకుండానే అధికారులు అనుమతులిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఏడు పురపాలక సంఘాల్లో విలీనమైన పంచాయతీల్లోని నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు, వ్యాపార వాణిజ్య సదుపాయాలకు సంబంధించిన కట్టడాల్లో అక్రమాలకు అంతులేదనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. తద్వారా ఆస్తిపన్ను అసెస్‌మెంట్ లెక్కింపులో తప్పిదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 16 పుర పాలికల్లో జనవరి నుంచి ఇప్పటి వరకు 6,947 దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రతీ పురపాలక సంఘంలోనూ నెలకు 20 నుంచి 45 ఇంటి నిర్మాణాలు, స్థలమార్పిడి కోసం దరఖాస్తులు వస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

కనుసన్నల్లో...

గతంలో నిబంధనలకు విరుద్ధంగా ఉండే దరఖాస్తులను సంబంధిత అధికారులు తిరస్కరించేవారు. అయితే బీపాస్ ద్వారా అన్ని దరఖాస్తులు సులువుగా పరిష్కారం అవుతుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసెస్‌మెంట్ లెక్కింపులో కొందరు ఉద్యోగులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలు పాటించని ఇళ్లకూ కొందరు పర్యవేక్షణాధికారులు ఆమోదం తెలుపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. భారీ భవనాలు, వాణిజ్య సముదాయాలకు కొలతలు తక్కువ చేసి అనుమతులు మంజూరు చేస్తున్నారనే వాదనలు వినవస్తున్నాయి. పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో ఉన్న వ్యాపార, వాణిజ్య కేంద్రాల భవనాలకు కూడా రెసిడెన్షియల్ అసెస్‌మెంట్ చేస్తున్నట్లుగా విమర్శలు వస్తున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రధానంగా పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట, జవహర్‌నగర్, కొంపెల్లి, దుండిగల్, దమ్మాయిగూడ, నాగారం, తూముకుంట, మేడ్చల్, పోచారం, ఎల్లంపేట్, అలియాబాద్, ఎంసీ పల్లి, ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి పురపాలక సంఘాల్లో ఇష్టారీతిన ఆక్రమణల పరంపర కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చేతివాటం ప్రదర్శిస్తున్న పుర సిబ్బంది...

75 నుంచి 120 గజాల్లోపు ఇళ్ల పత్రాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలి. ఈ వ్యవహారాన్ని పట్టణ ప్రణాళిక విభాగం పర్యవేక్షించాలి. ఆ తర్వాత ఇంటి కొలతల ఆధారంగా అసెస్‌మెంట్ లెక్కింపునకు యజమానులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్ వదలాలి. నిర్దేశించిన కొలతల ఆధారంగా ఇళ్ల నిర్మాణాలు జరగాలి. భవన నిర్మాణదారులు అవేమీ పట్టించుకోకుండా ఇష్టారీతిన నిర్మాణాలు చేపడుతున్నారు.

అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా..

జిల్లాలో నాలుగు పురపాలక సంఘాలకు ఒక టౌన్ ప్లానింగ్ అధికారి బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది. కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేసినా సరిపడా ఉద్యోగులను నియమించలేదు. కనీసంగా మంజూరు పోస్టులు భర్తీ చేయలేకపోతోంది. దీంతో ఉన్న ఉద్యోగులు, సిబ్బంది పైనే అదనపు భారం పడుతోంది. నల్లగొండ జిల్లా దేవరకొండ మున్సిపాలిటీ టీపీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీధర్ మేడ్చల్ జిల్లాలోని తూముకుంట, ఎల్లంపేట్, మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపాలిటీలకు ఇన్‌చార్జ్ టీపీఓగా బాధ్యతలు చేపట్టారు. ఒక్కరే ఐదు మున్సిపాలిటీల్లో టీపీఓగా పనిచేయటం వల్ల, దేనికి న్యాయం చేయలేకపోతున్నారు. జిల్లాలోని మిగతా 15 పురపాలక సంఘాల్లో కూడా ఇదే విధానం ఉంది. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోందని స్థానికులు, పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. పురపాలక సంఘాల్లో పెరుగుతున్న అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడకుండా జిల్లా అదనపు కలెక్టర్(లోకల్‌బాడీ) ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తప్పిదాలపై..

పురపాలికల్లో అసెస్‌మెంట్ లెక్కింపులో తప్పిదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. బీపాస్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని టీపీఓలకు సూచిస్తున్నామని.. చెబుతున్నప్పటికీ, ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే అన్న చందంగా ఉంది. అన్నీ సక్రమంగా ఉంటేనే భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తున్నామని, నిబంధనలు అతిక్రమిస్తే పురపాలక చట్టం ప్రకారం సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని పలువురు పుర కమిషనర్లు పేర్కొంటున్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

– విజ్ఞాన్ కాలేజీ ఫ్రెషర్స్ డే వేడుకల్లో మంత్రి పొన్నం



విజ్ఞాన్ కాలేజీలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బండ్లగూడ: విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని, వాటిని ఛేదించేందుకు శ్రమించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ విజ్ఞాన్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఫ్రెషర్స్ డే వేడుకలను కళాశాల చైర్మన్ గౌరీసతీష్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సాంకేతిక నైపుణ్యం పెరిగిపోయిందని, దానిని సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. ఇందు కోసం చేయాలనుకున్న పనిని తరగతి గది నుంచే ప్రారంభించాలని విద్యార్థులకు సూచించారు. అంతకు ముందు విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ రీజినల్ డైరెక్టర్ జయప్రదబాయి, కళాశాల కరస్పాండెంట్ మానస, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి

మంత్రి వివేక్ వెంకటస్వామి



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి వివేక్

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే తెలంగాణ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలిచిందని మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం సాయంత్రం షేక్‌పేట్ డివిజన్‌లోని టోలిచౌకీ సూర్యనగర్ కాలనీలో సీనియర్ కాంగ్రెస్, కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ఎంతగానో ముందుందన్నారు. ఎన్నికల హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కొక్కటిగా అమలు పరుస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను తమ ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని చెప్పారు. పేద, బడుగు వర్గాలు, దళితులు, మైనార్టీలు కాంగ్రెస్ పక్షాన ఉన్నారన్నారు. రానున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్, సీనియర్ నేత నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న 'పోర్టబుల్ డైనింగ్ టేబుల్'కు పేటెంట్

రాయదుర్గం: ప్రముఖ యాక్సెసరీస్ డిజైనర్, రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు ముప్పిడికి 17వ పేటెంట్ మంజూరైంది. ఈ విషయాన్ని భారతీయ పేటెంట్ కార్యాలయం అధికారికంగా ప్రకటించిందని రాంబాబు ఆదివారం తెలిపారు. డాక్టర్ రాంబాబుతోపాటు గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజీవన్ కుమార్, ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్‌లో బి.డెస్ నాలుగవ సంవత్సరం చదివే విద్యార్థి ఎం.అనిరుధ్‌తో కలిసి ఆయన 'పోర్టబుల్ డైనింగ్ టేబుల్'కు రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ ఇప్పటివరకు 80 జర్నల్స్, 20 అవార్డులు, 8 పుస్తకాలు, 20 క్రాఫ్ట్ డాక్యుమెంట్లతో కూడి విస్తృతమైన క్షేత్ర అధ్యయనం చేసినట్లు ఆయన వివరించారు. 17వ పేటెంట్ సాధించడం పట్ల ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.తేజ్ లోహిత్‌రెడ్డి, ఫ్యాకల్టీ, అధికారులు రాంబాబును అభినందించారు. వినూత్న యాక్సెసరీస్ తయారీలో మరింత ముందుకు వెళ్లాలని, మరిన్ని పేటెంట్లు సాధించాలని ఆకాంక్షించారు.

అలరించే.. ఆనందించే..



మాదాపూర్ శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ పాటలు

మాదాపూర్: శిల్పారామం కళకళలాడింది. సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. మాదాపూర్ శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అర్చన మిశ్రా శిష్య బృందం కథక్ నృత్యప్రదర్శన చేసింది. దీనిలో గణేశవందన, గురువందన, కృష్ణవందన, తీన్తాల్, రాస్ రచట, తరణ, సర్గం, చతురంగ్ తదితర అంశాలను స్వాతి, జాహ్నవి, సంచి, నిహారిక, మీతు, అధిర, రుచిత, ధృవ, ఆనందిని,శ్రీకా, సర్వాణీ, ఆకాంక్ష, సంజన, లిప్సిత, సౌందర్య తదితరులు పాల్గొన్నారు. బొమ్మ బొమ్మత, శరణం భావ, జయ జయ వైష్ణవి, అయిగిరి నందిని అంశాలను సౌందర్య కౌశిక్ శిష్య బృందం శ్రేష్ఠ, సుమన, లాస్య, ప్రవర్ధ, మాన్విత, అరుచి, సహస్ర తదితరులు ప్రదర్శించి అలరించారు. శిల్పారామం సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి సందర్శకులతో కలసి బతుకమ్మ ఆడారు.

డిమాండ్లు నెరవేర్చాలంటూ సినీ కార్మికుల నిరసన



బంజారాహిల్స్: న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ సినీ కార్మికులు ఆదివారం ఫిలిం చాంబర్ ముందు నిరసనకు దిగారు. చట్టవిరుద్ధంగా కార్మికుల భూమిని కాజేయాలని చూస్తున్న వారి అప్రజాస్వామిక చర్యలను తీవ్రంగా ఖండిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కార్మికులు స్పష్టం చేశారు. ఫిలిం ఛాంబర్ నాయకులు, చిత్రపురి కమిటీ, ఫెడరేషన్‌లోని కొందరు నాయకులు సినిమా కార్మికుల విశ్వాసాన్ని దుర్వినియోగం చేస్తూ, చిత్రపురి భూమిని అక్రమంగా విక్రయించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సినిమా కార్మికుల కోసం కేటాయించిన చిత్రపురి భూమిలోని 4,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రస్తుత ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్, మరికొందరు పెద్దలతో కలిసి విలాసవంతమైన ఫ్లాట్లను నిర్మించి వాటిని ఫిలిం చాంబర్‌లోని నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు చదరపు అడుగుకు రూ.7 వేల చొప్పున అమ్ముకోవాలని కుట్ర పన్నారని ఆరోపించారు. దీనికి ప్రభుత్వ అధికారులు, న్యాయవ్యవస్థలోని వ్యక్తులు అండగా నిలుస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. చిత్రపురి కమిటీని రద్దు చేయకుండా, ఎన్నికలు నిర్వహించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఈ పోరాటానికి ఫిలిం చాంబర్, నిర్మాతల మండలిలోని నిజాయితీపరులైన కొందరు మద్దతు తెలుపుతున్నారన్నారు. చిత్రపురిలో ఉన్న భూమిలో కేవలం సినిమా కార్మికుల కోసం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లేదా సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించాలని, ఈ ఫ్లాట్‌ల ధర చదరపు అడుగుకు రూ.3 వేలకు మించకుండా ఉండాలన్నారు. నిరసనలో చిత్రపురి సాధన సమితి, సినిమా కార్మిక సంక్షేమ సమితి, సినిమా 24 సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

నెలలు నిండక ముందే కవలల జననం

మృత్యువుతో పోరాడిన బాలుడిని కాపాడిన వైద్యులు



మృత్యువును జయించిన బాబుతో ఎల్‌బీనగర్ కామినేని వైద్యులు

మన్సూరాబాద్: ఆ దంపతులకు పెళ్లయిన చాలా కాలం వరకు సంతానం కలగలేదు. చివరకు ఐవీఎఫ్‌కు ప్రయత్నించగా కడుపులో కవలలు ఉన్నారని ఆనందించారు. కానీ, ఆరో నెలలోనే ఆమెకు నొప్పులు వచ్చి ఉమ్మనీరు తగ్గింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఆ దంపతులు ఆందోళనతో నగరానికి వచ్చి ప్రసవం చేయించుకున్నారు. కవల పిల్లలకు తీవ్రమైన ఇన్ఫెక్షన్ ఉండటంతో పుట్టిన రెండవ రోజే ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తీసుకవచ్చారు. మొదటి వారానికే తీవ్రమైన ఫంగల్ ఇన్ఫెక్షన్, కిడ్నీ సమస్యలతో ఒక బాలుడు మృతిచెందారు. రెండో బాబును రక్షించేందుకు కామినేని వైద్యులు రెండు నెలలపాటు వెంటిలేటర్స్‌పై ఉంచి చికిత్స అందించారు. మూడు నెలలపాటు బాబు మృత్యువుతో పోరాటం చేసి చావును జయించాడు. ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్ కన్సల్టెంట్ పిడియాట్రిషియన్, నియోనాటాలజిస్ట్ డాక్టర్ ఆర్‌వీ సౌజన్య ఆదివారం విలేఖరులకు వివరాలను వెల్లడించారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

యువ వైద్యులకు నిపుణుల సూచన



ఈఎన్‌టీ సదస్సులో పాల్గొన్న నిర్వాహకులు, యువ వైద్యులు

గాంధీఆస్పత్రి: యువ వైద్యులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని దేశ వైద్య రంగాన్ని ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలపాలని పలువురు వైద్యనిపుణులు సూచించారు. ఈఎన్‌టీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో రెండు రోజులపాటు జరిగిన ఏఓఐటీజీ కాన్ 2025 రాష్ట్ర సదస్సు ఆదివారం ముగిసింది. పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ చెవి, ముక్కు, గొంతు వ్యాధులు, వాటి ఉప విభాగాలపై మరింత విస్తృతమైన చర్చ జరగాలన్నారు. శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించిన సదస్సు యువ వైద్యులకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. యువ వైద్యులు ఆధునిక వైద్యపరిజ్ఞానం అందిపుచ్చుకుంటే రోగులకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ శోభన్ బాబు, ఎలెక్టెడ్ అధ్యక్షుడు డాక్టర్ వెంకటరామిరెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి భూపేందర్‌సింగ్ రాథోడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్, కార్యదర్శి ఆనంద్‌తోపాటు వివిధ రాష్ట్రాల ఈఎన్‌టీ వైద్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ముఫకంజా కాలేజీని సందర్శించిన మలేషియా బృందం



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ముఫకంజా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీని 22 మంది సభ్యుల ఉన్నతస్థాయి మలేషియా ప్రభుత్వ ప్రతినిధి బృందం ఆదివారం సందర్శించింది. మలేసియా వ్యవసాయం, ఆహార భద్రత మంత్రి మొహమ్మద్ సాబు, రక్షణ డిప్యూటీ మంత్రి అడ్లీ జహారీతో పాటు సీనియర్ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. సుల్తాన్–ఉల్–ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావిద్, జాయింట్ సెక్రటరీ ఆమేర్ జావిద్, బోర్డు సభ్యుడు నిసార్ అహ్మద్ తదితరులు మలేషియా బృందానికి స్వాగతం పలికారు. విద్య, వ్యవసాయం, మత్స్య సంపద వంటి కీలక రంగాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. భారతదేశంలో విద్యావ్యవస్థ పనితీరుతోపాటు ముఖ్యంగా సుల్తాన్–ఉల్–ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వహించే ప్రమాణాలను మలేసియా మంత్రులు ఆసక్తిగా పరిశీలించారు. ఇక్కడ విద్యాసంస్థల వైవిధ్యం ఆకట్టుకుందని, విద్య, పరిశోధన రంగాల్లో మలేషియా, భారతదేశం మధ్య సహకారానికి అవకాశాలు ఉన్నాయని బృందం సభ్యులు చెప్పారు. తమ పర్యటన భారతదేశం విద్యా చట్రం గురించిన విలువైన సమాచారాన్ని అందించిందన్నారు.



ఉత్సాహంగా 4కే, 5కే రన్

జగద్గిరిగుట్ట: కొంపల్లి డ్రీమ్ ఫిట్‌నెస్ జిమ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు 4కే, 5కే రన్ ఉత్సాహంగా నిర్వహించారు. దీనిలో సుమారు 150 మంది పాల్గొన్నారు. వైష్ణవి ఎంక్లేవ్ ప్రధాన గేటు నుంచి కొంపల్లి రాయచాందిని మాల్ వరకు వెళ్లి తిరిగి డ్రీమ్ ఫిట్‌నెస్ జిమ్‌కు రన్ చేరుకుంది. అంతకుముందు పేట్ బషీరాబాద్ ఎస్సై మహేశ్వర్‌రెడ్డి జెండా ఊపి రన్ ప్రారంభించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మెడల్ అందజేశారు.

లైంగికంగా వేధిస్తున్నారని కేఏ పాల్‌పై యువతి ఫిర్యాదు

కేసు నమోదు చేసిన పోలీసులు

పంజగుట్ట: ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ మీద పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఓ యువతి తనను లైంగికంగా వేధించాడంటూ షీటీంకు ఫిర్యాదు చేయడంతో వారు పంజగుట్ట పోలీసులకు కేసు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమీర్‌పేటలోని కేఏ పాల్ కార్యాలయంలో ఓ యువతి (24) యూఎస్ కోఆర్డినేటర్‌గా ఆగస్టు 28న ఉద్యోగంలో చేరింది. విధుల్లో ఉండగా కేఏ పాల్ తనను అసభ్యకరంగా తాకాడని, మరీ దగ్గరకు వచ్చి మాట్లాడటంతో పాటు ఫోన్‌కు అసభ్యకరమైన సందేశాలు పంపించారని షీ టీంకు ఆమె ఫిర్యాదు చేసింది. ఫోన్‌కు పంపిన సందేశాలను కూడా ఆధారంగా చూపించింది. వేధింపులకు తాళలేక ఈ నెల 12వ తేదీన ఉద్యోగం కూడా మానేశానని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. షీ టీం వారు కేసును పంజగుట్ట పోలీసులకు అప్పగించడంతో పాల్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కేఏ పాల్ ఎంట్రీ ఇవ్వడంతో విపక్షాలు కలవరపడి భయంతో అడ్డుకునేందుకు ఆయనపై చవకబారు ప్రచారాలు చేస్తున్నాయని ప్రజాశాంతి పార్టీ వాట్సాప్ గ్రూప్‌లో సిబ్బంది మెసేజ్ పెట్టారు. పాల్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తే పరువు నష్టం కేసులు పెడతామని హెచ్చరించారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఏజీవర్సిటీ: కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో స్వాతంత్య్ర సమరయోధుడు, తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి ఆదివారం ఘనంగా జరిగింది. లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ ప్రశాంత్ మాట్లాడుతూ లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటాలు, త్యాగాలను గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్న గొప్ప పోరాటయోధుడన్నారు. లక్ష్మణ్ నేటి తరానికి ఆదర్శప్రాయులని, ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవడమే అసలైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓఎస్ డాక్టర్ కళాధర్ బాబు, అశ్విన్‌కుమార్, శ్రీనివాస్, సంతోషిని, లావణ్య, మమత, జెన్ని, దీపారాణి, శ్రీరాములు, శ్రీధర్‌రెడ్డి, మేఘన, శ్రీధర్ విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణ వారోత్సవాలకు శ్రీకారం



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఖైరతాబాద్: మాజీమంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ సామాజిక తెలంగాణ వారోత్సవాలను కొండా లక్ష్మణ్ బాపూజీ గ్లోబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఆదివారం బాపూజీ వర్ధంతి నుంచి జయంతి వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక చైర్మన్ రాపోలు జ్ఞానేశ్వర్ అధ్యక్షతన ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న బాపూజీ విగ్రహం వద్ద వారోత్సవాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీలు రమణ, అద్దంకి దయాకర్, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అనిల్, రాజ్యసభ మాజీ సభ్యుడు రాపోలు ఆనంద భాస్కర్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, తెలంగాణ బీసీ కమీషన్ మాజీ చైర్మన్‌లు బి.ఎస్.రాములు, వకుళాభరణం కృష్ణమోహన్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు వీజీఆర్ నారగోనితోపాటు పలు బీసీ సంఘాల నాయకులు పాల్గొని బాపూజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్ । సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



దాండియా ఆటలు.. ఆడ.. సరదా పాటలు పాడ అంటూ నగర వ్యాప్తంగా నవరాత్రి వేడుకలకు ఏర్పాటు జరుగుతున్నాయి. వేడుకలను సంబరంగా నిర్వహించేందుకు పలువురు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. మిగిలిన ఈవెంట్స్‌కు భిన్నంగా మొత్తం 10 రోజుల పాటు సందడి కొనసాగడమే నవరాత్రి సంబరాల ప్రత్యేకత. ఈ 10 రోజులూ దాండియా-గర్బా నృత్యాల హోరులో నగరవాసులు మునిగితేలనున్నారు. ఇప్పటికే పలు ప్రముఖ డీజేలు, ఫుడ్ స్టాల్స్‌తో పాటు ఫ్లీ మార్కెట్స్ నిర్వహణకు ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి. సంప్రదాయంతో పాటు ఆధునికతనూ కలగలిపి డిజైన్ చేస్తున్న ఈవెంట్స్ సకుటుంబ సపరివార సమేతంగా అలరించనున్నాయి.

- సాక్షి, సిటీబ్యూరో/ సనత్‌నగర్

సరదా పాటలు.. దాండియా ఆటలు..

నగరంలో నవరాత్రి వేడుకల సందడి

- మోత మోగించనున్న దాండియా బీట్స్
- ఈ నెల 22 నుంచి పుంజుకోనున్న ఈవెంట్స్
- నగరవ్యాప్తంగా కార్యక్రమాలకు ఏర్పాట్లు
- 10 రోజుల పాటు కొనసాగనున్న గర్బా హడావుడి
- డీజేలు, ఫుడ్ స్టాల్స్‌తో పాటు ఫ్లీమార్కెట్స్ సైతం

క్లబ్స్‌తో పాటు, ఫంక్షన్ హాల్స్, ఉద్యానవనాలు, ఓపెన్-ఎయిర్ వేదికలు ఇలా చెప్పుకుంటూ పోతే.. ఎన్నో ఈ దాండియా/గర్బా ఈవెంట్స్‌కు వేదికలుగా మారనున్నాయి. ప్రధానంగా బ్యాండ్ ప్రదర్శనలు, డీజే, ఫుడ్ స్టాల్స్, వంటివి ప్రధాన ఆకర్షణలు కానున్నాయి. టికెట్ ధరల విషయానికి వస్తే కొన్ని ఈవెంట్స్ బడ్జెట్-ఫ్రెండ్లీగా ఉంటే, సగటున రూ.500 ధరలో అందుబాటులో ఉన్నాయి. అయితే ఏదైనా పెద్ద ఈవెంట్స్, సెలబ్రిటీ ప్రదర్శనలు ఉంటే లేదా ప్రీమియం వేదిక అయితే ధరలు ఇంకాస్త ఎక్కువగా ఉండొచ్చు. ఈ ఈవెంట్స్ సెప్టెంబర్ 20 నుంచి ప్రారంభమై, నవరాత్రి ముగిసే వరకు కొనసాగుతాయి. ఈ నేపథ్యంలో నగరంలో జరిగే కొన్ని కార్యక్రమాల గురించిన సమాచారం ఇది..

ఓపెన్ ఎయిర్ వేడుక..

నగరంలోని అతిపెద్ద ఓపెన్-ఎయిర్ వేదిక అయిన జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో హైదరాబాద్ దాండియా ఉత్సవ్ జరుగుతుంది. ఇది 10 రోజుల పాటు నృత్యం, సంగీతం సహిత వేడుకలను అందిస్తుంది. ఈ నెల 23వ తేదీన సాయంత్రం 6.30 గంటల నుంచి నిర్వహిస్తున్నారు. ఓపెన్-ఎయిర్ సెటప్, లైవ్ బ్యాండ్ ప్రదర్శనలు, ఫుడ్ స్టాల్స్, మొత్తం ఫెస్టివ్ అలంకరణతో ప్రాంగణం కనువిందు చేస్తుంది.



కన్వెన్షన్ సెంటర్స్‌లో..

- బేగంపేట్‌లోని చిరాన్ ఫోర్ట్ క్లబ్‌లో ఎస్‌కే నవరాత్రి ఉత్సవ్ పేరిట ఈ నెల 22న రాత్రి 7గంటల నుంచి ప్రారంభం అవుతుంది. హైదరాబాద్ బిగ్గెస్ట్ దాండియా ధమాల్‌గా నిర్వాహకులు అభివర్ణిస్తున్న ఈ ఈవెంట్‌లో డీజే దాన్ సింగ్ ఓ ఆకర్షణ. ఫుడ్, పానీయాలు, బహిరంగ వినోద వేదికలు.. సిద్ధం చేశారు.
- మాదాపూర్‌లోని యూలో ఎరీనాలో నవరాత్రి దాండియా మహోత్సవ్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 22 రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఈవెంట్‌లో బాలీవుడ్ డీజే మ్యూజిక్ అందిస్తున్నారని నిర్వాహకులు ప్రకటించారు.
- పీర్జాదిగూడలోని శ్రీ పలణి కన్వెన్షన్స్‌లో ఈ నెల 22న దాండియా మహోత్సవ్ సీజన్ 3 పేరిట నిర్వహిస్తున్నారు. కుటుంబ సమేతంగా అలరించేలా తమ ఈవెంట్ ఉంటుందని నిర్వాహకులు అంటున్నారు. ఈ ఈవెంట్ సాయంత్రం 6గంటలకు ప్రారంభం కానుంది.
- ఈసారి ఈ ఈవెంట్‌ను ఫ్లీ మార్కెట్‌తో మేళవించి అందిస్తున్నారు. బైరమల్‌గూడలోని ఎడుకంటి రామ్ రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించే రస్ గర్బా వాల్యూమ్ 7 ఫ్లీ మార్కెట్ అండ్ ఎక్స్‌పో.. ఓ వైపు నవరాత్రి సంబరాల నృత్యాలతో పాటు షాపింగ్, ఫుడ్.. వంటివి మేళవిస్తోంది. మొత్తం 3 రోజులపాటు కొనసాగే ఈ ఉత్సవం ఈ నెల 27వ తేదీన సాయంత్రం 5గంటలకు ప్రారంభమవుతుంది.
- ఉప్పల్‌లోని శ్రీ పళణి కన్వెన్షన్స్‌లో ఈ నెల 22 రాత్రి 7గంటల నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకూ దాండియా సంబరాలు కొనసాగనున్నాయి. మొత్తం 10 రోజుల పాటు సాగే ఈ సంబరాల్లో లైవ్ ఢోల్, డీజే షోస్, ఫుడ్ స్టాల్స్, సెలబ్రిటీల రాక.. వంటివి ఉంటాయని నిర్వాహకులు అంటున్నారు.



డీజేలు, సెలబ్రిటీ ఈవెంట్లు..

- కొంపల్లిలోని జీబీఆర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తరంగ్ నైట్స్ పేరిట దాండియా నైట్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 27వ తేదీన సాయంత్రం 4.30గంటలకు ప్రారంభం కానుంది. గర్బా, దాండియా నృత్యాలు, ఫొటోగ్రఫీ అవకాశాలు.. ఉంటాయని నిర్వాహకులు చెబుతున్నారు.
- నోవోటెల్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో సెలబ్రిటీ దాండియా నైట్స్ నిర్వహిస్తున్నారు. లైవ్ మ్యూజిక్, డీజేలు, సెలబ్రిటీల ప్రదర్శనలు, ఫుడ్ స్టాల్స్ ఉంటాయి.
- గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో 11 రోజుల పాటు డోలా రే డోలా పేరిట నవరాత్రి దాండియా మహోత్సవ్ నిర్వహిస్తున్నారు.
- సంప్రదాయ గర్బాను డిస్కో లైట్లు, ఆధునిక సంగీతంతో మిళితం చేసే డిస్కో దాండియా ఏఎమ్‌ఆర్ ప్లానెట్ మాల్‌లో జరుగుతుంది. ఇది ఒక ప్రత్యేకమైన ఫ్యూజన్ ఈవెంట్ అని నిర్వాహకులు ప్రకటిస్తున్నారు.
- నవరాత్రి ఉత్సవాలకు పేరొందిన నామ్‌ధారి గౌరవ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో శంషాబాద్‌లోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో నవరాత్రి ఉత్సవ్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తారు.

బుకింగ్స్.. ప్లానింగ్స్..

- ప్రత్యేక రోజుల్లో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది కాబట్టి ముందుగానే బుక్ చేసుకోవడం మంచిది.
- కుటుంబ సమేతంగా హాజరయ్యేవారు వేదికల సమాచారం, పార్కింగ్ సౌకర్యం, వాతావరణ పరిస్థితులు వంటి విషయాలు ముందుగా సరి చూసుకుని ప్లాన్ చేయడం అవసరం.
- నృత్యాలు చేసే అలవాటు ఉంటే అలసిపోయే అవకాశం ఉంది. కాబట్టి ఇంటికి దగ్గరలోని ఈవెంట్ ఎంచుకుంటే బెటర్.
- కొన్ని ఈవెంట్స్‌లో థీమ్ నైట్‌లు ఉంటాయి. కాబట్టి హాజరయ్యే ఈవెంట్‌కి సంబంధించి థీమ్/డ్రెస్ కోడ్ ఉంటే వాటి వివరాలు ముందుగా తెలుసుకోవడం అవసరం.
- ప్రస్తుతం వాతావరణ మార్పులు అనూహ్యంగా ఉంటున్నాయి కాబట్టి ఒకవేళ వాతావరణం అనుకూలించకపోతే ఈవెంట్ రద్దయ్యే పరిస్థితుల్లో సందర్శకులకు ఎటువంటి సౌలభ్యాలు ఉన్నాయో చెక్ చేసుకోవాలి.
- టికెట్ కొనుగోలుకు బుక్ మై షో, హై యాపె, డిస్ట్రిక్, టిక్కెట్స్ 99 వంటి అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే ఉపయోగించడం మేలు.



- స్ట్రీట్ కాజ్ పేరిట 21న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో దాండియా నైట్స్ జరుగనుంది.
- 22 నుంచి అక్టోబర్ 2 వరకు గచ్చిబౌలి సంధ్యా కన్వెన్షన్‌లో ఢోలా రే ఢోలా పేరిట మెగా ఫెస్ట్.
- నాగోలు శ్రీరాంగార్డెన్స్‌లో 27, 28 తేదీల్లో దాండియా ఢోల్ భాజే పేరిట వేడుకలు.
- నగరంలోని టీబీఏ వేదికగా 22న నవరాత్రి బతుకమ్మ, దాండియా నృత్యాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- సోమాజీగూడ ది పార్క్ హోటల్‌లో 24 నుంచి అక్టోబర్ 2 వరకు డిస్కో దాండియా.
- నాగోలు శుభం కన్వెన్షన్ సెంటర్‌లో 27న నాచో దాండియా పేరిట నవరాత్రి ఉత్సవాలు.
- బేగంపేట చిరాన్‌పోర్ట్‌లో 22 నుంచి అక్టోబర్ 2 వరకూ పది రోజుల పాటు నవరాత్రి ఉత్సవ్ పేరిట హైదరాబాద్ బిగ్గెస్ట్ దాండియా ధమాల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.





ఇండీ పప్పీ దత్తత మేళా

ప్రదర్శనలో 27 కుక్క పిల్లలు, 16 దత్తత | జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహణ

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన ఇండీ పప్పీ దత్తత మేళా కార్యక్రమానికి జంతు ప్రేమికుల నుంచి భారీ స్పందన వచ్చింది. కేబీఆర్ పార్కులో ఏర్పాటు చేసిన ఈ మేళాలో మొత్తం 27 కుక్క పిల్లలను ప్రదర్శనకు ఉంచగా, ఔత్సాహికులు ముందుకొచ్చి వాటిలో 16 కుక్క పిల్లలను దత్తతకు తీసుకున్నారు. ఆరోగ్యంగా ఉన్న అందమైన దేశీ కుక్క పిల్లలను ఈ మేళాలో ప్రదర్శించినట్లు జీహెచ్ఎంసీ చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ వకీల్ తెలిపారు. దత్తత తీసుకున్న వీటిని కుటుంబ సభ్యుల్లా ఆదరించాలని ఆయన కోరారు. పలువురు ఔత్సాహికులు ఈ మేళాకు హాజరై ఆసక్తిగా తిలకించారు. కుటుంబ బంధాలను మరింత బలపరిచే ఈ ప్రయత్నాన్ని అందరూ ప్రోత్సహించాలని, జంతువులపైన మనుషుల మాదిరిగా ప్రేమాభిమానాలు చూపడం ప్రశంసనీయమని వకీల్ కొనియాడారు. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చక్రపాణి రెడ్డి, ఖైరతాబాద్ వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వివేకానంద్, వెటర్నరీ అధికారులు డాక్టర్ ప్రసన్న, భీక్యా, సంజయ్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆకట్టుకున్న మానస్-2025 ఓనం

మలయాళీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ



శేరిలింగంపల్లి : సంప్రదాయ మలయాళీలు దుస్తులు ధరించి, రంగురంగుల రంగోలి వంటి కార్యక్రమాలతో 'మానస్-2025' వేడుకలు నిర్వహించారు. స్థానిక మలయాళీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మలయాళీ ఆరాధ్య పర్వదినం 'ఓనం' వేడుకలు శేరిలింగంపల్లిలోని నల్లగండ్లలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవుడి వేషధారణలో ఓ వ్యక్తి అందరినీ ప్రత్యేకంగా ఆకర్షించారు. ఓనం వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించడం సంతోషకరమని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో యేటా నిర్వహించాలని, ఎలాంటి సమస్యలున్నా అసోసియేషన్ సభ్యులు తనని సంప్రదించొచ్చని హామీ ఇచ్చారు. మంత్రిప్రగడ సత్యనారాయణ, వేణుగోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హరిదాస్, మనికాంత్ తదితరులు పాల్గొన్నారు.

చల్లగా.. చక్కగా..

మంచు పొరలపై బతుకమ్మ, దాండియా సంబరాలు



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఆట, పాటలతో బతుకమ్మను పూజిస్తారు. గుజరాతి, రాజస్థానీలు దుర్గాదేవిని పూజించే క్రమంలో దాండియా నృత్యాలు చేస్తారు. దసరా నవరాత్రుల సందర్భంగా కొండాపూర్ శరత్ సిటీమాల్‌లోని స్నో కింగ్డమ్ ఆధ్వర్యంలో బతుకమ్మ, దాండియా సంబురాలను ఒకే వేదికపై చేపట్టారు. మంచు కొండలు, మంచుతో కప్పిన ప్యాలెస్‌లు, బ్లాక్ సీల్స్, ఇగ్లూ, ఓక్ చెట్లు, ధృవపు ఎలుగుబంట్ల సెట్ల మధ్య ఈ ఉత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఇవి 11 రోజుల పాటు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

- సాక్షి, సిటీబ్యూరో



అచ్యుత గోపి లైవ్

స్పిరిచ్యువల్ కాన్సర్ట్

◆ అక్టోబర్ 4న నగరంలో నిర్వహణ



లక్డీకాపూల్ : తన జీవితంలోకి వెలుగు తెచ్చిన కృష్ణ, గోవింద అంటే ఎప్పటికీ తనకు అపార భక్తిభావమని ఆధ్యాత్మిక గురువు అచ్యుత గోపి అన్నారు. భారత యాత్ర సందర్భంగా తన అమృతగానంతో నగర సంగీత ప్రియులను అలరించనున్నారు. ఈ క్రమంలో చల్ మన్ బృందావన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అచ్యుత గోపి లైవ్ స్పిరిచ్యువల్ కాన్సర్ట్' కార్యక్రమంలో ప్రఖ్యాత గాయని అయిన గోపి పలు భక్తి గీతాలు, భక్తిపూరిత సంగీతంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్ నోవోటెల్‌వేదికగా ఆదివారం నిర్వహించిన వర్చువల్‌మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కృష్ణ ఎంచుకున్న ప్రజల మధ్య జీవిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. రాధాకృష్ణుల జీవితంలోని గొప్ప విషయాలు, నేర్చుకోదగిన అంశాలను ఆమె వివరించారు. భగవద్గీత గొప్పతనం, భాగవతం, భారత సంప్రదాయం, సంస్కృతి గొప్పదనం గురించి వివరించారు. హైదరాబాద్ రావడానికి చాలా ఉత్సాహంగా ఉన్నానని అన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజల్లో భక్తిభావం వెల్లివిరుస్తోందని, హైదరాబాద్‌లో కాన్సర్ట్‌చేయడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని అచ్యుత గోపి పేర్కొన్నారు. మరో పదిహేను రోజుల్లో తెలుగు ప్రజలను కలుస్తానన్నారు. అక్టోబర్ 4న గచ్చిబౌలిలో జరిగే కార్యక్రమంలో ఆధ్యాత్మిక, సంగీత ప్రియులను అలరించనున్నట్లు తెలిపారు. 'చల్ మాన్ బృందావన్' సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ ఈవెంట్‌ని ఆధ్యాత్మికత, సంగీతం కలగలిసిన మరో మరపురాని అనుభవాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు అచ్యుత గోపి తెలిపారు.



సైక్లింగ్ అండ్ రీసైక్లింగ్

ఆరోగ్యకరమైన విశ్వం కోసం..

గచ్చిబౌలి: ఆరోగ్యకరమైన విశ్వం కోసం 'సైక్లింగ్ అండ్ రీసైక్లింగ్' అనే థీమ్‌తో ఈపీటీఆర్ఐ (ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) విదేశీయులతో సైక్లింగ్ నిర్వహించింది. కొండాపూర్‌లోని పాలపిట్ట సైక్లింగ్ పార్క్‌లో ఈపీటీఆర్‌లో శిక్షణ కోసం వచ్చిన డెలిగేట్స్ ఆదివారం సైక్లింగ్ చేశారు. ఈ నెల 30 వరకు గచ్చిబౌలిలోని ఈపీటీఆర్‌లో విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్'లో అంతర్జాతీయ శిక్షణ ఇస్తున్నారు. 20 దేశాలకు చెందిన 35 మంది శిక్షణకు హాజరయ్యారు. వీరంతా సైక్లింగ్ చేసి కాసేపు సేదదీరారు. టీజీఎఫ్‌డీసీ ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ తనుజ ఈ సైక్లింగ్ ఏర్పాట్లు చేశారు. ఈపీటీఆర్ఐ క్లైమైట్ చేంజ్ ట్రైనింగ్ సెంటర్ హెడ్ రాజేశ్వర్‌రావు, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ ప్రవీణ్, రిసెర్చ్ ఫెలోషిప్ భాస్కర్ నాయక్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

25న అల్పపీడనం

- తదుపరి 24 గంటల్లో బలపడి తూర్పు మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం
- రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: తూర్పు మధ్య బంగాళాఖాతం..దాని సమీపంలోని ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో ఈ నెల 25న అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది క్రమంగా బలపడి 24 గంటల తర్వాత పశ్చిమ వాయవ్య దిశలో కదిలి.. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర కోస్తా తీరం సమీపంలో వాయుగుండంగా మారొచ్చు. ఇది దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర కోస్తా తీర ప్రాంతంలో ఈ నెల 27వ తేదీ ఉదయంకల్లా తీరాన్ని దాటే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ వెల్ల డించింది. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు కొనసా గుతుంది. ఈశాన్య ఉత్తరప్రదేశ్, సమీప బిహార్ ప్రాంతంలో ఉపరితల చక్రవాత ఆవర్తనం పశ్చిమ విదర్భ వరకు కొనసా గుతుంది. వీటి ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

25 శాతం అధిక వర్షపాతం

ప్రస్తుత నైరుతి రుతుపవనాల సీజన్ సంతృప్తికర వర్షాలనే నమోదు చేసింది. నైరుతి సీజన్‌లో ఈనెల 21వ తేదీ నాటికి 69.78 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 87.44 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 25% అధికంగా నమోదైనట్టు రాష్ట్ర ప్రణాళిక శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

- నైరుతి సీజన్‌లో ఇప్పటివరకు మెదక్, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 18 జిల్లాల్లో అధిక వర్షపాతం, 11 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.
- మండలాల వారీగా పరిశీలిస్తే... 103 మండలాల్లో అత్యధిక వర్షపాతం, 272 మండలాల్లో అధిక వర్షపాతం, 2,333 మండలాల్లో సాధారణ వర్షపాతం, 13 మండలాల్లో మాత్రం లోటు వర్షపాతం నమోదైంది.

ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే పంజాబ్, రాజస్తాన్ రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాల్లో రుతుపవనాల ఉపసంహరణ పూర్తయ్యింది. ఈ సమయంలో రుతుపవనాల కదలికలు చురుకుగా ఉండడంతో వానలు సైతం భారీగా నమోదయ్యే అవకాశముంది. ఈ నెల 25న తూర్పుమధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండడంతో రాష్ట్రంలోనూ భారీ వర్షాల నమోదుకు అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది.

మోహన్‌లాల్‌కు అవార్డుపై వైఎస్ జగన్ హర్షం



సాక్షి, అమరావతి: మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్‌కు కేంద్ర ప్రభుత్వం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించటం పట్ల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ఆయనకు అభినందనలు తెలుపుతూ వైఎస్ జగన్ ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. భారతీయ సినీ పరిశ్రమకు మోహన్‌లాల్ చేసిన కృషి శాశ్వతమైనదని.. నటుడిగా ఆయన బహుముఖ ప్రజ్ఞ అసమానమైనదని కొనియాడారు. మోహన్‌లాల్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

స్మృతి మంధానకు అభినందనలు

భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధానకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా కేవలం 50 బంతుల్లోనే సెంచరీ చేసి రికార్డు సృష్టించటంపై వైఎస్ జగన్ హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

లంబాడాలను ఎస్టీల్లో చేర్చి 50 ఏళ్లు

ఇందిర విగ్రహం వద్ద స్వర్ణోత్సవాలు



మాట్లాడుతున్న మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: లంబాడా సామాజిక వర్గాన్ని ఎస్టీల్లో చేర్చి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా బంజారా భారతి ఆధ్వర్యంలో స్వర్ణోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్, మాజీ ఎంపీ రవీందర్‌నాయక్, బంజారా భారతి అధ్యక్షుడు జగన్, అనూష, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. బంజారాలను షెడ్యూల్ ట్రైబ్స్ జాబితాలో చేర్చడం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చలవేనని కొనియాడారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి, సీతక్క, జూపల్లి, ఎంపీ కావ్య తదితరులు



హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మ ఆడుతున్న మేయర్ సుధారాణి, మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, ఎంపీ కడియం కావ్య తదితరులు

రాష్ట్రమంతా సౌభాగ్యంగా ఉండాలి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

హనుమకొండ వేయిస్తంభాల గుడివద్ద ఎంగిలిపూల బతుకమ్మ వేడుక

బతుకమ్మలను ఎత్తుకున్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క

సాక్షి ప్రతినిధి, వరంగల్/ హనుమకొండ కల్చరల్: హనుమకొండ వేయి స్తంభాల ఆలయం వద్ద ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు. అధికారికంగా వేడుకలను ప్రారంభించిన భట్టి.. ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు కాళోజీ కళాక్షేత్రంలో తెలంగాణ సంగీత అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాకతీయ నృత్య నాటకోత్సవాల్లో పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మపై రూపొందించిన నృత్య నాటకాన్ని తిలకించారు.

వేయి స్తంభాల గుడి వద్ద భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంతోపాటు ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ ఉత్సవం మన సంస్కృతీ సంప్రదాయాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ స్నేహ శబరీష్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ అలేఖ్య పుంజాల తదితరులు పాల్గొన్నారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఎంపీ కావ్య, మేయర్ గుండు సుధారాణి బతుకమ్మలు ఎత్తుకొని పాటలు పాడారు.

భూములు, ఆస్తుల ధరలు బూమ్!

- వచ్చే నెల నుంచే కొత్త విలువలు అమల్లోకి?
- ఆదాయం పెంపే లక్ష్యంగా రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తు
- ఖాళీ స్థలాల విలువలు 150 శాతం మేరకు పెరిగే చాన్స్
- అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్ల విలువలు కూడా 50 శాతం పెరుగుదల
- వ్యవసాయ భూముల కనీస విలువ ఎకరం రూ.3 లక్షలుగా ఖరారు
- విలువల సవరణ కోసం సబ్ రిజిస్ట్రార్లకు ప్రత్యేక ఫార్మాట్ పంపిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూముల విలువలు భారీగా పెరగనున్నాయి. ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మరోమారు కసరత్తు చేపట్టింది. ఖాళీ స్థలాల విలువలు 150 శాతం వరకు, అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్‌ల విలువలు 50 శాతం మేర పెరిగే అవకాశం ఉంది. అలాగే వ్యవసాయ భూముల కనీస విలువ ఎకరం రూ.3 లక్షలకు పెరుగుతుందని సమాచారం. నివాస (రెసిడెన్షియల్), వాణిజ్య (కమర్షియల్) ప్రాతిపదికన వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తుల విలువలను భారీగా సవరించే కసరత్తు ఇప్పటికే ప్రారంభమవగా, రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్లందరూ రెండు రోజులుగా ఇదే పనిలో నిమగ్నమయ్యారు. ఆదాయ వనరుల పెంపు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం ఇటీవల స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పనితీరును సమీక్షించింది. ఆదాయ పెంపు ప్రతిపాదనలను 15 రోజుల్లో ప్రభుత్వానికి పంపాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే మరోమారు భూముల విలువల సవరణ కసరత్తు జరుగుతోంది. నాలుగైదు రోజుల్లోనే కొత్త విలువల ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్తాయని, వచ్చే నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి ఈ విలువలు అమల్లోకి వస్తాయని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు చెపుతున్నాయి.

ప్రత్యేక ఫార్మాట్ పంపిన ఉన్నతాధికారులు

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి భాగంలో ఉన్న కోర్ అర్బన్ ఏరియాలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో విలువల సవరణ ప్రక్రియ ఇప్పటికే ఓ కొలిక్కి వచ్చింది. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. తాజాగా అర్బన్, సెమీ అర్బన్‌తో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని విలువల సవరణ కోసం క్షేత్రస్థాయిలోని సబ్ రిజిస్ట్రార్లకు ఉన్నతాధికారులు ప్రత్యేక ఫార్మాట్లు పంపారు. ఈ ఫార్మాట్‌లో భూముల విలువలను సవరించేందుకు అనుసరించాల్సిన ప్రక్రియను వివరించారు.

నేడో, రేపో సబ్ రిజిస్ట్రార్ల ప్రతిపాదనలు

ఉప సంఘం సమీక్షా సమావేశం ముగిసిన మరుసటి రోజే రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు రాష్ట్ర కార్యాలయంలోని ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. మరుసటి రోజు రాష్ట్రంలోని అందరు సబ్ రిజిస్ట్రార్లతో ఆన్‌లైన్‌లో సమావేశమై భూముల విలువల సవరణకు సంబంధించిన మార్గదర్శకాలను వివరించారు. దీంతో సబ్ రిజిస్ట్రార్లంతా నేడో, రేపో తమ ప్రతిపాదనలను మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీలకు సమర్పించనున్నారు. ఈ కమిటీలు ఆ ప్రతిపాదనలు పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు పంపనున్నాయి. వాటిని కలెక్టర్లు పరిశీలించి ప్రభుత్వానికి పంపనున్నారు. ప్రభుత్వం ఆమోదించిన అనంతరం కొత్త విలువలు అమల్లోకి రానున్నాయి.

మహిళలకు స్టాంపు డ్యూటీ తగ్గింపు!

ప్రస్తుతం స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కలిపి రాష్ట్రంలో 7.5 శాతం వసూలు చేస్తున్నారు. పాశ్చాత్య దేశాల్లో భూముల ప్రభుత్వ విలువలను పెంచినప్పుడు డ్యూటీలను తగ్గించడం ఆనవాయితీగా వస్తోంది. ఇదే పద్ధతిని రాష్ట్రంలోనూ అమలు చేయాలని, స్టాంపు డ్యూటీ 1 శాతం తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అయితే భూముల విలువల సవరణ ద్వారా రూ.2 వేల కోట్ల నుంచి రూ.2,500 వేల కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుండగా, స్టాంపు డ్యూటీ 1 శాతం తగ్గిస్తే రూ.1,000 కోట్ల వరకు ఆదాయం తగ్గే అవకాశం ఉండటంతో స్టాంపు డ్యూటీ తగ్గించాలా వద్దా అనే మీమాంస ప్రభుత్వ వర్గాల్లో కొనసాగుతోంది. అయితే మహిళల పేరిట రిజిస్ట్రేషన్లు జరిగితే స్టాంపు డ్యూటీ 1 శాతం తగ్గించే అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది.

విలువల సవరణ ప్రాతిపదికలివే..

వ్యవసాయ భూములు: 1) పూర్తిగా వ్యవసాయానికి మాత్రమే ఉపయోగపడేవి. 2) ఇండ్ల స్థలాలకు కూడా పనికి వచ్చేవి. 3) వ్యవసాయ భూములయినా, ఇండ్ల స్థలాలకు ఉపయోగపడేవి అయినా రాష్ట్ర, జాతీయ రహదారుల పక్కన ఉన్న భూములు.

వ్యవసాయేతర భూములు: 1) నివాసానికి ఉపయోగించే ఖాళీ స్థలాలు (రెసిడెన్షియల్). 2) రాష్ట్ర, జాతీయ రహదారులకు పక్కన ఉన్న స్థలాలు (కమర్షియల్). 3) అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లకు కూడా రెసిడెన్షియల్, కమర్షియల్ వర్తింపజేస్తారు. ఖాళీ స్థలాలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించి బహిరంగ మార్కెట్‌లో ఎంత విలువ ఉందో అందులో 33–50 శాతం వరకు పెంచే వెసులుబాటు కల్పించారు. ఉదాహరణకు ప్రస్తుత ప్రభుత్వ విలువ గజానికి రూ.22,500 ఉన్న చోట బహిరంగ మార్కెట్ విలువ రూ.80 వేల వరకు ఉంటే అందులో 50 శాతం అంటే రూ.40 వేలు పెంచుకోవచ్చు. అదే బహిరంగ మార్కెట్‌లో ఆ భూమి గజం రూ.1.50 లక్షల వరకు ఉంటే దాన్ని రూ.50 వేల వరకు పెంచవచ్చని సబ్ రిజిస్ట్రార్లకు పంపిన ప్రత్యేక ఫార్మాట్‌లో పేర్కొన్నారు. ఖాళీ స్థలాలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న విలువలో కనీసం 60 శాతం నుంచి 150 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయన్నమాట.

యువత చైతన్యానికే 'నమో యువ రన్'

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో కొండా, రాంచందర్ రావు, ఈటల

ఖైరతాబాద్ (హైదరాబాద్): ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినం సందర్భంగా.. దేశవ్యాప్తంగా యువతను చైతన్యపరుస్తూ 'నమో యువ రన్' నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. 'నమో యువ రన్' పేరుతో ఆదివారం నెక్లెస్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వేదికగా 3కె రన్‌ను నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా భారతీయ జనతాపార్టీ, బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన 3కె రన్‌ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన నాయకుడు మోదీ అని అభివర్ణించారు. పదకొండేళ్లుగా దేశంలో సమూల సంస్కరణలు తెస్తూనే ఉన్నారని కొనియాడారు. మోదీ పాలనలో ఒక్క అవినీతి కూడా లేదని స్పష్టం చేశారు. యువతకు అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధిలోకి రావాలని, స్వదేశీ భావజాలంతో ముందుకు వెళ్లాలన్నారు. యువతకు అవకాశాలు మెరుగుపడాలన్నా, దేశ సంపదను ఉపయోగించుకోవాలన్నా.. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రతి ఒక్కరు ఉపయోగించాలన్నారు. భారతదేశంలోని యువశక్తి ఏ దేశంలో లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ప్రేమ్‌సింగ్ రాథోడ్, లంకాల దీపక్‌రెడ్డి, గువ్వల బాలరాజ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డివి బరితెగింపు మాటలు

- మాజీ మంత్రి హరీశ్‌రావు



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న హరీశ్‌రావు, తలసాని

రాంగోపాల్‌పేట్: కండువా కప్పినంత మాత్రాన పార్టీ మారినట్టు కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బరితెగింపు మాటలు మాట్లాడుతున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు ఘాటుగా విమర్శించారు. ఆదివారం సనత్‌నగర్ నియోజకవర్గంలోని రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో ఇటీవల వరద ముంపునకు గురైన బస్తీల్లో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో 1,500 కుటుంబాలకు నిత్యావసర వస్తువుల పంపిణీ చేపట్టారు. అనంతరం హరీశ్ మాట్లాడుతూ పార్టీ మారకపోతే ఎందుకు కండువా కప్పారని ప్రశ్నించారు. పార్టీ మారిన వారే తాము పార్టీ మారామని, కండువా కప్పుకున్నామని ట్విట్టర్‌లో పెట్టుకున్నారని, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ 10 మందిని పార్టీలో చేర్చుకున్నామని చెప్పారని గుర్తు చేశారు. గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మీటింగ్‌లో, సీఎల్పీ మీటింగ్‌లో కూడా వారు పాల్గొన్నారని, ఏఐసీసీ కార్యాలయంలో రాహుల్‌గాంధీకి కలిపించారని చెప్పారు. ఇంత ఓపెన్‌గా కాంగ్రెస్ పార్టీలో చేర్చుకొని కండువా కప్పితే పార్టీ మారినట్టు కాదని చిల్లర మాటలు మాట్లాడటం ఏమిటని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు.

వరద బాధితులను ఆదుకోవడంలో విఫలం

రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు విమర్శించారు. ముఖ్యమంత్రి స్వయంగా మున్సిపల్ శాఖను తన అధీనంలో ఉంచుకున్నా, వర్షాకాలానికి ముందే నాలాల్లో పూడిక తీయకపోవడం వల్లే వరదనీరు బస్తీలను ముంచెత్తిందన్నారు. వరదలతో నాలాల్లో 7,8 మంది కొట్టుకుని పోయి చనిపోయారని ఇది రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. రాష్ట్రంలో వరదల వల్ల నష్టపోయిన వారికి, రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బతుకమ్మ పండుగ వస్తే ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదని, కనీసం పండుగ పూట వీధి దీపాలైనా వెలిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, తలసాని సాయికిరణ్ యాదవ్, కార్పొరేటర్ కుర్మ హేమలత తదితరులు పాల్గొన్నారు.

'ఆల్మట్టి' ఎత్తు పెంపును వ్యతిరేకిస్తున్నాం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్: కర్ణాటక ప్రభుత్వ ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గెల్లి అర్చనారవి ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. కృష్ణా జలాల్లో చుక్క నీటిని కూడా వదులుకోబోమని తేల్చిచెప్పారు. నీటి పంపిణీలో న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఆల్మట్టి డ్యామ్ పెంపు అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున సమర్థులైన న్యాయ నిపుణులతో సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించేందుకు ఢిల్లీ వెళ్తామని ఉత్తమ్ చెప్పారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గోదావరి నీటి హక్కులు తెలంగాణకు దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. గత పాలకులు నిర్లక్ష్యంతో తెలంగాణ నీటి హక్కులను కాలరాశారని ఉత్తమ్ ఆరోపించారు. కృష్ణా నదిలోని 811 టీఎంసీలలో తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రాకు 512 టీఎంసీలు కేటాయించేలా గత బీఆర్ఎస్ పాలకులు లిఖితపూర్వకంగా ఒప్పందం చేసుకున్నారని.. కానీ తమ ప్రభుత్వం వచ్చాక ఇది ఆమోదం కాదని కృష్ణా ట్రిబ్యునల్‌లో వాదనలు వినిపించామని ఆయన గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై విజిలెన్స్, జ్యుడీషియల్, ఎన్‌డీఎస్‌ఏ నివేదికల ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాలనుకున్న ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని పునఃప్రారంభించాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి ఉత్తమ్ చెప్పారు.

ఆల్మట్టి ఎత్తు పెంపుతో పాలమూరుకు మరణశాసనం

మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కర్ణాటక రాష్ట్రం కృష్ణా నదిపై నిర్మించిన ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచుతుండటం వల్ల.. పాలమూరు జిల్లాకు మరణ శాసనం లిఖించినట్లేనని బీఆర్ఎస్ మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫామ్‌హౌస్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆల్మట్టి ఎత్తు పెంపును పార్టీలకతీతంగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆల్మట్టిపై అవసరమైతే ఢిల్లీ దాక పోయి పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడుస్తున్నా పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో పురోగతి కనిపించడం లేదని ఆరోపించారు. మరో 15 రోజుల సమయం ఇస్తున్నామని, ఈలోగా పనులు ప్రారంభించకుంటే పెద్దఎత్తున ఆందోళలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, అంజయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నా ఆరోగ్యం ఆందోళనకరం

- రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధికి వైద్యానికి డబ్బు లేదు
- మరణ వాంగ్మూలం అంటూ ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టులో మాజీ డీఎస్పీ నళిని



సాక్షి, హైదరాబాద్/భువనగిరి: తెలంగాణ ఉద్యమ సమయంలో రాజీనామా చేసిన డీఎస్పీ నళిని రాష్ట్ర ప్రజలనుద్దేశించి ఫేస్‌బుక్ ద్వారా ఆదివారం పంచుకున్న ఒక బహిరంగ లేఖ చర్చనీయాంశమైంది. మరణ వాంగ్మూలం అంటూ పేర్కొన్న ఈ పోస్టులో తన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వివరించారు. ఫేస్‌బుక్ పోస్టులో నళిని పేర్కొన్న ప్రకారం.. 'ఒక అధికారిణిగా, ఉద్యమకారిణిగా, రాజకీయవేత్తగా, ఆయుర్వేద ఆరోగ్య సేవికగా, ఆధ్యాత్మిక వేత్తగా సాగిన నా జీవితం ముగియబోతోంది. నా ఆరోగ్య పరిస్థితి నెల రోజులుగా సీరియస్‌గా ఉంది. 8 ఏళ్ల క్రితం సోకిన రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనే కీళ్ల జబ్బు, రెండు నెలలుగా ఫీవర్ వైరస్‌ల వల్ల తీవ్ర స్థాయికి చేరింది. 2018లో ఈ జబ్బు రాగా, హరిద్వార్ వెళ్లి రాందేవ్ బాబా పంచకర్మ సెంటర్‌లో నెలల తరబడి ఉంటూ నన్ను నేను బాగు చేసుకున్నాను. కానీ ఇప్పుడు నాకు అంత దూరం పోయేంత ఓపిక, డబ్బు లేదు'అని పేర్కొన్నారు.

నా గతమంతా వ్యథాభరితం

'నా గతమంతా వ్యథాభరితం. రాజీనామా ద్వారా నాటి ప్రభుత్వం పన్నిన పద్మవ్యూహంలోంచి బయట పడితే, డిపార్ట్‌మెంట్ నా వెన్నులో సస్పెన్షన్ అనే బల్లెంను కసి తీరా దింపింది. మహర్షి దయానందుని దయవల్ల యజ్ఞ బ్రహ్మగా వీవైపీఎస్ (వేదయజ్ఞ పరిరక్షణ సమితి)సంస్థాపకురాలిగా ఎదిగాను. ఇలాంటి తరుణంలో నేటి సీఎం (రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి) అధికారంలోకి రాగానే నా ఫైల్ తెరిచారు. వారిని కలిసి నా మనసులో మాట చెప్పాను. సస్పెన్షన్‌పై విచారణ చేయించి ఇన్నేళ్లు ఇవ్వకుండా ఎగ్గొట్టిన సబ్సిస్టెన్స్ అలవెన్స్ లెక్కకట్టి (సుమారు రూ.2 కోట్లు) ఇవ్వండి అని ఓ లేఖ ఇచ్చాను. ఆరు నెలల తర్వాత నా పిటిషన్ పొజిషన్ కనుక్కుంటే చెత్త బుట్ట పాలైంది అని తెలిసింది. నా ఆఫీస్ కాపీని మళ్లీ స్కాన్ చేసి పంపినా, స్పందన లేదు. మీడియా మిత్రులకు విజ్ఞప్తి..నేను చస్తే ఎవరూ సస్పెండెడ్ ఆఫీసర్ అని రాయకండి. దేశ ప్రధాని నరేంద్రమోదీని కలవలేక పోయాను. నా మరణానంతరం వారు నా లక్ష్య సాధన కోసం ఏమైనా ఇవ్వాలి అనుకుంటే మా వేదామృతం ట్రస్ట్‌కు ఇవ్వవలసిందిగా మనవి. నా జీవితపు అంతిమ లక్ష్యమైన మోక్ష సాధనను మళ్లీ జన్మలో కొనసాగిస్తాను..సెలవిక మిత్రులారా 'అని నళిని పేర్కొన్నారు.

కుట్రలు చేసే వారిని వదలను


- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



బతుకమ్మను ఎత్తుకుని వస్తున్న కవిత

సిద్దిపేటజోన్/ సిద్దిపేట రూరల్: 'ఇది నా జన్మభూమి. భవిష్యత్తులో ఇదే నా కర్మభూమి కావొచ్చు. ఇక్కడి నుంచే కేసీఆర్ భూకంపం పుట్టించారు. నామీద రాజకీయంగా ఆంక్షలు పెడితే ఏమీ జరగదు. కుట్రలు చేసిన వారిని వదలను'అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. సిద్దిపేట జిల్లాలోని కేసీఆర్ స్వగ్రామమైన చింతమడకలో ఆదివారం సాయంత్రం జరిగిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చింతమడక అంటే చరిత్ర సృష్టించిన గ్రామమని.. ఇక్కడి ముద్దు బిడ్డ కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం సాధించారని అన్నారు. తాను చాలా ఏళ్లు ఇక్కడికి రాలేదని, గత ఏడాది పరిస్థితి వేరేలా ఉండిందని చెప్పారు. కానీ ఈ ఏడాది ప్రత్యేక పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రజలు తనను అక్కున చేర్చుకున్నారని అన్నారు. ఇక్కడికి రావాలన్నా.. ఆంక్షలు ఉన్నాయని, అయితే ఏఊరు ఎవరి జాగీరు కాదని స్పష్టం చేశారు. రాజకీయంగా ఆంక్షలు పెడితే చింతమడకకు మళ్లీ మళ్లీ వస్తా, అలాగే సిద్దిపేటకూ వస్తానని అన్నారు. 'చంద్రునికి మచ్చతెచ్చే పని కొంత మంది చేసింద్రు. అదే విషయం అడిగితే తల్లికి, పిల్లకు పాపింద్రు' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. కుట్రలు చేసే వారిని వదలనని, పురిటి గడ్డ పౌరుషం చూపించి.. వారి భరతం పడతానని స్పష్టం చేశారు. అంతకు ముందు గ్రామంలోని శివాలయంలోను, రామాలయంలోను ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిపాడారు.

ప్రసార భారతి మాజీ సీఈవో కేఎస్ శర్మ కన్నుమూత



సనత్‌నగర్/బంజారాహిల్స్: (హైదరాబాద్): ప్రసార భారతి మాజీ సీఈవో, విశ్రాంత ఐఏఎస్ అధికారి కంభంపాటి సుబ్రహ్మణ్య శర్మ (80) ఆదివారం బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఆయన నివాసంలో కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా శర్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన కేఎస్ శర్మ దూరదర్శన్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. ఆ తర్వాత ప్రసార భారతి సీఈవోగా 2006 వరకు సేవలు అందించారు. దూరదర్శన్ డైరెక్ట్ టు హోమ్, డీడీ డైరెక్ట్ ప్లస్ లాంటి సేవలను తీసుకురావడంలో శర్మ కీలకపాత్ర పోషించారు. ఆయన కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా కూడా సేవలందించారు. అంతేకాకుండా శ్రీవేంకటేశ్వర భక్తి చానెల్ వ్యవస్థాపక సీఈవోగా, మాజీ ప్రధానమంత్రి, దివంగత పీవీ నరసింహారావు కార్యాలయంలో ముఖ్య అధికారిగా, కేంద్ర విద్యాశాఖ కార్యదర్శిగా, నవోదయ విద్యాలయాల స్థాపకుడిగా ఆయన సేవలు మరువలేనివి. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తెలంగాణ భవన్‌లో బతుకమ్మ సంబురాలు



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు తెలంగాణ భవన్‌కు తరలి వచ్చారు. బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సంబురాలు నిర్వహించారు. అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, బీఆర్ఎస్ మహిళా విభాగం నేతలు తుల ఉమ, సుశీలారెడ్డి, సుమిత్రానంద్ తనోబ, పావనిగౌడ్ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

సందడి లేని యాదగిరి క్షేత్రం

అమావాస్య కావడంతో తగ్గిన భక్తులు



నిర్మానుష్యంగా ఉత్తర మాడ వీధి

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ తగ్గింది. ఆదివారం వస్తే చాలు భక్తులతో కిటకిటలాడే ఆలయ పరిసరాల్లో సాధారణ పరిస్థితులు కనిపించాయి. అమావాస్య కావడం.. బతుకమ్మ వేడుకలు ప్రారంభం కావడంతో ఆయా ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీంతో శ్రీస్వామివారి ధర్మ దర్శనానికి 30 నిమిషాల సమయం పట్టింది. శ్రీస్వామి వారిని 18 వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం కొద్దిగా భక్తులు కనిపించినా.. సాయంత్రం సమయంలో ఆలయ పరిసరాలు వెలవెలబోయాయి. శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.13,76,057 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

సన్నిధి





"సానుకూలమైన ఆలోచనలు సంక్షేమానికి, విజయానికి అవసరమైన శక్తిని ఇస్తాయి. ఒత్తిళ్లను తగ్గిస్తాయి. మంచి హార్మోన్లను విడుదల చేసి, శారీరక, మానసిక ఆరోగ్యాలకు దోహదం చేస్తాయి. అందుకే గొప్పగా ఆలోచించాలి. పెద్ద పెద్ద కలలు కనాలి. ఉన్నత లక్ష్యాలను మనసులో నాటుకోవాలి."

వంద పూలై విరిసే జ్ఞాపకాలు!

జ్ఞాపకాలు గతం ఇనప్పెట్టెలో భద్రంగా ఉంటాయి. దాని మూత తీయాలని అనుకున్నప్పటి నుండి మానసిక వైబ్రేషన్‌కు గురవుతాం. చిన్ననాటి స్మృతులు ముసురుకుంటాయి. సాధారణంగా పదేళ్ళ వరకు బాల్యదశ ఉంటుంది. ఈ స్లాట్ మనిషికి స్వర్ణయుగం. ప్రతిక్షణం కుటుంబంలో, సమాజంలో, వీధిలో, ఊరిలో, బడిలో, పక్కింట్లో ప్రతిచోట ప్రతి అనుభవం గుండె గోడలమీద బొమ్మ కడుతుంది. నలుపు తెలుపు రంగుల్లో సినిమా రీల్‌లాగా గర్‌గర్ మని ఒక్కో సంఘటన మనసు తెర మీద కదలాడుతుంది.

ఒక పండగని జ్ఞాపకం అయితే మరింత సంబరం. పూలదొంతర అల్లాలంటే ఒళ్ళంతా పులకరింతే. గత పరిమళాల జల్లుల్లో తడిసి ముద్దవడమే. బతుకమ్మ పండుగ రంగుల హరివిల్లుల్ని తెంపి వెన్నెల్లో ఆరేసి, వర్షంలో తడిసిన మట్టి సుగంధాలలో నానబెట్టి, కొత్త రంగురంగుల కాంతి తరంగాలని వాటికి పట్టించి నూటొక్క మొగ్గల్ని, పూలని, ఆకుల్ని తొడిగిన పూగుత్తుల్ని పేర్చాలంటే అంత సులభం కాదు. ఇలాంటప్పుడే గత అవిస్మృత ఖజానా విలువ తెలుస్తుంది. పూలను పరిరక్షించే ఇనప్పెట్టె తయారు కానందుకు బాధ. పుప్పొడిలా రాలిన కనబడని కన్నీటి తుంపరల్ని ఎలా, ఎక్కడని దాచగలం.

మాది ఊరు కాని ఊరు. పట్టణంలో ఒదిగి ఉన్న ఊరు. వరంగల్ జిల్లాలోని హనుమకొండ. మా ఇంటి చుట్టూరా అనేకానేక చిన్నా పెద్దా ప్రాచీన గుళ్ళు, చారిత్రక ప్రదేశాలు. ఇంటికి కాస్త దూరంలో మూడు పెద్ద గుట్టల మధ్య పద్మాక్షి గుడి. గుడి కింద నీటి గుండం. అందులో బంగారు జింక ఆకర్షణలా తామరాకులు, పూలు! గుట్టల మీద సీతాఫలాలే కాదు, ఎన్నో రకాల పూలు, గునుగు పూలు, తంగేడు, గన్నేరు పూలు... ఎన్నెన్నో.



మా ఇంట్లో నాకన్నా చిన్నది చెల్లెలు. ఇంటి పక్కన పాటకుల ఇంట్లో ఓ చిట్టెమ్మ. ఇంటి పక్కల చుట్టాలు, పరిచయస్తుల ఇళ్ళల్లో ఆడపిల్లలు. వీళ్ల బొడ్డెమ్మ ఆడేవాళ్ళు.

భాద్రపదం ప్రకృతి పచ్చదనానికి గర్భశివు. ఈ మాసం ప్రకృతి పరవశించే నిండు చూలాలు. బొడ్డెమ్మ వస్తుందంటేనే పూలవేట షురువయ్యేది. ఆడపిల్లల్ని బొడ్డి అంటారు. బొడ్డి అంటే చిన్నది అని అర్థం. ఈ ఆడపిల్లలు ఆడే బొడ్డెమ్మ ఒక ప్రత్యేక పండగ.

ఎవరి ఇంట్లోనూ పదిమంది ఆడే ఆట స్థలం ఉండేది కాదు. గుడిలోనో, ఏదో ఒక బహిరంగ ప్రదేశంలోనో వాళ్ళు వెదురుతో చేసిన చిన్న చిన్న సిబ్బుల్లో పూలు పట్టుకుని అక్కడికి చేరేవారు. అక్కడ కుమ్మరాయన మట్టితో బొడ్డెమ్మ గద్దె తయారు చేసేవాడు. కిందివైపు పెద్దగా పైపైపు చిన్న ఆకారంతో మట్టితో చతురస్రాకారంతో గద్దె కట్టేవాడు. దానికి నాలుగు దిక్కులా ప్రమిదలు పెట్టేవాడు. దానిలో రోజుకొక్కరు 9 రోజులు 9 ఇళ్ళలోంచి నూనె తెచ్చేవారు. దాని చుట్టూ రోజూ కొత్తగా ముగ్గులు వేసేవారు.ఈ పనంతా బాలికలే చేసేవారు.

ఊరి వడ్రంగి కర్రతో బొడ్డెమ్మ గద్దె చేసి ఇచ్చేవాడు. దానికి పసుపు, తెలుపు రంగులు వేసేవారు. దానిమీద కూడా ప్రమిదలు ఉండేవి. మధ్యలో పిల్ల బతుకమ్మని చెక్కేవాడు. దాన్ని జ్ఞాపకం పెట్టుకుని దెబ్బై ఐదేళ్ల తర్వాత అలాంటి కర్ర బొడ్డెమ్మ వస్తువుని ఆద్యకళ మ్యూజియం కోసం సేకరించాను.

మగపిల్లల టీం మహాలయ అమావాస్య నాడు ప్రారంభమయ్యే బతుకమ్మ కోసం సంచులు పట్టుకుని పూలవేటకు వెళ్ళేవారం. గునుగు పూలు తెచ్చి రకరకాల రంగులద్దేవాళ్ళం. తంగేడు పూలు, ఆకులు, కొమ్మలతో తెంపే వాళ్ళం. ఇంటికి వచ్చి పూలను వేరు చేసేవాళ్ళం.

జలాశయాల్లోంచి తెచ్చిన తామర ఆకుల్ని సిబ్బుల కింద ఉంచేవాళ్ళు. కొంతమంది ఎర్రని తామరపూవుని పైన అలంకరించేవాళ్ళు. పై భాగాన పసుపు ముద్ద పెట్టి గౌరమ్మ తల్లిగా సంభావించేవారు. మరి కొందరు గుమ్మడి ఆకుల్ని సిబ్బులో పరిచి బతుకమ్మ పైన గుమ్మడిపూవుని ఉంచేవారు. పూవు మధ్య భాగం కేసరాలు ఉండేచోట పసుపు రంగు ఉండేది. దాన్నే గౌరమ్మగా భావించేవారు. మేం ఇంత కష్ట పడితే మాకు దక్కేది ఆటపాటల తర్వాత అక్కలు, అమ్మలు పెట్టే ప్రసాదం. రోజుకో తీరొక్క ప్రసాదం. ఇంటికొరకం ప్రసాదం తెచ్చి అన్నీ ఒక్కో గంపలో వేసి వాళ్లు తిని మాకు పెట్టేవారు. ఆ రుచే వేరు. తలుచుకుంటేనే నోరూరుతుంది.

బొడ్డెమ్మ, బతుకమ్మలను తలకెక్కించుకునే సందర్భంలో ఆకులతో చేసిన పీకలు ఊదే వాళ్ళం. మరికొందరి దగ్గర కర్రతో చేసిన గొట్టం ఉండేది. ఎండిన గింజల్నో, కాగితం తుంచి దాన్ని నమిలి చేసిన ముద్దనో కర్ర బర్మారులో పెట్టి బాగా ఊదేవాళ్లం. అది పిస్తోలు పేల్చినట్లు శబ్దం అయ్యేది. ఎవరి శబ్దం పెద్దగా ఉంటే వారిపై ప్రశంసల పూల జల్లు పడేది. అలా తొమ్మిది రోజులు ఈ కార్యక్రమం కొనసాగేది. ఆరో రోజు అరెం. అంటే ఆరోజు బతుకమ్మ పేర్చరు. సెలవుదినం. ఆట ఉండదు. మాకు కూడా కాస్త తీరిక దొరికేది. కాకపోతే బతుకమ్మ ప్రసాదం దొరికేది కాదు. పండుగ తొమ్మిది రోజులు చాలా ఇండ్లల్లో శాకాహారమే ఉండేది. కొత్త ధాన్యంతో, పప్పులతో తయారు చేసిన రుచి ఈనాటికీ గుర్తు చేసుకుంటే నోరూరుతుంది.



బతుకమ్మ తొమ్మిది రోజులు ఆటపాటలతో గడిచేది. అక్కలు, చెల్లెల్లు, కోడళ్ళు, మరదళ్లతో సందడిగా గడిపిన క్షణాలు ఈ తరాలకు దక్కని మహోత్కృష్ట గడియలు.

బతుకమ్మలనే కాదు ఇంటిని, ఇంటి పరిసరాల్ని శుభ్రపరిచి అలంకరించేవారు. ఇళ్ళ ముందు భాగం ముగ్గులు రంగులతో మెరిసిపోయేవి. వివిధ రకాల పూలు ఒక్కచోట ఉంచడం వల్ల చక్కని సువాసనలతో ఆ ప్రదేశం ఎంతో బాగుండేది. బతుకమ్మలపై కొందరు అగరుబత్తీలు పెట్టేవారు. చాలా కాలం దాచిపెట్టి పండుగ రోజున కట్టుకునే పీతాంబరం, పాత చీరల ప్రత్యేక వాసన ఇంకా పీల్చుతున్నట్లే ఉంటుంది. రోజూ అలికిన తాజా వాసన సైతం పండగ ప్రత్యేకతని చెప్పకనే చెప్పేది.

స్త్రీలు పాడే పాటలు చెవుల్లో ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటాయి. బతుకమ్మ పేర్పులోని నేర్పు ఆశ్చర్యం కలిగిస్తుంది. వాళ్ళ కళాత్మక భావనల్నిచూసి వారిపై ఎనలేని ప్రేమ, గౌరవం కలిగేది. ఊరు ఊరంతా ఒక్కటై చేసుకునే పండుగ పట్ల గౌరవం ఇనుమడించేది. పండుగ కాలంలో స్త్రీలు మిగతా వాళ్ళని గౌరవంగా చూసేవాళ్ళు. అందరూ సమానమే. ఎందుకంటే అందరూ సుమంగళులే. అంటే గర్భం ధరించి పిల్లల్ని కనగలిగే అర్హత ఉన్నవాళ్ళే. వాళ్లే బతుకమ్మ ఆడాలి. వాయనాలు పెట్టుకోవాలి.

బాలికల గుంపు చిన్న మగపిల్లగాళ్ల గుంపు, యువతుల గుంపు, తల్లుల గుంపు, అమ్మమ్మ నానమ్మల గుంపు ఇలా ఎవరి గుంపు వారిదే. ఎవరి స్నేహితులతో వారు కలిసిమెలసి ఉండేవారు. హాస్యం వందపూలై పూసేది. సామెతలతో సంభాషణ నవరసాలతో ఆకట్టుకునేది. వరసలను బట్టి హాస్యం, చతురోక్తులు ఉండేవి. ఇది పండుగ సంబరాన్ని మరింత పెంచేది.

ఊరు ఊరంతా గాన ప్రవాహంలో ఈదేది. చెరువు గట్టో, నీటి గుండాల పక్కనో వాళ్ల నృత్యంతో భూమి పులకరించేది. సంధ్యాసమయంలో ప్రకృతిని చూసి మా ఒడలు పులకరించేది.

నాడు బతుకమ్మ ప్రకృతి పండుగ. నా జ్ఞాపకాలలో ఆనాటి ప్రాకృతిక సౌందర్యం చూడడం కోసం ఊరూ, వాడా, అడవీ, పల్లె తిరుగుతూనే ఉన్నాను. ఏదో తెలియని శూన్యం. నా జీవితకాలం అంతా పద్మాక్షి గుట్ట కింద నీటి గుండంలోని తామర పూవుల సువాసన ఇంకా వెన్నాడుతోంది. కొండమీది గోగుపూలు రమ్మని చేతులు చాస్తున్నాయి. పండిన సీతాఫలాల సువాసన, రుచి, బతుకమ్మ ప్రసాదాలు తిన్నాక చాలా గంటల వరకు చేతికంటిన కమ్మని సువాసన కోసం మళ్లీ బతుకమ్మ పండుగ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూపు!



– జయధీర్ తిరుమలరావు

తాత్త్వికథ

దీక్ష... దక్షత



అది కార్తీక మాసం. ఊర్లో చాలామంది అయ్యప్ప దీక్షలో ఉన్నారు. వారందరినీ చూసిన ఓ యువకుడికి కూడా అయ్యప్ప మాల ధరించాలనిపించింది. అనుకున్నదే తడవుగా శివాలయం వద్ద ఉన్న గురుస్వామి గుర్తుకు వచ్చాడు. అన్నీ సిద్ధం చేసుకుని మాలధారణకు బయలుదేరాడు. అదే సమయంలో గురుస్వామి గుడి పక్కనున్న నదిలో స్నానం చేస్తూ కనిపించాడు. ఆ యువకుడు ఒడ్డున నిలబడి నమస్కరించి ''స్వామీ, నాకు కూడా అయ్యప్ప మాల వేయాలని ఉంది. అయితే నలభై రోజుల మండల దీక్ష చేయలేను. రెండు వారాలు మాత్రమే మాల ధరిస్తాను'' అని చెప్పాడు. కారణమేమిటని అడిగాడు గురుస్వామి.

''నాకు చన్నీళ్ళ స్నానం అంటే భయం. అందుకని నలభై రోజులు ఉండలేను'' అని బదులిచ్చాడు యువకుడు. ''అదేమీ లేదు, కొన్నాళ్ళు చన్నీళ్ళ స్నానం చేస్తే అదే అలవాటైపోతుంది''అని ధైర్యం చెప్పాడు గురుస్వామి. అది అసాధ్యం అన్నట్లుగా ముఖం పెట్టాడు యువకుడు. ''సరే, నేను చెప్పినట్లు చేస్తావా?'' అని అడిగాడు గురుస్వామి.

''చన్నీళ్ళ స్నానం తప్పితే మరే పని చేయమన్నా చేస్తాను'' అని గట్టిగా చెప్పాడు ఆ యువకుడు. వెంటనే గురుస్వామి ''నీ చేతి వేలు ఈ ప్రవహించే నదిలో పెట్టు!'' అన్నాడు. అదెంత పని అన్నట్లుగా నీళ్ళలో వేలు పెట్టాడు. ఎలాగుందని అడిగాడు గురుస్వామి. చలిగా ఉందని సమాధానమిచ్చాడు యువకుడు. ఈసారి చేయి మొత్తం నీళ్ళలో పెట్టమని కోరాడు. అలాగే మొత్తం చేయి పెట్టిన యువకుడు భలే చలిగా ఉందని అరిచాడు. 'ఈసారి గట్టు నుంచి నదిలోకి దూకు!'' అన్నాడు. ఎగిరి దుమికాడు యువకుడు. వెంటనే స్వామి చలి ఎలా ఉందని ప్రశ్నించాడు. ''చలే లేదు స్వామీ! వెచ్చగా ఉంది!!'' అని నీళ్ళలో ఈతకొడుతూ బదులిచ్చాడు యువకుడు. గురుస్వామి నవ్వుతూ ''నిండా మునిగితే చలి లేదన్నారు పెద్దలు. రోజూ చన్నీళ్ళ స్నానం చేస్తే చలీగిలీ కనిపించవు. అలవాటయ్యాక చన్నీళ్ళ స్నానమే బాగుంటుందని అంటావు. చన్నీళ్ళ స్నానానికి భయపడి దీక్ష కాలాన్ని ఎందుకు తగ్గించుకుంటావు. దీక్ష ఫలితం పూర్తిగా ఆస్వాదించాలంటే నలభై రోజులు ఉంటేనే బాగుంటుంది'' అని సలహా ఇచ్చాడు. అలాగేనని సంతోషంగా నలభై రోజుల దీక్షకు ఉపక్రమించాడు ఆ యువకుడు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

సాక్షి సినిమా

ఈ సినిమాకి ఆ ఇద్దరే స్టార్స్ - పవన్ కల్యాణ్



● ఇమ్రాన్ హష్మీ, సుజిత్, పవన్ కల్యాణ్, డీవీవీ దానయ్య

''ఒక సినిమా కోసం ఇంతమంది ఎదురు చూస్తున్నారని నాకు తెలియదు. 'ఖుషి' చిత్రం సమయంలో ఈ జోష్ చూశాను. అలాంటి జోష్ మళ్లీ 'ఓజీ'కి వచ్చింది. సినిమాలు వదిలేసి రాజకీయాల్లోకి వెళ్లిన తర్వాత కూడా మీరు (ఫ్యాన్స్) నన్ను వదల్లేదనిపిస్తోంది.. మీరు కదా నాకు భవిష్యత్ ఇచ్చింది'' అని పవన్ కల్యాణ్ చెప్పారు. సుజిత్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్, ప్రియాంకా మోహన్ జోడీగా నటించిన చిత్రం 'ఓజీ'. ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషించారు. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఓజీ' ప్రీ రిలీజ్ వేడుకలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ–''సుజిత్ నా అభిమాని. 'జానీ' మూవీ చూసి నాతో సినిమా తీయాలనుకున్నాడు. 'సాహో' సినిమా తర్వాత సుజిత్‌తో సినిమా చేస్తే బాగుంటుందని త్రివిక్రమ్ చెప్పి, నాకు పరిచయం చేశారు. తను కథని ముక్కలు ముక్కలుగా చెప్పినా సినిమా తీసేటప్పుడు తన సత్తా తెలిసింది. ఈ సినిమాకి ఇద్దరే స్టార్స్... నాట్ పవన్ కల్యాణ్. వారిలో మొదటి క్రెడిట్ సుజిత్‌ది. రెండో క్రెడిట్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్‌ది. 'నేను డిప్యూటీ సీఎం అని ఈ రోజు మరచిపోయాను. మీరు ఊహించుకోండి.. ఒక ఉప ముఖ్యమంత్రి ఇలా కత్తి పట్టుకుని వస్తే ఊరుకుంటారా? సినిమాల్లో కాబట్టి చెల్లిపోయింది. నేను సినిమా ప్రేమికుణ్ణి. సినిమా చేసేటప్పుడు దాని ఆలోచనలు తప్ప వేరేవి ఉండవు. రాజకీయాలు చేసేటప్పుడు అదే ఆలోచనలు తప్ప వేరేవి ఉండవు. సుజిత్ టీమ్ చాలా అద్భుతమైనది. ఇలాంటి టీమ్ నేను దర్శకత్వం వహించే టప్పుడు నాకూ ఉండి ఉంటే రాజకీయాల్లోకి వచ్చేవాణ్ని కాదేమో? ట్రైలర్ పూర్తిగా సిద్ధం కాలేదంటే కుదరదు. మా వాళ్లకి (ఫ్యాన్స్) ఈ రోజు ఎంతో కొంత చూపించాల్సిందే. నాకు తెలుసు కదా... అమితాబ్ బచ్చన్‌గారి కోసం నేను చిన్నప్పుడు ఎలా కొట్టుకునేవాణ్నో. ఆయన సినిమాకి టిక్కెట్ దొరక్కపోతే చంపేద్దాం అనిపించేది. 'ఓజీ' చిత్రం అందర్నీ రంజింపజేసేలా ఉంటుంది'' అని చెప్పారు. ఈ ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్' రాజు, వై. రవిశంకర్, రచయిత కోన వెంకట్, ప్రియాంక మోహన్, సంగీత దర్శకుడు తమన్, నటులు ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్ మాట్లాడారు.

దసరాకి పాట?



● చిరంజీవి

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ట్యాగ్ లైన్. 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సుష్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. 2026 సంక్రాంతి కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీకి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే కొన్ని పాటలను సిద్ధం చేశారట భీమ్స్. ప్రమోషన్లలో భాగంగా దసరా సందర్భంగా 'మన శంకర వరప్రసాద్ గారు' నుంచి తొలి పాటను విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. వినాయక చవితి పండగని పురస్కరించుకుని ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేసిన యూనిట్.. ఇప్పుడు దసరాకి తొలి పాట రిలీజ్ చేసి, సినిమాపై మరింత క్రేజ్ పెంచాలన్నది ఆలోచనట. మరి... దసరా పండగకి పాట విడుదల చేస్తారా? లేదా? లేకుంటే మరేదైనా అప్‌డేట్ ఉంటుందా? అన్నది వేచి చూడాలి. ఇదిలా ఉంటే.. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వం వహించిన 'విశ్వంభర' సినిమా 2026 వేసవిలో రిలీజ్ కానుంది.

అక్టోబరులో ఆరంభం



● వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించనున్నారని సమాచారం. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను అక్టోబరు మొదటివారంలో ప్రారంభించనున్నారని తెలిసింది. తొలి షెడ్యూల్‌లోనే వెంకటేశ్‌తో పాటు ఈ చిత్రం ప్రధాన తారాగణం పాల్గొనగా, కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారట త్రివిక్రమ్. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాకు 'ఆనంద నిలయం, వెంకట రమణ: కేరాఫ్ ఆనంద నిలయం' అనే టైటిల్స్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారని, వైజాగ్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే... వెంకటేశ్ హీరోగా నటించిన 'నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ కథ, సంభాషణలు అందించారు. ఈ రెండు సినిమాలూ విజయాలు సాధించాయి. దీంతో వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు ఉండటం సహజం.

బ్యూటీ నాకు ఎంతో ప్రత్యేకం - వీకే నరేశ్



● అంకిత్, నీలఖి, వీకే నరేశ్

''నా కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూశా. ఇన్నేళ్ల నా కెరీర్‌లో 'బ్యూటీ' చిత్రం మాత్రం నాకు ఎంతో ప్రత్యేకం. అన్ని వర్గాల వారికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది. లవ్, ఎమోషన్స్, ఫ్యామిలీ... ఇలా అన్ని అంశాలను జోడించిన ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని నటుడు వీకే నరేశ్ తెలిపారు. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా నటించిన చిత్రం 'బ్యూటీ'. వీకే నరేశ్, వాసుకి ప్రధాన పాత్రలు పోషించారు. జె.ఎస్.ఎస్. వర్ధన్ దర్శకత్వంలో వానర సెల్యులాయిడ్, జీ స్టూడియోస్, మారుతి టీమ్ ప్రొడక్ట్‌పై అడిదల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కుమార్ బన్సల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ సక్సెస్ మీట్‌లో అంకిత్ కొయ్య మాట్లాడుతూ– ''బ్యూటీ' అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువైంది. క్లయిమాక్స్ తర్వాత అందరూ కన్నీళ్లు తుడుచుకుంటున్నారు. అదే మా విజయం'' అని చెప్పారు. ''మా సినిమా అందర్నీ అలరిస్తోంది. 15 థియేటర్స్‌కి వెళ్లాను.. ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు'' అన్నారు జె.ఎస్.ఎస్ వర్ధన్. ''మన జీవితాల్ని చూపించే చిత్రమిది. ఇది కేవలం సినిమా కాదు.. జీవితం'' అని అన్నారు విజయ్‌పాల్ రెడ్డి. ''నా పాత్రకి ప్రశంసలు కురిపిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని నీలఖి తెలిపారు. రైటర్ ఆర్.వి. సుబ్రహ్మణ్యం, కెమెరామేన్ సాయి కుమార్ ధారా, సీనియర్ జర్నలిస్ట్ ప్రభు తదితరులు మాట్లాడారు.

దేవగుడి విజయం సాధించాలి - మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి



● ఆది నారాయణరెడ్డి, రామ్‌ప్రసాద్ రెడ్డి, బెల్లం రామకృష్ణారెడ్డి, అభినవ శౌర్య, అనుశ్రీ

''దేవగుడి' సినిమా ఫస్ట్ లుక్, గ్లింప్స్ బాగున్నాయి. ఈ చిత్రంలోని డైలాగులు మా కడప మాండలికంలో ఉండటం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ సినిమా మంచి విజయం సాధించి, దర్శక–నిర్మాత రామకృష్ణారెడ్డిగారికి, నటీనటులకు, సాంకేతిక నిపుణులకు పేరు తీసుకు రావాలి'' అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి చెప్పారు. అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'దేవగుడి'. బెల్లం సుధా రెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణా రెడ్డి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఆదివారం నిర్వహించిన ఈ చిత్రం ఫస్ట్ లుక్, గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌కి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి, ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆది నారాయణరెడ్డి మాట్లాడుతూ– ''సినిమాలు వినోదం కోసమే కాదు... ప్రేక్షకులకు మంచి సందేశాన్నిచ్చేలా ఉండాలి'' అన్నారు. ''నవంబరులో విడుదల కానున్న మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అని బెల్లం రామకృష్ణారెడ్డి కోరారు. సంగీత దర్శకుడు షేక్ మదీన్, కెమెరామేన్ లక్ష్మీకాంత్, నటుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటీటీ
ఇది చూడొచ్చు

సమాజపు పరదా తీసిన సినిమా

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తెలుగు చిత్రం పరదా ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాలం నడుస్తున్నా, ఇంకా ఎక్కడో ఈ సమాజంలో మూఢనమ్మకమనే పరదా ఉంది. మరీ ముఖ్యంగా ఇది ఉత్తర భారతంలో కొన్ని రాష్ట్రాలలో ఎక్కువగా ఉంది. ఆ మూఢనమ్మకపు పరదాని చాలా సున్నితమైన కథాంశంతో మన ముందుకు తీసుకువచ్చారు దర్శకుడు ప్రవీణ్. ఈ సినిమా ప్రధాన పరదాలో (పాత్రలో) కథానాయిక అనుపమా పరమేశ్వరన్ నటించారు. మరో ప్రధాన పాత్రలో మలయాళ నటి దర్శనా రాజేంద్రన్, అలాగే మరో పాత్రలో సంగీత నటించి, మెప్పించారు. ఈ కథలో సున్నితమైన అంశాన్ని ఎంతో హృద్యంగా మలిచారు దర్శకుడు. అంతలా ఏముందో ఈ కథలో ఓసారి చూద్దాం. ఓ మారుమూల గ్రామంలో వింతైన ఓ ఆచారాన్ని పాటిస్తుంటారు. తమ గ్రామాన్ని దేవత శపించిందని, శాపవిమోచన కోసం గ్రామంలో ఉన్న ప్రతి అమ్మాయి తప్పనిసరిగా బయటకు వచ్చినపుడు పరదాతోనే రావాలని ఆచారం ఉంటుంది. ప్రతి అమ్మాయి తమ కుటుంబ సభ్యులను తప్ప మిగతా వారందరి దగ్గర పరదాతోనే ఉంటుంది. వాళ్ళలో సుబ్బలక్ష్మి (అనుపమ) కూడా ఉంటుంది. కాకపోతే సుబ్బలక్ష్మి చదువుకున్న అమ్మాయి. అయినా తమ గ్రామంలో తరతరాల నుండి వస్తున్న సాంప్రదాయాన్ని తూచా తప్పకుండా పాటిస్తుంటుంది. కానీ ఓరోజు గాలి వాటాన సుబ్బలక్ష్మి పరదా తొలగిపోతుంది. అప్పుడు సుబ్బలక్ష్మికి కూడా తెలియకుండా ఓ ఫేమస్ మేగజీన్ ఫొటోగ్రాఫర్ సుబ్బలక్ష్మి ఫొటో తీసి ప్రచురిస్తాడు. సరిగ్గా సుబ్బలక్ష్మి పెళ్ళి సమయంలో ఆ మేగజీన్ బయటపడి ఊరు మొత్తం సుబ్బలక్ష్మి ముఖాన్ని చూసేస్తుంది. దాంతో అల్లకల్లోలం అవుతుంది. దీనికి ప్రతిగా సుబ్బలక్ష్మి ఆత్మహత్య చేసుకోవాలని ఊరువాళ్ళు నిర్ణయించినా ఓ మేజిక్ వల్ల ఆత్మహత్య ఆగిపోతుంది. అప్పుడు సుబ్బలక్ష్మి ఊరి కోసం ఆ ఫొటోగ్రాఫర్‌ని వెతికి పట్టుకుని తన తప్పు లేదని నిరూపించుకుంటానని, లేదంటే అప్పుడే ఆత్మహత్య చేసుకుంటానని ఫొటోగ్రాఫర్ కోసం హిమాలయాల్లో ఉన్న ధర్మశాలకు బయలుదేరుతుంది. మరి... సుబ్బలక్ష్మి ఆ ఫొటోగ్రాఫర్‌ని వెతికి పట్టుకుందా? తిరిగి ఊరెళ్ళిన తరువాత అక్కడ తనకు ఎదురైన పరిస్థితులు ఏంటి? అన్నది మాత్రం ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'పరదా' సినిమాలోనే చూడాలి. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరికైనా, ఎలాగైనా నమ్మకం ఉండొచ్చు కానీ మూఢనమ్మకమనే పరదా మాత్రం ఉండకూడదు. నేటి సమాజంలో ఇంకా మూఢనమ్మకాలనే పరదాలను తీసేసిన సినిమా ఈ 'పరదా'. పిల్లలు కాకుండా పెద్దవాళ్లు చూడదగ్గ సినిమా ఇది.



– హరికృష్ణ ఇంటూరు



కోనేరు అశోక్‌ను నిలువరించిన దివిత్ రెడ్డి

వరల్డ్ క్యాడెట్ అండర్-8 చెస్ చాంపియన్, తెలంగాణకు చెందిన తొమ్మిదేళ్ల దివిత్ రెడ్డి జాతీయ సీనియర్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలను 'డ్రా'తో ప్రారంభించాడు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం ఈ మెగా టోర్నీ మొదలైంది. ప్రపంచ మహిళల ర్యాపిడ్ చెస్ చాంపియన్ కోనేరు హంపి తండ్రి కోనేరు అశోక్‌తో జరిగిన తొలి రౌండ్ గేమ్‌ను దివిత్ 'డ్రా' చేసుకున్నాడు. 'ద్రోణాచార్య అవార్డు' గ్రహీత 67 ఏళ్ల అశోక్‌తో జరిగిన గేమ్‌లో తెల్లపావులతో ఆడిన దివిత్ వ్యూహాత్మక ఎత్తులు వేసి ప్రత్యర్థిని నిలువరించాడు. తొలి గేమ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన లలిత్ బాబు, స్వర్ణ నిహాల్, సేతుమాధవ్, ఆముక్త, జ్ఞాన సాయిసంతోష్, అల్లూరి భాస్కరరత్న షణ్ముఖ, లాస్య, సింహాద్రి సాయి హృషికేశ్, దొండపాటి ధ్రువేశ్, హేమల్, గోర్లి నయన, టీపీఎస్ కావ్యశ్రీ, ధూళిపాళ్ల బాలచంద్ర ప్రసాద్, రవితేజ, గంపా ఆదిత్య వరుణ్, మురళీకృష్ణ, కొల్లా భావన్ తమ ప్రత్యర్థులపై గెలిచి శుభారంభం చేశారు. అక్టోబర్ 1వ తేదీ వరకు జరిగే ఈ చాంపియన్‌షిప్‌ను రూ. 30 లక్షల ప్రైజ్‌మనీతో నిర్వహిస్తున్నారు. విజేతకు రూ. 6 లక్షలు లభిస్తాయి.



రన్నరప్ సాత్విక్-చిరాగ్ జోడీ

షెన్‌జెన్: ఈ ఏడాది తొలి టైటిల్ సాధించాలని ఆశించిన భారత బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టికి మరోసారి నిరాశ ఎదురైంది. ఆదివారం ముగిసిన చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో సాత్విక్-చిరాగ్ ద్వయం రన్నరప్‌గా నిలిచింది. 45 నిమిషాల పాటు జరిగిన ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ 19-21, 15-21తో ప్రపంచ నంబర్‌వన్ జంట కిమ్ వన్ హో-సియో సెయుంగ్ జే (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. రన్నరప్‌గా నిలిచిన సాత్విక్-చిరాగ్‌లకు 43,750 (రూ. 38 లక్షల 54 వేలు) డాలర్ల ప్రైజ్‌మనీతోపాటు 9350 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఫైనల్లో తొలి గేమ్‌లో 14-7తో ఆధిక్యంలో నిలిచిన భారత జంట దానిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైంది. ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా ఫైనల్ చేరిన సాత్విక్-చిరాగ్ తుది పోరులో మాత్రం వరుస గేముల్లో ఓటమి పాలయ్యారు. గతవారం హాంకాంగ్ ఓపెన్ టోర్నీలోనూ రన్నరప్‌గా నిలిచిన సాత్విక్-చిరాగ్... అంతకుముందు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెల్చుకుంది.

సింగిల్స్ విజేత ఆన్ సె యంగ్

ఈ సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ ప్రపంచ నంబర్‌వన్, దక్షిణ కొరియా స్టార్ ఆన్ సె యంగ్ మరో టైటిల్ గెలిచింది. చైనా మాస్టర్స్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లో ఆన్ సె యంగ్ 21-11, 21-3తో ప్రపంచ మూడో ర్యాంకర్ హాన్ యువె (చైనా)పై గెలిచింది. ఈ ఏడాది ఆన్ సె యంగ్ ఖాతాలో ఇది ఏడో టైటిల్ కావడం విశేషం.

- బీసీసీఐ అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్!
- రజతంతో అథ్లెటిక్స్ కెరీర్‌ను ముగించిన జమైకా దిగ్గజం షెల్లీ ఫ్రేజర్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

మళ్లీ చితక్కొట్టి...

పాకిస్తాన్‌పై భారత్ మరో ఘన విజయం

- 6 వికెట్లతో గెలిచిన టీమిండియా
- చెలరేగిన అభిషేక్, గిల్
- బుధవారం బంగ్లాదేశ్‌తో భారత్ పోరు

వారం రోజుల వ్యవధిలో వేదిక కూడా మారలేదు... భారత జట్టు మళ్లీ తమ స్థాయి ఏమిటో ప్రదర్శించింది... పాకిస్తాన్‌పై సంపూర్ణ ఆధిక్యం కనబరుస్తూ మరో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది... ముందుగా చక్కటి బౌలింగ్‌తో సాధారణ స్కోరుకే పాక్‌ను పరిమితం చేసిన టీమిండియా... ఆ తర్వాత అలవోకగా గెలుపు తీరాన్ని చేరింది. అభిషేక్ శర్మ మెరుపు బ్యాటింగ్ భారత్ ఇన్నింగ్స్‌లో హైలైట్‌గా నిలిచింది. ఈసారి 'షేక్‌హ్యాండ్'పై చర్చ జరగాల్సిన అవసరమే రాకుండా తమ ఆటతోనే ప్రత్యర్థికి పదునుగా జవాబిచ్చింది.

దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నీ సూపర్-4 దశలో భారత్ శుభారంభం చేసింది. ఆదివారం పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. సాహిబ్‌జాదా ఫర్హాన్ (45 బంతుల్లో 58; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో రాణించాడు. అనంతరం భారత్ 18.5 ఓవర్లలో 4 వికెట్లకు 174 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అభిషేక్ శర్మ (39 బంతుల్లో 74; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (28 బంతుల్లో 47; 8 ఫోర్లు) చెలరేగి భారత్ విజయాన్ని సులువు చేశారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 59 బంతుల్లోనే 105 పరుగులు జోడించడం విశేషం. సూపర్-4 దశలో తమ తర్వాతి మ్యాచ్‌లో బుధవారం బంగ్లాదేశ్‌తో భారత్ తలపడుతుంది.



అభిషేక్

ఫర్హాన్ అర్ధ సెంచరీ...

భారత్‌తో జరిగిన గత మ్యాచ్‌తో పోలిస్తే ఈసారి పాక్‌కు ఎంతో మెరుగైన ఆరంభం లభించింది. కానీ దానిని సద్వినియోగం చేసుకొని భారీ స్కోరు సాధించడంలో జట్టు విఫలమైంది. బుమ్రా ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన ఫఖర్ జమాన్ (15) ఎక్కువ సేపు నిలవకపోయినా, మరో ఓపెనర్ ఫర్హాన్ చక్కటి షాట్లు ఆడాడు. బుమ్రా వరుస రెండు ఓవర్లలో ఫర్హాన్ రెండేసి ఫోర్లు కొట్టడం విశేషం. పవర్‌ప్లేలో జట్టు 55 పరుగులు సాధించింది. ఆ తర్వాతా ధాటిని కొనసాగిస్తూ పాక్ బ్యాటర్లు ఒకదశలో 13 బంతుల వ్యవధిలో 4 సిక్సర్లు బాదారు. 10.2 ఓవర్లలో 93/1 స్కోరుతో పాక్ పటిష్ట స్థితిలో నిలిచింది. అయితే సయీమ్ అయూబ్ (21) అవుటయ్యాక పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. **భారత బౌలర్లు పట్టు బిగించడంతో పరుగులు చేయడానికి బ్యాటర్లు తీవ్రంగా శ్రమించారు. వరుసగా 33 బంతుల పాటు ఒక్క బౌండరీ కూడా** రాలేదు! ఐదు పరుగుల వ్యవధిలో హుస్సేన్ తలత్ (10), ఫర్హాన్ అవుట్ కాగా, మొహమ్మద్ నవాజ్ (19 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్)లో దూకుడు లోపించింది. 7-16 మధ్య 10 ఓవర్లలో పాక్ 3 వికెట్లు కోల్పోయి 66 పరుగులే చేసింది. అయితే చివరి 4 ఓవర్లలో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 50 పరుగులు సాధించి గౌరవప్రదంగా ముగించింది. ఫహీమ్ అష్రఫ్ (8 బంతుల్లో 20 నాటౌట్; 1 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించాడు.



గిల్

మెరుపు బ్యాటింగ్...

ఛేదనలో భారత ఓపెనర్లు అభిషేక్, గిల్ ఒకరితో మరొకరు పోటీ పడుతూ చెలరేగిపోయారు. తొలి బంతికే సిక్సర్‌తో అభిషేక్ జోరు మొదలు పెట్టగా, తర్వాతి రెండు ఓవర్లలో రెండేసి ఫోర్లు కొట్టి గిల్ తానేంటో చూపించాడు. అయూబ్ ఓవర్లో మరో మూడు ఫోర్లు వచ్చాయి. వీరిద్దరి దూకుడుతో భారత్ పవర్‌ప్లేలో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 69 పరుగులు రాబట్టింది. అబ్రార్ ఓవర్లో 2 సిక్స్‌లు బాదిన అభిషేక్ 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నాడు. ఎట్టకేలకు భారీ భాగస్వామ్యం తర్వాత 18 పరుగుల వ్యవధిలో గిల్, సూర్యకుమార్ (0), అభిషేక్ వెనుదిరిగారు. సామ్సన్ (13) కూడా తొందరగానే అవుటైనా... తిలక్ వర్మ (19 బంతుల్లో 30 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), హార్దిక్ పాండ్యా (7 నాటౌట్) కలిసి మ్యాచ్‌ను ముగించారు. గత మ్యాచ్ తరహాలోనే ఈ సారి కూడా ఇరు జట్ల కెప్టెన్లు టాస్ సమయంలో కరచాలనం చేసుకోలేదు. తమ టీమ్ షీట్‌లను కూడా ఇద్దరూ రిఫరీ పైక్రాఫ్ట్‌కే అందించారు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ఎలాంటి 'షేక్ హ్యాండ్'లు లేకుండా ఎవరి దారిన వారు వెళ్లిపోయారు.

నాలుగు క్యాచ్‌లు నేలపాలు...

భారత్ పేలవ ఫీల్డింగ్ కూడా పాక్ ఈ స్కోరు చేయడానికి కారణమైంది. అనూహ్యంగా మన ఫీల్డర్లు నాలుగు క్యాచ్‌లు వదిలేశారు. వీటిలో మూడు అతి సులువైనవి కాగా, ఒకటి కాస్త కష్టసాధ్యమైంది. అభిషేక్ శర్మ రెండు క్యాచ్‌లు (ఫర్హాన్ 0, 32 వద్ద), కుల్దీప్ (అయూబ్ 4 వద్ద), గిల్ (ఫహీమ్ 6 వద్ద) వదిలేయడం చూసి ఫీల్డింగ్ కోచ్ దిలీప్ తలపట్టుకున్నాడు!



ఫర్హాన్

పాకిస్తాన్ మారదు!

గత మ్యాచ్‌లో భారత జట్టు షేక్‌హ్యాండ్ ఇవ్వక **పోవడంతో పాటు యుద్ధం,** సైనికుల ప్రస్తావన తీసుకొచ్చి క్రీడలతో రాజకీయాలు చేసిందని పాక్ వైపు నుంచి విమర్శలు వచ్చాయి. అయితే తాము మాత్రం అలాంటి రెచ్చగొట్టే పనులు, సైగలను తగ్గించుకోమని వారు చూపించారు. 34 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న తర్వాత ఫర్హాన్ బ్యాట్‌ను ఏకే-47 గన్ తరహాలో ఎక్కు పెట్టి పేలుస్తున్నట్లుగా సంబరాలు చేసుకున్నాడు. ఉద్దేశపూర్వకంగా చేసిన ఈ సైగ వారి ఆలోచనాధోరణిని చూపించింది.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఫర్హాన్ (సి) సూర్యకుమార్ (బి) దూబే 58; ఫఖర్ (సి) సామ్సన్ (బి) పాండ్యా 15; అయూబ్ (సి) అభిషేక్ (బి) దూబే 21; హుస్సేన్ (సి) వరుణ్ (బి) కుల్దీప్ 10; నవాజ్ (రనౌట్) 21; సల్మాన్ (నాటౌట్) 17; ఫహీమ్ (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 171.**
వికెట్ల పతనం: 1-21, 2-93, 3-110, 4-115, 5-149. **బౌలింగ్:** పాండ్యా 3-0-29-1, బుమ్రా 4-0-45-0, వరుణ్ చక్రవర్తి 4-0-25-0, కుల్దీప్ యాదవ్ 4-0-31-1, అక్షర్ 1-0-8-0, శివమ్ దూబే 4-0-33-2.

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) రవూఫ్ (బి) అబ్రార్ 74; గిల్ (బి) ఫహీమ్ 47; సూర్యకుమార్ (సి) అబ్రార్ (బి) రవూఫ్ 0; తిలక్ (నాటౌట్) 30; సామ్సన్ (బి) రవూఫ్ 13; పాండ్యా (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (18.5 ఓవర్లలో 4 వికెట్లకు) 174. వికెట్ల పతనం** : 1-105, 2-106, 3-123, 4-148. **బౌలింగ్:** షాహిన్ అఫ్రిది 3.5-0-40-0, అయూబ్ 3-0-35-0, అబ్రార్ 4-0-42-1, రవూఫ్ 4-0-26-2, ఫహీమ్ 4-0-31-1.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

టీజీఎస్‌ఆర్‌టీసీలో 1,743 పోస్టులు

తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టీజీఎస్‌ఆర్‌టీసీ) రాష్ట్రవ్యాప్తంగా వివిధ జోన్‌లలో డ్రైవర్, శ్రామిక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1,743.
» **పోస్టుల వివరాలు:** డ్రైవర్స్-1000, శ్రామిక్-743.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఐటీఐ, పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.07.2025 నాటికి డ్రైవర్ పోస్టులకు 22 నుంచి 35 ఏళ్లు, శ్రామిక్ పోస్టులకు 18 నుంచి 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు డ్రైవర్ పోస్టులకు రూ.20,960 నుంచి రూ.60,080, శ్రామిక్ పోస్టులకు రూ.16,550 నుంచి రూ.45,030.
» **ఎంపిక విధానం:** ఫిజికల్ మెజర్‌మెంట్(పీఎంటీ), మెడికల్, డ్రైవింగ్ టెస్టుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 08.10.2025.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.10.2025.
» **వెబ్‌సైట్:** https://www.tgprb.in/

ఐఐఎస్సీ, బెంగళూరులో 10 టీచింగ్ అసిస్టెంట్ పోస్టులు

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ) ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
» **విభాగాలు:** బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, వాటర్ ట్రీట్‌మెంట్, కంప్యూటర్ ల్యాబ్.
» **అర్హత:** ఏదైనా విభాగంలో బీఈ/బీటెక్, ఎంఎస్సీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 40 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.30,000, నెట్/గేట్ క్వాలిఫైడ్ వారికి రూ.37,000.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా



» **దరఖాస్తులకు చివరితేది:** 29.09.2025.
» **వెబ్‌సైట్:** https://iisc.ac.in/

సీఈఎల్, ఘజియాబాద్‌లో 46 పోస్టులు

ఘజియాబాద్(ఉత్తరప్రదేశ్)లోని సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(సీఈఎల్) వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 46.
» **పోస్టుల వివరాలు:** డిప్లొమా ఇంజనీర్ (ఎలక్ట్రికల్)-04, డిప్లొమా ఇంజనీర్ (ఎలక్ట్రానిక్స్)-25, డిప్లొమా ఇంజనీర్ (మెకానికల్)-04, టెక్నీషియన్(ఫిట్టర్)-02, టెక్నీషియన్(ఎలక్ట్రీషియన్)-02, టెక్నీషియన్ (ఎలక్ట్రానిక్స్)-03, ఆపరేటర్-02, క్లర్క్(ఎఫ్ అండ్ ఏ)-02, క్లర్క్-01, డ్రైవర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 31.08.2025 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు డిప్లొమా ఇంజనీర్‌కు రూ.40,000, ఇతర పోస్టులకు రూ.30,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ/స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జనరల్ మేనేజర్, సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఇండస్ట్రియల్ ఏరియా, షాహిబాబాద్, ఘజియాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.celindia.co.in/

ఎన్ఐఏబీ, హైదరాబాద్‌లో వివిధ ఖాళీలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ(ఎన్ఐఏబీ) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసోసియేట్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 02.
» **ఖాళీల వివరాలు:** ప్రాజెక్ట్ అసోసియేట్1-01, ల్యాబ్ టెక్నీషియన్-01.
» **అర్హత:** సంబంధిత విభాగాల్లో ఇంటర్మీడియట్, బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, బీవీఎస్సీ, బీఫార్మసీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.30,000(నెట్ క్వాలిఫైడ్ అభ్యర్థులకు రూ.37,000, ల్యాబ్ టెక్నీషియన్‌కు రూ.20,000)
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **దరఖాస్తులకు చివరితేది:** 03.10.2025.
» **వెబ్‌సైట్:** https://www.niab.res.in/

పీజీఐఎంఈఆర్, చండీగఢ్‌లో 12 పోస్టులు

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(పీజీఐఎంఈఆర్) ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్ 2(మెడికల్)-01, ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్ 2(నాన్ మెడికల్)-04, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ 3-02, ప్రాజెక్ట్ నర్స్2-01, డేటా ఎంట్రీ ఆపరేటర్-02, ఆఫీస్ హెల్పర్-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీబీఎస్.బీవీఎస్సీ, బీడీఎస్, పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్‌కు రూ.80,000, ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్2(నాన్ మెడికల్)కు రూ.56,000 నుంచి రూ.67,000. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్‌కు రూ.28,000. ప్రాజెక్ట్ నర్స్‌కు రూ.20,000. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.29,000. ఆఫీస్ హెల్పర్‌కు రూ.26,800.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.10.2025.
» **వెబ్‌సైట్:** https://pgimer.edu.in/

రైల్వేలో సెక్షన్ కంట్రోలర్ కొలువు

రైల్వేలో ఉద్యోగాలు కోరుకునే అభ్యర్థులకు శుభవార్త. భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ).. మరో చక్కటి నోటిఫికేషన్‌తో ముందుకొచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే జోన్‌లలో 368 సెక్షన్ కంట్రోలర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఈ పోస్టుల వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, పరీక్ష ప్యాట్రన్, సిలబస్ అంశాలు తదితర సమాచారంతో ప్రత్యేక కథనం..



» మొత్తం 368 పోస్టులకు ఆర్ఆర్‌బీ నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు
» సీబీటీ, సీబీఏటీలో ప్రతిభ ద్వారా ఎంపిక
» ఎంపికైతే నెలకు ప్రారంభ వేతనం రూ.35,400

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ) దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే జోన్లలో సెక్షన్ కంట్రోలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 14వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

- **పోస్టు పేరు:** సెక్షన్ కంట్రోలర్
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 368.
- **ఆర్ఆర్‌బీ రీజియన్ల వారీగా ఖాళీలు:** అహ్మదాబాద్-15, అజ్మీర్-33, బెంగళూరు-24, భోపాల్-06, భువనేశ్వర్-17, బిలాస్‌పూర్-27, చండీగఢ్-07, చెన్నై-05, గువాహటి-16, జమ్మూశ్రీనగర్-10, కోల్‌కతా-28, మాల్దా-14, ముంబై-44, ముజఫర్‌పూర్-21, పాట్నా-05, ప్రయాగ్‌రాజ్-23, రాంచీ-15, సికింద్రాబాద్-25, సిలిగురి-05, గోరఖ్‌పూర్-09, తిరువనంతపురం-19.

అర్హత

01.01.2026 నాటికి గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హతలు కలిగి ఉండాలి.

వయసు

01.01.2026 నాటికి 20 నుంచి 33 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక విధానం

- సింగిల్ స్టేజ్ కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష(సీబీటీ), ఆ తర్వాత కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్(సీబీఏటీ), సర్టిఫికెట్‌ల పరిశీలన, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- సీబీటీలో చూపిన ప్రతిభ ఆధారంగా కేటగిరీల వారీగా ఒక్కో పోస్టుకు 8 మంది చొప్పున సీబీఏటీకి ఎంపిక చేస్తారు.
- సీబీటీలో కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.

100 మార్కులకు సీబీటీ

- ఎంపిక ప్రక్రియ తొలిదశలో 100 మార్కులకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహిస్తారు. ఈ పరీక్షలో 100 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 120 నిమిషాలు. అనలిటికల్ అండ్ మ్యాథమెటికల్ కేపబిలిటీ నుంచి 60 ప్రశ్నలు, లాజికల్ కేపబిలిటీ 20 ప్రశ్నలు, మెంటల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు లభిస్తుంది. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి 1/3 వంతు మార్కు తగ్గిస్తారు. సీబీటీని వివిధ షిఫ్టుల్లో నిర్వహిస్తే నార్మలైజేషన్ ప్రక్రియను అనుసరిస్తారు.
- ఈ పరీక్షలో అర్హత పొందేందుకు అన్ రిజర్వ్‌డ్ అభ్యర్థులు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు కనీసం 40 శాతం; ఓబీసీలు(నాన్ క్రీమీ లేయర్), ఎస్సీలు కనీసం 35 శాతం, ఎస్టీలు కనీసం 25 శాతం మార్కులు సాధించాలి.
- అనలిటికల్ అండ్ మ్యాథమెటికల్ కేపబిలిటీలో.. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి నంబర్ సిస్టమ్, రేషియో అండ్ ప్రపోర్షన్స్, యావరేజెస్, పర్సంటేజెస్, ప్రాఫిట్, లాస్, డిస్కౌంట్స్, టైమ్, స్పీడ్, డిస్టెన్స్, పవర్ అండ్ వర్క్, ఆల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, అర్థమెటిక్ ప్రోగ్రెషన్, ఎల్‌సీఎం, హెచ్‌సీఎఫ్, జామెట్రీ, ఏరియా, వాల్యూమ్స్, ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, డేటా అనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- లాజికల్ క్యాపబిలిటీ విభాగంలో.. లాజికల్ రీజనింగ్, బైనరీ లాజిక్, సిలాజిజమ్, క్లాక్స్, క్యాలండర్స్, అసంప్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ఫ్యామిలీ ట్రీ, పజిల్స్, రీడింగ్ కాంప్రహెన్షన్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- మెంటల్ రీజనింగ్ విభాగంలో.. అనాలజీ, సిరీస్, కోడింగ్, డీకోడింగ్, సాల్వింగ్ ర్యాంకింగ్, అరేంజ్‌మెంట్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి.

మెరిట్ లిస్ట్ ఇలా

- సీబీటీలో ప్రతిభ ఆధారంగా సీబీఏటీ పరీక్షకు ఎంపిక చేస్తారు. ఈ పరీక్షలో ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీలో మాత్రమే ఉంటాయి. ఈ పరీక్షలోని ప్రతి టెస్ట్ బ్యాటరీలో కనీసం 40 శాతం మార్కులు పొందాలి. సీబీఏటీ పరీక్ష విధానం, ప్రశ్నలు తదితర వివరాల కోసం అభ్యర్థులు http://www.rdso.indianrailways.gov.inను సందర్శించమని నోటిఫికేషన్‌లో పేర్కొనడం జరిగింది.
- సీబీటీలో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ, సీబీఏటీలో పొందిన మార్కులకు 30 శాతం వెయిటేజీ కల్పించి ఆర్ఆర్‌బీల వారీగా కేటగిరీలను అనుసరించి మెరిట్ లిస్టును సిద్ధం చేసి.. 1:1 నిష్పత్తిలో సర్టిఫికెట్‌ల పరిశీలన, మెడికల్ ఎగ్జామినేషన్‌కు ఎంపికచేస్తారు.

దరఖాస్తు ఫీజు

జనరల్/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ/ఎస్టీ/మహిళలు/ట్రాన్స్‌జెండర్/ఎక్స్‌సర్వీస్‌మెన్/దివ్యాంగ అభ్యర్థులకు రూ.250.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 15.09.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.10.2025.
- **దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరితేది:** 16.10.2025.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 17.10.2025 నుంచి 26.10.2025.
- **వెబ్‌సైట్:** www.rrbapply.gov.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-పాలిటి » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలుగు - కంటెంట్ (ఎస్ఏ)
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- జనరల్ ఇంగ్లిష్

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
388	97
82,626	25,327

విదేశీ సూచీలు


సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	22,631	△	161
డోజోన్స్	46,315	△	173
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,217	▽	11
డాక్స్	22,639	▽	35
షాంఘై	3,820	▽	12
నికాయ్	45,046	▽	258

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.80	88.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.23	121.22
€	యూరో	ఎస్‌బీఐ	102.73	105.33
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.28	60.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.29	59.57
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.27	69.97
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.60	24.10
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.09	24.35
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.50	13.32

ఆరోగ్య బీమా.. అన్‌లిమిటెడ్!



- ఒకరికి ఎంత ఆరోగ్య బీమా కావాలి?
- రూ.5–10 లక్షల బీమా చాలకపోవచ్చు
- ఏటేటా ఎగబాకుతున్న వైద్య వ్యయాలు
- జీవనశైలి వ్యాధుల ముప్పు
- అవయవ మార్పిడులకు భారీ ఖర్చు
- జీవితాంతం ఆదుకునే స్థాయిలో ఉండాలి

ఒకరికి ఎంత ఆరోగ్య బీమా రక్షణ అవసరం..? మెజారిటీ పాలసీదారులకు ఈ విషయంలో స్పష్టత లేదన్నది నిజం. పాలసీబజార్ సంస్థ నిర్వహించిన 'హౌ ఇండియా బైస్ ఇన్సూరెన్స్ 2.0' నివేదిక ప్రకారం.. 75 శాతం మంది ఎంపిక చేసుకుంటున్న ఆరోగ్య బీమా కవరేజీ రూ.10 లక్షలకు మించడం లేదు. మరీ ముఖ్యంగా 48 శాతం మంది రూ.5 లక్షలకే పరిమితం అవుతున్నారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో కుటుంబానికి ఈ కొద్ది పాటి రక్షణ చాలుతుందా? ఈ విషయంలో నిపుణుల సూచనలు తప్పకుండా పరిశీలనలోకి తీసుకోవాలి.

– సాక్షి బిజినెస్ డెస్క్

ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో 60 శాతం మంది ఎంపిక చేసుకుంటున్న బీమా రక్షణ రూ.5 లక్షలు అంతకులోపే ఉంటున్నట్టు పాలసీ బజార్ అధ్యయనం గుర్తించింది. వీరిలో చాలా మంది మెరుగైన చికిత్సల కోసం మెట్రోలకు వెళుతున్నారు. దీంతో రవాణా వ్యయాలకు తోడు మెట్రోల్లో చికిత్స తీసుకున్నందుకు కో–పేమెంట్ చెల్లించాల్సి రావడంతో వారిపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. అందుకే ఎంపిక చేసుకునే కవరేజీ అవసరాల్లో పూర్తిగా ఆదుకునే స్థాయిలో ఉండాలి. కరోనా విపత్తు సమయంలో రూ.10 లక్షలు, అంతకుమించి భారీ బిల్లుల చెల్లింపుల కోసం ఎంతో మంది అప్పులు చేయాల్సి రావడాన్ని మర్చిపోకూడదు.

ఏటేటా పెరుగుతున్న చార్జీలు

వైద్య రంగంలో ద్రవ్యోల్బణం సాధారణం కంటే రెట్టింపునకు పైగా ఉంటోంది. 12–15 శాతం మధ్య ఉంటుందన్నది నిపుణుల అంచనా. అంటే వేతన జీవులకు ఏటా ఆదాయ వృద్ధికి మించి వైద్య చార్జీలు పెరుగుతున్నట్టు అర్థమవుతోంది. ఒకవైపు మారిన జీవనశైలి కారణంగా వ్యాధుల ముప్పు పెరుగుతోంది. మరోవైపు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయి. దీంతో అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ సగటు జీవనకాలం పెరుగుతోంది. ఇంకోవైపు గత దశాబ్ద కాలంలో చికిత్సలు, డయాగ్నోస్టిక్స్ చార్జీలు గణనీయంగా పెరిగాయి. గుండె సర్జరీలు, కేన్సర్ చికిత్సలు, అవయవ మార్పిడుల వంటి వాటికి రూ.30–50 లక్షల వరకు ఖర్చవుతోంది. ముఖ్యంగా అవయవ మార్పిడి అనంతరం ఏవైనా సమస్యలు ఎదురైతే.. అప్పుడు చికిత్సల కోసం మరింత అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అలాంటప్పుడు బిల్లు రూ.కోటి దాటినా ఆశ్చర్య పోనక్కర్లేదు.

ఉదాహరణకు లక్ష్మణ్ కుమార్ (45)కు హెపటైటిస్–సి వైరస్ సోకింది. సకాలంలో గుర్తించి వైద్యం తీసుకోకపోవడంతో చివరికి కాలేయ మార్పిడికి వెళ్లాల్సి వచ్చింది. రక్త సంబంధీకులు వైద్య పరంగా ఫిట్‌గా లేకపోవడంతో దాత నుంచి కాలేయం స్వీకరించి మార్పిడి చేశారు. ఆస్పత్రి నుంచి ఇంటికి చేరిన తర్వాత కుమార్ ఇన్ఫెక్షన్ బారిన పడ్డాడు. దీంతో ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతం కాలేదు. తిరిగి ఆస్పత్రిలో చేరగా.. రెండు వారాల తర్వాత మృతి చెందాడు. కార్పొరేట్ ఆస్పత్రిలో వీటన్నింటికీ అయిన బిల్లు రూ.కోటి దాటింది.

2013లో కిడ్నీ మార్పిడికి రూ.5 లక్షలు ఖర్చు కాగా, ఇప్పుడు రూ.18 లక్షలకు చేరింది. గుండె మార్పిడి చికిత్సకు సగటున రూ.30 లక్షలకుపైనే వ్యయమవుతోంది. అదే ఊపిరితిత్తుల మార్పిడికి రూ.కోటి వరకు ఖర్చు అవుతోంది. కనుక రూ.5–10 లక్షల హెల్త్ కవరేజీ అర్థవంతమైనది కాదన్న సూచన వినిపిస్తోంది. ఒకవేళ రూ.25 లక్షల కవరేజీ ఉన్నా కానీ.. అవయవ మార్పిడి అవసరమైన పరిస్థితుల్లో అది కూడా చాలకపోవచ్చు. ఎప్పుడు ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందో? అన్న దానికి కుమార్ కేసు ఒక ఉదాహరణ. అందుకే సంపూర్ణ రక్షణపై ప్రతి కుటుంబం దృష్టి పెట్టాలి. పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో బీమా కంపెనీలు ఇప్పుడు రూ.కోటి, అన్‌లిమిటెడ్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తక్కువ ప్రీమియానికే అందిస్తున్నాయి.

''వ్యక్తులు బీమా ప్రాధాన్యాన్ని అర్థం చేసుకుంటున్నారు. దీంతో రూ.10–20 లక్షల కవరేజీతో హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకుంటున్నారు. కానీ, వయసు పెరుగుతున్న క్రమంలో తీవ్ర వ్యాధుల బారిన పడిన తర్వాత బీమా కవరేజీ మొత్తాన్ని పెంచుకోవడం అంత సులభం కాదు. వైద్య ద్రవ్యోల్బణం దృష్ట్యా బీమా కవరేజీని ఎప్పటికప్పుడు పెంచుకోవడం కష్టమే'' అని నివా బూపా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బబతోష్ మిశ్రా తెలిపారు. భవిష్యత్తు అవసరాలు, పెరిగిపోతున్న వైద్య చికిత్సల వ్యయాలను దృష్టిలో పెట్టుకుని మెరుగైన బీమా కవరేజీని చిన్న వయసులోనే తీసుకోవడం మంచి నిర్ణయమవుతుందని మిశ్రా మాటలను బట్టి తెలుస్తోంది.

కవరేజీ ఎంత అవసరం?

కనీసం రూ.10–25 లక్షలకు బేసిక్ సమ్ ఇన్సూర్డ్‌తో హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకుని.. ఈ మేరకు డిడక్టబుల్‌తో రూ.50 లక్షలు లేదా రూ.కోటికి సూపర్ టాపప్ తీసుకోవడాన్ని సైతం పరిశీలించొచ్చు. దీనివల్ల బేసిక్ ప్లాన్ ప్రీమియం భరించలేని స్థాయిలో పెరగకుండా చూసుకోవచ్చు. బిల్లు రూ.10–25 లక్షలు మించిన సందర్భాల్లో, అదనపు చెల్లింపులు చేసే సూపర్ టాపప్ ప్లాన్ల ప్రీమియం తక్కువే ఉంటుంది. నలుగురు లేదా ఐదుగురు సభ్యుల కుటుంబం రూ.కోటి సమ్ ఇన్సూర్డ్ కవరేజీ కలిగి ఉండడం నేటి పరిస్థితుల్లో అవసరమే. జీవనశైలి వ్యాధుల తీవ్రత భవిష్యత్తులోనూ మరింత పెరిగేదే. దీనికితోడు ఎప్పటికప్పుడు మెరుగైన చికిత్సలు అందుబాటులోకి వస్తుంటాయి. కనుక వీటి వ్యయాలు కూడా అధికంగా ఉంటాయి. వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే తరుణంలో బీమా కవరేజీ పెంచుకోవడం కష్టమవుతుంది. కనుక అప్పటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని మెరుగైన కవరేజీని ముందుగానే ఎంపిక చేసుకోవాలి. రూ.10 లక్షల సమ్ ఇన్సూర్డ్‌కు, రూ.కోటి సమ్ ఇన్సూర్డ్‌కు మధ్య ప్రీమియం వ్యత్యాసం 10–15 శాతమే ఉంటుంది. కనుక ప్రీమియం చెల్లించే సామర్థ్యం కలిగిన వారు మెరుగైన కవరేజీకి వెళ్లడమే సూచనీయం.



'అన్‌లిమిటెడ్'కు ప్రీమియం ఎక్కువే

కంపెనీ	ప్లాన్ పేరు	వార్షిక ప్రీమియం (రూ.లలో)		
		30 ఏళ్లు	40 ఏళ్లు	50 ఏళ్లు
నివాబూపా	రీఅష్యూర్ 3.0	12,828	14,383	25,159
ఐసీఐసీఐ లాంబార్డ్	ఎలివేట్	24,030	31,426	48,905
స్టార్‌హెల్త్	సూపర్‌స్టార్ (అన్‌లిమిటెడ్ రీస్టోరేషన్)	17,988	22,210	34,653

నోట్: వయసుతోపాటు ఈ ప్రీమియంలు భవిష్యత్తులో పెరుగుతాయని గుర్తుంచుకోవాలి.

బిల్లు ఎంతయినా సరే..

బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, నివా బూపా 'అన్‌లిమిటెడ్' (పరిమితుల్లేని కవరేజీ) హెల్త్ ప్లాన్లను ఇటీవలి కాలంలో తీసుకొచ్చాయి. ఉదాహరణకు నివా బూపా 'రీఅష్యూర్ 3.0' ప్లాన్ అన్ని క్లెయిమ్‌లు, అనారోగ్యాలకు అపరిమిత బీమాను ఆఫర్ చేస్తోంది. ''చికిత్సా నాణ్యత పరంగా పాలసీదారులు రాజీపడాల్సిన అవసరం ఉండకూడదు. అభివృద్ధి చెందిన దేశాల్లో అసలు సమ్ ఇన్సూర్డ్ (బీమా మొత్తం) అనేది ఉండదు. ఒక వ్యక్తికి లేదా ఫలానా వ్యాధికి జీవితకాల పరిమితులు మాత్రమే ఉంటాయి'' అని నివా బూపా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బబతోష్ మిశ్రా తెలిపారు. బజాజ్ అలియాంజ్ ఇన్ఫినిటీ ప్లాన్‌లో.. రోజువారీ రూమ్ రెంట్ రూ.3,000–50,000 ఆధారంగా కవరేజీని ఎంపిక చేసుకునే ఆప్షన్ ఉంది. రోజువారీ రూమ్ రెంట్‌కు 100 రెట్ల వరకు సమ్ ఇన్సూర్డ్ తీసుకోవచ్చు. ఒకవేళ ఆస్పత్రి బిల్లు అంతకుమించితే అప్పుడు 15–25–25 శాతం కోపేమెంట్ (పాలసీదారు తనవంతు చెల్లించాల్సిన వాటా) అమలు చేస్తోంది.

అవసరమా? లేక అదనమా?

వైద్య ద్రవ్యోల్బణం అధికంగా ఉంటున్న పరిస్థితుల్లో అన్‌లిమిటెడ్ హెల్త్ ఇన్సూరెన్స్ సాకర్యాన్నిస్తుందన్నది నిపుణుల అభిప్రాయం. ఇక్కడి నుంచి మరో 10, 20, 30 ఏళ్ల వైద్య అవసరాలను తీర్చగలిగేలా ఉండాలన్నది వారి సూచన. నేడు రూ.10 లక్షల కవరేజీ.. వచ్చే పదేళ్ల కాలంలో రెట్టింపునకు పైగా పెరిగే వైద్య వ్యయాలను ఏ మాత్రం తీర్చగలదు? మరీ ముఖ్యంగా 20–30 ఏళ్ల తర్వాత వృద్ధాప్యంలో ఖరీదైన చికిత్సలకు ఇప్పుడు తీసుకునే కవరేజీ భరోసానిస్తుందా? అని ప్రశ్నించుకోవాలి. 2024–25లో హెల్త్ ఇన్సూరెన్స్ మొత్తం క్లెయిమ్‌ల్లో 20 శాతం గుండె సంబంధితమైనవే ఉన్నాయి. పదేళ్ల క్రితం ఉన్న 10 శాతంతో పోల్చి చూస్తే రెట్టింపయ్యాయి. అంతేకాదు సగటు క్లెయిమ్ రూ.4–5 లక్షల నుంచి రూ.14–17 లక్షలకు పెరిగిపోయింది.

ఏదో ఒకటి లేదా రెండు సందర్భాల్లో పెద్ద మొత్తంలో క్లెయిమ్‌కు సన్నద్ధమైతే చాలు కానీ, తరచూ ఇలా పెద్ద క్లెయిమ్‌లు అవసరపడవని నిపుణులు చెబుతున్నారు. ''అపరిమిత కవరేజీ అన్నది మార్కెటింగ్ ఎత్తుగడ. ఉదాహరణకు ఒక వ్యక్తికి రూ.కోటి సమ్ ఇన్సూర్డ్ కింద ఒకటికి మించిన పర్యాయాలు రీస్టోరేషన్ (తిరిగి అంతే మొత్తాన్ని పునరుద్ధరించడం) అవసరం ఏర్పడదు. పెద్ద మొత్తంలో క్లెయిమ్‌లను ఒకటికి మించిన పర్యాయాలు ఎలాంటి ఇబ్బంది లేకుండా కంపెనీలు చెల్లిస్తాయా? అన్నది చూడాలి. ఒకవేళ క్లెయిమ్‌లు పెద్ద సంఖ్యలో ఎదురైతే బీమా కంపెనీలు ఆయా ప్లాన్లను ఉపసంహరించుకోవచ్చు'' అని ఆల్ ఇండియా జనరల్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల జాతీయ అధ్యక్షుడు ప్రశాంత్ మాత్రే అభిప్రాయపడ్డారు. హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను ఏటా రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ సమయంలో ప్రీమియం సవరణకు గురవుతుంటుంది. కొనుగోలు సమయంలో ప్రీమియం భరించే స్థాయిలోనే ఉండొచ్చు. వయసు, వైద్య ద్రవ్యోల్బణం, క్లెయిమ్‌ల ఆధారంగా ప్రీమియం కాలక్రమంలో పెరిగిపోతుంది. ''కొంత కాలం తర్వాత అంత ప్రీమియం చెల్లించడం కష్టం కావొచ్చు. వైద్య చికిత్సల ధరలు ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతున్న తరుణంలో ఈ తరహా ప్లాన్‌లు దీర్ఘకాలం పాటు కొనసాగుతాయా? అన్నది ప్రశ్నార్థకమే. బీమా కంపెనీలు నష్టాలను ఇస్తున్న ప్లాన్లను తర్వాతి కాలంలో ఉపసంహరించుకుని, మరొక ప్లాన్‌లోకి మారిపోవాలని పాలసీదారులను కోరతాయి'' అని ఫస్ట్ పాలసీ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ రీజినల్ డైరెక్టర్ హరి రాధాకృష్ణన్ తెలిపారు. కనుక అన్‌లిమిటెడ్ పేరుతో ఉన్న ప్లాన్లను తీసుకోవాలనేమీ లేదు. మెరుగైన కవరేజీ ఉండేలా చూసుకోవడం అవసరం.




వీటిని చూడాలి..

- ఒకే రకమైన బీమా కవరేజీ అన్నది అందరికీ అనుకూలమని చెప్పలేం. ఏ వయసులో ఉన్నారు? ఆరోగ్య సమస్యలు ఏవైనా ఉన్నాయా? అన్నది చూడాలి.
- మెట్రోల్లో నివసించే వారికి అధిక కవరేజీ అవసరం పడుతుంది. ఎందుకంటే ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ తరహా మెట్రోలు, ఇతర పట్టణాలకు మధ్య చికిత్సల ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన, నాణ్యమైన చికిత్సలకు కవరేజీ ఉండేలా చూసుకోవాలి.
- బేసిక్ ఇండెమ్నిటీ ప్లాన్‌తోపాటు క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్ కూడా అవసరమే. గుండె, మూత్రపిండాలు, కాలేయం, మెదడు, ఊపిరితిత్తులకు సంబంధించి తీవ్ర అనారోగ్యాల్లో ఏకమొత్తంలో చెల్లింపులు చేసే క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్లు అనుకూలంగా ఉంటాయి.
- ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్‌లో ఒకరు ఆస్పత్రి పాలై, బీమా కవరేజీ మొత్తం ఖర్చయిపోతే.. మిగిలిన వారికి అదే ఏడాది రక్షణ కోసం రీస్టోరేషన్ సదుపాయం ఉండేలా చూసుకోవాలి.
- 60 ఏళ్లు దాటిన తల్లిదండ్రులను అంతకు తక్కువ వయసున్న కుటుంబ సభ్యుల ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్‌లో భాగం చేయొద్దు. ఎందుకంటే వృద్ధాప్యంలో క్లెయిమ్‌లు ఎక్కువగా వస్తుంటాయి. దాంతో బీమా కవరేజీ తల్లిదండ్రులకే ఖర్చయిపోతుంది. పైగా పాలసీలో పెద్ద వయసున్న వారి ఆధారంగా ప్రీమియం నిర్ణయం అవుతుంది.
- 60 ఏళ్లు దాటిన తల్లిదండ్రులకు విడిగా హెల్త్ ప్లాన్ తీసుకోవాలి. ఉద్యోగుల తల్లిదండ్రులకు కంపెనీలు ఆఫర్ చేసే గ్రూప్ హెల్త్ కవరేజీని తీసుకోవచ్చు.
- వయసు పెరుగుతున్న క్రమంలో హెల్త్‌ప్లాన్ సమ్ ఇన్సూర్డ్‌ను కనీసం ఐదేళ్లకోసారి సమీక్షించుకోవాలి. కవరేజీ సరిపడదనుకుంటే, దాన్ని పెంచుకోవాలి. కంపెనీ సేవలు, క్లెయిమ్ చెల్లింపుల తీరు సంతృప్తికరంగా లేకపోతే, మెరుగైన సేవలు, చెల్లింపుల చరిత్ర ఉన్న కంపెనీకి పోర్టింగ్ ద్వారా మారిపోవచ్చు.



ముందుగా ఏ రుణం వదిలించుకోవాలి?




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఐదేళ్ల కుమారుడి భవిష్యత్తు అవసరాల కోసం రూ.లక్ష ఇన్వెస్ట్ చేద్దామని అనుకుంటున్నాను. ఈ మొత్తాన్ని ఫ్లెక్సీక్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయాలా? లేక అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్ ఎంపిక చేసుకోవాలా? ఒక పథకం లేదంటే ఒకటికి మించిన పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా?

– మాధవ్.కె

దీర్ఘకాలంలో మీ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఫ్లెక్సీక్యాప్, అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ రెండూ అనుకూలమే. ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలన్నది మీ రిస్క్ సామర్థ్యంపైనే ఆధారపడి ఉంటుంది. ఫ్లెక్సీక్యాప్ అన్నది లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతుంది. ఎన్నో రంగాలతోపాటు, వివిధ మార్కెట్ విలువలతో కూడిన స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తాయి. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తమ పెట్టుబడుల్లో మార్పులు చేస్తుంటాయి. మిడ్‌క్యాప్ ఫండ్స్, స్మాల్‌క్యాప్ ఫండ్స్ కంటే ఫ్లెక్సీక్యాప్‌లో స్థిరత్వం ఎక్కువ. కనుక మోస్తరు రిస్క్ తీసుకోగలిగి, దీర్ఘకాలంలో పెట్టుబడులను వృద్ధి చేసుకోవాలని కోరుకుంటే అప్పుడు ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ సహజంగానే వైవిధ్యంతో ఉంటాయి. కనుక ఒక ఫ్లెక్సీక్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకుంటే సరిపోతుంది. అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ అన్నవి ఈక్విటీ, డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెడుతుంటాయి. కాకపోతే ఈక్విటీలకు ఎక్కువ పెట్టుబడులను కేటాయిస్తాయి. పెట్టుబడుల వృద్ధితోపాటు భద్రతను ఇవి ఆఫర్ చేస్తాయి. ఈక్విటీ మార్కెట్ల పతనాల సమయంలో డెట్ పెట్టుబడులు పోర్ట్‌ఫోలియోకి నష్టాల నుంచి రక్షణనిస్తాయి. ఈక్విటీ పెట్టుబడులు ద్రవ్యోల్బణాన్ని మించి రాబడులను ఇస్తాయి. ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలని భావిస్తూ, అదే సమయంలో అచ్చమైన ఈక్విటీ ఫండ్స్ మాదిరి ఆటుపోట్లు వద్దనుకుంటే.. అప్పుడు మీకు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ అనుకూలం. ఒకవేళ మీరు ఇప్పటికే ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తూ, మార్కెట్ ఉద్దాన, పతనాలకు ఆందోళనకు గురికాకుండా ఉండేట్టు అయితే అప్పుడు మీకు అగ్రెస్సివ్ ఈక్విటీ పెట్టుబడులు అనుకూలంగా ఉంటాయి. అలాంటప్పుడు మిడ్‌క్యాప్ లేదా స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. దీర్ఘకాలంలో అధిక రాబడులకు ఇవి భరోసానిస్తాయి. ముఖ్యంగా 10–15 ఏళ్ల కాలానికి ఇవి మెరుగైన ఎంపిక. సంక్షిప్తంగా.. మోస్తరు రిస్క్‌తో దీర్ఘకాలానికి ఇన్వెస్ట్ చేసుకోవాలని అనుకుంటే ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఎంపిక చేసుకోండి. స్వల్పకాలంలో మార్కెట్ల పతనాలకు ఆందోళన చెందేట్టు అయితే అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోండి. 10 ఏళ్లు అంతకుమించిన కాలానికి, రిస్క్ తీసుకునేట్టు అయితే మిడ్ లేదా స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. రూ.లక్ష మొత్తాన్ని ఒకే విడత కాకుండా.. 6 లేదా 12 వాయిదాల్లో ఇన్వెస్ట్ చేసుకోండి.



నేను ఇల్లు, కారు, క్రెడిట్ కార్డు రుణాల కోసం నెలకు రూ.40,000 ఈఎంఐ కింద చెల్లిస్తున్నాను. వీటిల్లో ముందుగా ఏ రుణం నుంచి బయటపడాలి?

– భాస్కర్ బాబు

రుణాలన్నవి భవిష్యత్తు ఆదాయాన్ని మింగేస్తాయి. కనుక ఆర్థికంగా కుదేలు చేసే రుణాలను ముందుగా వదిలించుకోవాలి. ముందుగా క్రెడిట్ కార్డు రుణాన్ని తీర్చడంతో ప్రారంభించండి. అధిక వడ్డీ రేటుతో ఖరీదైన రుణాలు ఇవి. కనుక వేగంగా తీర్చేయడంపై దృష్టి పెట్టండి. అవసరమైతే పార్ట్ టైమ్ ఉద్యోగం చేయడం లేదంటే పెట్టుబడులను స్వల్పకాలం పాటు నిలిపివేసి క్రెడిట్ కార్డు బకాయి తీర్చేయండి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే తీసుకోతగినవి ఇవి. ఎక్కువ కాలం పాటు కొనసాగిస్తే ఆర్థిక పరిస్థితులపై ప్రభావం పడుతుంది. క్రెడిట్ కార్డు రుణం తర్వాత కారు రుణం తీర్చేయండి. ఎందుకంటే వాహనం విలువ క్షీణిస్తుంటుంది. కనుక వీలైనంత ముందుగా ముగించండి. దీర్ఘకాలంలో విలువను సమకూర్చే ఆస్తి కనుక ఇంటిపై రుణాన్ని కొనసాగించుకోవచ్చు. తక్కువ రేటుతో, పన్ను ప్రయోజనం ఇందులో ఉంటుంది.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..

మార్కెట్‌పై హెచ్1బీ, జీఎస్‌టీ ఎఫెక్ట్	దీర్ఘకాలానికి నిశ్చింత! కోటక్ మల్టీక్యాప్ ఫండ్

స్టాక్స్ వ్యూ

కల్పతరు ప్రాజెక్ట్స్ | బ్రోకరేజ్: యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,268 టార్గెట్: రూ. 1,470

ఎందుకంటే: గత ఆర్థిక సంవత్సరం(2024–25)లో మౌలిక సదుపాయాల దిగ్గజం కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ వార్షికంగా 14 శాతం వృద్ధితో రూ. 22,316 కోట్ల ఆదాయం సాధించింది. ఇందుకు విద్యుత్ ప్రసారం, పంపిణీ(టీఅండ్‌డీ) బిజినెస్‌తోపాటు.. బిల్డింగ్స్ అండ్ ఫ్యాక్టరీస్(బీఅండ్‌ఎఫ్) విభాగంలో పటిష్ట ఎగ్జిక్యూషన్ తోడ్పాటునిచ్చింది. నికర లాభం సైతం వార్షికంగా 10 శాతం ఎగసి రూ. 567 కోట్లను తాకింది. ఇందుకు మెరుగైన నిర్వహణా సామర్థ్యం, మార్జిన్లలో నిలకడ సహకరించాయి. నికర రుణభారాన్ని తగ్గించుకోవడం తదితర అంశాల ద్వారా పెట్టుబడుల్లో పటిష్టతను చూపిస్తోంది. 2025 మార్చి31కల్లా మెరుగైన స్థాయిలో 0.3 రెట్లు ఈక్విటీ– నికర రుణ నిష్పత్తిని సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర రుణభారం వార్షిక పద్ధతిలో 25 శాతం క్షీణించి రూ. 1,953 కోట్లకు పరిమితమైంది. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల కేటాయింపులో విజయవంతమైంది. దీంతో దేశ, విదేశీ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజాలు కంపెనీలు పెట్టుబడులు చేపట్టాయి. ఇది కంపెనీ దీర్ఘకాలిక వ్యూహాలకు, ప్రణాళికలకు మార్కెట్లో కనిపిస్తున్న విస్తారిత విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. కాగా.. కంపెనీ ఆయిల్ అండ్ గ్యాస్ బిజినెస్ రూ. 1,758 కోట్ల ఆదాయాన్ని అందుకుంది. వార్షిక ప్రాతిపదికన ఇది 114 శాతం పురోభివృద్ధికాగా.. దేశీ ప్రాజెక్టులలో పటిష్ట ఎగ్జిక్యూషన్, అంతర్జాతీయ ప్రాజెక్టులను సాధించడంలో ప్రగతి ఇందుకు దోహదపడ్డాయి. సౌదీ ఇంధన దిగ్గజం కోసం చేపట్టిన ప్రాజెక్టులో చూపిన పటిష్ట కార్యాచరణతో విదేశీ బిజినెస్ ఊపందుకుంది. విస్తారిత ఆర్డర్ బుక్, టీఅండ్‌డీ, బీఅండ్‌ఎఫ్ విభాగాలలో దేశ, విదేశాలలో కనిపిస్తున్న డిమాండ్, ప్రభుత్వ మద్దతు కంపెనీకి లబ్ధిని చేకూర్చే వీలుంది.



నజారా టెక్నాలజీస్ | బ్రోకరేజ్: చాయిస్ ఇంటర్నేషనల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,083 టార్గెట్: రూ. 1,400

ఎందుకంటే: మొబైల్ గేమ్స్, ఈస్పోర్ట్స్ తదితర విభాగాలలో కార్యకలాపాలు విస్తరించిన దేశీ టెక్నాలజీ కంపెనీ నజారా టెక్నాలజీస్. దేశ, విదేశాలలో వేగంగా విస్తరిస్తున్న గేమింగ్ మార్కెట్లో పట్టు సాధిస్తోంది. దేశీయంగా 50 కోట్లకుపైబడిన గేమర్స్ సంఖ్యరీత్యా రెండో పెద్ద కంపెనీగా నిలుస్తోంది. అయితే దీనినుంచి లబ్ధిని పొందవలసి ఉంది. గేమింగ్ యూజర్లు చేపట్టే వర్చువల్ కరెన్సీ, కాస్మెటిక్ ఐటమ్స్ తదితర అదనపు కొనుగోళ్ల(కంటెంట్ ఇన్‌యాప్ పర్చేజెస్–ఐఏపీ) 3 శాతానికంటే తక్కువేకాగా.. ఒక్కో వినియోగదారుడిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 8–9 డాలర్లుగా నమోదవుతోంది. చైనాలో ఈ సగటు 17–18 డాలర్లుకావడంతో భవిష్యత్‌లో నిర్మాణాత్మక లబ్ధికి ఆస్కారముంది. డిజిటల్ పేమెంట్స్, 5జీ, జెన్ జెడ్ తదితరాలు ఇందుకు దారి చూపే వీలుంది. ఫ్యూజ్‌బాక్స్, జెప్టోల్యాబ్ ఐపీఎస్ తదితర సంస్థల కొనుగోళ్ల ద్వారా అంతర్జాతీయంగా విస్తరిస్తోంది. దీంతో అధిక ఏఆర్‌పీయూ సాధించగల మార్కెట్లలో కార్యకలాపాలకు దారి ఏర్పడుతోంది. దేశీయంగా డెవలప్‌మెంట్ కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వ్యయాల ఆదాతోపాటు.. హైబ్రిడ్ మానిటైజేషన్ విధానాలతో కంపెనీ లబ్ధి పొందేందుకు వీలుంటుంది. రానున్న కాలంలో ఐఏపీ మిక్స్ పుంజుకోనున్నట్లు అంచనా. దీంతో ప్రస్తుత 19 శాతం నుంచి ఐఏపీ ఆదాయం వాటా 2027–28కల్లా 35 శాతానికి జంప్‌చేసే అవకాశముంది. ప్రీమియం(ఉచిత గేముల ద్వారా ప్రీమియం ఫీచర్స్‌తోకూడిన ఇన్‌యాప్ కొనుగోళ్లతో లభించే) బిజినెస్ రెండంకెల వృద్ధిని సాధిస్తోంది. వెరసి క్యాజువల్, నెరేటివ్, ప్రీమియం విభాగాల ఆదాయం బలపడనుంది. రమ్మీ, పోకర్, ఫాంటసీ స్పోర్ట్స్ తదితర ఆర్‌ఎంజీలో నియంత్రణా సంస్థల విధానాలు, ఐపీల ఆదాయం మందగించడం తదితర అంశాలను కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

TATA MOTORS
Connecting Aspirations

FESTIVAL OF GST
GREATEST SAVINGS FROM TATA MOTORS

TATA

ఈ పండగలో, Tata Motors ని ఎంచుకోండి

స్పెషల్ పోస్ట్ GST ధర + ప్రతి కారు పై ఇప్పటివరకు ఉన్న ఉత్తమ ఆఫర్లు. ఇప్పుడే బుక్ చేయండి! ఆఫర్ 30 సెప్టెంబర్ 2025 వరకు మాత్రమే.

బిగర్ సెలబ్రేషన్స్ విత్ బిగ్గెస్ట్ ఆఫర్స్. ఫోర్ లిమిటెడ్ పీరియడ్. హర్రీ!

Models	Reduction in Ex-Showroom Price (Up to INR Lakh)	New Ex-Showroom^^ Starting Price after GST (INR Lakh)	Additional Benefits* (Up to INR Lakh)	Total Benefits (Upto INR Lakh)*
Tiago	0.75	4.57	0.35	1.10
Tigor	0.81	5.48	0.40	1.21
Punch	1.07	5.49	0.45	1.52
Altroz	1.11	6.30	0.65	1.76
Nexon	1.54	7.31	0.53	2.07
Curvv	0.67	9.65	0.48	1.15
Harrier	1.44	13.99	0.60	2.04
Safari	1.48	14.66	0.60	2.08



book TATA Motors

BHARAT NCAP | GLOBAL NCAP

PRATHAMMALIK AUTOMATRIX
Banjara Hills: 8291058022; Boduppal: 9000979494; Financial District (Near Q City): 9167090503

SELECT CARS
Alkapuri: 7506025176; Begumpet: 7506025220; Karmanghat: 9619083948

SELECT CARS
Chandanagar: 7506025180; Miyapur,Bachupally: 9167413840

JASPER INDUSTRIES
SD Road, Secunderabad: 9619024718; Narsingi: 8879152707; Chandrayangutta: 9167450755; Kompally: 9619973314

TEJASWI AUTOMOBILES
HiTech City Madhapur: 7506025271, Sangareddy: 8879187409, Siddipet: 8879187436, Zaheerabad: 8879194145; Tolichowki: 8879186915

VENKATARAMANA MOTORS
Gachibowli, Shankarpally, Shamshabad : 7506025311; Kukatpally: 8879221046

VVC AUTOWORLD
Vanastalipuram, Ibrahimpatnam: 7506025358; Jubilee Hills: 8879334329; ECIL, Kushaiguda: 7506025339

MALIK AUTOWORLD
Malakpet: 7506025166; Himayathnagar, Beeramguda : 7506025158; Bowenpally: 7506025486; Shadnagar: 8291106052

ORANGE AUTO
Attapur: 9167473372; Erragadda: 7506025174; Kharkana: 7506025493; Medchal: 8291244717; Medak: 9619938527

Service: Attapur, Autonagar, Beeramguda, Bowenpally, Champapet, ECIL, Hafeezpet, Hi-tech City, Kompally, Kondapur, Kothapet, L.B. Nagar, Miyapur, Nacharam, Sanathnagar, Sangareddy, Secunderabad, Siddipet, Tadbund, Tellapur, Tolichowki, Uppal, Y Junction

Images and Illustrations are indicative and for information purposes only. All features/specifications are not available in all variants and may vary for different variants. Specifications/features are subject to change without prior information. Colours may vary due to printing limitations. *Benefits up to differs from model to model and is inclusive of consumer offer, exchange bonus and maximum corporate offer. **Please confirm the exact price of your preferred car/SUV variant from an authorized Tata Motors showroom near you. ^^Price mentioned is for Tiago XE MT petrol ex showroom New Delhi local taxes extra. Tiago is available in Petrol, CNG & EV. ^^Prices mentioned is Punch Pure MT, ex showroom Delhi. ^^Price mentioned is Harrier and Safari Smart MT, ex-showroom Delhi Local taxes extra. Harrier and Safari GNCAP test in 2023 & BNCAP tested in 2023 Harrier is available in Diesel and EV in India. Safari is available in Diesel in India. ^^Price mentioned is Nexon Smart MT Petrol, ex showroom Delhi Local taxes extra. TATA Nexon scored highest adult occupant score as per test conducted by Bharat NCAP and Global NCAP in category of SUV less than 4 meter & engine less than 1.5L as per GNCAP & BNCAP test result. ^^Price mentioned is for Tigor XM MT petrol ex showroom New Delhi local taxes extra. Tigor is available in Petrol & CNG. ^^Ex showroom Delhi, Curvv smart MT (Petrol). Curvv is 5 Star BNCAP rated mid SUV as per 2025 test. ^^Altroz price mentioned is Smart MT Petrol, ex showroom Delhi. Altroz is 5 star BNCAP rated hatchback as per 2025 test. Altroz is the only hatchback to get 5 star rating across powertrain of Petrol, Diesel and CNG. As per Bharat NCAP results 2025. BNCAP rating and GNCAP rating is not valid for Tiago & Tigor T&C apply.

కడలిలో తమిళ తంబీల ఆగడాలు ఇక చెల్లవంటున్నారు జిల్లా మత్స్యకారులు. నడిసంద్రంలో సమరానికి సై అంటున్నారు. మా ప్రాంతంలోకి వచ్చి మత్స్య సంపదను దోచుకుపోవడమే కాకుండా రూ.లక్షలు విలువజేసే వలలు ధ్వంసం చేస్తుంటే చూస్తూ ఊరుకోం.. ఇటువైపు కన్నెత్తి చూస్తే ఎదురుదాడులు తప్పవని హెచ్చరికలు చేస్తున్నారు. ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల మత్స్యకారులు సమావేశమై సోనాబోట్ల అంతు చూడాలని నిర్ణయించుకున్నారు. చేపల వేటతో పాటు నిబంధనలు ధిక్కరించే తమిళ జాలర్లను కూడా వేటాడేస్తామంటూ కదనరంగంలోకి దిగారు. ఇప్పటికే రెండు సోనాబోట్లను స్వాధీనం చేసుకున్నారు.



దాడిలో పట్టుకున్న కడలూరు బోటును నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె పోర్టుకు వెంటబెట్టుకుని తీసుకుని వస్తున్న రెండు జిల్లాల మత్స్యకారులు

కన్నీళ్లే.. ఆయుధాలై

కడలూరు సోనాబోట్లపై ఏపీ మత్స్యకారుల దండయాత్ర

- కడలిలో తమిళనాడు కడలూరు బోట్ల ఆగడాలు
- నిత్యం 80 బోట్లతో దాడులు
- విలువైన మత్స్య సంపద దోపిడీతో పాటు వలలు ధ్వంసం
- మారణాయుధాలతో మత్స్యకారులపై దాడులు
- స్పందించని కూటమి ప్రభుత్వం
- ఈనెల 11, 19 తేదీల్లో రెండు సార్లు వేట నిషేధం
- కడలూరు బోట్లపై దాడికి వెళ్లి తరిమికొట్టిన మత్స్యకారులు
- సోనాబోటు స్వాధీనం.. జువ్వలదిన్నె హార్బర్‌కు తరలింపు
- నెల కిందట ఒక బోటు స్వాధీనం

ఒంగోలు, టాస్క్‌ఫోర్స్: ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి నెల్లూరు, తిరుపతి జిల్లా తడ వరకూ సుమారు 281 కిలోమీటర్లు తీరప్రాంతం విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో మత్స్యకారులు ప్రాణాలు పణంగా పెట్టి చిన్న బోట్లతో వేట సాగిస్తున్నారు. మత్స్య సంపదను తెచ్చుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. వీరిపై మెకనైజ్డ్ (సోనా) బోట్లతో తమిళ జాలర్లు సమూహంలా వచ్చి మారణాయుధాలతో దాడులకు తెగబడుతున్నారు. రూ.లక్షల విలువైన వలలను ధ్వంసం చేస్తున్నారు. మత్స్య సంపదను దోచుకెళ్లిపోతున్నారు. తమిళనాడుకు చెందిన కడలూరు జాలర్లతో మన మత్స్యకారుల సమరం నిత్యకృత్యంగా మారింది. చేపల కోసం వేట చేయడం ఒక ఎత్తైతే, సముద్రంలో తమిళ జాలర్ల నుంచి కాపాడుకోవడం మరో ఎత్తుగా మారింది. చిన్న ఇంజిన్ ఉన్న బోట్లతో సముద్రంలో తీరం నుంచి 8 కి.మీ. లోపలే వేట సాగించుకోవచ్చు. ఇంకా లోపలికి వెళ్లి వేట సాగించుకోవచ్చు. ఇక ఇతర రాష్ట్రాలకు చెందిన జాలర్లు ఒడ్డు నుంచి 23 కి.మీ. అవతలి జలాల్లో మాత్రమే చేపల వేట చేసుకోవాల్సి ఉంటుంది. ఒడ్డు నుంచి సముద్రంలో 8 కి.మీ. వరకు మెకనైజ్డ్ బోట్లతో చేపల వేట చేయకూడదనే నిబంధనలు ఉన్నాయి. తమిళనాడులో వేల సంఖ్యలో ఈ రకం బోట్లు ఉన్నాయి. వీటిలో కనీసం 5 నుంచి 10 మంది వరకు మత్స్యకారులు ఉంటారు. అధునాతన వలలు, మారణాయుధాలతో మన ప్రాంతం వైపు వచ్చి దాడులు చేస్తున్నారు. వీరి నుంచి రక్షించాలని అధికారులను, పాలకులను కోరుతూ వస్తున్నారు. అయినా ఎలాంటి ఫలితం కనిపించలేదు..



జువ్వలదిన్నె పోర్టులో ఆగిన కడలూరు బోటును పరిశీలిస్తున్న మత్స్యకారులు

స్వీయ వేట నిషేధం..

మత్స్యకారులు ఎన్నోసార్లు జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకపోవటంతో చివరకు మత్స్యకారులు తమ సమస్యను తామే పరిష్కరించుకోవటానికి నడుం బిగించారు. చిన్నబోటుతో చేపల వేటకు వెళితే సముద్రంలో 60 నుంచి 80 వరకు సోనాబోట్లు చేపల వేట సాగిస్తూ మత్స్య సంపద కొల్లగొట్టడంతో పాటు లక్షలాది రూపాయల వలలు ధ్వంసం చేసేవని, దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సోనాబోట్ల కట్టడికి మన జిల్లాతోపాటు, పక్కనే ఉన్న నెల్లూరు జిల్లాకు చెందిన మత్స్యకార కాపులు ఈ నెల 11వ తేదీన సమావేశమయ్యారు. మూడు రోజుల పాటు వేట నిషేధం అని ప్రకటించారు. 12వ తేదీ రాత్రి గతంలో తాము వేటాడి నెల్లూరు జిల్లాలోని జువ్వలదిన్నె హార్బర్‌లో ఉంచిన కడలూరుకు చెందిన సోనాబోటును తీసుకుని సుమారు 80 మంది జాలర్లు కర్రలు, కేట్ బాల్స్, టపాసులు తీసుకుని తీరంలో సోనాబోట్ల వేట ప్రారంభించారు. ఆంధ్రా మత్స్యకారులు తమపై దాడికి వస్తున్నారని సమాచారం రావటంతో జాగ్రత్త పడ్డ కడలూరు జాలర్లు పారిపోయారు. నిషేధకాలం పూర్తయిన తరువాత నాలుగు రోజుల పాటు మత్స్యకారులు చేపల వేట కొనసాగించగా ఈనెల 18వ తేదీ గురువారం రాత్రి సోనాబోట్లు తీరానికి దగ్గరగా వచ్చి లక్షలాది రూపాయలు వలలు తెంచుకుని చేపల వేట సాగించారు. ఈసారి కడలూరు బోట్లను వదిలేది లేదని నిశ్చయించుకున్నారు. తిరిగి 19వ తేదీ చేపల వేట నిషేధం అని మత్స్యకార గ్రామాల్లో రెండవసారి దండోరా వేయించారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో మత్స్యకారుల సమస్యను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి దృష్టికి తీసుకుని వెళ్లారని, సీఎం చంద్రబాబు కూడా స్పందించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్న విషయం అప్పట్లో సోషల్ మీడియాలో కూడా వైరల్ అయింది.

ఏడాదిన్నరగా నిరీక్షణ..

అయినా సంవత్సరం దాటినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మత్స్యకారుల విజ్ఞప్తితో అద్దెకు స్పీడ్‌బోటు తీసుకుని కొద్దిరోజుల పాటు సోనాబోట్లను అడ్డుకునే ప్రయత్నం చేసింది. కానీ కూటమి ప్రభుత్వంలో మాత్రం మత్స్యకారుల బాధలు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో విసుగు చెందిన మత్స్యకారులు సమస్యను వారే పరిష్కరించుకోవాలని నిర్ణయించుకున్నారు.

గురువారం రాత్రి తమిళ జాలర్లు దాడులు చేయడమే కాకుండా మన ప్రాంత మత్స్యకారులను అవమానించే రీతిలో వ్యవహరించారు. దీంతో వారికి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారు. శుక్రవారం రాత్రి నెల్లూరు జిల్లా కొడవలూరు సమీపంలోని కొనపూడి సముద్ర తీరంలో సోనాబోట్లతో చేపల వేట సాగిస్తున్న సమాచారం అందింది. వెంటనే రెండు జిల్లాల మత్స్యకారులు అక్కడకు బయలుదేరారు. వారిని అడ్డుకున్నారు.

సోనాబోట్లపై ఎదురుదాడి..

బోటును స్వాధీనం చేసుకుని విజయం సాధించారు. ఆ బోట్లలో మారణాయుధాలతో పాటు, 15 మంది వరకూ తమిళ మత్స్యకారులు ఉన్నట్టు తెలిసింది. ఇదిలా ఉండగా గత నెలలో సైతం తమిళజాలర్లను తరిమికొట్టి ఒక సోనాబోటును స్వాధీనం చేసుకుని జువ్వలదిన్నె హార్బర్‌లో ఉంచారు. సుమారు నెల రోజులు దాటినా ఇంత వరకు తమిళనాడు మత్స్యకారులు ఎవరూ ఈ బోటు కోసం వచ్చిన దాఖలాలు లేవని తెలిసింది. తాజాగా మరో బోటును కూడా స్వాధీనం చేసుకుని దాన్ని కూడా జువ్వలదిన్నెకు తరలించినట్టు సమాచారం. ఇకపై ఎవరు సహకరించినా, సహకరించకపోయినా వెనక్కి తగ్గేదే లేదని ఇకపై తమిళనాడు సోనాబోట్లకు చుక్కలు చూపిస్తామని మత్స్యకారులు హెచ్చరిస్తున్నారు.

బంగారుపాళ్యం మొగిలి ఘాట్ వద్ద రెండు రోజులకు క్రితం ఓవర్ లోడ్‌తో పలమనేరు వైపు నుంచి వస్తున్న ఓ గ్రానైట్ లారీ ఇంకో లారీని ఢీకొట్టింది. ఆ లారీ బిల్లులను తనిఖీ చేయగా చిత్తూరు అసోసియేషన్ పేరిట ఉంది. తీరా.. దాన్ని పూర్తి స్థాయిలో పరిశీలిస్తే అది దొంగ బిల్లు అని తేలింది.

చిత్తూరు జిల్లాలో ఇదొక్కటే కాదు. వందలాది లారీలు దొంగ బిల్లులు సృష్టించుకుని గ్రానైట్‌ను విచ్చలవిడిగా తరలిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో కూరుకుపోయి అటువైపు కన్నెత్తి చూసేందుకూ తీరిక లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గ్రానైట్.. రైట్ రైట్!

- చిత్తూరు జిల్లాలో విచ్చలవిడిగా గ్రానైట్ దోపిడీ
- సీనరేజ్ లేదు.. అన్నీ దొంగ బిల్లులే
- బిల్లుల్లో కూటమినేతల హస్తం
- చిత్తూరు కేంద్రంగా నడుస్తున్న వైనం

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఇందులో భాగంగానే ఇటీవల గ్రానైట్ అక్రమ తరలింపు వ్యవహారం పెచ్చుమీరుతోంది. ప్రభుత్వానికి రావలసిన రాయల్టీ చెల్లించకుండా అక్రమార్కులు అడ్డదారిలో గ్రానైట్‌ను తరలిస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. గ్రానైట్ రాయి అక్రమ తరలింపు వ్యవహారంలో అక్రమార్కులు అడ్డదారులను ఎంచుకుంటున్నారు. ఎక్కడికక్కడ తమ మనుషులతో గస్తీ నిర్వహిస్తూ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్నారు. చిత్తూరు జిల్లాలో లభించే గ్రానైట్ రాయిని అక్రమంగా లారీల ద్వారా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. జిల్లాలో 400 వరకు క్వారీలు నడుస్తుండగా.. ఇందులో చాలా చోట్ల కోట్లాది రూపాయల విలువ చేసే గ్రానైట్ దిమ్మెలు మాయమవుతున్నాయి. చిత్తూరు, యాదమరి, బంగారుపాళ్యం, పాలసముద్రం, కుప్పం, గంగాధరనెల్లూరు, ఎస్ఆర్‌పురం, పూతలపట్టు తదితర మండలాల నుంచి ఈ వ్యవహారం జోరుగా సాగుతోందనే ఆరోపణలు వినిస్తున్నాయి.

గ్రానైట్ తరలింపునకు ఇలా..

క్వారీల నుంచి గ్రానైట్ దిమ్మెలు బయటపడితే.. వాటి విలువను అధికారులకు నివేదించుకోవాలి. తరలింపునకు అనుమతులు తీసుకోవాలి. ఈ మేరకు మైనింగ్ శాఖ అధికారులు గ్రానైట్ బండను కొలతలు వేసి లెక్కకట్టాలి. తర్వాత ఆన్‌లైన్ ద్వారా అనుమతులువస్తాయి. ఆపై రాఘవకన్‌స్ట్రక్షన్ రాయల్టీ కడితే తరలింపునకు అనుమతులు లభిస్తాయి. దీంతో పాటు క్వారీ నిర్వాహకులకు స్టేషనరీ నిర్వహణ ఉంటుంది. బార్‌కోడ్‌తో ఉన్న ఈ బిల్లుల్లో గ్రానైట్ తరలింపు వివరాలు పొందుపరచాలి. అయితే వీటిని లెక్కచేయకుండా కొందరు కూటమి నేతలు కాసులు దండుకునే పనిలో పడ్డారు. అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారు.

దొంగబిల్లుల రారాజు ఎవరు?



ఓ అసోసియేషన్ పేరుతో ఉన్న గ్రానైట్ బిల్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొందరు నేతల కన్ను గ్రానైట్‌పై పడింది. వారు క్వారీలపై పడి కాసులు పిండుకునే పనిలో నిమగ్నమైపోయారు. ఈ క్రమంలో రాయల్టీ వసూళ్లకు బాధ్యతలు ఉన్న సంస్థను తోసిపుచ్చారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని బిల్లులే లేకుండా చాలా వరకు గ్రానైట్‌ను అమ్ముకుంటున్నారు. దీనికి తోడు దొంగ బిల్లులతో గ్రానైట్ దందాకు ఆజ్యంపోస్తున్నారు. సంస్థలు, అసోసియేషన్లను తెరపైకి తీసుకొచ్చి గ్రానైట్ దందాల్లో కోట్లాకు పడగెత్తుతున్నారు. తద్వారా రాయల్టీకి డుమ్మా కొడుతున్నారు. అయితే ఈ బినామీ సంస్థకు రూపశిల్పి... ఆ 'రా' రాజు ఎవరనేది ఇప్పుడు జిల్లాంతా హాట్‌టాపిక్‌గా మారింది.



అధికారులకు పట్టదా..?

గ్రానైట్ ఆక్రమ తరలింపును అడ్డుకునేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీన్ని కట్టడి చేయాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉంటున్నారు. గ్రానైట్ లారీలు రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నా.. అధికారులు మామూళ్ల మత్తులో పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. భూగర్భ గనుల శాఖ అధికారులు వీటిపై దృష్టిపెడితే ఈ అక్రమాలకు ఎప్పుడో చెక్ పడేది. ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోపాటు అక్రమార్కుల నుంచి ముడుపులు తీసుకుని అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మాకు సంబంధం లేదు

"ఆ బిల్లు చూశాం. అసోసియేషన్ పేరుతో ఉన్నాయి. దానికి మాకు ఎటువంటి సంబంధం లేదు. అదేదైనా ఉంటే వాళ్లను అడగండి. మాకు ఫిర్యాదులు వస్తే కచ్చితంగా స్పందిస్తాం. చర్యలు తీసుకుంటాం. తనిఖీలు చేస్తున్నాం.

– సత్యనారాయణ, మైనింగ్‌శాఖ డీడీ, చిత్తూరు

నారికేళం.. ధరహాసం

వరుస పండుగలతో పెరుగుతున్న కొబ్బరికాయ ధరలు

- రైతుల వద్ద వెయ్యి కాయలు రూ. 27 వేలు
- క్షేత్రాల్లో సైజును బట్టి రూ.30 నుంచి రూ.50కి విక్రయాలు
- ముందెన్నడూ ఇంత ధర లేకపోవడంతో రైతుల హర్షం
- కొనేందుకు వెనకాడుతున్న భక్తులు.. తగ్గిన విక్రయాలు



శ్రీవారి కొండపై ఓ దుకాణంలో కొబ్బరి కాయలు కొంటున్న భక్తులు

ద్వారకాతిరుమల: కొబ్బరికాయల ధర మరింత పెరిగింది. దీపావళి, ఆ తరువాత కార్తీకమాసం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కొబ్బరి కాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇప్పటికే కనీవినీ ఎరుగని రీతిలో ధరలు పెరగడంతో పలు క్షేత్రాలను సందర్శిస్తున్న భక్తులు కొబ్బరి కాయలు కొనలేక గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం రైతులు వెయ్యి కొబ్బరి కాయలను రూ. 27 వేలకు విక్రయిస్తున్నారు. చిన్నా, పెద్దా, లేత, ముదురు, ఎండు, పచ్చి అనే తేడా లేకుండా అన్ని రకాల కాయలను ఇదే ధరకు అమ్ముతున్నారు. ఇదిలా ఉంటే నెల రోజుల నుంచి రికార్డు స్థాయిలో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో కొబ్బరి కాయకు రూ.20 ధర రావడాన్ని రైతులు చూడలేదు. అలాంటిది ఊహించని విధంగా ఇప్పుడు ఇంత ధర పలుకుతుండటంతో రైతులు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. వరుస పండుగలు, ఆ తరువాత కార్తీకమాసం కావడంతో ధర అనూహ్యంగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితులను చూస్తే నారికేళం ధర ఇప్పట్లో దిగివచ్చేలా కనిపించడం లేదు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు

ప్రస్తుతం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోజుకు 70 లారీలకు పైగా కొబ్బరి కాయలు గుజరాత్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్‌కు ఎగుమతి అవుతున్నాయి. స్థానికంగా ధరల పెరుగుదలకు ఈ ఎగుమతులు కూడా ఒక కారణమని వ్యాపారులు చెబుతున్నారు. మహారాష్ట్ర నుంచి డిమాండ్ ఉంటే నెల క్రితమే ఒక్కో కొబ్బరి కాయ ధర రూ. 28కు చేరేదని అంటున్నారు.

మొక్కుబడులు వాయిదా..

కోరిన కోర్కెలు తీరడంతో శ్రీవారి క్షేత్రానికి మొక్కులు చెల్లించేందుకు వస్తున్న భక్తులు కొబ్బరి కాయల ధరలను చూసి హడలిపోతున్నారు. ఈ క్రమంలోనే 101, ఆపై కొబ్బరి కాయల మొక్కుబడి ఉన్న పలువురు భక్తులు తమ మొక్కులను వాయిదా వేసుకుంటున్నారు. సామాన్య భక్తులు సైతం అంత ధర పెట్టి కొబ్బరికాయను కొనేందుకు ఆలోచిస్తున్నారు. దాంతో కొందరు వ్యాపారులు కొబ్బరికాయ రేటు చెబితే భక్తులు కొనడం లేదని గ్రహించి, పూజా సామాగ్రితో కలిపి సెట్టు రూ.100కు విక్రయిస్తున్నారు. కొబ్బరికాయల ధరలు మరింతగా పెరిగితే వ్యాపారాలు సాగడం కష్టమేనని అంటున్నారు.

సైజును బట్టి ధర

పుణ్యక్షేత్రాల్లో వ్యాపారులు ఒక్కో కొబ్బరి కాయను రూ.30 నుంచి రూ.45కు విక్రయిస్తున్నారు. రైతుల నుంచి అన్ని సైజుల కాయలను ఒకే ధరకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, వాటిని గ్రేడింగ్ చేసి అతి చిన్న కాయను రూ.30కు, మీడియం సైజు కాయను రూ.35 నుంచి రూ. 40కు, పెద్ద కాయను రూ. 45 నుంచి రూ.50కు విక్రయిస్తున్నారు. దాంతో ద్వారకాతిరుమల దివ్య క్షేత్రాన్ని సందర్శిస్తున్న భక్తులు కొబ్బరి కాయలు కొనేందుకు గగ్గోలు పెడుతున్నారు.

సెప్టెంబర్ 27వ తేదీ వరల్డ్ టూరిజమ్ డే





వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్

ప్రకృతి పూలతోట

ఈ నెల 27వ తేదీ వరల్డ్ టూరిజమ్ డే.
ఓ గొప్ప పర్యటన చేసి తీరాలి. అది... ప్రపంచం గర్వించే ప్రదేశమై ఉండాలి.
అంతేనా... అది మనదేశంలోనే ఉండాలి. ఈ టూర్ జీవితమంతా గుర్తుండాలి.
మంచు కొండలను చీలుస్తూ పోదాం. ట్రెక్ దారులు వేసుకుంటూ నడుద్దాం.
నింగిలో విరిసిన పూల తోటలో విహరిద్దాం. ప్రకృతి సిగలో తురుముకున్న పూలను చూద్దాం.

ఐఆర్‌సీటీసీ... రైళ్లు, బస్సు, విమానాలు, క్రూయిజ్ టూర్‌లతోపాటు కొత్తగా ట్రెకింగ్ టూర్‌లను కూడా మొదలు పెట్టింది. వరల్డ్ టూరిజమ్ డే సందర్భంగా మనదేశంలో నెలకొన్న ప్రకృతి గీసిన అద్భుత చిత్రం 'వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ ట్రెకింగ్' అడ్వెంచరస్ టూర్ వివరాలు ఈ వారం ట్రావెల్‌లో..



1వ రోజు

రిషికేశ్ నుంచి పీపల్‌కోటికి ప్రయాణం. రిషికేశ్ నుంచి 200 కిమీల దూరం రోడ్డు మార్గాన ప్రయాణించాలి. ప్రయాణ సమయం తొమ్మిది నుంచి పది గంటలు. పీపల్‌కోటి నాలుగు వేల అడుగులకు పైగా ఉంటుంది.

కూడలి గ్రామం

రిషికేశ్ నుంచి పీపల్‌కోటికి పర్వత సానువుల మధ్య సాగే ప్రయాణంలో ప్రకృతి విచిత్రాలను ఆస్వాదిస్తూ ముందుకు సాగాలి. అలకనంద నది తీరాన ఉన్న చిన్న గ్రామం పీపల్‌కోటి. ఇక్కడ ప్రత్యేకంగా చూడాల్సిన క్షేత్రాల వంటివేవీ లేవు. చార్ ధామ్ యాత్రికులు, వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్, మాణా గ్రామ పర్యటనకు వెళ్లడానికి కూడలి పాయింట్.



2వ రోజు

పీపల్ కోటి నుంచి గోవింద ఘాట్‌కు (52 కిమీలు) రోడ్డు మార్గాన ప్రయాణం. ప్రయాణ సమయం రెండు గంటలు. అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరాన ఉన్న పుల్నాలోని ట్రెకింగ్ పాయింట్‌కు చేరడానికి 15 నిమిషాలు. పుల్నా నుంచి ఘంగారియాకు ట్రెకింగ్. ఈ రోజు ప్రయాణ లక్ష్యం 6,900 అడుగుల ఎత్తులో ఉన్న పుల్నా నుంచి 9.800 అడుగుల ఎత్తులో ఉన్న ఘంగారియా చేరడం. దూరం తొమ్మిది కిలోమీటర్లు ఉంటుంది. నాలుగు గంటల్లో చేరవచ్చు.



లక్ష్మణ గంగ తీరం

గోవింద్ ఘాట్ అనే ప్రదేశం చిన్న పట్టణం. అలకనంద నది, లక్ష్మణ గంగ సంగమిస్తాయిక్కడ. ఇది కూడా పై పర్యటన దారిలో తారసపడే ఒక జనావాసం. పర్యాటకం ఆధారంగా పట్టణంగా అభివృద్ధి చెందింది. పుల్నా గ్రామం కూడా ఇలాంటిదే. స్థానికులు పర్యాటకం మీదనే ఆధారపడి జీవిస్తుంటారు. వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్, హేమ కుండ్ సాహిబ్ పర్యాటకులకు తమ ఇళ్లలో హోమ్‌స్టే సౌకర్యం కల్పిస్తారు. ఇక ఘంగారియా విషయానికి వస్తే ఇది పుష్పవతి నది తీరాన విలసిల్లిన నివాసప్రదేశం. దీనిని చివరి నివాస ప్రదేశం అని చెప్పవచ్చు. ఇక్కడి నుంచి పైకి వెళ్లే కొద్దీ పర్యాటకులు తప్ప నివాస ప్రదేశాలు ఉండవు. ఘంగారియా గ్రామం కూడా ఏడాదిలో మూడు నెలలు (జూన్- అక్టోబర్) మాత్రమే మనుష్య సంచారంతో ఉంటుంది. మిగిలిన కాలమంతా మంచు కప్పేసి ఉంటుంది.





3వ రోజు

ఘంగారియా నుంచి వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్‌కు ట్రెకింగ్. తిరిగి ఘంగారియాకు చేరడం. ఈ రోజు పర్యటనలో చేరే లక్ష్యం 11,500 అడుగుల ఎత్తు. దూరం నాలుగు కిలోమీటర్లు. వెనక్కి రావడానికి మరో నాలుగు కిలోమీటర్లు.

ప్రకృతి చీరకు రంగుల పూలు

ఘంగారియా నుంచి వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్‌కు వెళ్లే దారి ఆద్యంతం రంగులమయమే. తలెత్తి చూస్తే నీలాకాశంలో తేలాడుతున్న వెండి మబ్బులు, ఆ మబ్బుల కంటే ఎత్తులో ఉన్న పచ్చటి శిఖరాలు, దూరంగా మంచుదుప్పటి కప్పుకున్న వెండి కొండలు, కిందకు చూస్తే పచ్చటి చీర మీద రంగు రంగుల పూలను ఎంబ్రాయిడరీ చేసినట్లు ఉంటుంది నేల. బ్లూ పాపీ, స్నేక్ ఫాయిల్, వైట్ లీఫ్ హోగ్ ఫుట్, హిమాలయన్ రేంజ్, మిడోస్ జెరానియమ్, డాగ్ ఫ్లవర్, హూక్‌డ్ స్టిక్ సీడ్, రివర్ అనేమోన్... వంటి ఇంగ్లీష్ పేర్లు చెబుతారు. అంతే తప్ప వాటికి స్వదేశీ నామాలను స్థానిక గైడ్‌లు కూడా చెప్పలేరు. మన దగ్గర 'సీతమ్మ వారి జడకుచ్చులు' అని పిలిచే ముఖమల్ వస్త్రం వంటి పూలు అక్కడక్కడా కనిపిస్తాయి. వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే నేల మీద విరిసిన ఇంద్రధనస్సు అనాలి. అన్నట్లు ఇది వరల్డ్ హెరిటేజ్ సైట్ గుర్తింపు పొందిన ప్రదేశం. పూల చెట్ల మధ్య రకరకాల జంతువులు కూడా విహరిస్తుంటాయి. అవి మంచును తట్టుకోగలిగిన దేహదారుఢ్యంతో పుష్టిగా ఉంటాయి. మనం వాటిని ఆశ్చర్యంగా చూస్తాం, కానీ అవి మాత్రం పర్యాటకులను చిరపరిచితులన్నట్లు ఒకసారి అలా చూసి వెళ్లిపోతుంటాయి.



4వ రోజు

ఘంగారియా నుంచి హేమ్‌కుండ్ సాహిబ్‌కు ట్రెకింగ్. తిరిగి ఘంటారియాకు చేరడం. ఈ రోజు లక్ష్యం 14,100 అడుగుల ఎత్తుకు చేరడం. ఘంగారియా నుంచి హేమ్‌కుండ్ సాహిబ్‌కు దూరం ఆరు కిలోమీటర్లు. రెండు వైపులా ట్రెకింగ్‌కు తొమ్మిది గంటల సమయం పడుతుంది.

బ్రహ్మకమలం విరిసింది!

హేమకుండ్ సాహిబ్ కూడా ఓ మోస్తరు పట్టణం మాత్రమే. సిక్కుల పవిత్ర తీర్థం. ఇక్కడి హేమకుండ్ సరస్సు మంచులా గట్టి పడి ఉంటుంది. గురుద్వారాకు నడిచి వెళ్లే దారి మొత్తం రెండు అడుగుల మందాన మంచు పేరుకుపోయి ఉంటుంది. పర్యాటకుల కోసం మంచును తవ్వి దారి చేస్తారు. ఇక్కడ జూలై నుంచి సెప్టెంబర్ మధ్య బ్రహ్మ కమలాలు విరుస్తాయి. గురుద్వారా ముందున్న నీటి ఉపరితలం మంచు పలకలుగా మారిపోయి ఉంటుంది.



5వ రోజు

ఘంగారియా నుంచి పుల్నా కు తొమ్మిది కిలోమీటర్ల దూరం ట్రెకింగ్. ఐదు గంటల సమయం. పుల్నా నుంచి వాహనంలో గోవిందఘాట్‌కు 15 నిమిషాల ప్రయాణం. గోవిందఘాట్ నుంచి బదరీనాథ్ (25కిమీలు)కు గంట ప్రయాణం. అక్కడి నుంచి పీపల్‌కోటికి (75 కిమీలు) నాలుగు గంటల ప్రయాణం. సమయం, వాతావరణం అనుకూలించకపోతే బదరీనాథ్‌ను మినహాయిస్తారు. గోవింద్ ఘాట్ నుంచి బదరీనాథ్ మధ్య రోడ్డుకు అడ్డంగా కొండచరియలు విరిగి పడడం వంటి ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఏ రోజుకారోజు పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటారు.

తిరిగి వచ్చే దారి

వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ ట్రెకింగ్‌లో రెండవ రోజు పుల్నా నుంచి ఘంగారియాకు ప్రయాణించిన దారిలోనే మరోసారి ప్రయాణం సాగుతుంది. వెళ్లేటప్పుడు చూసిన వాటిని మరోసారి మనసారా ఆస్వాదించడానికి అనువైన సమయం ఇది. ట్రెకింగ్ మొదలు పెట్టినప్పుడు ట్రెకింగ్ తామున్న చోటు నుంచి పైకి చూస్తూ సాగుతుంటుంది. ఆకాశాన్నంటే పర్వత శిఖరాలకు చేరాలనే ఉత్సాహం ఉంటుంది. తిరిగి వచ్చేటప్పుడు ఆకాశం నుంచి నేల మీదకు దిగుతున్న భావన చాలా గొప్పగా ఉంటుంది. కిందకు చూస్తుంటే కంటికి కనిపించినంత మేర అందమైన ప్రకృతి చిత్రం అలరిస్తుంది.

6వ రోజు

పీపల్‌కోటి నుంచి రిషికేశ్‌కు ప్రయాణం. ప్రయాణం పది గంటలు పడుతుంది. రిషికేశ్‌కు చేరిన తర్వాత టూర్ ఆపరేటర్‌లు వీడ్కోలు చెబుతారు. పర్యాటకులు రిషికేశ్ నుంచి తమ సొంత స్థానాలకు రావడానికి రైలు లేదా విమాన ప్రయాణానికి మధ్య ఒకరోజు విరామం తీసుకోవడం మంచిది. ఆ రోజు రిషికేశ్ పర్యటన, విశ్రాంతికి కేటాయించుకోవచ్చు.

గంగాతీరాన ఒకరోజు

రిషికేశ్‌లో ఒక రోజు చూడగలిగిన ప్రదేశాల్లో త్రివేణీ ఘాట్, త్రివేణీ ఘాట్‌లో సాయంకాలం గంగా హారతి, లక్ష్మణ్ ఝూలా, రామ్‌ఝూలా, పరమార్థ నికేతన్ ఆశ్రమ్, స్వర్గ ఆశ్రమ్‌లోని ప్రాచీన రాతి వలయాకారపు ఆశ్రమాలు, వశిష్ఠ గుహ, రిషికుండ్, భారత్‌మందిర్, తారా మంజిల్ టెంపుల్. రిషికేశ్‌లో పర్యాటక ప్రదేశాలను పర్యాటకులు సొంతంగా చూడాలి. ప్యాకేజ్‌లో లేవు. పీపల్‌కోటి నుంచి ట్రెకింగ్ టూర్ మొదలు కావడానికి ఒక రోజు ముందుగా రిషికేశ్ చేరిన వాళ్లు సాయంత్రం గంగాహారతిని మిస్ చేసుకోవద్దు.

ప్యాకేజ్ వివరాలివి

- ట్రెక్ పేరు 'వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ ట్రెక్. ఇది ఆరు రోజుల పర్యటన. ఉత్తరాఖండ్ రాష్ట్రం, పీపల్‌కోటి నుంచి మొదలవుతుంది. రిషికేశ్ నుంచి టూర్ మొదలవుతుంది. ట్రెకర్‌లు రిషికేశ్ వరకు తమకు తాముగా చేరుకోవాలి. రిషికేశ్‌లో టూర్ నిర్వాహకులు రిసీవ్ చేసుకుంటారు. రిషికేశ్ వరకు ట్రైన్‌లో వెళ్లవచ్చు. రిషికేశ్‌కు సమీప విమానాశ్రయం జాలీ గ్రాంట్ ఎయిర్‌పోర్ట్, డెహ్రాడూన్‌లో ఉంది. 21 కిమీల దూరం.
- ఈ ఆరు రోజుల యాత్రకు ఒక్కొక్కరికి 11,800 రూపాయలవుతుంది.
- వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ ట్రెకింగ్‌కి అనువైన ప్రదేశం. నిజానికి దీనిని లెర్నర్స్ ట్రెక్ అనాలి. పెద్ద పెద్ద ట్రెకింగ్‌కి ఇది ప్రాక్టీస్‌గా పనికి వస్తుంది.

ఫిట్‌నెస్ ఇలా ఉండాలి!

ట్రెకింగ్‌కు బయలుదేరడానికి కనీసం నెల ముందు దేహాన్ని సంసిద్ధం చేసుకోవాలి. ఫిట్‌నెస్ మెయింటెయిన్ చేయడానికి రోజూ ఐదు కిలోమీటర్ల దూరం జాగింగ్35 నిమిషాల్లో పూర్తి చేయాలి. జాగింగ్ పూర్తయ్యేటప్పటికి విపరీతంగా అలసిపోయిన ఫీలింగ్ లేకుండా నార్మల్‌గా ఉండగలగాలి. సైక్లింగ్ ప్రాక్టీస్ చేసే వాళ్లయితే అరగంట సమయంలో 10 కిలోమీటర్లు వెళ్లగలగాలి.

- అవసరమైన వస్తువులతో నిండిన బ్యాక్ ప్యాక్ పది నుంచి పన్నెండు కిలోలుంటుంది. ట్రెకింగ్ సమయమంతా దానిని మోయగలిగిన శక్తి ఉండాలి.
- బాడీ మాస్ ఇండెక్స్ 18-29 మధ్యలో ఉంటేనే దేహం ట్రెకింగ్ తగినట్లు శక్తిమంతంగా ఉంటుంది.
- పల్స్ రేట్ నిమిషానికి 60- 100 మధ్య ఉండాలి. బ్లడ్ ప్రెషర్ డయస్టోలిక్ 75-85 మధ్య, సిస్టోలిక్ 100- 130 మధ్య ఉండాలి.
- ఉచ్ఛ్వాసనిశ్వాసలు నిమిషానికి 12 నుంచి 20 మధ్య ఉండాలి.
- లివర్, కిడ్నీ సమస్యలు, డయాబెటిస్, బ్రాంకైల్ ఆస్మా, హార్ట్ ప్రాబ్లమ్స్, హైబీపీ, సైనసైటిస్, ఎపిలెప్సీ వంటివి ఉండకూడదు.
- పేస్‌మేకర్ ఇంప్లాంట్ చేసుకున్న వారు ట్రెకింగ్‌కు వెళ్లరాదు. పై కొలతలు కొంచెం అటూ ఇటూగా ఉన్నప్పటికీ ఫిట్‌నెస్ పరంగా దృఢంగా ఉంటే ట్రెక్ కో ఆర్డినేటర్‌ను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి.
- ఈ ట్రెకింగ్‌లో 14,100 అడుగుల ఎత్తుకు చేరతారు కాబట్టి ఆల్టిట్యూడ్ సిక్‌నెస్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కార్డియో వర్కవుట్స్, రన్నింగ్, బ్రిస్క్ వాకింగ్, మెట్లు ఎక్కడం వల్ల ఊపిరితిత్తులు ఆక్సిజెన్‌ను ఎక్కువ మోతాదులో తీసుకుంటాయి. ట్రెకింగ్‌కు ముందు కనీసం నెల రోజులు వీటిని సాధన చేస్తే లంగ్ కెపాసిటీని మెరుగవుతుంది. ట్రెకింగ్ టూర్‌ని ఆద్యంతం ఆస్వాదించవచ్చు.

ఏ వయసు వాళ్లు ట్రెకింగ్ చేయవచ్చు!

తొమ్మిది సంవత్సరాలు నిండిన పిల్లలను కూడా ట్రెకింగ్‌కి అనుమతిస్తారు. కానీ వారితోపాటు తల్లిదండ్రులు కూడా ట్రెకింగ్ టీమ్‌లో ఉండాలి.

- 15 సంవత్సరాల నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలను ఒంటరిగా (తల్లిదండ్రులు వెంట లేకపోయినా) ట్రెకింగ్‌కి అనుమతిస్తారు. కానీ తల్లిదండ్రులు అనుమతి పత్రం మీద సంతకం చేయాల్సి ఉంటుంది.
- 18 ఏళ్లు దాటిన వారికి తల్లిదండ్రుల అనుమతి అవసరం లేదు.
- గరిష్ఠ వయసు విషయానికి వస్తే ప్రత్యేకంగా నిబంధనల కంటే ఆరోగ్య నిర్ధారణ చేస్తూ డిస్‌క్లెయిమర్ ఫార్మ్ సంతకం చేసి ఇవ్వాలి.
- వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ ట్రెకింగ్ టూర్ కోడ్: https://www.irctctourism.com/adventure/trekDetails?id=48


ఏమేమి తీసుకెళ్లాలి?

బ్యాక్‌ప్యాక్, రెయిన్ కవర్, వాకింగ్ స్టిక్, వాటర్ బాటిల్, లంచ్ బాక్స్, స్నాక్స్, పర్సనల్ మెడికల్ కిట్, సింథటిక్ టీ షర్ట్, ఫ్లీస్ టీ షర్ట్, ఫ్లీస్ జాకెట్, విండ్ ప్రూఫ్ జాకెట్, హాలో జాకెట్, థర్మల్ ఇన్నర్, ట్రెక్ ప్యాంట్, ఫ్లీస్ ప్యాంట్, వాటర్ ప్రూఫ్ గ్లవ్స్, ఉలెన్ గ్లవ్స్, హెడ్ టార్చ్, సన్ క్యాప్, ఉలెన్ క్యాప్, నెక్ గెయిటర్స్, సన్ గ్లాసెస్, సన్ స్క్రీన్ లోషన్, మాయిశ్చరైజర్, లిప్ బామ్, టూత్ బ్రష్- పేస్ట్, టాయిలెట్ పేపర్- వైప్స్, సబ్బు, హ్యాండ్ శానిటైజర్, ట్రెకింగ్ షూస్, ఫ్లిప్ ఫ్లాప్స్ లేదా ఫ్లోటర్స్, కాటన్ సాక్స్, ఉలెన్ సాక్స్, వాటర్ ప్రూఫ్ జాకెట్- ప్యాంట్స్, మైక్రో స్పైక్స్, యాంటీ బ్యాక్టీరియల్ పౌడర్, క్విక్ డ్రై టవల్.



- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి










ఉత్పత్తి అమ్మడానికి మాత్రమే కాదు,
విలువ అందించడానికి సృష్టించాలి
- పీటర్ డ్రక్కర్, అమెరికన్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్, రచయిత

సాక్షి ప్లస్
సోమవారం। 22-9-2025

ఈప్యాక్ ప్రీఫ్యాబ్ @ రూ. 194-204

ఐపీవో స్ట్రీట్


ఈ నెల 24-26 మధ్య ఐపీవో ● రూ. 504 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: ప్రీఇంజనీర్డ్ బిల్డింగ్ సొల్యూషన్లు అందించే ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 194–204 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 24న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 204 కోట్ల విలువైన కోటి షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి 26న ముగియనున్న ఇష్యూ ద్వారా గ్రేటర్ నోయిడా కంపెనీ రూ. 504 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 102 కోట్లతో రాజస్తాన్‌లోని అల్వార్, గిలోత్ పారిశ్రామిక ప్రాంతంలో కొత్త తయారీ యూనిట్ నెలకొల్పనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని మాంబట్టులోగల ప్లాంటు విస్తరణకు రూ. 58 కోట్లు వెచ్చించనుంది. తద్వారా ప్రీఇంజనీర్డ్ స్టీల్ బిల్డింగ్ సామర్థ్యాన్ని పెంచుకోనుంది. రుణ చెల్లింపులకు మరో రూ. 70 కోట్లు కేటాయించనుంది. 2024 డిసెంబర్‌కల్లా కంపెనీ గ్రేటర్ నోయిడా(యూపీ), గిలోత్(రాజస్తాన్), మాంబట్టు(ఆంధ్రప్రదేశ్)లలో తయారీ యూనిట్లను కలిగి ఉంది. వీటితోపాటు నోయిడా, హైదరాబాద్(తెలంగాణ), విశాఖపట్టణం(ఆంధ్రప్రదేశ్)లలో డిజైన్ సెంటర్లను నిర్వహిస్తోంది.

జైన్ రిసోర్స్ @ రూ. 220-232

- ఈ నెల 24–26 మధ్య ఐపీవో
- రూ. 1,250 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: రీసైక్లింగ్ ద్వారా నాన్‌ఫెర్రస్ మెటల్ ప్రొడక్టులను తయారు చేసే జైన్ రిసోర్స్ రీసైక్లింగ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 220–232 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 24న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 750 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్ కమలేష్ జైన్(రూ. 715 కోట్లు), ప్రస్తుత వాటాదారుడు మయాంక్ ప్రతీక్(రూ. 35 కోట్లు) విక్రయానికి ఉంచనున్నారు. వెరసి 26న ముగియనున్న ఇష్యూ ద్వారా తమిళనాడు కంపెనీ రూ. 1,250 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. లిస్టింగ్‌లో కంపెనీ విలువ రూ. 8,000 కోట్లుగా నమోదయ్యే వీలున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 64 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. కంపెనీ ప్రధానంగా నాన్‌ఫెర్రస్ మెటల్ స్క్రాప్ నుంచి నాన్‌ఫెర్రస్ మెటల్ ప్రొడక్టులను రూపొందిస్తోంది. ప్రొడక్టుల జాబితాలో లెడ్, లెడ్ అల్లాయ్ ఇన్‌గాట్స్, కాపర్, కాపర్ ఇన్‌గాట్స్, అల్యూమినియం, అల్యూమినియం అల్లాయ్స్ తదితరాలున్నాయి. అంతేకాకుండా నాన్‌ఫెర్రస్ మెటల్స్, ఇతర కమోడిటీల ట్రేడింగ్‌ను సైతం చేపడుతోంది. షార్జాలో గోల్డ్ రిఫైనింగ్ యూనిట్ ఏర్పాటుకుగాను ఐకాన్ స్క్వేర్ లిమిటెడ్(యూఏఈ)తో జైన్ రిసోర్స్ చేతులు కలిపింది.

హెచ్1బీ, జీఎస్‌టీ ఎఫెక్ట్

ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లను పలు అంశాలు ప్రభావితం చేయనున్నాయి. వారాంతాన యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ హెచ్1బీ వీసా ఫీజును ఏకాఏకిన లక్ష డాలర్ల(రూ. 88 లక్షలు)కు పెంచేయడం, గత వారం 0.25 శాతం వడ్డీ రేట్లను తగ్గించిన యూఎస్ ఫెడ్ చైర్మన్ పావెల్ భవిష్యత్ విధానాలపై ప్రసంగించనుండటం వంటి అంశాలు ప్రధానంగా సెంటిమెంటుకు కీలకంగా నిలవనున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. వివరాలు చూద్దాం.. - సాక్షి, బిజినెస్ డెస్క్



ఐటీ పరిశ్రమకు సవాళ్లు- షేర్లు డీలా

- ఆటో, ఎఫ్‌ఎంసీజీ వైట్‌గూడ్స్ జోష్
- ఫెడ్ చైర్మన్ ప్రసంగంపై ఇన్వెస్టర్ల దృష్టి
- మార్కెట్ల ట్రెండ్‌పై నిపుణుల అంచనా

దేశీయంగా స్టాక్ మార్కెట్లకు ఈ వారం కీలకంగా నిలవనుంది. గత వారం జూలై తదుపరి ప్రధాన ఇండెక్సులు బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ గరిష్టాలకు చేరాయి. అయితే ఇకపై వీటి పరుగును దేశ, విదేశీ అంశాలు ప్రభావితం చేయనున్నట్లు మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. దేశీయంగా ఈ(సెప్టెంబర్) నెలకు హెచ్ఎస్‌బీసీ కాంపోజిట్, తయారీ, సర్వీసుల పీఎంఐ ఫ్లాష్ అంచనాలు వెలువడనున్నాయి. ఇక గత వారాంతాన ఉన్నట్టుండి యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ హెచ్1బీ వీసా ఫీజును 3,000–5,000 డాలర్ల నుంచి ఏకంగా 1,00,000 డాలర్లకు పెంచేయడం ఐటీ పరిశ్రమలో సంచలనానికి తెరతీసింది. దీంతో యూఎస్ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన దేశీ ఐటీ దిగ్గజాల షేర్లు(ఏడీఆర్‌లు) అమ్మకాలతో డీలాపడ్డాయి. ఈ ప్రభావం నేడు(సోమవారం) కనిపించే వీలున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు. దీనికితోడు ఐటీ పరిశ్రమలో కొన్నేళ్లుగా పెరిగిపోయిన ఆన్‌సైట్ సర్వీసులపై ఈ ప్రభావం పడవచ్చని అభిప్రాయపడ్డారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే తిరిగి ఆఫ్‌షోర్ విధానానికి ప్రాధాన్యత పెరగవచ్చని అంచనా వేశారు. 285 బిలియన్ డాలర్ల విలువైన దేశీ ఐటీ పరిశ్రమలో ఆఫ్‌షోర్ ప్రాజెక్టులపై ప్రతికూల ప్రభావం పడనున్నట్లు ఐటీ పరిశ్రమల సమాఖ్య నాస్కామ్ పేర్కొంది. ఇప్పటికే ఎగుమతి ఆధారిత రంగాలు ట్రంప్ విధించిన అదనపు టారిఫ్‌లతో డీలాపడినట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు. హెచ్1బీ వీసాల జారీలో భారత నిపుణుల వాటా 70 శాతంకాగా.. దేశీ ఐటీ దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రోకు సెగ తగిలే వీలున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ ప్రవేష్ గౌర్ వివరించారు.

జీఎస్‌టీ దన్ను

నేటి నుంచి వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) సంస్కరణలు అమల్లోకిరానుండటంతో ఆటోమొబైల్, వైట్ గూడ్స్, ఎఫ్‌ఎంసీజీసహా పలు రంగాలలోని కంపెనీలకు జోష్ లభించనున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. కొనుగోళ్లు పెరిగి వ్యవస్థలో డిమాండ్ బలపడే వీలున్నట్లు అంచనా వేశాయి. ఇది పెట్టుబడులకు, ఉద్యోగాలకు ప్రోత్సాహాన్నిచ్చే వీలున్నట్లు అభిప్రాయపడ్డాయి. ప్రధానంగా జీఎస్‌టీని రెండు శ్లాబులు 5 శాతం, 18 శాతంగా క్రమబద్ధీకరించడంతో పట్టణ ప్రాంతాలలోనూ డిమాండ్ ఊపందుకోనున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. 40 శాతం శ్లాబులోకి మరికొన్ని ప్రొడక్టులను చేర్చినప్పటికీ జీవిత, ఆరోగ్య బీమాపై జీఎస్‌టీని రద్దు చేయడం, 375 వస్తువులపై జీఎస్‌టీ తగ్గింపు వినియోగానికి దారి చూపనున్నట్లు తెలియజేశారు. కాగా.. వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ అధ్యక్షతన ఈ నెల 22 నుంచి యూఎస్‌తో వాణిజ్య టారిఫ్‌లపై చర్చలు ప్రారంభంకానున్నట్లు దేశీ ప్రభుత్వం వారాంతాన వెల్లడించింది.

ఇతర అంశాలు

కొద్ది నెలలుగా సెకండరీ మార్కెట్లు ఆటుపోట్లను చవిచూస్తున్నప్పటికీ ప్రైమరీ మార్కెట్లు కళకళలాడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భవిష్యత్‌లోనూ మరిన్ని కంపెనీలు ఐపీవో ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు క్యూ కట్టనున్నట్లు పీఎల్ క్యాపిటల్ అడ్వయిజరీ హెడ్ విక్రమ్ కసట్ పేర్కొన్నారు. ఇక దేశీ మార్కెట్లలో ముడిచమురు ధరలు, డాలరుతో మారకంలో రూపాయి కదలికలు, విదేశీ ఇన్వెస్టర్ల తీరు తదితర అంశాలకు ప్రాధాన్యత ఉన్నట్లు నిపుణులు వివరించారు.

గత వారమిలా

గత వారం మార్కెట్లు వరుసగా మూడోసారి లాభాలతో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ నికరంగా 722 పాయింట్లు(0.9 శాతం) బలపడి 82,626 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 213 పాయింట్లు(0.85 శాతం) పుంజుకుని 25,327 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 1.5–2 శాతం చొప్పున ఎగశాయి.

సాంకేతికంగా

గత వారం అంచనాలనకు అనుగుణంగా మార్కెట్లు బ్రేకవుట్ బాటలో సాగాయి. దీంతో ఎన్ఎస్ఈ నిఫ్టీ 25,350 సమీపంలో ముగిసింది. అయితే ఈ వారం నిఫ్టీకి 25,500 పాయింట్ల వద్ద రెసిస్టెన్స్ కనిపించవచ్చు. ఆపై ఇటీవలి గరిష్టం 25,669 వద్ద అవరోధాలు ఎదురుకావచ్చు. ఒకవేళ బలహీనపడితే తొలుత 25,000 పాయింట్ల వద్ద మద్దతుకు వీలుంది. తదుపరి 24,650 వద్ద మరోసారి సపోర్ట్ లభించవచ్చు.

వెనకడుగులోనే ఎఫ్‌పీఐలు

ఈ నెలలో రూ. 7,945 కోట్ల అమ్మకాలు

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) దేశీ స్టాక్స్‌లో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఫలితంగా ఈ నెలలో ఇప్పటివరకూ నికరంగా రూ. 7,945 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. ఆగస్ట్‌లో రూ. 34,990 కోట్లు, జూలైలో రూ. 17,700 కోట్లు విలువైన స్టాక్స్ విక్రయించిన విషయం విదితమే. దీంతో ఈ కేలండర్ ఏడాది(2025)లో ఇప్పటివరకూ రూ. 1.38 లక్షల కోట్ల పెట్టుబడులను నికరంగా వెనక్కి తీసుకున్నారు. టారిఫ్‌లు, యుద్ధాలు తదితర ప్రపంచ అనిశ్చితులు ప్రభావం చూపుతున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. అయితే గత వారం యూఎస్ ఫెడ్ 0.25 శాతం వడ్డీ రేటు కోత పెట్టడంతో ఎఫ్‌పీఐలు నికరంగా రూ. 900 కోట్లు ఇన్వెస్ట్ చేశారు.

టాటా ఏఐఏ లైఫ్ నుంచి రెండు ఫండ్స్



టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ కొత్తగా రెండు ఫండ్స్ ఆవిష్కరించింది. టాటా ఏఐఏ సెక్టార్ లీడర్స్ ఇండెక్స్ ఫండ్, టాటా ఏఐఏ సెక్టార్ లీడర్స్ ఇండెక్స్ పెన్షన్ ఫండ్ వీటిలో ఉన్నాయి. ఈ న్యూ ఫండ్ ఆఫర్లు సెప్టెంబర్ 22తో ముగుస్తాయి. ఎన్ఎఫ్‌వో వ్యవధిలో యూనిట్ ధర రూ. 10గా ఉంటుంది. ఓవైపు జీవిత బీమా కవరేజీతో పాటు మరోవైపు వివిధ రంగాల్లో దిగ్గజాలుగా ఉన్న సంస్థల్లో ఇన్వెస్ట్ చేసేందుకు తోడ్పడేలా ఈ ఫండ్స్ ఉంటాయి. టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ యూనిట్ లింక్ సొల్యూషన్స్ ద్వారా వీటిలో ఇన్వెస్ట్ చేయొచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-9-2025

విశాఖ	540–00
చిత్తూరు	578–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550–00
విజయవాడ	560–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

సంపద సృష్టికి జీవిత బీమా అండ..



సమీర్ జోషి
చీఫ్ ఏజెన్సీ ఆఫీసర్, బజాజ్ అలయంజ్ లైఫ్ ఇన్సూరెన్స్

స్టాక్ మార్కెట్లో షేర్లను తక్కువ రేటుకు కొనుక్కుని, ఎక్కువ రేటుకు అమ్ముకోవాలనేది సాధారణంగా ప్రతి ఇన్వెస్టరు ధ్యేయంగా ఉంటుంది. ఇది వినడానికి సులభంగానే అనిపించినప్పటికీ, వాస్తవ ప్రపంచంలో దీన్ని ఆచరణలో పెట్టడం చాలా కష్టంగా ఉంటుంది. ఎందుకంటే మార్కెట్లు ఎటు వెళ్తాయనేది, కచ్చితమైన సమయంలో ఇన్వెస్ట్ చేయడమనేది దాదాపు అసాధ్యమైన విషయం. దీన్నే 'ఇన్వెస్ట్‌మెంట్ డైలమా' అంటారు. ఇలాంటి సందర్భాల్లో ఎస్ఐఎస్‌వో విధానం (సిస్టమాటిక్ ఇన్, సిస్టమాటిక్ ఔట్- సిసో) ఉపయోగకరంగా ఉంటుంది. అంటే మార్కెట్ హెచ్చుతగ్గుల గురించి పట్టించుకోకుండా ఒక క్రమపద్ధతిలో ఇన్వెస్ట్ చేయడం, అదే విధంగా క్రమపద్ధతిలో వెనక్కి తీసుకోవడం. యులిప్స్‌లాంటి జీవిత బీమా పథకాలకు ఈ విధానాన్ని జోడించడం ద్వారా జీవిత బీమా కవరేజీతో పాటు దీర్ఘకాలంలో సంపద సృష్టి ప్రయోజనాలను కూడా పొందవచ్చు. ఉదాహరణకు తొలి దశలో 'సిస్టమాటిక్ ఇన్' కింద మీరు ప్రతి నెలా నిర్దిష్ట మొత్తాన్ని యులిప్స్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లడం వల్ల యూనిట్ల సగటు కొనుగోలు ధర తగ్గుతుంది. యూనిట్ విలువ (ఎన్ఏవీ) మారే కొద్దీ మీరు పెట్టే పెట్టుబడికి ఒకోసారి యూనిట్లు పెరగొచ్చు మరోసారి తగ్గొచ్చు. దీని వల్ల అంతిమంగా సగటు రేటు తగ్గుతుంది. ఇక పోగుపడిన మొత్తాన్ని, పిల్లల చదువు కోసమో లేక రిటైర్మెంట్ అవసరాల కోసమో లేక మరో దాని కోసమో వెనక్కి తీసుకోవాల్సిన సమయం తర్వాతెప్పుడో వస్తుంది. అప్పుడు సిస్టమాటిక్ ఔట్ .. అంటే ఒక క్రమపద్ధతిలో వెనక్కి తీసుకుంటే స్థిరంగా ఆదాయాన్ని పొందేందుకు వీలుంటుంది.



బీమాకు 'సిసో'..

సాధారణంగా జీవిత బీమా అంటే భద్రత మాత్రమే కల్పించే సాధనంగా పరిగణిస్తారు. కానీ యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లలాంటివి (యులిప్‌లు) ఇటు పెట్టుబడి వృద్ధి అటు జీవితానికి కవరేజీ.. ఇలా రెండింటాల ప్రయోజనాలు కల్పిస్తాయి. సిసో వ్యూహంతో సంపద సృష్టి సాధనంగా కూడా ఇవి పని చేస్తాయి. సంపద పోగు చేసుకునే దశలో మీ ప్రీమియంలను ఈక్విటీ, డెట్ లేదా మీ రిస్కు సామర్థ్యాలు, పెట్టుబడి లక్ష్యానికి తగ్గట్లుగా ఉండే కాంబినేషన్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తాయి. అదే సమయంలో మీపై ఆధారపడిన కుటుంబసభ్యులకు ఆర్థిక భద్రత లభించేలా జీవిత బీమా కవరేజీని కూడా అందిస్తాయి. మీరు మీ ఆర్థిక లక్ష్యాన్ని చేరుకోవడానికి ముందు మీకు రావాల్సిన చెల్లింపులను సిస్టమాటిక్ ఔట్ విధానం కింద క్రమానుగతంగా పొందేలా ఎంచుకుంటే.. స్థిరంగా ఆదాయాన్ని అందుకోవచ్చు. ఆర్థిక స్వాతంత్ర్యం అనేది ఏదో సంక్లిష్టమైన బ్రహ్మపదార్థం కాదు. సిసో వ్యూహం అలాగే తగిన జీవిత బీమా పథకంతో మీరు లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చు. మార్కెట్ ప్రతి కదలికను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాల్సిన అవసరం లేకుండా ఆర్థిక ప్రణాళిక పట్టాలు తప్పకుండా చూసుకోవచ్చు.

టాక్స్ ఆడిట్ కేసులు... త్వరపడండి..!



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

టాక్స్–ఆడిట్ అవసరం లేని కేసులకు గడువు తేదీ 16.9.2025 తో ముగిసింది. ఆ ప్రహసనం ముగిసిన తరువాత అందరూ ఆడిట్ కేసుల మీద దృష్టి సారిస్తారు. ఒరిజినల్ గడువు తేది 30.9.2025. ముందు నుంచి ఇదే గడువు తేదీ. ఇప్పటి వరకు పొడగించలేదు. పొడిగించమని వినతులు వెళ్లాయి. కానీ కేంద్రం వైఖరి ఎలా ఉంటుందో చెప్పలేము. అటువంటి ఆశలు లేకుండా రంగంలోకి దూకుదాం.

టాక్స్ ఆడిట్... అంటే?

44 అఆ సెక్షన్ ప్రకారం కొంత టర్నోవర్/వసూళ్లు దాటిన అస్సెసీలకు టాక్స్ ఆడిట్ వర్తిస్తుంది. వీరంతా సీఏగా ప్రాక్టీసు చేస్తున్న వారి దగ్గర తమ అకౌంట్లు అన్నింటినీ ఆడిట్ చేయించాలి. ఈ ఆడిట్‌లో అకౌంట్స్ బుక్స్‌ని వెరిఫై చేస్తారు. ఫైనాన్షియల్ ఆడిట్, కాస్ట్ ఆడిట్, స్టాక్ ఆడిట్... ఇలాంటివి కాకుండా కేవలం ఈ చట్టం ప్రకారం చేసేది టాక్స్ ఆడిట్.

టాక్స్ ఆడిట్ ఉద్దేశం ఏమిటంటే...

- సరైన, సరిపోయినన్ని అకౌంట్ బుక్స్ నిర్వహణ.
- ఏవైనా తేడాలు, సర్దుబాట్లు, పొరపాట్లు మొదలైవని చెప్పడం
- ఎన్నో మినహాయింపులు ఉన్నాయి. రాయితీలు ఉంటాయి. తగ్గింపులుంటాయి. ఉదాహరణకు 'తరుగుదల'... ఇటువంటివి కరెక్ట్‌గా చూపించారా లేదా అనేది చెప్పాలి.
- టీడీఎస్, టీసీఎస్ సరిగ్గా లెక్కించారా? లెక్కించిన దానిని చెల్లించారా? సరైన మొత్తం సకాలంలో చెల్లించారా?
- పెనాల్టీలు, వడ్డీలు మొదలైనవి ఉన్నాయా? ఉంటే కట్టారా?
- అకౌంటింగ్ పాలసీలు... అకౌంటింగ్ పద్ధతులు... పద్ధతి మారితే కారణం, ఎందుకు మారింది. వాటి విలువెంత?
- కొన్ని అకౌంటింగ్ రేషియోలు... లాభ, నష్టాల శాతం, పెరుగుదల, వ్యత్యాసం ... ఇలా ఈ ఆడిట్ విశ్లేషణాత్మకంగా ఉంటుంది. లాభశాతంలో హెచ్చుతగ్గులకు వివరణ అడిగే అవకాశం ఉంది. డిపార్టుమెంటు వారు అరకొర సిబ్బందితో వారు చేయాల్సిన పనిని ఒక ఆడిట్ రూపంలో వృత్తి నిపుణులకు అంటగట్టారు. ఈ మేరకు బరువు, బాధ్యత వృత్తి నిపుణులదే. అందుకని ఈ ఆడిట్‌ని సీఏలు ఎంతో జాగ్రత్తగా పూర్తి చేసి సర్టిఫై చేస్తారు. అసెస్సీలు చట్టప్రకారం చేయాల్సిన పనులన్నీ... కాంప్లయన్స్ (COMPLIANCE) అయ్యాయా లేదా సీఏలు చెప్పాలి. క్లయింటు ఆర్థిక వ్యవహారాల్లో లాభ, నష్టాలు, ఆస్తి, అప్పులతో సహా తెలియజేసేది వాటిని విశ్లేషించేది.. ఇలా ఎన్నో విషయాల్లో ఈ పని చేశారా లేదా అని చెప్పే చెక్ లిస్ట్ తనిఖీ జాబితా. చేయాల్సిన పనులు, చేశారా లేదా అని తెలియజేసే పట్టిక. అకౌంటు బుక్స్ జాబితా, వ్యాపారం, వివరాలు, ఆస్తుల వివరణ, అప్పుల విశ్లేషణ, వ్యక్తిగత ఖర్చులు, క్యాపిటల్ ఖర్చులు ఎక్కడ చూపించారు. అన్నీ చట్ట ప్రకారం జరిగాయా లేదా? అని సీఏలు చేత చెక్ చేయించే ప్రక్రియ. కర్త, కర్మ అసెస్సీయే అయినా సంధానకర్త ఆడిటర్. టాక్స్ ఆడిటర్.

గడువు తేదీలు రెండు

ఈ నెలాఖరు లోపల టాక్స్ ఆడిట్ రిపోర్ట్‌ని అప్‌లోడ్ చేయాలి. ఇదొక గడువు తేది. దీని తర్వాత వచ్చే నెల అక్టోబర్ 31 లోపల రిటర్న్ చేయవచ్చు. మిగతా వారందరిలా కాకుండా టాక్స్ ఆడిట్ వారికి వెసులుబాటు ఏమిటంటే ఆడిట్ రిపోర్ట్ ఈ నెలాఖరు లోపల వేస్తే ఆదాయపన్ను రిటర్న్ వచ్చే నెల లోగా చేయవచ్చు. రెండూ ఒకసారి ఈ నెలలో వేసినా తప్పులేదు. ఆంక్షలూ లేవు. ఏది వేసి ఏది దాఖలు చేయకపోయినా మొత్తం ప్రక్రియ డిఫెక్టివ్ అయిపోతుంది. రిటర్న్ వేయనట్లే.

పెనాల్టీలు వడ్డీస్తారు

అమ్మకాల మీద 0.5%. అరశాతం లేదా రూ.1.50 లక్షలు ఏది తక్కువ అయితే అది పెనాల్టీగా చెల్లించాలి. ఖర్చులను ఒప్పుకోకపోవచ్చు. అంటే పన్ను భారం పెరుగుతుంది. పన్ను పెరగడం వల్ల వడ్డీలు పడతాయి. రిటర్నులను డిఫెక్టివ్‌గా పరిగణిస్తారు. చట్టపరమైన చర్యలుంటాయి. నష్టాలను రాబోయే సంవత్సరంలో సర్దుబాటుకు ఒప్పుకోరు. ఎక్కువ స్క్రూటినీకి అవకాశం ఇచ్చి వారం అవుతాము. ఆడిట్‌కి, తనిఖీకి గురికావచ్చు. ముందు జాగ్రత్త వహించండి.

ప్రకృతి వైపరీత్యాలు, మరణం, దీర్ఘకాలిక జబ్బు, లాకౌట్లు, స్ట్రయిక్ ఇలా విపత్కర పరిస్థితుల్లో మాత్రమే పెనాల్టీలు విధించరు.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

దీర్ఘకాలానికి నిశ్చింత!

కోటక్ మల్టీక్యాప్ ఫండ్



ఫండ్ రివ్యూ

మార్కెట్లు జీవిత కాల గరిష్టానికి 5 శాతం దిగువన ఉన్నాయి. గతేడాది కాలంలో పెద్దగా ర్యాలీ చేసింది లేదు. కానీ, ఈ కాలంలో ఎన్నో అస్థిరతలు ఈక్విటీలను పరిమిత శ్రేణికి కట్టడి చేశాయి. పలు దేశాల మధ్య యుద్ధ వాతావరణం, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రారంభించిన సుంకాల పోరు ఫలితంగా ఎగుమతి అవకాశాలు నీరసించాయి. ఇవన్నీ మన మార్కెట్లపై ప్రతిఫలిస్తున్నాయి. ఇప్పటికీ స్మాల్, మిడ్‌క్యాప్ వ్యాల్యూషన్లు లార్జ్‌క్యాప్‌తో పోల్చితే కొంత ఖరీదుగానే ఉన్నాయన్నది కొందరు నిపుణుల అభిప్రాయం. అయినప్పటికీ దీర్ఘకాలంలో వీటిల్లో ఎంపిక చేసిన కంపెనీలు మంచి రాబడులు కురిపిస్తాయని చెబుతున్నారు. వీటికితోడు లార్జ్‌క్యాప్ వ్యాల్యూషన్లు ఆకర్షణీయంగా ఉన్నాయి. ఇలాంటి క్లిష్టమైన వాతావరణంలో అన్ని విభాగాల్లోనూ మంచి వృద్ధికి అవకాశం ఉన్న కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసే మల్టీక్యాప్ ఫండ్స్ లేదా ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌ను ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల కోసం పరిశీలించొచ్చు. ఈ విభాగంలో కోటక్ మల్టీక్యాప్ ఫండ్ గురించి తప్పక చెప్పుకోవాలి.

రాబడులు

ఈ పథకం 2021 సెప్టెంబర్ 29న ప్రారంభమైంది. ఆరంభం నుంచి చూసుకుంటే వార్షిక రాబడి డైరెక్ట్ ప్లాన్‌లో 19.70 శాతం చొప్పున ఉంది. అదే రెగ్యులర్ ప్లాన్‌లో అయితే రాబడి 17.95 శాతం చొప్పున ఉంది. గత మూడేళ్ల కాలంలో వార్షిక రాబడి డైరెక్ట్ ప్లాన్‌లో 23.43 శాతం మేర ఉంది. రెగ్యులర్ ప్లాన్‌లో ఇది 21.74 శాతంగా ఉంది. డైరెక్ట్ ప్లాన్ అంటే మధ్యవర్తుల ప్రమేయం లేనిది. కనుక ఇన్వెస్టర్ల నుంచి ఫండ్ సంస్థలు తక్కువ ఎక్స్‌పెన్స్ రేషియో తీసుకుంటాయి. దీని ఫలితంగా దీర్ఘకాలంలో రాబడులు డైరెక్ట్ ప్లాన్లలోనే అధికంగా ఉంటాయి. గత మూడేళ్ల కాలంలో మల్టీక్యాప్ విభాగంలో సగటు వార్షిక రాబడి 18 శాతం చొప్పునే ఉంది. మల్టీక్యాప్ విభాగం కంటే ఈ పథకమే 5 శాతానికి పైగా అదనపు ప్రతిఫలాన్ని తెచ్చినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

పెట్టుబడుల విధానం

ఈ పథకం లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతుంటుంది. ఇలా అన్ని విభాగాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల వైవిధ్యానికి చోటు ఉంటుంది. అధిక వృద్ధి అవకాశాలున్న భవిష్యత్ విజేతలను గుర్తించి ఇన్వెస్ట్ చేయడంపై ఈ ఫండ్ బృందం దృష్టి పెడుతుంది. ఈ పథకంలో రిస్క్ ఎక్కువే. అదే సమయంలో అధిక రాబడులకూ అవకాశం ఉంటుంది. కనుక 5–7 ఏళ్ల అంతకుమించిన దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేసే వారికే ఈ పథకం అనుకూలం. కనీసం రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకోగల వెసులుబాటు ఉంది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
మారుతి సుజుకీ	7.15
ఎస్‌బీఐ	3.92
హీరో మోటో	3.17
రాడికో ఖైతాన్	2.86
ఎటర్నల్	2.78
పూనవాలా ఫిన్‌కార్ప్	2.64
ఎంఫసిస్	2.47
ఐటీసీ	2.45
హిందుస్థాన్ పెట్రో	2.38
పవర్ ఫైనాన్స్	2.30

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.19,227 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 99 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, డెట్ సాధనాల్లో 0.39 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. 0.59 శాతం నగదు నిల్వలు ఉన్నాయి. పోర్ట్‌ఫోలియోలో 70 స్టాక్స్ ఉండడాన్ని గమనించొచ్చు. లార్జ్‌క్యాప్ కంపెనీలకు 55 శాతం కేటాయింపులు చేసింది. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 27.51 శాతం ఇన్వెస్ట్ చేయగా, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 17.49 శాతం కేటాయించింది. పెట్టుబడులను గమనిస్తే.. అత్యధికంగా 14.32 శాతం బ్యాంకింగ్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసింది. ఆటోమొబైల్ కంపెనీలకు 11.67 శాతం కేటాయించింది. ఐటీ రంగ కంపెనీలకు 8.72 శాతం, ఫైనాన్స్ కంపెనీలకు 6.91 శాతం, రిటైల్ కంపెనీలకు 6.67 శాతం చొప్పున కేటాయించింది.

స్వియాటెక్ ఖాతాలో 25వ టైటిల్

సియోల్: ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న పోలాండ్ టెన్నిస్ స్టార్ ఇగా స్వియాటెక్ తన ఖాతాలో మరో టైటిల్ జమ చేసుకుంది. ఆదివారం ముగిసిన కొరియా ఓపెన్ డబ్ల్యూటీఏ-500 టోర్నీలో స్వియాటెక్ విజేతగా నిలిచింది. ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ స్వియాటెక్ 1-6, 7-6 (7/3), 7-5తో రెండో సీడ్ ఎకతెరీనా అలెగ్జాండ్రోవా (రష్యా)పై గెలిచింది. స్వియాటెక్ కెరీర్‌లో ఇది 25వ సింగిల్స్ టైటిల్‌కాగా... ఈ ఏడాది మూడో టైటిల్. 2 గంటల 41 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో స్వియాటెక్‌కు గట్టిపోటీ ఎదురైంది. కేవలం రెండు ఏస్‌లు సంధించిన స్వియాటెక్ ఏకంగా తొమ్మిది డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయిన ఈ పోలాండ్ స్టార్ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. విజేతగా నిలిచిన స్వియాటెక్‌కు 1,64,000 డాలర్ల (రూ. 1 కోటీ 44 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



సాక్షి ప్లస్
సోమవారం। 22-9-2025

బీసీసీఐ అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్!

- నామినేషన్ వేసిన ఢిల్లీ మాజీ కెప్టెన్
- బరిలో ఒకే ఒక్కడు

ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త అధ్యక్షుడు ఖరారయ్యాడు. ఏమాత్రం ఊహించని రీతిలో ఢిల్లీ రంజీ జట్టు మాజీ కెప్టెన్ మిథున్ మన్హాస్ బీసీసీఐ అధ్యక్ష పదవికి నామినేషన్ వేశాడు. రోజర్ బిన్నీ పదవీకాలం గత నెలతో ముగియగా... అప్పటి నుంచి ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తాత్కాలిక అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఈ నెల 28న ముంబై వేదికగా జరగనున్న బోర్డు సమావేశంలో ఆఫీస్ బేరర్లు కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన 45 ఏళ్ల మిథున్ మన్హాస్... దేశవాళీల్లో ఢిల్లీ జట్టుకు సుదీర్ఘకాలం ప్రాతినిధ్యం వహించాడు. ఆదివారంతో నామినేషన్‌ల గడువు ముగియగా... అధ్యక్ష పదవికి మిథున్ ఒక్కడే దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో అతడి ఎంపిక ఏకగ్రీవమైనట్లే. ఇక కోశాధికారిగా భారత మాజీ క్రికెటర్ రఘురామ్ భట్ ఎన్నిక కానున్నాడు. ప్రస్తుతం అతడు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. శనివారం ఢిల్లీ వేదికగా జరిగిన సమావేశంలోనే మన్హాస్ పేరు తెరపైకి వచ్చినట్లు సమాచారం. ఐసీసీ అధ్యక్షుడు జై షా, బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కార్యదర్శి దేవజిత్ సైకియా, ఢిల్లీ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీతో పాటు బోర్డు ప్రస్తుత, మాజీ కీలక సభ్యుల సమక్షంలో జరిగిన సమావేశంలో మన్హాస్‌ను అధ్యక్షుడిగా నియమించాలని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. 'కొత్త పాలక వర్గం ఏర్పాటవుతోంది. ఢిల్లీ మాజీ ఆటగాడు మిథున్ మన్హాస్‌ని అధ్యక్షుడిని చేయాలని నిర్ణయించారు. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా అరుణ్ ధుమాల్ కొనసాగుతారు'అని బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపాడు.

- కొత్త అధ్యక్షుడి ఎన్నిక తర్వాత కూడా ఉపాధ్యక్షుడిగా రాజీవ్ శుక్లా, కార్యదర్శిగా దేవజిత్ సైకియా కొనసాగనున్నారు. ప్రస్తుతం బోర్డు కోశాధికారిగా వ్యవహరిస్తున్న ఛత్తీస్‌గఢ్ క్రికెట్ సంఘానికి చెందిన ప్రభ్‌తేజ్ భాటియా... తదుపరి సంయుక్త కార్యదర్శిగా పనిచేయనున్నాడు.
- సౌరాష్ట్ర మాజీ కెప్టెన్ జయ్‌దేవ్ షా బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లో భాగం కానున్నాడు. ఇప్పుడా స్థానంలో ఉన్న ఖైరుల్ జమాల్ మజుందార్ ఐపీఎల్ పాలక మండలికి వెళ్లనున్నాడు.
- ప్రస్తుతం కార్యదర్శిగా కొనసాగుతున్న దేవజిత్ సైకియా అదే పోస్ట్‌కు ఆదివారం నామినేషన్ దాఖలు చేశాడు. త్వరలో స్వదేశంలో వెస్టిండీస్‌తో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం రెండు రోజుల్లో జట్టును ఎంపిక చేయనున్నట్లు సైకియా తెలిపాడు.
- భారత్, వెస్టిండీస్ మధ్య వచ్చే నెల 2 నుంచి అహ్మదాబాద్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో టీమిండియాకు ఇదే మొదటి మ్యాచ్ కానుంది.





ఎవరీ మన్హాస్...!

అంచనాలకు అందకుండా అనూహ్యంగా తెరపైకి వచ్చిన మిథున్ మన్హాస్... బీసీసీఐ 37వ అధ్యక్షుడిగా ఎంపికవడం ఖాయమైంది. పెద్దల అండదండలతో బరిలో నిలిచిన మన్హాస్‌కు పోటీనే లేకుండా పోయింది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మంచి అనుభవం ఉన్న మిథున్... కెరీర్‌లో 157 మ్యాచ్‌లాడి 9714 పరుగులు చేశాడు. అందులో 27 సెంచరీలు ఉన్నాయి. లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో 130 మ్యాచ్‌లాడి 4126 పరుగులు చేశాడు. అందులో 5 సెంచరీలు, 26 హాఫ్‌సెంచరీలు ఉన్నాయి. 91 టి20ల్లో 1170 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో మూడు (ఢిల్లీ క్యాపిటల్స్, పుణే వారియర్స్ ఇండియా, చెన్నై సూపర్ కింగ్స్) జట్లకు ప్రాతినిధ్యం వహించిన మన్హాస్... ఓవరాల్‌గా 55 మ్యాచ్‌లాడి 514 పరుగులు చేశాడు. 1997-98 సీజన్‌లో దేశవాళీ కెరీర్ ప్రారంభించిన మిథున్ 2016-17 వరకు కెరీర్ కొనసాగించాడు. కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన సమయంలో భారత జట్టు మిడిలార్డర్‌లో తీవ్రమైన పోటీ ఉండటంతో... అతడికి అంతర్జాతీయ క్రికెట్ ఆడే అవకాశం దక్కలేదు. ఆటగాడిగా సుదీర్ఘ అనుభవం ఉన్న మన్హాస్... ఆ తర్వాత కోచ్‌గాను మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. క్రీడా పరిపాలనలోనూ అతడికి అనుభవం ఉంది. జమ్మూకశ్మీర్ క్రికెట్‌ను గాడిన పెట్టేందుకు బీసీసీఐ నియమించిన కమిటీలో మిథున్ సభ్యుడిగా పనిచేశాడు. అందుకోసం 2015లో ఢిల్లీ నుంచి జమ్మూకశ్మీర్‌కు మారాడు. ఆ మరుసటి ఏడాదే కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఆపై బంగ్లాదేశ్ పురుషుల అండర్-19 జట్టుకు బ్యాటింగ్ సలహాదారుడిగా పనిచేసిన మిథున్... ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్‌లో సహాయ బృందంలో కీలకంగా వ్యవహరించాడు. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి పలువురు ప్లేయర్లు ఢిల్లీ జట్టులో మన్హాస్ సారథ్యంలో ఆడారని... అండర్-19 స్థాయిలో అతడితో కలిసి ఆడిన టీమిండియా మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా గుర్తుచేసుకున్నాడు. రాహుల్ ద్రవిడ్, సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ వంటి హేమాహేమీలు టీమిండియాకు ప్రాతినిధ్యం వహించిన సమయంలో మిడిలార్డర్‌లో చోటుదక్కకే మన్హాస్‌కు జాతీయ సెలెక్టర్ల నుంచి పిలుపు రాలేదని చోప్రా అభిప్రాయపడ్డాడు.



ఏడేళ్ల తర్వాత...

ప్రాంజల ఖాతాలో ఐటీఎఫ్ టోర్నీ డబుల్స్ టైటిల్

గురుగ్రామ్: హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ యడ్లపల్లి ప్రాంజల ఏడేళ్ల విరామం తర్వాత అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) సర్క్యూట్‌లో డబుల్స్ టైటిల్‌ను సాధించింది. ఆదివారం ముగిసిన ఐటీఎఫ్ డబ్ల్యూ-15 మహిళల టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కే చెందిన చిలకలపూడి శ్రావ్య శివానితో కలిసి ప్రాంజల డబుల్స్ విభాగంలో టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఫైనల్లో ప్రాంజల-శివాని జోడీ 6-4, 6-0తో భారత్‌కే చెందిన మహిక ఖన్నా-సోహిని మొహంతి ద్వయంపై గెలుపొందింది. 63 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో ప్రాంజల-శ్రావ్య శివాని ద్వయం ప్రత్యర్థి జంట సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. ప్రాంజల కెరీర్‌లో ఇది ఏడో ఐటీఎఫ్ డబుల్స్ టైటిల్. 2018లో చివరిసారి ఆమె రుతుజా భోసలేతో కలిసి థాయ్‌లాండ్‌లో రెండు డబుల్స్ టైటిల్స్ సాధించింది. 2017లో నాలుగు డబుల్స్ టైటిల్స్ నెగ్గింది. సింగిల్స్ విషయానికొస్తే ప్రాంజల నాలుగు టైటిల్స్ నెగ్గగా... 2021లో చివరిసారి బెంగళూరు ఓపెన్‌లో విజేతగా నిలిచింది. ఆ తర్వాత గాయాల బారిన పడటంతో ప్రాంజల కెరీర్ తడబడింది. మరోవైపు శ్రావ్య శివాని కెరీర్‌లో ఇది మూడో ఐటీఎఫ్ డబుల్స్ టైటిల్. 25 ఏళ్ల శ్రావ్య శివాని 2021లో షర్మదా బాలుతో కలిసి మొనాస్టిర్ ఓపెన్ టోర్నీలో, 2022లో సిలైన్ సిమున్యు (ఐర్లాండ్)తో కలిసి నైరోబి ఓపెన్ టోర్నీలో డబుల్స్ టైటిల్ గెలిచింది.

సెమీఫైనల్లో రిత్విక్-బాలాజీ జంట



సాక్షి, హైదరాబాద్: హాంగ్జౌ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్ డబుల్స్ విభాగంలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ సెమీఫైనల్లోకి అడుగుపెట్టాడు. చైనాలో ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రిత్విక్-శ్రీరామ్ బాలాజీ (భారత్) జంట 6-7 (5/7), 6-2, 10-5తో 'సూపర్ టైబ్రేక్'లో మూడో సీడ్ ఫెర్నాండో రాంబోలి (బ్రెజిల్)-జాన్ ప్యాట్రిక్ స్మిత్ (ఆస్ట్రేలియా) ద్వయంపై సంచలన విజయం సాధించింది. 1 గంట 45 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బాలాజీ మూడు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. ప్రత్యర్థుల సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. మరో క్వార్టర్ ఫైనల్లో అర్జున్ ఖడే-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ 4-6, 2-6తో గిడో అండ్రెజి (అర్జెంటీనా)-మాన్యుయల్ గినార్డ్ (ఫ్రాన్స్) ద్వయం చేతిలో ఓడిపోయింది. నేడు జరిగే సెమీఫైనల్లో టాప్ సీడ్ లుకాస్ మిడ్లెర్ (ఆస్ట్రియా)-ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్)లతో రిత్విక్-బాలాజీ తలపడతారు.



రజత పతకాలతో జమైకా అథ్లెట్స్ జోడీన్ విలియమ్స్, జొనెల్లీ స్మిత్, టియా క్లేటన్, టీనా క్లేటన్, షెల్లీ ఫ్రేజర్

ఇంగ్లండ్‌దే టి20 సిరీస్



డబ్లిన్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇంగ్లండ్ జట్టు... ఐర్లాండ్‌పై టి20 సిరీస్ కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు 6 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తుచేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి పోరులో ఇంగ్లండ్ విజయం సాధించగా... రెండో టి20 వర్షార్పణమైంది. దీంతో 2-0తో ఇంగ్లండ్ సిరీస్ చేజిక్కించుకుంది. ఆఖరి పోరులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. గారెత్ డెలానీ (29 బంతుల్లో 48 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... రాస్ అడైర్ (33; 5 ఫోర్లు, 1 సిక్స్), హ్యారీ టెక్టర్ (28; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ 3 వికెట్లు పడగొట్టగా... లియామ్ డాసన్, జెమీ ఓవర్టన్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 17.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. జోర్డన్ కాక్స్ (35 బంతుల్లో 55; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీ చేయగా... టామ్ బాటన్ (37 నాటౌట్; 6 ఫోర్లు), ఫిల్ సాల్ట్ (29; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఆదిల్ రషీద్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', ఫిల్ సాల్ట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

ఇటలీ జట్టుదే బిల్లీ జీన్ కింగ్ కప్



షెన్‌జెన్ (చైనా): డిఫెండింగ్ చాంపియన్ ఇటలీ బిల్లీ జీన్ కింగ్ కప్‌ను నిలబెట్టుకుంది. ప్రముఖ డేవిస్ కప్ తరహా మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో ఇటలీ మళ్లీ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ఇటలీ 2-0 తేడాతో అమెరికాపై ఘనవిజయం సాధించింది. ఇటలీ స్టార్లు జాస్మిన్ పావోలిని, ఎలిసాబెట్టా కొకియారెటో వరుస సింగిల్స్ మ్యాచ్‌ల్లో గెలుపొందారు. ఫలితం తేలిపోవడంతో డబుల్స్ మ్యాచ్ నిర్వహించాల్సిన అవసరం రాలేదు. ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ పావోలిని 6-4, 6-2తో ఏడో ర్యాంకర్ జెస్సికా పెగూలాను కంగుతినిపించింది. రెండో సింగిల్స్‌లో 91వ ర్యాంకర్ కొకొయారెటో 6-4, 6-4తో 11వ ర్యాంకులో ఉన్న ఎమ్మా నవారోను మట్టికరిపించింది. బ్రిటన్‌తో జరిగిన సెమీఫైనల్లో వరుస మ్యాచ్‌ల్లో అమెరికాను గెలిపించిన పెగులా, నవారో తుదిపోరులో మాత్రం చేతులెత్తేశారు. ఇటలీకి చెందిన ఒలింపిక్ చాంపియన్స్ పావోలిని, సారా ఎరానిలను బరిలోకి దించడం ద్వారా ఈ టోర్నీ చరిత్రలో ఆరో టైటిల్ సాధించింది. గత మూడు టోర్నీల్లో ఫైనల్స్‌కు చేరిన ఇటలీ 2023లో మాత్రం కెనడా చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. మరోవైపు అత్యధికంగా 18 సార్లు విజేతగా నిలిచిన అమెరికా 2017 తర్వాత మళ్లీ టైటిల్ గెలుపొందలేకపోయింది. బిల్లీ జీన్ కింగ్ కప్‌ను గతంలో ఫెడ్ కప్‌గా నిర్వహించేవారు. 2020-21 సీజన్ నుంచే బిల్లీ జీన్ కింగ్ కప్‌గా పేరు మార్చారు.

రజతంతో వీడ్కోలు

- అథ్లెటిక్స్ కెరీర్‌ను ముగించిన జమైకా దిగ్గజం షెల్లీ ఆన్ ఫ్రేజర్
- ప్రపంచ చాంపియన్‌షిప్ మహిళల 4×100 మీటర్ల రిలేలో జమైకా బృందానికి రెండో స్థానం



టోక్యో: తన 17 ఏళ్ల అంతర్జాతీయ అథ్లెటిక్స్ కెరీర్‌కు జమైకా దిగ్గజం షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్ ఘనంగా ముగింపు పలికింది. ఆదివారం ముగిసిన ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో చివరిసారి ట్రాక్‌పై బరిలోకి దిగిన 38 ఏళ్ల షెల్లీ మహిళల 4-100 మీటర్ల రిలే విభాగంలో జమైకా బృందానికి రజత పతకం అందించింది. షెల్లీ, టియా క్లేటన్, టీనా క్లేటన్, జొనెల్లీ స్మిత్‌లతో కూడిన జమైకా బృందం 41.79 సెకన్లలో రేసును ముగించి రెండో స్థానంలో నిలిచింది. 100 మీటర్లు, 200 మీటర్ల వ్యక్తిగత విభాగాల్లో స్వర్ణ పతకాలు గెలిచిన అమెరికా స్టార్ మెలిస్సా జెఫర్సన్ వుడెన్ తన ఖాతాలో మూడో స్వర్ణ పతకాన్ని జమ చేసుకుంది. మెలిస్సా, ట్వానిషా టెర్రీ, కేలా వైట్, షకారి రిచర్డ్‌సన్‌లతో కూడిన అమెరికా రిలే జట్టు 41.75 సెకన్లలో గమ్యానికి చేరి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. సినా మేయర్, రెబెకా హాస్, సోఫియా జంక్, గినా లుకెన్‌కెంపర్‌లతో కూడిన జర్మనీ జట్టుకు కాంస్య పతకం లభించింది. 2008 నుంచి అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో ఉన్న షెల్లీ తన కెరీర్‌లో 8 ఒలింపిక్ పతకాలు (4 స్వర్ణాలు, 3 రజతాలు, 1 కాంస్యం) గెల్చుకుంది. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 17 పతకాలు (10 స్వర్ణాలు, 6 రజతాలు, 1 కాంస్య) సొంతం చేసుకుంది.

అమెరికాదే అగ్రస్థానం

ఆదివారంతో ముగిసిన ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మరోసారి అమెరికా అగ్రస్థానాన్ని దక్కించుకుంది. అమెరికా 16 స్వర్ణాలు, 5 రజతాలు, 5 కాంస్యాలతో కలిపి మొత్తం 26 పతకాలతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. 7 స్వర్ణాలు, 2 రజతాలు, 2 కాంస్యాలు నెగ్గిన కెన్యా 11 పతకాలతో రెండో స్థానంలో... 3 స్వర్ణాలు, 1 రజతం, 1 కాంస్యం నెగ్గిన కెనడా ఐదు పతకాలతో మూడో స్థానంలో నిలిచాయి. ఓవరాల్‌గా 54 దేశాలు కనీసం ఒక కాంస్య పతకాన్ని సాధించాయి.



వెల్‌డన్ వెర్‌స్టాపెన్

రెడ్‌బుల్ డ్రైవర్ ఖాతాలో అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి టైటిల్



బాకు (అజర్‌బైజాన్): ఫార్ములావన్ తాజా సీజన్‌లో రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ వరుసగా రెండో విజయం ఖాతాలో వేసుకున్నాడు. ఇటీవల ఇటాలియన్ గ్రాండ్‌ప్రి టైటిల్ చేజిక్కించుకున్న డిఫెండింగ్ చాంపియన్ వెర్‌స్టాపెన్... ఆదివారం అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచాడు. ఈ ఏడాది ఇది 17వ రేసు కాగా... అందులో వెర్‌స్టాపెన్‌కు నాలుగో విజయం. ఆదివారం జరిగిన ప్రధాన రేసును పోల్ పొజిషన్‌తో ప్రారంభించిన వెర్‌స్టాపెన్ 51 ల్యాప్‌లను అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 33 నిమిషాల 26.408 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచాడు. రేసు ఆరంభం నుంచే వాయువేగంతో దూసుకెళ్లిన నాలుగుసార్లు ప్రపంచ చాంపియన్ వెర్‌స్టాపెన్ ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆద్యంతం ఆధిక్యంలో కొనసాగాడు. వెర్‌స్టాపెన్ వరుసగా రెండు రేసులు నెగ్గడం ఈ ఏడాది ఇదే తొలిసారి. మెర్సిడెస్‌కు చెందిన రసెల్ 1 గంట 33 నిమిషాల 41.017 సెకన్లలోలో పూర్తి చేసి రెండో స్థానం దక్కించుకున్నాడు. విలియమ్స్ రేసింగ్‌కు చెందిన కార్లోస్ సెయింజ్ 1 గంట 33 నిమిషాల 45.607 సెకన్లతో మూడో స్థానంలో నిలిచాడు. ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ రేసులో అగ్రస్థానంలో ఉన్న మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి కారు తొలి ల్యాప్‌లోనే ప్రమాదానికి గురవడంతో రేసును పూర్తి చేయలేకపోయాడు. ఏడు సార్లు ప్రపంచ చాంపియన్ లూయిస్ హామిల్టన్ (1 గంట 34 నిమిషాల 2.718 సెకన్లు; ఫెరారీ) ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 'ప్రతికూల పరిస్థితుల్లో ఇలాంటి ప్రదర్శన చేయడం ఆనందంగా ఉంది. గాలి ప్రభావంతో ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమిస్తూ ముందుకు సాగా. ఈ ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నా' అని వెర్‌స్టాపెన్ పేర్కొన్నాడు. 24 రేసుల సీజన్‌లో 17 రేసులు ముగిసేసరికి ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో పియాస్ట్రి 324 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... నోరిస్ 299 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. తాజా విజయంతో వెర్‌స్టాపెన్ 255 పాయింట్లతో మూడో స్థానాన్ని మరింత మెరుగు పర్చుకున్నాడు. తొలి స్థానంలో ఉన్న పియాస్ట్రికి వెర్‌స్టాపెన్‌కు మధ్య 69 పాయింట్లు తేడా ఉంది. తదుపరి రేసు అక్టోబర్ 5న సింగపూర్ గ్రాండ్‌ప్రి జరుగనుంది.

అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి రేసు ఫలితాలు (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	ల్యాప్‌లు	సమయం	వ్యత్యాసం	పాయింట్లు
1	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	51	1:33:26.408 సెకన్లు	-	25
2	రసెల్	మెర్సిడెస్	51	1:33:41.017 సెకన్లు	14.609 సెకన్లు	18
3	సెయింజ్	విలియమ్స్ రేసింగ్	51	1:33:45.607 సెకన్లు	19.199 సెకన్లు	15
4	ఆంటొనెల్లి	మెర్సిడెస్	51	1:33:48.168 సెకన్లు	21.760 సెకన్లు	12
5	లియామ్ లాసన్	రేసింగ్‌బుల్స్	51	1:33:59.698 సెకన్లు	33.290 సెకన్లు	10
6	యూకి సునోదా	రెడ్‌బుల్	51	1:34:00.216 సెకన్లు	33.808సెకన్లు	8
7	నోరిస్	మెక్‌లారెన్	51	1:34:00.635 సెకన్లు	34.227 సెకన్లు	6
8	హామిల్టన్	ఫెరారీ	51	1:34:02.718 సెకన్లు	36.310 సెకన్లు	4
9	లెక్‌లెర్క్	ఫెరారీ	51	1:34:03.182 సెకన్లు	36.774 సెకన్లు	2
10	హడ్జర్	రేసింగ్ బుల్స్	51	1:34:05.390 సెకన్లు	38.982 సెకన్లు	1

67 ఫార్ములావన్ కెరీర్‌లో వెర్‌స్టాపెన్ సాధించిన విజయాలు. అత్యధిక విజయాలు సాధించిన డ్రైవర్ల జాబితాలో వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో ఉన్నాడు. లూయిస్ హామిల్టన్ (బ్రిటన్: 105) తొలి స్థానంలో, మైకేల్ షుమాకర్ (జర్మనీ: 91) రెండో స్థానంలో ఉన్నారు. కెరీర్ మొత్తంలో 226 రేసుల్లో పోటీపడ్డ వెర్‌స్టాపెన్ ఇప్పటివరకు 120 సార్లు టాప్-3లో నిలిచాడు.



పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో దుర్గా పూజ మంటపానికి తుది మెరుగులు దిద్దుతున్న నిపుణులు



కోల్‌కతాలో ట్రామ్ ముందుభాగంపై చిత్రించిన త్రినయని దుర్గా మాత చిత్రం



కోల్‌కతాలోని ఓ దుర్గా పూజ మంటపం వద్ద సెల్ఫీ క్లిక్‌మనిపిస్తున్న నటి నీలమ్ కొఠారి

ట్రంప్ సృష్టించిన వీసా ప్రకంపనలు

హెచ్-1బీ వీసాలపై లక్ష డాలర్ల ప్రకటనతో బెంబేలు

- ఆందోళనకు గురైన అమెరికాలోని భారతీయులు
- ఒక రోజు తర్వాత స్పష్టత ఇచ్చిన అమెరికా సర్కార్
- అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది

వాషింగ్టన్: హెచ్-1బీ వీసాల దరఖాస్తు రుసుముపై అమెరికా ప్రభుత్వం చేసిన ప్రకటన ప్రపంచమంతటా ప్రకంపనలు సృష్టించింది. దరఖాస్తుకు లక్ష డాలర్లు చెల్లించాలంటూ సంబంధిత ఉత్తర్వుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయడంతో జనం ఆందోళనకు గురయ్యారు. ముఖ్యంగా అమెరికాలో ఉద్యోగాలు చేయాలని కలలు కంటున్నవారు, హెచ్-1బీ వీసా కోసం ప్రయత్నిస్తున్నారు బెంబేలెత్తిపోయారు. ఆశలు వదిలేసుకోవాల్సిందేనా? అని ఆవేదనకు గురయ్యారు. అమెరికా నుంచి స్వదేశాలకు వెళ్లాల్సిన వారు ఆగిపోయారు. ప్రయాణాలు రద్దు చేసుకున్నారు. ఇందులో భారతీయులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. విదేశాల్లో ఉన్న హెచ్-1బీ వీసాదారులైతే వెంటనే అమెరికాకు చేరుకోవడానికి పరుగులు పెట్టారు. పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టి విమానం టికెట్ కొనుగోలు చేయాల్సి వచ్చింది. అయితే, హెచ్-1బీ వీసాల విషయంలో కొత్త దరఖాస్తుదారులకు మాత్రమే లక్ష డాలర్లు వసూలు చేయనున్నట్లు అమెరికా ప్రభుత్వం వివరణ ఇచ్చింది. దీంతో చాలామంది ఊరట చెందారు. పెద్ద భారం భారం దిగిపోయినట్లుగా ఉపశమనం పొందారు.

టిక్కెట్‌కు రూ.7.04 లక్షలు

మహారాష్ట్రకు చెందిన ఒకరు హెచ్-1బీ వీసాతో అమెరికాలో సాఫ్ట్‌వేర్ నిపుణుడిగా ఉద్యోగం చేస్తున్నాడు. 11 ఏళ్లుగా అక్కడే ఉంటున్నాడు. తన తండ్రి వర్ధంతి కార్యక్రమం కోసం ఇటీవలే అమెరికా నుంచి నాగపూర్ వచ్చాడు. మరికొన్ని రోజులు ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నాడు. హెచ్-1బీ వీసాలపై లక్ష డాలర్ల ఫీజు గురించి తెలియగానే ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. వెంటనే అమెరికాకు ప్రయాణం కట్టాడు. అప్పటికప్పుడు విమానం టిక్కెట్ దొరకాలంటే మాటలు కాదు కదా! ప్రయాణం కోసం ఎక్కువ సొమ్ము చెల్లించక తప్పలేదు. నాగపూర్ నుంచి అమెరికాకు చేరుకోవడానికి 8,000 డాలర్లు (రూ.7.04 లక్షలు) ఖర్చు పెట్టాల్సి వచ్చిందని రోహన్ మెహతా వాపోయాడు. సాధారణం అయ్యే ఖర్చు కంటే ఇది 60 రెట్లు అధికం. ట్రంప్ ప్రభుత్వం ముందే స్పష్టత ఇచ్చి ఉంటే తనకు ఈ భారం తప్పేదని ఆవేదన వ్యక్తంచేశాడు.

పెళ్లి రద్దయ్యింది

ఇండియాకు చెందిన ఓ యువకుడు అమెరికాలో జాబ్ చేస్తున్నాడు. అతడికి ఇండియాలోనే పెళ్లి కుదిరింది. ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. శనివారమే పెళ్లి జరగాల్సి ఉంది. వివాహం కోసం శుక్రవారం ఆనందంగా స్వదేశానికి బయలుదేరాడు. ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న తర్వాత ట్రంప్ విసిరిన వీసా బాంబు గురించి తెలిసింది. ఇప్పుడు ఇండియాకు వెళ్తే మళ్లీ వెనక్కి వస్తామో లేదో తెలియని పరిస్థితి. దాంతో ఆ యువకుడు ప్రయాణం ఆపేసి ఎయిర్‌పోర్ట్ నుంచి ఇంటికి తిరిగివెళ్లాడు. ఇండియాలో జరగాల్సిన పెళ్లి రద్దు చేసుకున్నాడు. ఇప్పటికే హెచ్-1బీ వీసాలు ఉన్నవారిపై లక్ష డాలర్ల రుసుము ఉండబోదని మొదటే చెబితే తనకు ఈ బాధ తప్పేదని ఆ యువకుడు పేర్కొన్నాడు.

యూరప్ దేశాలే ముద్దు

దసరా, దీపావళి పండుగల కోసం స్వదేశానికి రావడానికి అమెరికాలోని భారతీయులు ముందే ప్లాన్ చేసుకున్నారు. హెచ్-1బీ వీసాలపై లక్ష డాలర్ల రుసుము విధిస్తున్నారని తెలియగానే విమానం టిక్కెట్లను రద్దు చేసుకున్నారు. పండుగలకు వెళ్లలేమంటూ ప్రయాణాలు ఆపేశారు. స్థానిక కాలమానం ప్రకారం ఈ నెల 19న ట్రంప్ ప్రభుత్వం నుంచి ప్రకటన వచ్చింది. దాంతో సోషల్ మీడియాలో ఇదే అంశంపై జోరుగా చర్చ సాగింది. అమెరికాలోని హెచ్-1బీ వీసాదారులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఇప్పుడు ఇండియాకు వెళ్లకపోవడమే ఉత్తమం అన్న నిర్ణయానికి వచ్చేశారు. స్వదేశంలో కుటుంబ సభ్యులతో పండుగలు చేసుకోవాలన్న ఆసక్తి చచ్చిపోయిందని ఓ భారతీయుడు స్పష్టంచేశారు. ఇదిలా ఉండగా, భారత్‌లో ఉన్న వృత్తి నిపుణులు అమెరికా పట్ల విముఖత చూపుతున్నారు. ట్రంప్ దూకుడు నిర్ణయాలతో వారు పునరాలోచనలో పడ్డారు. ఉద్యోగాలకు యూరప్ దేశాలే బెటర్ అని అంచనాకొచ్చారు. ఆ దిశగా ప్రణాళికలు తయారు చేసుకుంటున్నారు.

అత్యంత అభిమానం నుంచి అత్యంత విద్వేషం దాకా..

హెచ్-1బీకి మొదట్లో మద్దతు పలికి ఇప్పుడు వ్యతిరేకిస్తున్న ఎలాన్ మస్క్

వాషింగ్టన్: నూతన హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులకు వార్షిక రుసుమును ఏకంగా లక్ష డాలర్లకు అమెరికా ప్రభుత్వం పెంచిన నేపథ్యంలో దక్షిణాఫ్రికా మూలాలున్న ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ గతంలో చేసిన హెచ్-1బీ అనుకూల, ప్రతికూల వ్యాఖ్యలు మరోసారి తెరమీదకొచ్చాయి. హెచ్-1బీ కారణంగానే తనలాంటి ఎంతో మంది దక్షిణాఫ్రికా మొదలు ఎన్నో ప్రపంచదేశాల నుంచి వచ్చి అమెరికాలో స్థిరపడ్డారని, హెచ్-1బీ అనేది అద్భుతమైన విధానమని గతంలో మస్క్ 'ఎక్స్'లో ట్వీట్‌చేసిన అంశాన్ని పలువురు గుర్తుచేసుకుంటున్నారు. ఆ తర్వాతి కాలంలో హెచ్-1బీ విధానంపై మస్క్ హఠాత్తుగా మాటమార్చారు. అది అత్యంత లోపభూయిష్టమైన విధానమని, అమెరికాకు దీంతో ప్రయోజనంలేదని అభాండాలు వేయడం మొదలెట్టడం చూసి రిపబ్లికన్ పార్టీ నేతలు సైతం విస్మయం వ్యక్తంచేయడం తెల్సిందే. మొదట్లో ట్రంప్‌ను ఆకాశానికెత్తేసిన మస్క్ ఆ తర్వాత ట్రంప్‌కు పోటీగా రాజకీయ పార్టీని సైతం ప్రకటించారు. హెచ్-1బీ అమలు తీరులో ఎలాంటి లోపాలు లేవు. సంస్కరణలు అక్కర్లేదని మస్క్ గతంలో అన్నారు. ఇటీవల మాటమార్చారు. 'అదొక విఫల విధానం. భారీ సంస్కరణలు తేవాల్సిందే'అని అన్నారు. గతంలో దీనికి పూర్తి భిన్నంగా మాట్లాడారు. 'హెచ్-1బీ కారణంగానే నేను అమెరికాలో స్థిరపడగలిగా. నేను మాత్రమే కాదు నా సంస్థలైన టెస్లా, ఎక్స్, స్పేస్‌ఎక్స్, ఇతర కీలక సంస్థల ఏర్పాటులో నాకు సాయపడిన వారెందరినో హెచ్-1బీ అమెరికా కలలను నెరవేర్చింది. చట్టబద్ధ వలసలకు ఇది స్వర్గధామం. హెచ్-1బీ కోసం యుద్ధం చేయడానికైనా నా సిద్ధం. హెచ్-1బీని తప్పుబట్టేవాళ్లను ముఖం మీదనే చాచికొడతా'అని గతంలో అన్నారు. ఇలా మాట్లాడిన కొద్ది కాలానికే మస్క్ స్వరం మార్చారు. 'హెచ్-1బీ వీసాతో అమెరికాలో అడుగుపెట్టిన వృత్తినిపుణులకు కనీస వేతనం పెంచడం, మెయింటెన్స్ ఖర్చులు పెరగడంతో స్థానిక ఉద్యోగులతో పోలిస్తే ఇలా విదేశీయులను పనిలో పెట్టుకోవడం ఆర్థికంగా భారమే. ఇవన్నీ చూస్తుంటే హెచ్-1బీ అనేది కాలంచెల్లిన విధానంగా అఘోరించింది. దీనిలో భారీ సంస్కరణలు తీసుకురాక తప్పదు' అని అన్నారు.

గాజాపై రాత్రంతా ఆగని దాడులు

పలువురు చిన్నారులు సహా 55 మంది మృతి

కైరో: గాజా నగరంపై శనివారం రాత్రంతా ఇజ్రాయెల్ ఆర్మీ వైమానిక దాడులను ఆపకుండా కొనసాగించింది. గాజా వ్యాప్తంగా జరిగిన దాడుల్లో చిన్నారులు సహా 55 మంది చనిపోయారు. ఒక్క గాజా నగరంలోనే 37 మంది అసువులు బాశారు. ఇక్కడి సబ్రా ప్రాంతంలోని నివాస భవనంపై జరిగిన దాడిలో కనీసం 25 మంది ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల్లో చిక్కుకున్న 17 మందిని కాపాడారని, మరో 50 మంది వరకు లోపలే చిక్కుకుని ఉంటారని ఆందోళన వ్యక్తమవుతోంది. శిథిలాల నుంచి ఆర్తనాదాలు వినిపిస్తున్నాయని, కాపాడేందుకు వెళ్లిన తమపై ఇజ్రాయెల్ డ్రోన్లు కాల్పులు జరుపుతున్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనలో బాధితులంతా డొఘముష్ కుటుంబీకులేనని చెప్పారు. కాగా, తమ దాడిలో మాజెద్ అబూ సెల్మియా అనే హమాస్ సాయుధ విభాగానికి చెందిన స్నైపర్ చనిపోయాడని ఇజ్రాయెల్ ఆర్మీ చేసిన ప్రకటనను ఆయన సోదరుడు, షిఫా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ అబూ సెల్మియా ఖండించారు. 57 వయస్సున్న తన సోదరుడు హై బీపీ, డయాబెటిస్, దృష్టి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. అతడు స్నైపర్ కానే కాదని, ఇజ్రాయెల్ చెప్పేదంతా కట్టుకథేనని కొట్టిపారేశారు. అదేవిధంగా, ఇజ్రాయెల్ దాడుల్లో షిఫా ఆస్పత్రి నర్సుతోపాటు ఆయన భార్య, ముగ్గురు పిల్లలు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు సిబ్బంది తెలిపారు. గాజా ప్రాంతంపై ఇజ్రాయెల్ సాగిస్తున్న దాడులపై పోప్ లియో స్పందించారు. గాజాలోని పాలస్తీనియన్లను తమ ఇళ్ల నుంచి బలవంతపు అజ్ఞాతంలోకి పంపిస్తోందంటూ వ్యాఖ్యానించారు. హింస, తీవ్ర ప్రతీకార చర్యల ఫలితంగా గాజా స్ట్రిప్‌కు భవిష్యత్తు లేకుండా పోయిందన్నారు. కాగా, పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నట్లు యూకే, కెనడా, ఆస్ట్రేలియా ఆదివారం ప్రకటించాయి. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలు మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుండగా ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ సమావేశాల్లో పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించే ప్రతిపాదనను ఆమోదించే అవకాశముంది.

వీడ్కోలు ఫొటో విడుదల చేసిన హమాస్

విధ్వంసం కొనసాగిస్తూ గాజా నగరాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఇజ్రాయెల్ ఒక వైపు తీవ్ర ప్రయత్నాలు చేస్తుండగా, హమాస్ మిలటరీ విభాగం కస్సమ్ బ్రిగేడ్ శనివారం తమ ఉన్న సజీవ, మృతి చెందిన 48 ఇజ్రాయెల్ బందీల చిత్రాలను 'వీడ్కోలు ఫొటో'అంటూ విడుదల చేయడం సంచలనం రేపింది. ప్రతి ఫొటోకు దిగువన 'రాన్ అరాడ్'అనే క్యాప్షన్ ఉంచింది. 1986లో లెబనాన్‌లో కనిపించకుండా పోయిన ఇజ్రాయెల్ ఎయిర్ ఫోర్స్ కెప్టెన్ రాన్ అరాడ్. బాంబు అనుకోకుండా పేలడంతో గాయపడి హెజ్బొల్లాకు పట్టుబడ్డాడు. ఆ తర్వాత రాన్ అరాడ్ జాడ తెలియకుండా పోయింది. బందీల ఫొటోల దిగువన కస్సమ్ బ్రిగేడ్. 'కాల్పుల విరమణకు నెతన్యాహూ నిరాకరించడం, గాజా నగరాన్ని ఆక్రమించుకునే ప్రతిపాదనను బహిరంగంగా వ్యతిరేకించి, మిలటరీ ఆపరేషన్ సారథ్యం వహించేందుకు ఆర్మీ చీఫ్ ఈయల్ జమీర్ సిద్ధపడినందుకే బందీలకు వీడ్కోలు'అని పేర్కొంది. అయితే, హమాస్ చెరలో కనీసం 20 బందీలు సజీవంగానే ఉన్నారని ఇజ్రాయెల్ అధికారులు భావిస్తున్నారు. అయితే, సజీవంగా ఉన్న బందీల సంఖ్య 20 కంటే తక్కువగానే ఉంటుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం గమనార్హం. బందీలందరినీ వెనక్కి తీసుకురావడం, హమాస్ అంతమే తమ లక్ష్యమని ట్రంప్, నెతన్యాహూ ప్రకటిస్తుండగా, గాజా నగరంలో సైనిక ఆపరేషన్ ఫలితంగా బందీల ప్రాణాలకు ముప్పు తప్పదని హమాస్ హెచ్చరిస్తోంది.



గౌహతిలోని జలుక్‌బరి వద్ద జుబీన్ మృతదేహం ఉంచిన వాహనం వద్ద నివాళులర్పించేందుకు భారీగా చేరిన జనం



జుబీన్‌కు నివాళులర్పించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభిమానులతో కిటకిటలాడుతున్న గౌహతి స్టేడియం

జుబీన్ కడసారి చూపునకు లక్షలాదిగా జనం

అభిమానులతో నిండిపోయిన గౌహతి స్టేడియం

గౌహతి: ప్రముఖ అస్సామీ గాయకుడు జుబీన్ గార్గ్ కడసారి చూపు కోసం ఆదివారం అసోంలోని గౌహతికి లక్ష మందికి పైగా అభిమానులు తరలివచ్చారు. గౌహతిలోని అర్జున్ భోగేశ్వర్ బారువా స్పోర్ట్స్ కాంప్లెక్స్ కిక్కిరిసిపోయింది. ఉదయానికే అక్కడికి చేరుకున్న జనం ఎండ తీవ్రతను, ఆ తర్వాత వచ్చిన భారీ వర్షాన్ని సైతం జనం లెక్క చేయకుండా క్యూలో నిల్చున్నారు. అభిమానులు జుబీన్ చిత్రాలున్న కటౌట్లను చేబూని, ఆయనకిష్టమైన పాటలు పాడారు. జుబీన్ గార్గ్ శుక్రవారం సింగపూర్‌లోని సముద్రంలో ఈదుతూ చనిపోవడం తెల్సిందే. సింగపూర్ నుంచి జుబీన్ మృతదేహాన్ని విమానంలో శనివారం అర్ధరాత్రి ఢిల్లీకి తీసుకువచ్చారు. మరో విమానంలో ఆదివారం ఉదయం 7 గంటల సమయానికి గౌహతికి మృతదేహం చేరుకుంది. గౌహతి విమానాశ్రయం నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న నగరంలోని కహిలీపారలో ఉన్న జుబీన్ నివాసం వరకు దారి పొడవునా వేలాది మంది ఆఖరిసారిగా చూసుకునేందుకు రహదారిపైకి చేరారు. దీంతో ఆరు గంటల సమయం పట్టింది. మృతదేహం స్టేడియంకు చేరుకునేటప్పటికి మధ్యాహ్నం 3 గంటలయింది. అప్పటికే అభిమానులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. వేదికపై గాజు శవ పేటికలో ఉంచిన జుబీన్ మృతదేహాన్ని కడసారి చూసుకునేందుకు జనం క్యూ కట్టారు. రాత్రయినా అభిమానుల తాకిడి కొనసాగుతోంది. దీంతో, అభిమానుల సందర్శనార్థం మృతదేహాన్ని రాత్రంతా అక్కడే ఉంచుతామని, ఉదయం కూడా అక్కడే ఉంటుందని సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. తన భర్త కోసం తరలివచ్చిన అసంఖ్యాక అభిమానులకు జుబీన్ భార్య, ప్రముఖ డిజైనర్ గరిమ కృతజ్ఞతలు తెలిపారు.

మళ్లీ మొదలైన పంట వ్యర్థాల దహనం

పంజాబ్‌లో ఒక్కరోజే 12 ఎఫ్ఐఆర్‌లు

- జైళ్లకు పంపిస్తామని హెచ్చరించినా ఆగని రైతులు
- ఢిల్లీకి పొంచి ఉన్న వాయు కాలుష్యం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీకి పొరుగునున్న పంజాబ్‌లో మళ్లీ పంట వ్యర్థాల దహనాలు మొదలయ్యాయి. ఇలా పంట వ్యర్థాలకు నిప్పు పెడితే ఉపేక్షించరాదని, అవసరమైతే కొందరు రైతులను జైలుకు పంపాలని ఇటీవల సుప్రీంకోర్టు సైతం కన్నెర్ర చేసింది. రైతులు మాత్రం పట్టించుకోకుండా గడ్డి దుబ్బలను దహనం చేస్తున్నారు. పంట వ్యర్థాల దహనాలపై ఆదివారం ఒక్క రోజే పంజాబ్‌లో 12 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. పంజాబ్‌లో ఇప్పుడిప్పుడే వరి కోతలు మొదలవుతున్నందున రానున్న రోజుల్లో వ్యర్థాల దహనం తీవ్రంగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

వరి కోతల తర్వాత అక్టోబర్-నవంబర్ నెలల్లో ఢిల్లీలో వాయు కాలుష్యం పెరగడానికి పంజాబ్, హరియాణాల్లో పంట వ్యర్థాలను కాల్చడమే ప్రధాన కారణమని అధికారులు అంటున్నారు. వరి కోతకు, రబీలో గోధుమలను విత్తడానికి మధ్య సమయం తక్కువగా ఉండటంతో రైతులు తరచుగా వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా శీతాకాలంలో ఢిల్లీలో కాలుష్యం పెరిగేందుకు కారణమవుతోంది. ఈ దృష్ట్యా పంట దహనాలను నివారించేందుకు కేంద్రం భూ విస్తీర్ణం ఆధారంగా రూ.5వేల నుంచి రూ.30వేల వరకు జరిమానాలు విధిస్తూ కేంద్రం గత ఏడాది ఉత్తర్వులిచ్చింది. ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ 400 మార్కును దాటుతుండటం, ప్రజలకు తీవ్ర శ్వాసకోశ వ్యాధులతో పాటు ఇతర అనారోగ్యాలను ఎదుర్కొంటుండటంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. గత ఏడాది 1,500 మందికి పైగా రైతులకు జరిమానాలు సైతం విధించారు. దీంతో పాటే పంట వ్యర్థాలను కాల్చే సంఘటనలను నివారించేందుకు 8వేల మంది నోడల్ అధికారులతో ఓ ప్రత్యేక దళాన్ని సైతం ఏర్పాటు చేశారు. దీనికి తోడు సెక్షన్ 223 కింద గత ఏడాది 5,797 కేసులు సైతం నమోదయ్యాయి. ఇందులో ఒక్క సంగ్రూర్ జిల్లాలోనే 1,725 కేసులు నమోదయ్యాయి.

పోలీసు రికార్డుల్లో కులం పేరొద్దు

యూపీ ప్రభుత్వానికి అలహాబాద్ హైకోర్టు ఆదేశం

ప్రయాగ్‌రాజ్: పోలీసు రికార్డుల్లో నిందితుల కులం పేరు నమోదు చేసే సంప్రదాయానికి తక్షణమే ముగింపు పలకాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని అలహాబాద్ హైకోర్టు ఆదేశించింది. ఈ విధానం రాజ్యాంగ విశ్వాసాన్ని దెబ్బతీసేదిగాను, ప్రజాస్వామ్యానికి సవాలుగా, చట్టపరమైన తప్పుడు అర్థంగా మారిందని వ్యాఖ్యానించింది. మద్యం అక్రమ రవాణాకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ వినోద్ దివాకర్ ఈ మేరకు ఈ నెల 16న ఇచ్చిన తీర్పులో పేర్కొన్నారు. నిందితులు, సాక్షుల కులానికి సంబంధించిన అన్ని కాలమ్‌లు, ఎంట్రీలను అధికారిక పత్రాల నుంచి తొలగించడం ద్వారా పోలీసు డాక్యుమెంటేషన్ విధానాలను సరిదిద్దాలని కోర్టు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. మాలి, పహాడీ, పంజాబీ, ఠాకూర్, బ్రాహ్మణ.. అంటూ ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయడం వల్ల ప్రత్యేకంగా ఎలాంటి న్యాయపరమైన ఉపయోగం లేదన్నారు. శాఖాపరమైన విచారణను సిఫార్సు చేయడానికి, రాజ్యాంగం, సామాజిక అంశాలపై అధికారులకు అవగాహన కల్పించడానికి బదులుగా, కొందరి ప్రవర్తనలను వారి కులాలకు ఆపాదించేదాకా వెళ్లడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

బీఎంసీ ఎన్నికల్లో చెరో సగం సీట్లలో పోటీ

శివసేన (యూబీటీ), ఎంఎన్ఎస్ అంగీకారం

ముంబై: ముంబై మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) ఎన్నికల్లో తమకు గట్టి పట్టున్న సీట్లను సమానంగా పంచుకోవాలని శివసేన(యూబీటీ), మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) నిర్ణయించాయి. మిగతా మున్సిపాలిటీల్లో 60: 40 సూత్రాన్ని అనుసరించాలని తీర్మానించాయి. సీట్ల పంపకంపై దీపావళి వరకు స్పష్టత వచ్చే అవకాశముంది. బీఎంసీ పరిధిలోని ప్రాబల్యం కలిగిన స్థానాలను ముందుగా గుర్తించాలని కూడా అంగీకారానికి వచ్చాయి. ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని శివసేన(యూబీటీ), ఎంఎన్ఎస్ సారథి రాజ్ ఠాక్రే వరుసకు సోదరులవుతారు. ఈ రెండు పార్టీల కూటమి ఏర్పాటు ప్రకటన కేవలం లాంఛనప్రాయమేనని ఇరుపార్టీల నేతలు అంటున్నారు. ముంబైతోపాటు థానె, నాసిక్, కల్యాణ్-డొంబివిలి ప్రాంతాల్లో రెండు పార్టీలకు గట్టి పట్టుంది. 2026 జనవరి 31వ తేదీలోగా మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలంటూ ఇటీవల సుప్రీంకోర్టు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు గట్టి ఆదేశాలివ్వడం తెల్సిందే. 2025-26లో వార్షిక బడ్జెట్ రూ.74 వేల కోట్లు కలిగిన బీఎంసీ దేశంలోనే అత్యంత ధనిక మున్సిపల్ కార్పొరేషన్. బీఎంసీలో 227 వార్డులున్నాయి.

కేంద్రం హామీతో ఆగిన కుర్మీల రైల్ రోకో

రాంచీ: ఎస్టీ హోదా, కుర్మాలీ భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలనే ప్రధాన డిమాండ్లతో జార్ఖండ్‌లో రైల్ రోకో చేపట్టిన కుర్మీలు వెనక్కి తగ్గారు. వీరి సమస్యల పరిష్కారానికి హోం మంత్రితో చర్చలకు రావాలంటూ కేంద్రం ఆహ్వానించడంతో ఆందోళనను విరమించినట్లు ప్రకటించారు. జార్ఖండ్‌లోని రెండు చోట్ల మినహా అన్ని స్టేషన్లలోనూ నిరసనలు ఆపారు. సెరాయికేలా- ఖర్సవాన్ జిల్లాలోని సిని, ధన్‌బాద్ జిల్లాలోని ప్రధాన్ ఖాంటా స్టేషన్లలో మాత్రం ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో నిరసనలను ఉపసంహరించుకున్నారు. అమిత్ షాతో సమావేశం షెడ్యూల్ ఖరారు కాలేదని కుర్మీ వికాస్ మోర్చా సెంట్రల్ అధ్యక్షుడు శీతల్ ఓహ్‌దార్ చెప్పారు. నిషేధం ఉత్తర్వులను సైతం లెక్క చేయకుండా వందలాదిగా ఆందోళనకారులు శనివారం రాంచీ, హజారీబాగ్, ధన్‌బాద్, తూర్పుసింఘ్‌భుమ్, బొకారో జిల్లాల్లోని పలు స్టేషన్లలో రైల్ రోకోలు చేపట్టారు. దీంతో, వేలాదిగా ప్రయాణికులు ఎక్కడివారక్కడే గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వచ్చింది. అధికారులు వందకు పైగా రైళ్ల రద్దు, దారి మళ్లించడం, కుదించడం చేయాల్సి వచ్చింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించండి

ప్రధాని మోదీకి కశ్మీర్ కవల సోదరీమణుల ఆహ్వానం

అనంత్‌నాగ్: కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాకు చెందిన కవలలు సోషల్ మీడియా ద్వారా ప్రధాని మోదీకి ఆహ్వానం పంపారు. కశ్మీర్ లోయ అందాలను తిలకించడంతోపాటు వరద బాధితులకు సాయం అందించాలని వారు కోరారు. ఈ మేరకు కోకర్‌నాగ్ ప్రాంతానికి చెందిన జైనాబ్, జైబా అనే ఎనిమిదేళ్ల కవలలు బీజేపీ నేత రవీందర్ రైనాతో మాట్లాడుతున్నట్లుగా ఉన్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. జబ్లిపొర పండ్ల మార్కెట్‌కు వెళ్లిన రవీందర్ రైనాకు కొందరు యాపిల్ వ్యాపారులు తమకు వాటిల్లిన తీవ్ర నష్టంపై వివరించారు. ఇటీవలి వరదలు, కొండచరియలు విరిగిపడటంతో జాతీయరహదారిని అధికారులు మూసివేశారు. పండ్ల రవాణా నిలిచిపోవడంతో భారీగా నష్టపోయామని వారు చెప్పారు. అక్కడే ఉన్న జైనా, జైబాలు ప్రధాని మోదీతో మాట్లాడాలనుందంటూ ఆకాంక్షను వ్యక్తం చేశారు. అందమైన కశ్మీర్‌ను చూసేందుకు ఒక్కసారి రావాలని వారు ప్రధానిని ముక్తకంఠంతో కోరారు. తమ ఊర్లో వంతెన కొట్టుకుపోయిందని, కోల్డ్ స్టోరేజీ సౌకర్యం కూడా లేదని వారు తెలిపారు. కోల్డ్ స్టోరేజీ కావాలా అని రైనా ఆశ్చర్యంతో అడగ్గా కవలలు అవునంటూ బదులిచ్చారు. 'మా అందరికీ, భారతదేశంలోని అందరికీ ఇష్టమైన యాపిల్స్‌ను ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోవచ్చు. రోజుకో యాపిల్ తింటే డాక్టర్‌తో అవసరం ఉండదు'అని అనగానే అక్కడున్న వారంతా ఘొల్లున నవ్వారు.


నేడు అరుణాచల్, త్రిపురల్లో ప్రధాని పర్యటన

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం అరుణాచల్ ప్రదేశ్, త్రిపురల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ఇటానగర్‌లో రూ.5,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో రూ.3,700తో ఏర్పాటయ్యే రెండు జలవిద్యుత్ ప్రాజెక్టులు కూడా ఉన్నాయని ఆదివారం ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో)తెలిపింది. సరిహద్దులకు సమీపంలోని తవాంగ్‌లో అత్యాధునిక కన్వెన్షన్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ప్రధాని త్రిపురకు వెళతారు. మాతాబరిలో ఆయన మాతా త్రిపుర సుందరి ఆలయంలో పూజలు చేయడంతోపాటు ఆలయ సముదాయం అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారని పీఎంవో వివరించింది.

రూ.12 కోట్ల హై-గ్రేడ్ గంజాయి సీజ్

తిరువొత్తియూరు: థాయ్‌లాండ్ నుంచి చెన్నైకి విమానంలో దొంగచాటుగా తరలిస్తున్న రూ.12 కోట్ల విలువైన హై-గ్రేడ్ గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చెన్నైలోని మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయానికి శనివారం రాత్రి థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి ఓ విమానం వచ్చింది. అందులో వచ్చిన ప్రయాణికులను విమానాశ్రయ కస్టమ్స్ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు తనిఖీ చేశారు. ఓ యువకుడి బ్యాగులో 6 కిలోల గంజాయి ఉంది. అదేవిధంగా, పర్యాటకురాలిగా వెళ్లి తిరిగి వచ్చిన ఓ మహిళ ట్రాలీ సూట్‌కేస్‌లోనూ మరో 6 కిలోల అత్యంత నాణ్యమైన గంజాయిని గుర్తించి వారిద్దరిని అరెస్టు చేశారు. అదేవిధంగా, అంబత్తూరు బస్ స్టేషన్ సమీపంలో గంజాయి ప్యాకెట్లతో సంచరిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు.

'సమన్యాయ పాలన'ను ప్రతిపాదించిందెవరు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక హక్కులు- వర్గీకరణ

సమానత్వ హక్కు (ప్రకరణ 14-18)

ప్రకరణ 14 ప్రకారం చట్టం దృష్టిలో అందరూ సమానులే. ఈ భావన బ్రిటిష్ రాజ్యాంగంలోని సమ న్యాయపాలన (Rule of law)కుఅనుగుణంగా పొందుపరిచారు. వ్యక్తి హోదా, గౌరవంతో సంబంధం లేకుండా హక్కులు కల్పిస్తారు.

సమన్యాయ పాలన భావాన్ని 'ఎ.వి. డైసీ'అనే రాజ్యాంగ నిపుణుడు ప్రతిపాదించాడు. చట్టం మూలంగా సమాన రక్షణ (Equal protection of law) అనేది అమెరికా రాజ్యాంగం నుంచి గ్రహించారు. దేశంలో ఒకే చట్టం ఉన్నప్పటికీ, ఆ చట్టాన్ని అమలు చేసే సమయంలో ప్రజలను వర్గీకరించి అమలు చేయొచ్చు. అయితే వర్గ చట్టాలు చేయొద్దు (Classification of people but not class legislation). దీన్నే 'రక్షిత వివక్ష' అంటారు. దీంతో సామాజిక న్యాయం సాధ్యమవుతుంది.

ప్రకరణ 14 ప్రకారం, చట్టం ముందు అందరూ సమానులే. అయినప్పటికీ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వొచ్చు. హేతుబద్ధ, శాస్త్రీయ వర్గీకరణ ద్వారా మినహాయింపులు ఇవ్వడం ప్రకరణ 14కు వ్యతిరేకం కాదు. భౌగోళిక ప్రాంతం, అక్షరాస్యత, పెద్ద, చిన్న పరిశ్రమలు, మైనర్, మేజర్, స్త్రీలు, పురుషులు మొదలైన ప్రాతిపదికలపైన మినహాయింపులు ఇవ్వొచ్చు.

ప్రత్యేక వివరణ

ప్రకరణ 39(బి), (సి)లోని ఆదేశికాలను అమలు చేయడానికి చర్యలు తీసుకుంటే అవి ప్రకరణ 14కు వ్యతిరేకమని న్యాయస్థానంలో ప్రశ్నించొద్దు. వీటిని అమలు చేయడానికి ప్రకరణ 14 అడ్డుకాదు.

మినహాయింపులు

- నిబంధన 14లో పేర్కొన్న' అందరూ సమానులు' అనే సూత్రం రాష్ట్రపతి, గవర్నర్లకు వర్తించదు. వారు ఈ సూత్రానికి మినహాయింపు.
- ప్రకరణ 361 ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్ తమ అధికార విధుల నిర్వహణలో ఏ న్యాయస్థానానికీ జవాబుదారులు కారు. వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు పెట్టడానికి వీలులేదు. అయితే రెండు నెలల ముందస్తు నోటీసుతో సివిల్ కేసులు పెట్టొచ్చు.
- ప్రకరణ 105, ప్రకరణ 194 ప్రకారం, పార్లమెంట్, రాష్ట్ర శాసన సభల్లో సభ్యులు వ్యక్తీకరించిన అభిప్రాయాలకు వారు ఏ న్యాయస్థానానికీ బాధ్యులు కారు.
- విదేశీ సార్వభౌములకు, దౌత్యవేత్తలకు కూడా మినహాయింపుఉంటుంది.
- ఐక్యరాజ్యసమితి వివిధ విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందికి కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది.

సుప్రీంకోర్టు ముఖ్య తీర్పులు

చిరంజిత్ లాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1950)

చట్టం ముందు అందరూ సమానులే అంటే సమానుల్లో మాత్రమే సమానత్వం అమలు చేస్తారని సుప్రీంకోర్టు పేర్కొంది. హేతుబద్ధమైన వర్గీకరణ చెల్లుబాటు అవుతుంది.

బెన్నెట్ కోలెమెన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1973)

పత్రికలను చిన్న, పెద్ద పత్రికలు అనే ప్రాతిపదికపై వర్గీకరించి న్యూస్ ప్రింట్ పంపిణీ చేయడం చెల్లుబాటు అవుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. అన్ని పత్రికలకు సమానంగా పంపిణీ చేయడం న్యాయసమ్మతం కాదని పేర్కొంది.

విశాఖ వర్సెస్ స్టేట్ ఆఫ్ రాజస్థాన్ (1997)

పనిచేసే ప్రదేశాల్లో మహిళా ఉద్యోగుల పట్ల అనుచిత ప్రవర్తన, లైంగిక వేధింపులు ప్రకరణ 14లోని చట్టం ముందు అందరూ సమానులే అనే సూత్రానికి వ్యతిరేకం, స్త్రీల పట్ల వివక్ష అని, పురుషులతో సమానంగా వారు హక్కులను కలిగి ఉండే అధికారం ఉందని పేర్కొంది. పని ప్రదేశాల్లో మహిళపై లైంగిక వేధింపులు నివారించడానికి సమగ్ర మార్గదర్శక సూత్రాలను సుప్రీంకోర్టు జారీ చేసింది.

ప్రకరణ 15

ప్రకరణ 15(1): మత, జాతి, కుల, లింగ, పుట్టుక అనే వివక్షను పాటించొద్దు.

ప్రకరణ 15(2): ప్రజా ప్రయోగకర ప్రదేశాల్లోకి అందరికీ సమాన ప్రవేశం ఉండాలి. ఈ సౌకర్యాల విషయంలో వివక్ష చూపొద్దు. బావులు, చెరువులు, రోడ్లు, హోటళ్లు, వినోద ప్రదేశాలు, ఇతర ప్రజా సంబంధ ప్రదేశాల్లోకి అందరికీ సమాన అవకాశాలు ఉండాలి.

మినహాయింపులు

ప్రకరణ 15(3): దీని ప్రకారం మహిళలు, బాలలకు ప్రత్యేక మినహాయింపులు, సౌకర్యాలు కల్పించవచ్చు.

ప్రకరణ 15(4): సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక సౌకర్యాలు, మినహాంపులు ఇవ్వొచ్చు. ఈ క్లాజ్‌ను 1951లో 1వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

ప్రకరణ 15(5): ప్రైవేట్, ప్రభుత్వ ధన సహాయం పొందిన విద్యాసంస్థల్లో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు లేదా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి ప్రత్యేక మినహాయింపులు, సౌకర్యాలు కల్పించవచ్చు. అయితే ఇది ప్రకరణ 30లో పేర్కొన్న మైనారిటీ సంస్థలకు వర్తించదు. ప్రకరణ 15(5) క్లాజ్‌ను 2005లో 93వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

ప్రకరణ 16

ప్రకరణ 16(1): ప్రభుత్వోద్యోగాల్లో పౌరులందరికీ సమాన అవకాశాలు.

ప్రకరణ 16(2): ప్రభుత్వోద్యోగాల్లో పౌరులను జాతి, మత, కుల, లింగ పుట్టుక వారసత్వ, స్థిర నివాస అనే ఏడు ప్రాతిపదికలపై వివక్ష చూపొద్దు.

ప్రకరణ 16(3): ప్రభుత్వ ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక మినహాయింపులు, సదుపాయాలు కల్పించవచ్చు.

ప్రకరణ 16(4ఎ): ప్రభుత్వోద్యోగాలు, ప్రమోషన్లలో షెడ్యూల్డ్ కులాలు, తెగలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించవచ్చు. ఈ అంశాన్ని 1995లో 77వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలో పొందుపరిచారు.

ప్రకరణ 16(4బి): ఈ క్లాజును 81వ రాజ్యాంగ సవరణ ద్వారా 2000లో చేర్చారు. ఎస్సీ, ఎస్టీలకు ఒక ఏడాదిలో కేటాయించిన రిజర్వ్ కోటా భర్తీ కాకుంటే ఆ ఖాళీలను తర్వాత సంవత్సరంలో సంబంధిత రిజర్వేషన్ కోటాలో కలుపుతారు. అప్పుడు రిజర్వేషన్ల శాతం 50కి మించిందా లేదా అనే విషయాన్ని నిర్ధారించడానికి ఆ ఏడాది రిజర్వేషన్ కోటాలో కలిసిన గత సంవత్సరం కోటాను పరిగణనలోకి తీసుకోకుండా, మిగిలిన ఖాళీలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. దీని ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల విషయంలో క్యారీ ఫార్వర్డ్ అవకాశాన్ని కల్పించారు.

ప్రకరణ 16(5): ప్రభుత్వంలో ఏదైనా ఒక శాఖలో పూర్తిగా ఒక మత విశ్వాసానికి సంబంధించిన విషయం ఉంటే ఆ శాఖలో కేవలం ఆ మత విశ్వాసాలకు చెందిన వారిని మాత్రమే నియమించడానికి తగిన చట్టాలను ప్రభుత్వాలు రూపొందించుకోవచ్చు.

దేవాదాయ ధర్మాదాయ శాఖలో పనిచేయడానికి హిందువులు మాత్రమే అర్హులు. అలాగే వక్ఫ్‌బోర్డు ఇతర మత సంస్థల్లో నియామకాలకు సంబంధిత మత విశ్వాసం ఉన్నవారే అర్హులు.

అదేవిధంగా 2001లో 85వ రాజ్యాంగ సవరణ ప్రకారం, పదోన్నతుల్లో రిజర్వేషన్లు పొందిన ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ ఉద్యోగులకు తద్వారా లభించే సీనియారిటీ అర్హత కూడా లభిస్తుంది. ఈ సవరణ 1995 నుంచి వర్తిస్తుంది.

ప్రత్యేక వివరణ

81, 85వ రాజ్యాంగ సవరణల ద్వారా గతంలో సుప్రీంకోర్టు బాలాజీ వర్సెస్ మైసూరు (1963), ఇంద్ర సహాని వర్సెస్ భారత ప్రభుత్వం (1992) కేసుల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని చెప్పిన తీర్పులకు మినహాయింపు లభించింది.

మండల్ కమిషన్ నివేదిక

వెనుకబడిన తరగతులను వర్గీకరించి తగిన రాయితీలు కల్పించడానికి 1979లో నాటి జనతా ప్రభుత్వం బి.పి. మండల్ అధ్యక్షతన కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు కేంద్ర సర్వీసుల్లో 27 శాతం రిజర్వేషన్లను కల్పించాలని 1980లో తన తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. 1989లో అధికారంలోకి వచ్చిన వి.పి.సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికను అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. దీన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. తర్వాత పి.వి. నరసింహారావు ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికకు రెండు సవరణలు చేసింది.

ఎ) వెనుకబడిన తరగతులకు కేటాయించిన రిజర్వేషన్లను ఆర్థిక ప్రాతిపదికన అమలు చేయడం.

బి) అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం.

పై అంశాలు ఇంద్రా సహాని కేసులో సుప్రీంకోర్టులో చర్చకు వచ్చాయి.

ఇంద్రా సహాని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (మండల్ కేసు) (1993)

- వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగబద్ధమే.
- వెనుకబడిన తరగతుల్లో క్రీమీలేయర్ (మెరుగైన వర్గాలు)ను గుర్తించి వారిని రిజర్వేషన్లకు అనర్హులుగా పరిగణించాలి.
- కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మినహా, అన్ని రకాల రిజర్వేషన్లు కలిపి 50 శాతం మించొద్దు.
- ఆర్థికపరమైన రిజర్వేషన్లు చెల్లవు. రాజ్యాంగంలో ఈ ప్రాతిపదికన మినహాయింపులు లేవని సుప్రీంకోర్టు ఈ కేసులో తీర్పు చెప్పింది.

గమనిక: క్రీమీలేయర్ వర్గాలను గుర్తించడానికి 1993లో రామ్‌నందన్ ప్రసాద్ కమిటీని నియమించారు.

ప్రకరణ 17

ఈ ప్రకరణ ప్రకారం అస్పృశ్యతను నిషేధించారు. ఈ ప్రకరణ తనంతట తాను అమలులోకి రాదు. దీని అమలుకు సంబంధిత చట్టాలను రూపొందించాలి. అయితే అస్పృశ్యత అనే పదాన్ని రాజ్యాంగంలోగాని, చట్టంలోగానీ నిర్వచించలేదు. కులతత్వ నేపథ్యంలో అస్పృశ్యతను గమనించాలని కర్ణాటక హైకోర్టు అభిప్రాయపడింది. దీని అమలుకు సంబంధించి పార్లమెంట్ ఈ కింది చట్టాలను రూపొందించింది.

అస్పృశ్యత నిషేధ చట్టం (1955)

అస్పృశ్యతను నిషేధిస్తూ, దాన్ని నేరంగా పరిగణిస్తూ, పార్లమెంట్ 1955లో ఈ చట్టాన్ని రూపొందించింది. అయితే ఈ చట్టంలోని లొసుగులను తొలగించడానికి 1976లో ఈ చట్టాన్ని సమగ్రంగా సవరించి పౌరహక్కుల పరిరక్షణ చట్టంగా పేరు మార్చారు. ఈ చట్టం ప్రకారం నేరం రుజువైతే రెండేళ్ల వరకు జైలు, అలాగే ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటిస్తారు.

ఎస్సీ, ఎస్టీలపై అకృత్యాల నిషేధ చట్టం (1989)

ఈ చట్టం ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, తెగలపై అకృత్యాలను సమగ్రంగా నిరోధిస్తూ కఠినమైన నియమ నిబంధనలను రూపొందించారు.

ప్రకరణ 18

18(1): సైనిక, విద్యాపరమైన గుర్తింపు మినహా మిగతా బిరుదుల రద్దు.

18(2): భారత పౌరులు విదేశీ బిరుదులను స్వీకరించొద్దు.

18(3): భారత పౌరులు కానప్పటికీ భారత ప్రభుత్వంలో లాభదాయక పదవుల్లో ఉన్నప్పుడు రాష్ట్రపతి అనుమతి లేకుండా విదేశాల నుంచి ఎలాంటి బిరుదులు స్వీకరించొద్దు.

18(4): ప్రభుత్వంలో లాభదాయక పదవుల్లో ఉన్న వ్యక్తులు రాష్ట్రపతి అనుమతి లేకుండా విదేశాల నుంచి ఎలాంటి బహుమతులను, భత్యాన్ని, ఉద్యోగాన్ని స్వీకరించొద్దు.

ఈ ప్రకరణలో కొన్ని రకాల బిరుదులను రద్దు చేశారు. ఉదాహరణకు, బ్రిటిష్ పాలనా కాలంలో సమాజంలోని వ్యక్తుల సామాజిక, ఆర్థిక ప్రాతిపదికలపై కల్పించిన ప్రత్యేక హోదాలైన రావ్ బహద్దూర్, రావ్ సాహెబ్, రాజా విక్రమార్క, జాగిర్దార్, ఇనాందార్, జమిందార్ మొదలగు వాటిని రద్దు చేశారు. అయితే ఈ నిషేధం విద్యా, సైనిక, విశిష్ట యోగ్యతాపరమైన బిరుదులకు వర్తించదు. ఉదాహరణకు భారతరత్న, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ. అదే విధంగా సైనిక హోదాలైన పరమ వీరచక్ర, అశోక చక్ర, శౌర్య చక్ర, మొదలగు వాటిని ఇవ్వవచ్చు.

ప్రత్యేక వివరణ

భారతరత్న, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ లాంటివి ప్రత్యేక పౌర పురస్కారాలేకానీ బిరుదులు కావు. వీటిని పేరుకు ముందుకానీ, పేరుకు తర్వాతకానీవాడటం, వ్యాపార కార్యక్రమాలకు వినియోగించొద్దని బాలాజీ రాఘవన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1996)లో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

'కనుల కొలనులో దాగిన నీ రూపం'



..కావ్య సరస్వతికి శోభను చేకూర్చేవి అలంకారాలు. 'అలం' శబ్దానికి 'కృ' ధాతువు చేరి 'అలంకారం' అనే రూపం సిద్ధించింది. అలంకారమంటే భూషణం అని అర్థం. ఇవి కావ్య సౌందర్యాన్ని పెంపొందించి, శోభను కలిగిస్తాయి. ఆలంకారకులు వీటిని ప్రధానంగా శబ్దాలంకారాలు, అర్థాలంకారాలని రెండు రకాలుగా విభజించారు. భోజుడు 'సరస్వతీ కంఠాభరణం'లో మూడు విధాలుగా పేర్కొన్నాడు. శబ్ద, అర్థాలంకాలతో పాటు ఉభయాలంకారాలను (శబ్దార్థ మిశ్రమాలు) వివరించాడు. ఆ తర్వాత మమ్మటుడు, రుయ్యకుడు, విశ్వనాథుడు, విద్యానాథుడు లాంటివారు మిశ్రాలంకారాల గురించి ప్రస్తావించారు.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు - కంటెంట్ (ఎస్ఏ)

అలంకారాలు

అలంకారాల్లో ప్రధానమైనవి శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు.

శబ్దాలంకారాలు

శబ్ద వైచిత్రీ రామణీయకత వల్ల కావ్యానికి సౌందర్యాన్ని చేకూర్చేవి శబ్దాలంకారాలు. సంగీతానుగుణ్యమైన శ్రవణ పేయతతో పాఠకులకు ఆహ్లాదం కలిగించేవి శబ్దాలంకారాలు. ఇవి ఆరు రకాలు.

1. వృత్త్యనుప్రాసం 2. ఛేకానుప్రాసం
3. లాటాను ప్రాసం 4. యమకం
5. ముక్తపదగ్రస్తం 6. అంత్యానుప్రాసం

1. వృత్త్యనుప్రాసం: ఒకటి లేదా రెండు మూడు వర్ణాలు పునరుక్తాలై ఆహ్లాదం కలిగిస్తే అది వృత్త్యనుప్రాసం.

ఉదా: 'హరిహరి సిరియురమున గలహరి'

ఇందులో 'ర' కారం పునరుక్తమై ఆహ్లాదం కలిగిస్తోంది. అందువల్ల ఇది వృత్త్యనుప్రాసం.

2. ఛేకానుప్రాసం: అర్థ భేదం ఉన్న రెండేసి హల్లులు అవ్యవధానంగా పునరుక్తమై ఆహ్లాదాన్ని కలిగిస్తే అది ఛేకానుప్రాసం. ఛేకులంటే పండితులు అని అర్థం. ఛేకులకు ఆహ్లాదం కలిగించే అనుప్రాసం ఛేకానుప్రాసం.

ఉదా: 'కందర్పదర్పములగు సందర దరహాస రుచులు'. ఈ లక్ష్యంలో దర్ప-దర అనే రెండేసి హల్లులు అర్థభేదంతో పునరుక్తమయ్యాయి. కాబట్టి ఇది ఛేకానుప్రాసం.

3. లాటాను ప్రాసం: తాత్పర్య భేదం ఉన్న శబ్దాలు పునరుక్తాలై ఆహ్లాదాన్ని కలిగిస్తే అది లాటానుప్రాసం.

ఉదా: 'కమలాక్షునర్చించు **కరములు కరములు**
శ్రీనాథు వర్ణించు **జిహ్వ జిహ్వ**'

'కరములు', 'జిహ్వ' శబ్దాలు తాత్పర్య భేదంతో పునరుక్తాలైనందువల్ల ఇది లాటానుప్రాసం.

4. యమకం: సమాన స్వరసహితాలైన వ్యంజనాలు అర్థభేదంతో అవ్యవహితంగా పునరుక్తాలైతే అది యమకం.

ఉదా: 'మన **సుభద్ర** మనసు**భద్ర**మయ్యె'

సుభద్ర అనే అక్షరాలు అర్థభేదంతో అవ్యవహితంగా వచ్చాయి. కాబట్టి ఇది యమకం.

5. ముక్తపదగ్రస్తం: మొదటి పాదం చివరి పదం రెండో పాదంలో మొదటి పదంగా రావడాన్ని ముక్తపదగ్రస్తం అంటారు. అంటే విడిచిన పదాన్ని గ్రహించడం అని అర్థం.

ఉదా: 'సుదతీ నూతన **మదనా**
మదనా గతురంగ పూర్ణ మణిమయసదనా'

మొదటి పాదం చివర ఉన్న 'మదనా' పదం రెండోపాదం మొదటిపదంగా వచ్చింది. అందువల్ల ఇది ముక్తపదగ్రస్థం.

6. అంత్యానుప్రాసం: ప్రతి పాదం చివరన ఒకే అక్షరం లేదా పదం రావడాన్ని అంత్యాను ప్రాసం అంటారు.

ఉదా: కమనీయశుభగా**త్రు** - కంజాతదళనే**త్రు**
వసుధాకళ**త్రు** - పావన చరి**త్రు**

'త్రు' అనే అక్షరం పాదాల చివర వచ్చినందువల్ల ఇది అంత్యానుప్రాసం.

అర్థాలంకారాలు

అర్థ సౌందర్యం వల్ల కావ్య శోభను ద్విగుణీకృతం చేసేవి అర్థాలంకారాలు. అర్థం లేని శబ్ద సౌందర్యం ఆహ్లాదకరం కాదు. అర్థ ప్రధానమైన అలంకారాలు అర్థాలం కారాలు. వీటిలో ప్రధానమైనవి..

1. ఉపమాలంకారం: ఉపమాన, ఉపమేయా లకు మనోహరమైన సాదృశ్యాన్ని చెప్పడాన్ని ఉపమాలంకారం అంటారు. ఇందులో ఉపమేయం (ప్రస్తుతం), ఉపమానం (అప్రస్తుతం), సమాన ధర్మం (ఉపమేయ, ఉపమానాల్లో సమానంగా ఉండేది), ఉపమావాచకం (ఉపమేయ, ఉపమానాలకు సమాన ధర్మాన్ని సూచించేది) ఉంటాయి. వలెన్, పోలెన్, ఎంతయున్, కైవడి, భంగి, అట్లు, అనంగ మొదలైనవి ఉపమావాచకాలు. పైన పేర్కొన్న నాలుగు అంశాలుంటే దాన్ని పూర్ణోపమాలంకారం అంటారు. ఏదైనా ఒక అంశం లోపిస్తే దాన్ని లుప్తోపమాలంకారం అంటారు.

భరతుడు ఉపమాలంకారంలో ఐదు భేదాలను చెప్పాడు. మమ్మటుడు లాంటి ఆలంకారకులు 25 భేదాలను పేర్కొన్నారు. దండి 32 భేదాలను చెప్పాడు. చంద్రాలోకకర్త చెప్పిన ఏడు భేదాలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

అలంకారాల్లో ప్రసిద్ధమైంది, ప్రాచీన మైంది ఉపమాలంకారం. దీన్ని ప్రయోగించని కవులు లేరు. కాళిదాసు లాంటి సంస్కృత కవులు విరివిగా ఉపయోగించారు. అందుకే 'ఉపమా కాళిదాసస్య' అనే నానుడి ప్రసిద్ధమైంది.

లక్ష్యం:
ఓ కృష్ణా! నీ కీర్తి హంసవలె ఆకాశ
గంగయందు మునుగుచున్నది

ఉపమేయం = కీర్తి, ఉపమానం = హంస, 'ఆకాశగంగయందు మునుగుట' ఉపమేయ ఉపమానాలు రెండింటిలో ఉన్నందువల్ల ఇది సమాన ధర్మం. ఉపమావాచకంలా ఇందులో నాలుగు అంశాలున్నందువల్ల ఇది 'పూర్ణోపమ అలంకారం'.

2. ఉత్ప్రేక్షాలంకారం: జాతి, గుణ, ధర్మ సామ్యం వల్ల ఉపమేయాన్ని ఉపమానంగా ఊహిస్తే అది ఉత్ప్రేక్షాలంకారం. ఇందులో ఉపమేయ ఉపమానాలతోపాటు ఉత్ప్రేక్షా వాచకం ఉంటుంది. తలంచెదన్, ఎంచెదన్, భావించెదన్, ఊహించెదన్, అనన్ మొదలైనవి ఉత్ప్రేక్షా వాచకాలు.

లక్ష్యం: "ఈ చీకటిని చక్రవాక విరహాగ్ని నుండి పుట్టిన ధూమమో అని తలంతును"

ఇందులో చీకటి ఉపమేయం, ధూమం ఉపమానం. ధూమం నల్లనిది, దృష్టిని ఆపుచేసేది. ఈ గుణ సామ్యం వల్ల ఉపమేయమైన చీకటిని ఉపమానమైన ధూమంగా ఊహించారు. కాబట్టి ఇది ఉత్ప్రేక్షాలంకారం.

రూపకాలంకారం: ఉపమేయంలో ఉపమాన ధర్మాన్ని ఆరోపించడం లేదా ఉపమేయ ఉపమానాలకు భేదం లేనట్లుగా వర్ణించడం రూపకాలంకారం. ఇందులో రూపక సమాసం కూడా ఉంటుంది.

లక్ష్యం: రాజుపై **లతాలలనలు కుసుమాక్షతలు** చల్లిరి. ఇందులో ఉపమేయమైన లతల్లో ఉపమానమైన లలనల ధర్మం ఆరోపించారు. ఉపమేయమైన కుసుమాల్లో ఉపమానమైన అక్షతల ధర్మాన్ని ఆరోపించారు. కాబట్టి ఇది రూపకాలంకారం.

4. అనన్వయాలంకారం: ఒక వస్తువు సాటి లేనిది అని చెప్పడానికి అదే వస్తువుతో పోల్చడాన్ని అనన్వయాలంకారం అంటారు. ఇందులో ఉపమేయమే ఉపమానంగా ఉంటుంది.

లక్ష్యం:
'మేరునగానికి సాటి మేరునగమే
సముద్రానికి సాటి సముద్రమే'

ఇందులో ఉపమేయమైన మేరునగమే ఉపమానంగా ఉంది. ఉపమేయమైన సముద్రమే ఉపమానంగా ఉంది. అందువల్ల ఇది అనన్వయాలంకారం.

5. స్వభావోక్తి: జాతి, గుణక్రియాదులను సహజసిద్ధంగా, మనోహరంగా వర్ణించడాన్ని స్వభావోక్తి అలంకారం అంటారు.

లక్ష్యం: "ఉద్యానవనంలో జింకలు చెవులు రిక్కించి చంచల నేత్రాలతో సరోవరంలో నీళ్ల త్రాగుచున్నవి" ఇందులో జింకల స్థితిని మనోహరంగా, సహజసిద్ధంగా వర్ణించారు. అందువల్ల ఇది స్వభావోక్తి.

6. అర్థాంతరన్యాసాలంకారం:

విశేషాన్ని సామాన్యంతో లేదా సామాన్యాన్ని విశేషంతో సమర్థించి వర్ణిస్తే.. అది అర్థాంతరన్యాసాలంకారం.

లక్ష్యం: 1
"ఆంజనేయుడు సముద్రాన్ని దాటాడు
మహాత్ములకు అసాధ్యమైంది లేదు కదా!"

ఆంజనేయుడు సముద్రాన్ని దాటడం విశేష విషయం. మహాత్ములకు సాధ్యం కానిది లేదు అనే సామాన్య విషయంతో సమర్థించినందువల్ల ఇది అర్థాంతరన్యాస అలంకారం.

లక్ష్యం: 2
పూలతో కూడిన నారకు వాసన కలిగినట్లు
సజ్జన సాంగత్యం వల్ల సర్వశ్రేయాలు కలుగుతాయి.

పూలతో కూడిన నారకు వాసన కలగడం సామాన్య విషయం. సజ్జన సాంగత్యం వల్ల సర్వశ్రేయాలు కలుగుతాయి అనే విశేష విషయంతో దీన్ని సమర్థించడం వల్ల ఇది అర్థాంతరన్యాస అలంకారం.

7. అతిశయోక్తి అలంకారం: లోకస్థితిని మించి అతిశయించి వర్ణిస్తే అది అతిశయోక్తి అలంకారం.

లక్ష్యం: ఆ పట్టణమందలి సౌధాలు చంద్ర మండలాన్ని తాకుచున్నవి. సహజస్థితిని మించి వర్ణించడం వల్ల ఇది అతిశయోక్తి.

8. శ్లేషాలంకారం: అనేక అర్థాలకు ఆశ్రయ మైంది శ్లేషాలంకారం. చమత్కారమైన పదాల విరుపులతో అనేక అర్థాల వల్ల ఆహ్లాదం కలిగించేది శ్లేష.

లక్ష్యం: 'రాజు కువల యానందకరుడు'

ఇందులో రాజు శబ్దానికి పాలకుడు, చంద్రుడు అని; 'కువలయం' పదానికి భూమి, కలువ అనే అర్థాలున్నాయి. రాజు భూ ప్రజలకు సుపరిపాలనతో ఆనందం కలిగించేవాడని ఒక అర్థం. చంద్రుడు కలువలను వికసింపజేసి ఆనందం కలిగించేవాడని మరో అర్థం ఉన్నందువల్ల ఇది శ్లేషాలంకారం.

9. సమాసోక్తి అలంకారం: ప్రస్తుత వర్ణన వల్ల అప్రస్తుత విషయం స్ఫురిస్తే అది సమాసోక్తి అలంకారం.

లక్ష్యం: చంద్రుడు రక్తుడై ఐంద్రీముఖమును ముద్దిడుచున్నాడు. ప్రస్తుత వర్ణన వల్ల పరకాంతా చుంబనాభిలాషియైన కాముకుడు స్ఫురిస్తున్నందువల్ల ఇది సమాసోక్తి అలంకారం.

10. దీపకాలంకారం: ఉపమేయ ఉపమా నాలకు (ప్రకృత, అప్రకృతాలకు) సాధారణ ధర్మంతో ఒకే అన్వయాన్ని కలిగిస్తే అది దీపకాలంకారం.

లక్ష్యం: "బ్రహ్మ రాత, విష్ణు చక్రం, ఇంద్రుడి వజ్రాయుధం, పండిత వాక్యం వ్యర్థం కాబోవు"

పండిత వాక్యం వ్యర్థం కాదు అనే ఉపమేయంతో బ్రహ్మ రాత, విష్ణు చక్రం, ఇంద్రుడి వజ్రాయుధం లాంటి ఉపమే యాలను అన్వయించి చెప్పారు. అందువల్ల ఇది దీపకాలంకారం.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. విశేషాంశం-సామాన్యం అనే రెండింటితో ప్రవర్తించే అలంకారం?
   1) రూపకం 2) వ్యాజస్తుతి
   3) ఉత్ప్రేక్ష
   4) అర్థాంతరన్యాసం
2. 'రాజ బింబాస్య రుక్మిణి తేజరిల్లె సానబట్టిన మకరాంకు శస్త్రమనగ'లోని అలంకారం?
   1) ఉపమ 2) ఉత్ప్రేక్ష
   3) రూపకం
   4) అర్థాంతరన్యాసం
3. 'కనుల కొలనులో దాగిన నీ రూపం' అనేది?
   1) యమకాలంకారం 2) అతిశయోక్తి
   3) రూపకాలంకారం 4) ఉత్ప్రేక్ష

సమాధానాలు

1) 4; 2) 1; 3) 3.

మాదిరి ప్రశ్నలు

1. 'రక్షాదక్ష! విపక్ష శిక్షా' ఏ అలంకారం?
   1) ఛేకానుప్రాసం 2) వృత్త్యనుప్రాసం
   3) లాటానుప్రాసం 4) యమకం
2. 'మన సుభద్ర మనసుభద్రమయ్యె' ఇందులోని అలంకారం?
   1) ముక్తపదగ్రస్థం 2) లాటానుప్రాసం
   3) యమకం 4) అంత్యానుప్రాసం
3. 'శేషశాయికి మ్రొక్కు శిరముశిరము'లోని అలంకారం?
   1) లాటానుప్రాసం 2) యమకం
   3) ఛేకానుప్రాసం 4) వృత్త్యనుప్రాసం
4. 'కమనీయ శుభగాత్రు - కంజాత దళనేత్రు వసుధాకళత్రు - పావన చరిత్రు' లోని అలంకారం?
   1) వృత్త్యనుప్రాసం 2) లాటానుప్రాసం
   3) అంత్యానుప్రాసం 4) యమకం
5. యమకాలంకార లక్షణం?
   1) అచ్చులు మారతాయి, హల్లులు మారవు
   2) అచ్చులు మారవు, హల్లులు మారవు
   3) అచ్చులు మారకూడదు, హల్లులు మారతాయి
   4) అచ్చులు మారవచ్చు, హల్లులు మారవచ్చు
6. ఉభయాలంకారాలను మొదటగా పేర్కొన్న లాక్షణికుడు?
   1) మమ్మటుడు 2) విశ్వనాథుడు
   3) భోజుడు 4) విద్యానాథుడు

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 3;
5) 2; 6) 3.

కృత్రిమంగా రూపొందిన గుండె?

రక్తం, రక్త ప్రసరణ

మానవ శరీరంలో ముఖ్యమైన ద్రవం రక్తం. 70 కిలోల బరువున్న ఆరోగ్యవంతుడైన పురుషుడిలో 5–6 లీటర్ల రక్తం ఉంటుంది. రక్తం అధ్యయనం హెమటాలజీ. రక్తం ద్రవ రూపంలోని సంయోజక కణజాలం. ఆహార పదార్థాలు, శ్వాస వాయువులు, వ్యర్థాలు, హార్మోన్ల రవాణాను రక్తం నిర్వహిస్తుంది. తెల్ల రక్తకణాలు ఉండటం ద్వారా రక్తం శరీర నిరోధక శక్తిలో పాల్గొంటుంది.రక్తంలో రెండు భాగాలు ఉంటాయి. అం దులో ఒకటి ప్లాస్మా. ఇది రక్తంలోని ద్రవభాగం. రక్తంలో 55 శాతం ప్లాస్మా ఉంటుంది. మిగిలిన 45 శాతం రక్తకణాలు ఉంటాయి. ప్లాస్మాలో 92 శాతం నీరు, మిగిలిన 8 శాతం ఘనపదార్థాలు ఉంటాయి. ఈ ఘన పదార్థాల్లో ప్రొటీన్లు, పిండి పదార్థాలు, కొవ్వులు వంటివి కర్బన పదార్థాలు. ఖనిజాలన్నీ అకర్బన పదార్థాలు.

రక్తకణాలు

ఇవి మూడు రకాలు. అవి ఎర్రరక్తకణాలు, తెల్ల రక్త కణాలు, రక్తఫలికికలు. రక్త కణాలు ఎముక మజ్జ నుంచి ఏర్పడుతాయి. పిండాభివృద్ధిలో వీ టిని కాలేయం ఏర్పరుస్తుంది. రక్తం, రక్తకణాలు ఏర్పడడాన్ని హీమోపాయిసస్ అంటారు. శరీరంలోని మరో ముఖ్యద్రవం శోషరసం. ఎర్రరక్తకణాలు లేని ద్రవం శోషరసం. శరీర కణజాలా ల మధ్య ప్రత్యేకనాళాల్లో శోషరసం ప్రవహిస్తుం ది. దీనిలో తెల్ల రక్తకణాలు ఉంటాయి కాబట్టి ఇదికూడా రోగ నిరోధక శక్తిలో పాల్గొంటుంది.

ఎర్ర రక్తకణాలు

ప్రతి క్యూబిక్ మిల్లీ మీటరు రక్తంలో 4.5 నుంచి 5 మిలియన్ల ఎర్రరక్తకణాలు ఉంటాయి. శరీరంలో సుమారు 32 బిలియన్ల ఎర్ర రక్తకణాలు ఉంటాయి. ఎముక మజ్జలో ఇవి ఏర్పడడాన్ని ఎరిత్రోపాయిసిస్ అంటారు. ఇవి ద్విపుటా కారంలో ఉంటాయి. అభివృద్ధి చెందిన క్షీరదాల ఎర్ర రక్తకణాల్లో కేంద్రకం, ఇతర కణభాగాలు ఉండవు. కేవలం హీమోగ్లోబిన్ మాత్రమే ఉంటుంది. హీమోగ్లోబిన్‌లో రెండు భాగాలు ఉంటాయి. అవి.. హీం, గ్లోబిన్. ఇనుము ఫెర్రస్ రూపంలో కలిగి ఉన్న కర్బన పదార్థం హీం. గ్లోబిన్ ఒక ప్రొటీను. రక్తం ఎరుపు రంగులో ఉండటానికి కారణమైన వర్ణకం హీమోగ్లోబిన్. ఇది ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడ్‌ల రవాణాను నిర్వహిస్తుంది. ప్రతి హీమోగ్లోబిన్ అణువు నాలుగు ఆక్సిజన్ అణువులను రవాణా చేస్తుంది. హీమోగ్లోబిన్ ఏర్పడడానికి, ఎర్రరక్తకణాలు అభివృద్ధి చెందడానికి ఇనుము, విటమిన్ బి12 (సైనకోబాలమిన్), విటమిన్ బి9 (ఫోలిక్ ఆమ్లం) అవసరమవుతాయి. ఆహారంలో ఇవి లోపిస్తే అనీమియా (రక్తహీనత) సంభవిస్తుంది. ఎర్ర రక్తకణాల జీవితకాలం 120 రోజులు. ఆ తర్వాత అవి ప్లీహంలో నశిస్తాయి.



తెల్ల రక్తకణాలు

వీటిని ల్యూకోసైట్లు అంటారు. శరీర రక్షక భటులుగా వ్యవహరిస్తాయి. వీటి జీవితకాలం కొన్ని రోజుల నుంచి కొన్ని వారాల వరకు ఉంటుంది. ఇవి ప్రధానంగా రెండు రకాలు. అవి.. గ్రాన్యులోసైట్లు, ఎగ్రాన్యులోసైట్లు. గ్రాన్యులోసైట్ల కణ ద్రవ్యంలో ప్రత్యేక కణికలు ఉంటాయి. ఇవి ప్రధానంగా మూడు రకాలు. అవి.. అసిడోఫిల్స్, బేసోఫిల్స్, న్యూట్రోఫిల్స్. ఎగ్రాన్యులోసైట్లు రెండు రకాలు. అవి.. మోనోసైట్‌లు, అసిడోఫిల్స్ లేదా ఇసినోఫిల్స్. అలర్జీ చర్యల్లో పాల్గొంటాయి. న్యూట్రోఫిల్స్, మోనోసైట్లు భక్షక కణాలుగా వ్యవహరిస్తాయి. శరీర రోగ నిరోధక శక్తిలో ప్రధానమైనవి లింఫోసైట్లు. ఇవి రెండు రకాలు. అవి T, B లింఫోసైట్లు. T లింఫోసైట్లు మళ్లీ రెండు రకాలు. అవి CD_4/T_4 కణాలు, CD_8 కణాలు. శరీరంలోకి ప్రవేశించిన వ్యాధి కారకాన్ని గుర్తించి దాన్ని నాశనం చేసే ప్రక్రియను T లింఫోసైట్‌లు ప్రారంభిస్తాయి. వీటి ద్వారా సెల్యులార్ ఇమ్యూనిటీ లభిస్తుంది. వ్యాధి కారకానికి విరుద్ధంగా ప్రతి దేహకాల (యాంటీ బాడీస్)ను విడుదల చేసి ఇమ్యూనిటీని అందించేవి B లింఫోసైట్లు. ఈ రకమైన ఇమ్యూనిటీ హ్యూమొరల్ ఇమ్యూనిటీ. తెల్ల రక్తకణాల సంఖ్య అసాధారణంగా పెరిగితే ల్యుకేమియా లేదా రక్త కేన్సర్ వస్తుంది. వీటి సంఖ్య అసాధారణంగా తగ్గడం ల్యూకోపినియా.

రక్త ఫలకికలు

ఇవి నిజమైన కణాలు కాదు. ఎముక మజ్జలో మెగా క్యారియోసెట్‌ల నుంచి ఏర్పడిన ఖండితాలు. వీటి జీవితకాలం 3–10 రోజులు. ప్రతి క్యూబిక్ మిల్లీ మీటరు రక్తంలో 2.5–5 లక్షలు ఉంటాయి. గాయమైనప్పుడు రక్త స్కందన ప్రక్రియను ప్రారంభిస్తాయి. గాయమైన ప్రాంతంలో ఇవి విచ్ఛిన్నం చెంది థ్రాంబోప్లాస్టిన్ పదార్థాన్ని విడుదలచేస్తాయి. ఇవి రక్తంలోని ప్రోథాంబిన్‌ను థ్రాంబిన్‌గా మారుస్తాయి. ఆ తర్వాత థ్రాంబిన్ చర్య ద్వారా రక్తంలోని ఫైబ్రినోజన్‌ను ఫైబ్రిన్‌గా మారుస్తాయి. ఫైబ్రిన్ ప్రొటీన్ పోగులుగా మారి సంక్లిష్ట జాలకాన్ని ఏర్పర్చి రక్తం నష్టాన్ని నివారిస్తుంది. ఈ ప్రక్రియలో 13 ప్రధాన రక్తస్కందన కారకాలు, కొన్ని అనుబంధ కారకాలు పాల్గొంటాయి. శరీరంలో రక్తం గడ్డకట్టడాన్ని హిపారిన్ నివారిస్తుంది. రక్త సంకోచానికి కావాల్సిన ఖనిజం కాల్షియం. అనుబంధ కారకాల్లో ముఖ్యమైంది విటమిన్ -కె. ఏ చిన్న దెబ్బ తగిలినా రక్తస్కంధనం జరగని వ్యాధి హీమోఫీలియా. కృత్రిమ రక్తస్కందన కారకాలుగా ఉపయోగించేవి సిట్రేట్‌లు, ఆక్సలేట్‌లు, డైకౌమరల్.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

రక్త వర్గాలు

ఎర్రరక్తకణాల్లోని ప్రత్యేక ప్రతిజనకాల ఆధారంగా మానవ రక్తాన్ని వివిధ గ్రూపులుగా విభజించారు. A, B, O రక్తవ్యవస్థను తొలిసారిగా ల్యాండ్‌స్టీనర్ గుర్తించారు. మానవ ఎర్రరక్తకణాలపై A,B ప్రతిజనకాలు ఉండటం లేదా లేకపోవడం ఆధారంగా మనుషులు నాలుగు వర్గాలు. A గ్రూపు ఎర్రరక్తకణాల్లో A అనే ప్రతిజనకం ఉంటుంది. B గ్రూపు ఎర్ర రక్తకణాలపై B ప్రతిజనకం ఉంటుంది. ఎర్ర రక్తకణాలపై A,B ప్రతిజనకాలు రెండూ ఉన్న వారు AB గ్రూపునకు చెందుతారు. ఈ రెండు ప్రతిజనకాలూ లేనివారు O గ్రూపునకు చెందుతారు. A గ్రూపు రక్తాన్ని B గ్రూపు వారికి ఇస్తే A ప్రతిజనకానికి విరుద్ధంగా B వ్యక్తి శరీరంలో ప్రతిదేహకాలు విడుదలై రక్తం గడ్డకడుతుంది. ఇది ప్రాణాంతకం కూడా కావచ్చు. అదేవిధంగా B గ్రూపు రక్తాన్ని A గ్రూపు వారికి ఇస్తే ఇదే సమస్య వస్తుంది. కాబట్టి A గ్రూపు వారికి A గ్రూపు రక్తాన్ని, B గ్రూపు వారికి B గ్రూపు రక్తాన్ని ఇవ్వాలి. ఐతే వీరిద్దరికీ O గ్రూపు రక్తాన్ని ఇవ్వొచ్చు. అదేవిధంగా AB గ్రూపు వారికి A,B,O, గ్రూపు రక్తాన్ని ఇవ్వొచ్చు. కాబట్టి AB గ్రూపు వారు విశ్వ గ్రహీతలు. O గ్రూపు వారి రక్తాన్ని అందరికీ ఇవ్వొచ్చు. కాబట్టి వీరు విశ్వదాతలు. వీరికి మాత్రం O గ్రూపు రక్తాన్నే ఇవ్వాలి. A, B ప్రతిజనకాలకు అదనంగా మనిషి ఎర్ర రక్తకణాలపై Rh ప్రతిజనకాన్ని కూడా ల్యాండ్ స్టీనర్, వీనర్ గుర్తించారు. ABO రక్త వ్యవస్థకు సంబంధం లేకుండా ఒక వ్యక్తి ఎర్ర రక్తకణాలపై Rh ప్రతిజనకం ఉండొచ్చు లేదా ఉండకపోవచ్చు. దీన్ని కలిగి ఉన్నవారిని Rh పాజిటివ్ అని, లేనివారిని Rh నెగిటివ్ అని సంబోధిస్తారు. అరుదుగా ఎవరిలో లేని ప్రతిజనకం కొందరి ఎర్రరక్తకణాల్లో ఉంటుంది. దీనికి మంచి ఉదాహరణ బాంబే ప్రతిజనకం. బాంబే రక్త గ్రూపునకు చెందిన వారిలో బాంబే ప్రతిజనకం (H) ఉంటుంది.

గుండె, రక్త ప్రసరణ

శరీరంలో రక్తాన్ని పంపు చేసే అవయవం గుండె. అకశేరుకాల్లో నాడీ జనిత, సకశేరుకాలలో కండర జనిత గుండె ఉంటుంది. మనిషిలో నాలుగు గదుల గుండె ఉంటుంది. ఊపిరితిత్తుల మధ్యలో మీడియా స్టీనియం అనే కుహరంలో గుండె అమరి ఉంటుంది. గుండెలోని పై గదులు కర్ణికలు. కింది గదులు జఠరికలు. గుండె లయ ఒక కండర కణుపులో మొదలవుతుంది. దీన్ని లయారంభకం అంటారు. మానవుడి గుండెలో రెండు లయారంభకాలు ఉంటాయి. సిరాకర్ణికా కణుపు గుండె కుడి కర్ణిక కుడివైపు పై భాగంలో ఉంటుంది. రెండోది కర్ణికా జఠరికా కణుపు. ఇది కుడి కర్ణిక, కుడి జఠరిక మధ్య ఉంటుంది. సిరా కర్ణికా కణుపు వద్ద జనించిన సంకోచ తరంగాలు కర్ణికలకు మాత్రమే పరిమితమవుతాయి. దీని నుంచి సంకోచ తరంగాలను అందుకున్న కర్ణిక, జఠరిక కణుపు హిస్ కండరకట్ట ద్వారా జఠరికలకు చేరుతాయి. ఈ విధంగా మొత్తం గుండె సంకోచిస్తుంది. గుండె సంకోచం సిస్టోల్. గుండె సడలిక డయాస్టోల్. కర్ణికల సంకోచం ద్వారా రక్తం జఠరికల్లోకి చేరుతుంది. జఠరికల సంకోచం ద్వారా మళ్లీ రక్తం కర్ణికల్లోకి చేరకుండా ప్రత్యేక కవాటాలు అడ్డుకుంటాయి. ఎడమ కర్ణిక, జఠరికల మధ్య అగ్రద్వయ లేదా మిట్రల్ కవాటం; కుడి కర్ణిక, జఠరికల మధ్య అగ్రత్రయ కవాటం ఉంటాయి.

సిరలు

శరీరంలోని సిరలు వివిధ భాగాల నుంచి సేకరించిన మలిన/ ఆమ్లజని రహిత రక్తాన్ని ఊర్ధ్వ, నిమ్న మహా సిరల ద్వారా గుండె కుడి కర్ణికలోకి విడుదల చేస్తాయి. ఐతే ఒక్క పుపుస సిర మాత్రమే ఊపిరితిత్తుల నుంచి శుద్ధ/ ఆమ్లజని సహిత రక్తాన్ని ఎడమ కర్ణికలోకి విడుదల చేస్తుంది. కర్ణికలు సంకోచిస్తాయి. జఠరికల్లోకి రక్తం చేరుతుంది. ఎడమ జఠరికలోకి చేరిన శుద్ధ రక్తం మహాధమని ద్వారా శరీరంలోని ధమనుల్లోకి చేరుతుంది. కుడి కర్ణికలోకి చేరిన మలిన రక్తం ఒక పుపుస ధమని ద్వారా ఊపిరితిత్తులకు చేరుతుంది. ఈ విధంగా శరీరంలోని ధమనులన్నీ గుండె ఎడమ జఠరిక నుంచి శుద్ధ రక్తాన్ని అన్ని శరీర భాగాలకూ సరఫరా చేస్తాయి. ఒక పుపుస ధమని మాత్రమే గుండె కుడి జఠరిక నుంచి మలిన రక్తాన్ని ఊపిరితిత్తులకు సరఫరా చేస్తుంది. ఈ రకంగా గుండె కుడి భాగంలో మలిన రక్తం, ఎడమ భాగంలో శుద్ధ రక్తం స్వతంత్రంగా సరఫరా కావడం ద్విరక్త ప్రసరణ.

మాదిరి ప్రశ్నలు

1. ప్రతి 100 మి.లీ. రక్తంలో హీమోగ్లోబిన్ ఏ మోతాదులో ఉంటుంది?
   ఎ) 15 గ్రాములు బి) 15 మిల్లీ గ్రాములు
   సి) 25 గ్రాములు డి) 25 మిల్లీ గ్రాములు
2. ఎముక మజ్జ నుంచి రక్తం, రక్త కణాలు ఏర్పడని జన్యువ్యాధి?
   ఎ) హీమోఫీలియా బి) థలసీమియా
   సి) పాలిసైథామియా డి) అడిసిన్స్
3. విటమిన్ బి12 లోపం ద్వారా సంభవించే రక్తహీనత?
   ఎ) మెగలోబ్లాస్టిక్ బి) మాక్రోసిస్టిక్
   సి) పెర్నిసియస్ డి) న్యూట్రిషినల్
4. మానవుడిలో ఎర్ర, తెల్ల రక్తకణాల నిష్పత్తి?
   ఎ) 1:600 బి) 600:1
   సి) 6000:1 డి) 1:6000
5. రక్తం రసాయన గుణం?
   ఎ) స్వల్పక్షారం బి) మోస్తరు క్షారం
   సి) స్వల్ప ఆమ్లం డి) మోస్తరు ఆమ్లం
6. ప్రతి క్యూబిక్ మిల్లీ మీటరు రక్తంలో తెల్ల రక్తకణాలు సంఖ్య?
   ఎ) 8000– 12,000
   బి) 2– 2.5 లక్షలు
   సి) 3.0– 3.5 మిలియన్‌లు
   డి) 3,000– 5,000
7. తెల్ల రక్తకణాలలో ఎక్కువగా ఉండేవి?
   ఎ) అసిడోఫిల్స్ బి) బేసోఫిల్స్
   సి) న్యూట్రోఫిల్స్ డి) మోనోసైట్‌లు
8. దోమ లాలాజలంలో రక్తస్కందన నివారిణి?
   ఎ) హీమోలైసిన్ బి) హిరుడిన్
   సి) లైసోజైం డి) అల్బుమిన్
9. బాంబే ప్రతిజనకం?
   ఎ) H బి) M సి) N డి) p
10. కింది ఏ జంటకు కలిగే రెండు వరుస Rh పాజిటివ్ శిశువు తల్లి గర్భంలోనే మరణించే అవకాశం ఉంది?
    ఎ) Rh^+ పురుషుడు, Rh^- స్త్రీ
    బి) Rh^- పురుషుడు, Rh^+ స్త్రీ
    సి) Rh^+ పురుషుడు, Rh^+ స్త్రీ
    డి) Rh^- పురుషుడు, Rh^+ స్త్రీ
11. వీటిలో ఏ అవయవం తొలగించినప్పటికీ ఏ సమస్యా ఉండదు?
    ఎ) ప్లీహం బి) కాలేయం
    సి) ఊపిరితిత్తులు డి) పీయూష గ్రంథి
12. రక్తనాళాల్లో రక్తప్రవాహ వేగాన్ని కొలిచే పరికరం?
    ఎ) ఈసీజీ బి) స్ఫిగ్మామానోమీటరు
    సి) స్ట్రోమరు డి) ఈఈజీ
13. కర్ణికల సంకోచం (సిస్టోల్)కు పట్టే సమయం?
    ఎ) 0.1 సెకను బి) 0.3 సెకను
    సి) 0.5 సెకను డి) 0.8 సెకను
14. రక్త నాళాల అధ్యయనం?
    ఎ) కైనిసియాలజీ బి) సిన్‌డెస్మాలజీ
    సి) ఆంజియాలజీ డి) ట్రైకాలజీ
15. గుండె వేగం అసాధారణంగా పెరగడం?
    ఎ) టేకీకార్డియా బి) బ్రేడీ కార్డియా
    సి) ఎరిథిమియా డి) ఏదీకాదు
16. గుండె లయలో లబ్ శబ్దానికి కారణం?
    ఎ) కర్ణికల సంకోచం
    బి) జఠరికల సంకోచం
    సి) కర్ణిక–జఠరిక కవాటాలు మూసు కోవడం
    డి) అర్ధ చంద్రాకార కవాటాలు మూసు కోవడం
17. హెచ్ఐవి ప్రత్యేకంగా దాడిచేసే తెల్ల రక్తకణాలు?
    ఎ) బి - లింఫోసైట్‌లు బి) CD4 కణాలు
    సి) CD8 కణాలు డి) మోనోసైట్‌లు
18. కృత్రిమంగా రూపొందిన గుండె?
    ఎ) టిక్నోకోర్ బి) అబియోకోర్
    సి) కార్డియోకోర్ డి) ఏదీకాదు
19. పురుషుడి గుండె బరువుతో పోలిస్తే స్త్రీ గుండె బరువు ఎంత శాతం తక్కువ ఉంటుంది?
    ఎ) 50 బి) 25 సి) 10 డి) 2
20. శోషరసంలో లేనివి?
    ఎ) తెల్ల రక్తకణాలు బి) ఎర్రరక్తకణాలు
    సి) ప్లాస్మా డి) పైవన్నీ
21. రక్త పరిమాణాన్ని నియంత్రించే అవయవం?
    ఎ) కాలేయం బి) మూత్రపిండం
    సి) ప్లీహం డి) పైవన్నీ
22. సీరంలో లేనివి?
    ఎ) ఎర్రరక్తకణాలు బి) తెల్ల రక్తకణాలు
    సి) రక్త ఫలికలు డి) పైవన్నీ
23. భారత్‌లో ఎక్కువ మంది ప్రజలు ఏ రక్త గ్రూపునకు చెందినవారు?
    ఎ) ఎ బి) బి సి) ఎబి డి) ఒ
24. రక్త స్కందన నివారిణిగా ఉపయోగపడేవి?
    ఎ) పొటాషియం ఆక్సలేట్
    బి) అమ్మోనియం ఆక్సలేట్
    సి) డై కౌమరల్
    డి) పైవన్నీ
25. సిరలకు సంబంధించిన రుగ్మత?
    ఎ) అథెరోస్క్లిరోసిస్
    బి) స్కిజోఫ్రినియా
    సి) వారికోస్
    డి) అల్జిమర్స్

సమాధానాలు:

1) ఎ; 2) బి; 3) సి; 4) బి; 5) ఎ 6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) ఎ; 11) ఎ; 12) సి; 13) ఎ; 14) సి; 15) ఎ; 16) సి;17) బి; 18) బి; 19) బి; 20) బి; 21) సి; 22) డి; 23) బి; 24) డి; 25) సి

A common way of expanding the basic..

Friends here is the study material for bank probartionary officer's exam. Before going into the details let us take a look at the syllabus and preparation strategy. The English section of probartionary officer's exam has two categories objective and descriptive papers. For objective the questions are based on grammar, comprehension and vocabulary. For grammar the questions are based on subject-verb agreement, tenses, prepositions and articles. More than 65% questions are given from these areas. In sentence correction the first thing you have to check is concord i.e. subject-verb agreement. Apart from this the questions will also be given from tenses and prepositions. After getting enough knowledge on these areas move on to prepare on adverbs and pronouns.

One way to begin studying basic sentence structures is to consider the traditional parts of speech. To know for sure what part of speech a word is, we have to look not only at the word itself but also at its meaning, position, and use in a sentence. Assuming that many of you have undergone proper education for all these years elaborate explanation is not being given on this section.

The next thing which is important is the sentence structure. The basic parts of a sentence are the subject, the verb and the object. The subject is usually a noun--a word that names a person, place, or thing. The verb or predicate usually follows the subject and identifies an action or a state of being. An object receives the action and usually follows the verb.

A sentence expresses a relationship, conveys a command, voices a question, or describes someone or something. It begins with a capital letter and ends with a period, question mark, or exclamation mark.

See if you can identify the subject and the predicate in each of the following short sentences:

- The dog barks.
- My daughter is a dancer.
- The children are tired.

In each of these sentences, the subject is a noun: dog, daughter, and children. The verb in the first sentence-barks shows action and answers the question, "What does the subject do?" The verbs in the next two sentences--is, are--are called linking verbs because they link the subject with a word that renames it (dancer) or describes it (tired).

Look at the table below and understand the typical sentence structure.

Subject	Verb	Complement	Modifier of time
The pilot	completed	his training	last year.
All students	must submit	their assignments	by next week.
The boy	enjoys	fishing.	

The subject of a sentence may be a singular word noun, such as teacher or table or it may be a noun phrase. A noun phrase is a group of words ending with a noun but not beginning with a preposition.

Adjectives and Adverbs:

A common way of expanding the basic sentence is with modifiers--words that add to the meanings of other words. The simplest modifiers are adjectives and adverbs. Adjectives modify nouns, while adverbs modify verbs, adjectives, and other adverbs.

Example:

Maggie cooked the chicken on the grill.

Noun verb complement modifier



BANK EXAMS

GENRAL ENGLISH

Adjective Clauses:

To show that one idea in a sentence is more important than another, we rely on subordination--that is, treating one word group as secondary (or subordinate) to another. One common form of subordination is the adjective clause--a word group that modifies a noun. The most common adjective clauses begin with one of these relative pronouns: who, which, and that.

Example:

Although the bear is able to sprint rapidly,

Clause it tires easily due to its weight.

Appositives:

An appositive is a word or group of words that identifies or renames another word in a sentence--most often a noun that immediately precedes it. Appositive constructions offer concise ways of describing or defining a person, place, or thing.

Example: Hyderabad, the capital of Andhra Pradesh is famous for pearls.

Adverb Clauses:

Like an adjective clause, an adverb clause is always dependent on (or subordinate to) an independent clause. Like an ordinary adverb, an adverb clause usually modifies a verb, though it can also modify an adjective, an adverb, or even the rest of the sentence in which it appears. An adverb clause begins with a subordinating conjunction--an adverb that connects the subordinate clause to the main clause.

Example: When Julie returned, she found Tom very ill.

Participle Phrases:

A participle is a verb form used as an adjective to modify nouns and pronouns. All present participles end in -ing. The past participles of all regular verbs end in -ed. Irregular verbs, however, have various past participle endings. Participles and participial phrases can add vigour to our writing as they add information to our sentences.

Example: Is that John running for the bus?

Absolute Phrases:

Among the various kinds of modifiers, the absolute phrase may be the least common but one of the most useful. An absolute phrase, which consists of a noun plus at least one other word, adds details to an entire sentence--details that often describe one aspect of someone or something mentioned elsewhere in the sentence.

Example: A linguistics student studies how languages are created.

Structures generally test one of the following items:

Sentence structure: This area questions test more than a word or two; they test the ability to make a sentence complete. Sentence structure questions also test one's understanding of subordinate clauses.

Word order: Word order questions are generally more detail-oriented than sentence structure questions. For example, it gives the knowledge pertaining to one's understanding whether an adjective should appear before the noun it modifies, not after it.

Word form: These questions test your ability to recognize which form of a word should be used in a given situation. Word form questions include recognizing which ending should be on a word. For example, you need to recognize if a plural ending on a noun should be singular, a singular designation on a verb should be plural and so on. It also requires you to determine that an adjective form of a word is being used when the noun form of the word is required.

Word choice: Word choice type of questions test your understanding of idiomatic expressions, words often confused, appropriate prepositional usage and so on.

Missing or extra words: Missing or extra word questions overlap with some other categories, but they are easy to recognize than some other question types.

PRACTICE TEST

The questions given below consists of incomplete sentences, with a blank line showing where information is to be filled in. Choose the word that most correctly completes the sentence.

1. The twinkling stars ____ shining brightly.
   a) Are b) is c) have d) had
2. Despite the polar bear's tremendous weight and height, ____ of sprinting at tremendous speed.
   a) It is capable
   b) is capable
   c) it is able d) ability
3. The twinkling stars, which shine so brightly, ____ very far away.
   a) Are b) was c) have d) had
4. The rain forest, ____ large trees that provide shade to the vegetation below, is home to unique flora and fauna.
   a) Has b) with its
   c) and d) although has
5. The leaders of the two countries ____ an agreement to avoid future conflicts.
   a) Have recently reached
   b) recently reach
   c) have reached recently
   d) have recently reach
6. Laura had hurt her leg and ____ not walk very well.
   a) Should b) would c) could d) had
7. They did not want to come with us at first but we ____ able to persuade them.
   a) Was b) were c) are d) is
8. Chocolate cake with raspberry filling ____ my favourite.
   a) Had b) is c) but d) yet
9. The giraffe's long neck ____ for reaching the tops of trees.
   a) Is useful b) used
   c) using d) being used
10. The giraffe's long neck and long, spindly legs ____ strange sight to see.
    a) Are a b) were c) had d) have

KEY:

1. A; 2. A; 3. A; 4. B; 5. A; 6. C; 7. B; 8. B; 9. A; 10. A;